

# కరువు-వ్యవసాయ సంబంధాలు



కె. బాలగోపాల్

మానవహక్కుల వేదిక ప్రచురణ

# కరువు-వ్యవసాయ సంబంధాలు

## రైతు ఆత్మహత్యలు, రైతాంగ పోరాటాలు



కె. బాలగోపాల్

Human Rights Forum
మానవహక్కుల వేదిక ప్రచురణ

# కరువు–వ్యవసాయ సంబంధాలు

కె. బాలగోపాల్

మానవహక్కుల వేదిక ప్రచురణ
**Human Rights Forum Publication**
ప్రచురణ సంఖ్య: 45
ప్రచురణ కాలం : అక్టోబర్ 2018

వెల : 150 రూపాయలు
కవర్ డిజైన్ : జుగాష్ విలీ
**డి.టి.పి, ముద్రణ :**
అనుపమ ప్రింటర్స్, గ్రీన్ వ్యూ,
126 శాంతినగర్, హైదరాబాద్ – 28
ఫోన్ : 23391364, 233041941
Email: anupamaprinters@yahoo.co.in

**ప్రతులకు:**
ఎస్. జీవన్ కుమార్
ఫోన్ : 040–27039519, సెల్ : 9848986286
Email: kumjeevan@gmail.com

వి. వసంతలక్ష్మి
ఫోన్ : 040–23537969
Email: vasantha.aj@gmail.com

**నవోదయ, నవ తెలంగాణ, ప్రజాశక్తి బుక్‌హౌస్‌లు**

మా వెబ్‌సైట్: www.humanrightsforum.org
బాలగోపాల్ రచనల కోసం : www.balagopal.org

# సహజమూ కాదు, అనివార్యమూ కాదు

సొంతంగా ఓటు వేయాలని అట్టడుగు జనం అనుకోనంతవరకు ఓటు హక్కు 'పవిత్ర' హక్కుగా భావింపబడేది. ఇప్పుడు కొనుక్కోగల హక్కుగా మారిపోయింది. మేము కూడా చదువుకుంటాం, మాకూ స్కూళ్ళు కాలేజీలు కావాలి అని అడగనంతవరకు విద్య ఎక్కువ భాగం 'జ్ఞాన' సంబంధమైనదిగా ఉండేది. ఇప్పుడు కొత్త పరిశ్రమలకు అవసరమైన కొత్త జీతగాళ్ళను తయారుచేసే కార్ఖానాగా మారిపోయింది. ఈ రెండింటి కంటే చాలా ముందే వ్యవసాయ రంగంలో జరిగిన అటువంటి ఒక 'కుట్ర' గురించి తెలియజేసే వ్యాసాల సమాహారమే ఈ 'కరువు – వ్యవసాయ సంబంధాలు' పుస్తకం.

వెట్టి చాకిరీని వదిలించుకుని సొంత భూమి గల రైతుగా మారేందుకు గ్రామీణ శ్రామిక వర్గం ప్రయత్నాలు మొదలుపెట్టిన కొద్ది కాలానికే సంప్రదాయ సాగునీటి వనరులన్నీ మూలపడ్డం ప్రారంభించాయి. చెరువులు, బావులు ఎండిపోయి, లక్షలు కోట్లు పెట్టుబడి అవసరమయ్యే బోరు బావులు, పెద్ద పెద్ద సాగునీటి ప్రాజెక్టులు రంగం మీదికి వచ్చాయి. ఇవేవీ యాదృచ్ఛికంగా జరగలేదని ఈ వ్యాసాలు సోదాహరణంగా నిరూపిస్తాయి. 'పల్లె కన్నీరు పెడుతుంది కనిపించని కుట్రల' అనే వ్యాసానికి అసలైన అర్థం ఈ వ్యాసాలలో కనిపిస్తుంది.

కరువు రావడంలో 'సహజం' ఏమీ లేదు. చెరువుల్ని నిర్లక్ష్యం చేయడంలో 'సహజం' ఏమీ లేదు. విత్తనాల ధరలు, ఎరువుల ధరలు, మందుల ధరలు అదుపులో లేకపోవడంలో, గ్రామీణ బ్యాంకుల వ్యవస్థ చిన్న రైతులకు పనికి రాకపోవడంలో, పంటలకు గిట్టుబాటు ధరలు లభించకపోవడంలో, ప్రభుత్వ మార్కెటింగ్ సంస్థలు

ముందుకొచ్చి పంటల్ని కొనకపోవడంలో…ఎందులోనూ 'సహజం' ఏమీ లేదు. అన్నిటి వెనకా ఉన్నది ఒకటే. లాభార్జనే ధ్యేయంగా గల పెట్టుబడిదారీ వ్యవసాయ విధానాన్ని మాత్రమే ప్రోత్సహించాలన్న ప్రభుత్వ నిర్ణయం అని బాలగోపాల్ చెపుతారు.

ఈ విధానం అమలు కోసమే కొత్త వ్యవసాయ రంగస్థలం ఒకటి ఇప్పుడు రూపుదిద్దుకుంటోంది. దాని వైశాల్యాన్ని పెంచి, కొత్త తెరలు కట్టి, కొత్త హంగులు సమకూర్చి, కొత్త రంగులతో దాన్ని మెరిపించాలని చూస్తున్నారు. అందుకోసమే పాత ఉపకరణాలన్నిటినీ ఒక్కొక్కటిగా బయటికి విసిరి పారేస్తున్నారు. పాత్రల సంపూర్ణ నిష్క్రమణ కోసం ఎదురు చూస్తున్నారు. మరైతే రైతుకు మిగిలింది ఏమిటి? ఇప్పటికే లక్షలాది మంది ఎంచుకున్న ఆత్మహత్యా మార్గమేనా?

"ఎన్ని వ్యాఖ్యలయినా చేయొచ్చు గానీ ఒక సత్యాన్ని ఎవ్వరూ కాదనలేరు. కొంచెం బాగుపడదామని ఆశపడే రైతు అప్పుల సుడిగుండంలో ఇరుక్కునే 'రిస్క్' తీసుకోక తప్పని పరిస్థితి ఈ రోజు ఉంది. చెప్పుకోవలసిందేమిటంటే ఇది ఎంత మాత్రం 'అనివార్యం' కాదు, 'సహజం' కాదు. ఇదొక అభివృద్ధి నమూనా పర్యవసానం. ఏవో కాల్పనిక ప్రత్యామ్నాయాలను దృష్టిలో పెట్టుకొని నేను ఈ మాటలు అనడం లేదు. ఏ కష్టాలూ ఏ సంక్షోభం లేకుండా ఒకరి అభివృద్ధి అందరి అభివృద్ధిగా, సమాజం సమిష్టిగా పురోగమించే చిత్రం కల్పన అనే ప్రస్తుతానికి అనుకుందాం. ఎందుకంటే దానిని నిర్మించే మార్గం తమకు తెలుసుననుకున్న వారు ఈ శతాబ్దంలో ఘోరంగా భంగపడ్డారు. కానీ దాని అర్థం ఆ ఆదర్శం చచ్చిందనీ కాదు. పెట్టుబడిదారీ నమూనాకు అందరూ ఇంక దాసోహమనాలనీ కాదు. దానిని మరింత వికృతంగా తయారుచేసే నైసర్గిక, సాంఘిక, చారిత్రక పరిస్థితులకు దాసోహమనాలని అంతకంటే కాదు."

మరో ప్రారంభానికి నాంది పలకాల్సి ఉందేమో!

**మానవహక్కుల వేదిక**
**3 అక్టోబరు 2018**

# ఈ వరసలో...

## కరువు – వ్యవసాయ సంబంధాలు – రైతు ఆత్మహత్యలు


1. కరువు – వ్యవసాయ సంబంధాలు ........................................... 7
2. ఆదిలాబాద్‌లో కరువు, టాడా................................................. 23
3. కరువు సంవత్సరం ....................................................... 41
4. విజన్ 2020లో బక్క రైతుకు ఏదీ భరోసా? .............................. 57
5. విజన్ చూపులో వివక్ష........................................................ 63
6. మళ్ళీ రైతుల ఆత్మహత్యలు.................................................. 68
7. కార్పొరేట్ వాదనకు కలిసొచ్చే కరువు ..................................... 71
8. ఈ కరువు మళ్ళీ వస్తుంది జాగ్రత్త ........................................ 75
9. కార్పొరేట్ సేద్యానికి జల సంరక్షణ? ...................................... 78
10. అక్కరకు రాని పంట బీమా పథకం ........................................ 82
11. ఇది కూడ గో హత్యే........................................................ 85
12. ‘పునఃపంపిణీ’ జరగకుండా కరువు సమస్య తీరుతుందా? ............... 88
13. కరువు, కరువు పనులు, కరువు దాడులు ................................ 92
14. రైతుల ఆత్మహత్యల్ని ఆపుదాం............................................... 96
15. అక్రమ కనెక్షన్ల క్రమబద్ధం మేలు ......................................... 108
16. ఉచిత విద్యుత్తుకు ఉచిత సంస్కరణలు .................................. 111
17. 421 జీవో : జీవోలోనూ, అమలులోనూ లోపాలే......................... 115
18. సరళమైన రుణ వ్యవస్థ లేనిదే రైతుల ఆత్మహత్యలు ఆగవు .............. 126
19. కరువు నియమావళి చట్టం అవసరం ...................................... 130


## రైతాంగ పోరాటాలు


1. తెలంగాణ పోరాటం – ‘ధనిక రైతాంగ’ వాదం ........................... 133
2. సిరిసిల్లా – వేములవాడ రైతాంగ పోరాటం ............................... 148
3. రైతాంగ పోరాటాలు ....................................................... 164
4. నూతన రైతాంగ ఉద్యమాలు – ఒక అభిప్రాయం ........................ 186

# కరువు - వ్యవసాయ సంబంధాలు

పెట్టుబడికి కొన్ని ప్రత్యేకమయిన లక్షణాలున్నాయి. దానికి దర్శనీయత (visibility) చాలా ఎక్కువ. అది ఎక్కడున్నా కొట్టొచ్చినట్టు కనబడుతుంది. దాని మనుగడకు హేతుబద్ధమయిన అకౌంటింగ్ అవసరం కాబట్టి అది తన ఉనికిని తాను గణాంకాల యుక్తంగా ప్రకటించుకుంటుంది. అందువల్ల పెట్టుబడి గురించి విషయ సేకరణ సులభం. అవసరమయిన కూడికలూ తీసివేతలూ నిష్పత్తులూ తానే చేసి పట్టికలలో ఇస్తుంది కాబట్టి దానిని విశ్లేషించడమూ సులభమే.

పెట్టుబడికి లోబడని విషయాలకు ఈ లక్షణాలు ఉండవు కాబట్టి వాటిని విశ్లేషించడం కష్టం. దేశంలోని ఫ్యాక్టరీలలో ఎంతమంది కార్మికులున్నారు, వాళ్ళు రోజుకు ఎన్ని గంటలు పనిచేస్తారు, ఎన్ని కోట్ల రూపాయల ఉత్పత్తి చేస్తారు, ఇత్యాది విషయాలను సంబంధిత ప్రభుత్వ శాఖలు వివరంగా లెక్కగట్టి తరచుగా ప్రచురిస్తుంటాయి. అయితే స్వంత కమతాల మీద తాము తినడం కోసం పండించుకునే రైతులు, భూస్వాముల దగ్గర వెట్టిచాకిరీ చేసే పాలేర్లు, రికార్డు లేకుండ భూమిని కౌలుకు తీసుకొని సాగుచేసే కౌలుదార్లు, ఇళ్ళల్లో చాకిరీ చేసే స్త్రీలు, తమ తల్లిదండ్రుల చేతి వృత్తులకూ చిల్లర వ్యాపారాలకూ సాయంగా పనిచేసే చిన్నపిల్లలు, క్వారీలలోనూ, గనులలోనూ కాంట్రాక్టు లేబర్‌గా పనిచేసే కూలీలకు చేయూతగా పనిచేసే భార్యా పిల్లలు, అడవి సంపదను రకరకాల పెత్తందార్లకు వెట్టిగా సేకరించి సరఫరా చేసే గిరిజనులు – వీళ్ళ శ్రమ పెట్టుబడితో ప్రత్యక్షంగా మారకం చెందదు కాబట్టి దానికి లెక్క వుండదు. ఏ గణాంకాల పట్టికలలోనూ కనిపించదు. దీనిని విశ్లేషించడం కష్టం. చుట్టూ వుండే పెట్టుబడి చేసే ఆర్భాటంలో ఇది లేనేలేదనే భ్రమ సులువుగా కలుగుతుంది.

ఇటువంటివి చాలా ఉదాహరణలు ఇయ్యవచ్చును. బజారులో ఎన్ని రకాల సబ్బులు దొరుకుతాయో తెలుసుకోవాలంటే ఒక్క పూటలో తెలుసుకోవచ్చును గానీ దేశంలో ఎన్ని రకాల పంటలు పండుతాయో తెలుసుకోవడం కష్టం. వరి, గోధుమ, పత్తి, పొగాకు, చెరుకు మొదలయినవి ఏదో ఒక మేరకు పెట్టుబడికి లోనయి సాగవుతాయి కాబట్టి వీటిని చూడనివాళ్ళకు కూడా వీటి గురించి తెలుసును గానీ, జొన్నలు, రాగులు, సజ్జలు అనే పంటలున్నాయని చెబితే తప్ప తెలీదు. ఇక కొర్రలు, సామలు, అనుములు మొదలయిన ధాన్యాల గురించయితే వాటిని పండించే వాళ్ళకు మాత్రమే తెలుసును. మన రాష్ట్రంలో పత్తి కేవలం 3.5 శాతం సేద్యపు భూభాగంలో వేస్తారనీ, పొగాకు 2 శాతం సేద్యపు భూభాగంలో మాత్రమే వేస్తారనీ, జొన్నలు 16.6 శాతం, సజ్జలు, రాగులు, కొర్రలు, సామలు మొదలయినవి మరొక 12.2 శాతం సేద్యపు భూభాగంలో వేస్తారనీ చెప్తే చాలామంది ఆశ్చర్యపోతారేమో! (ఇవి 1982-83 గణాంకాలు. ఇప్పటి లెక్కలు కొద్ది ఇటూఅటుగా అదే రాశిలో వుంటాయి). పత్తి, పొగాకు రైతుల సమస్యల గురించి చాలా విన్నాము గానీ సజ్జలు, కొర్రలు, సామలు, రాగులు పండించే రైతుల సమస్యల గురించి ఎవరూ విని ఉండరు. వాళ్ళకు సమస్యలు లేవని కాదు, వాళ్ళూ అడపా దడపా ఆత్మహత్యలకో ఆకలిచావులకో పాల్పడరనీ కాదు. పెట్టుబడి 'మహాత్మ్యం' అటువంటిది. అది ఉన్న మేరకు దేదీప్యమానంగా ప్రకాశిస్తూ తక్కినదేదీ లేదనే భ్రమ కలిగిస్తుంది.

మరొక ఉదాహరణ. మనకు చిన్నప్పటి నుండీ పరిచయం ఉన్న చాలా చెట్ల పేర్లు మనకు తెలీదుగానీ యూకలిప్టస్ మొక్కను అందరం గుర్తుపట్టగలం. యూకలిప్టస్ మొక్కకు గల సామాజిక రాజకీయ ఆర్థిక ప్రాముఖ్యాన్ని గురించి చాలా చర్చ జరుగుతూంటుంది. అయితే (ఉదాహరణకు) తెలంగాణ జిల్లాల సామాజిక రాజకీయ జీవితంలో తాడిచెట్లకున్న ప్రాముఖ్యం అక్కడ ఉన్నవాళ్ళకు సహితం సరిగ్గా తెలీదు. రోడ్డుపక్కన అర ఎకరం భూమిలో యూకలిప్టస్ మొక్కలు కనబడితే మనకు వెంటనే 'సామ్రాజ్యవాదం' స్ఫురిస్తుంది. పక్కనే రెండు ఎకరాలలో చింత తోపు కనబడితే మాత్రం మనకు ఏమీ స్ఫురించదు. ఆ చింతలు స్థానిక భూస్వాములు లేక పెత్తందార్ల గుప్పిట్లో ఉండవచ్చును లేదా వాటిని ప్రజలంతా తమ అవసరాల కోసం యధేచ్ఛగా వినియోగించుకుంటూ ఉండవచ్చును లేదా (రాయలసీమలో చాలా చోట్ల జరుగుతున్నట్టు) గ్రామ పంచాయితీ ఆ చెట్ల వినియోగాన్ని కాంట్రాక్టర్లకు యిచ్చి తాను రెవెన్యూ

పొందుతూ ఉండవచ్చును, ఆ రెవెన్యూ మళ్ళీ కొద్దిమంది జేబులలోకి పోతూ ఉండవచ్చును. వీటిలో ఒక్కొక్క పరిస్థితికీ ఒక్కొక్క రాజకీయమైన 'అర్థం' వుంటుంది. అయితే మనకు చింత చెట్లను చూస్తే ఇవేవీ స్ఫురించవు.

సమాచార రంగంలోనూ, విశ్లేషణా రంగంలోనూ సరుకుల మార్మికత (commodity fetishism) బలంగా పనిచేస్తుంది. నీరు దీనికి మరొక ఉదాహరణ. దేశంలో బీరు, బ్రాంది, విస్కీ వంటి మాదక ద్రవ్యాలు ఎక్కడెక్కడ ఎంతెంత ఉత్పత్తి అయ్యేదీ, ఎక్కడెక్కడ ఎంతెంత అమ్ముడుపోయేదీ (అధికార లెక్కలూ, దొంగ లెక్కలూ కలిపి) తెలుసుకోగలం గానీ నీటిని గురించి గణాంకాలు దొరకడం కష్టం. అది పెట్టుబడికి కొంత మేరకు ఒక వనరుగా ఉపయోగపడుతున్నప్పటికీ పూర్తిగా పెట్టుబడి గుప్పిట్లోకి పోలేదు కాబట్టి దాని గురించి పరస్పరం పొంతనలేని అంచనాలు మాత్రమే దొరుకుతాయి. నీటికొరత (కరువు) వచ్చినప్పుడే నీటిని గురించి కుతూహలం కలుగుతూ వుంటుంది. కరువు ఎందుకు వస్తుంది, ఎట్లా పోతుంది అనే విషయాలు తెలుసుకోవడం అవసరం అవుతుంది. దీనికి సమాధానం చెప్పాలంటే పెట్టుబడినీ, దాని పెత్తనం వల్ల మనకు వచ్చే కష్టాలనూ చర్చించి ఊరుకోకుండ కొంచెం లోతుగా విశ్లేషించాలి. కరువు గురించిన చర్చ సామ్రాజ్యవాదంతో ముడిపెట్టకుండ జరగదు అని అంటే ('కరువూ సామ్రాజ్యవాదమూ కవల పిల్లలే', నాగార్జున, అరుణతార, మార్చి 88 సంచిక) అందరూ ఒప్పుకుంటారు గానీ సామ్రాజ్యవాదంతో ముడిపెట్టి ఊరుకుంటే విషయం సగం కూడ అర్థం కాదు. ఆధునిక ప్రపంచంలో చాలా విషయాలకు సామ్రాజ్యవాదంతో ఏదో ఒక సంబంధం ఉంటుంది. అయితే ఏదో ఒక సంబంధం ఉండడానికీ, కార్యకారణ సంబంధం ఉండడానికీ చాలా తేడా వుంది.

## నీటి వనరులు[1]

మనం ఉపయోగించే నీటిని పరిశోధకులు మూడు రకాలుగా వర్గీకరిస్తారు. ఉపరితల జలాలు (surface water), నేల జలాలు (soil water), భూ జలాలు (ground water). ఉపరితల జలాలంటే వర్షపాతం వల్ల లేక కొండల మీద మంచు కరగడం వల్ల నదులలో చెరువులలో వచ్చి చేరే నీరు. నేల జలాలంటే నేల పైభాగంలోని మట్టిలో తేమ రూపంలో వుండే నీరు. వర్షాధారమయిన మెట్ట సాగుకు ఇదే నీటివనరు. భూ జలాలంటే భూమిలోకి ఇంకిపోయి, బావులు చెరువులలో 'ఊట' రూపంలో

మనకు ఉపయోగపడే నీరు. ఈ మూడు రకాల నీటివనరుల నష్టాన్నీ చర్చించినప్పుడే కరువు అనేది అర్థం అవుతుంది.

ఇందులో మొదటి రకం నీటి వనరును నదుల మీద, వాగుల మీద ప్రాజెక్టులు (భారీ లేక మధ్యతరహా ప్రాజెక్టులు) నిర్మించడం ద్వారా వినియోగించుకుంటాము. వీటికి ఎక్కువ పెట్టుబడి అవసరం అవుతుంది. కాబట్టి నీటిపారుదల సౌకర్యాలు అనగానే మనకు ఈ ప్రాజెక్టులే జ్ఞాపకం వస్తాయి. అయితే ప్రస్తుతం వీటి వల్ల సేద్యపు భూమిలో 12 శాతానికి మాత్రమే నీరు లభిస్తోంది. నదీజలాల వినియోగాన్ని నూటికి నూరుపాళ్ళు అభివృద్ధి చేసినా (కె.ఎల్ రావుగారి గంగా-కావేరి కాలవతో సహా) 33 లేక 40 శాతం సేద్యపు భూ భాగానికి మాత్రమే నదీ జలాల ప్రాజెక్టుల వల్ల నీరు వస్తుంది. ప్రాజెక్టుల నిర్మాణానికి భారత ప్రభుత్వం సామ్రాజ్యవాదుల నుండి పెద్ద ఎత్తున అప్పులు తెచ్చుకుందనీ, ఆ అప్పులు మన ఆర్థికరంగానికి భారంగా తయారయినాయనీ, ఇప్పుడు నిధుల కొరత ఏర్పడి ప్రాజెక్టులు ఆగిపోయి రిజర్వాయర్లు ఎండిపోయినాయనీ నాగార్జున చేసిన విశ్లేషణ (అందులోని లోపాలు అటుంచి) ఈ నీటి వనరుకు మాత్రమే వర్తిస్తుంది.

మూడవ రకం నీటివనరును (భూ జలాలు) మనం ప్రధానంగా బావుల రూపంలోనూ చెరువుల రూపంలోనూ వినియోగించుకుంటున్నాము. (చెరువు నీటిలో ఉపరితల జలాలు, భూ జలాల ఊట రెండూ కలిసి వుంటాయి - అయితే చెరువుల కింద జరిగే సేద్యం మొత్తం సేద్యంలో నాలుగవ వంతు కూడా లేదు. కొత్తగా చెరువుల నిర్మాణం అసలు జరగడం లేదు కాబట్టి భవిష్యత్తులో ఇంకా తగ్గుతూ పోతుంది.) అయినా ఈ నీటి వనరు ఎప్పుడూ కూడ నదీ జలాల ప్రాజెక్టుల కంటే ఎక్కువగానే సాగునీరు సరఫరా చేస్తోంది. ప్రస్తుతం దేశంలోని సేద్యపు భూమిలో 18 శాతానికి బావులు, చెరువుల నుండే నీరు లభిస్తోంది. మొత్తం భూజలాలను సద్వినియోగం చేస్తే ఇది 40 శాతానికి పెరగగలదు. నిజానికి ఈ నీటివనరు అభివృద్ధికి పెద్దఎత్తున పెట్టుబడిని సమకూర్చాల్సిన అవసరం లేదు. బావులను ఎక్కువగా వ్యవసాయదారులు తమ స్వంత పెట్టుబడితో లేదా స్వంత పూచీ మీద అరువు తెచ్చుకునే పెట్టుబడితో అభివృద్ధి చేయడం జరుగుతోంది. చెరువుల విషయానికొస్తే ప్రస్తుతం వాటిని పూర్తిగా నిర్లక్ష్యం చేయడం జరుగుతోంది. దీనికి కారణం నిధుల కొరత మట్టుకు కాదు. భూ జలాల అభివృద్ధికీ, సక్రమ వినియోగానికీ ఇప్పుడున్న వ్యవసాయ సంబంధాలూ, భారత ప్రభుత్వ వ్యవసాయ విధానమూ ముఖ్య అవరోధంగా వున్నాయి.

ఇకపోతే మిగిలింది రెండవదైన నేల జలాల వనరు. దీనిని మనం అసలు ఒక నీటివనరుగానే గుర్తించడం లేదు. దీని మీద ఆధారపడే భూమిని నీటిపారుదల వసతి లేని వర్షాధారమయిన భూమిగా వర్గీకరిస్తున్నాం. ఆ కారణంగా కరువును గురించి చర్చించేటప్పుడు ఈ భూమిని గురించి చర్చించేదేమీ లేదని భ్రమపడుతున్నాం. అయితే ఈ భూమి 'తేమ'ను నిలుపుకునే శక్తిని కోల్పోవడం కూడ 'కరువు' లక్షణాలలో ఒకటి. అది ఎందుకు జరుగుతుందో చూడకుండ కరువు పూర్తిగా అర్థం కాదు. ప్రస్తుతం సాగుభూమిలో 70 శాతం వర్షాధారంగా వుంది. మొత్తం నదులనూ వాగులనూ భూజలాల సేద్యానికి వినియోగించుకున్నానూ ఇంకా 20 శాతం వర్షాధారంగా వుంటుంది. భూసార అభివృద్ధి చర్యలను విస్తారంగా చేపట్టి, ప్రస్తుతం సాగుకు పనికి రాకుండ పోయిన భూమిని పూర్తిగా సాగులోకి తెస్తే దేశంలోని మొత్తం సాగుభూమిలో వర్షాధారమయిన భూమి 40 శాతానికి పెరుగుతుంది. అంటే ఎన్ని ప్రాజెక్టులు కట్టినా ఎన్ని వేల గొట్టపు బావులు వేసినా వర్షాధారమైన వ్యవసాయం మన ఆర్థిక రంగంలో ప్రముఖ స్థానాన్ని కలిగివుంటుంది.

అంతే కాదు. మనకు లభించే వర్షపాతంలో 30 శాతాన్ని మాత్రమే మనం వినియోగించుకుంటున్నామనీ, 70 శాతం వృథాగా పోతోందనీ అంచనా. అంటే 30 శాతం మాత్రమే భూమిలోకి ఇంకి భూజలాలలో కలవడమో లేక నేలలో తేమగా నిలవడమో లేక రిజర్వాయర్లలోకి చేరి కాలవల ద్వారా ఉపయోగపడడమో జరుగుతోంది. 70 శాతం వృథాగా సముద్రంలోకి పోవడమో, ఆవిరి అయిపోవడమో జరుగుతోంది. ఇది జరగడానికి కారణం ఏమిటో, ఈ నీటిని వ్యవసాయానికి ఉపయోగించడానికి చేపట్టగల చర్యలకు ప్రస్తుత వ్యవస్థలో వున్న ఆటంకం ఏమిటో చూడాలి.

ఇంకా చూడవలసింది ఉంది. మన దేశంలో మొత్తం 80 కోట్ల ఎకరాల భూమి ఉంది. ప్రస్తుతం సాగులో 36 కోట్ల ఎకరాలు, అడవుల జాబితాలో మరొక 14 కోట్ల ఎకరాలు కలిపి 50 కోట్ల ఎకరాలు కాగితపు లెక్కల ప్రకారం వినియోగం అవుతున్నాయి. అయితే తక్కిన 30 కోట్ల ఎకరాలు పూర్తిగా నిరుపయోగమైనవి కాదనీ, అందులో దాదాపు 20 కోట్ల ఎకరాలు వన్య లేక వ్యవసాయ అవసరాలకు ఉపయోగపడగల నేలలే కానీ భూసార విధ్వంసం వల్ల వట్టిపోయినాయని ఒక అంచనా. అంతేకాక, ప్రస్తుతం వ్యవసాయం జాబితాలోనూ, అడవుల జాబితాలోనూ వున్న 50 కోట్ల ఎకరాలలో కనీసం 20 కోట్ల ఎకరాలు ఏదో ఒక మేరకు భూసార విధ్వంసానికి

గురయి పూర్తి ఉత్పాదకత ఇవ్వలేకుండ ఉన్నాయని మరొక అంచనా. ఈ భూసార విధ్వంసానికి గల కారణాలనూ అర్థం చేసుకోవాలి.

వీటన్నిటి వెనక మనకు కనిపించేది ఏమిటంటే సామ్రాజ్యవాదం, వ్యవసాయ వర్గ వ్యవస్థ పరస్పరాశ్రితాలుగా దేశాన్ని తమ గుప్పిట్లో పెట్టుకొని ప్రజలను కరువు పాలు చేయడం. వ్యవసాయ సంబంధాలను పదిలంగా రక్షిస్తూ 'అభివృద్ధి' సాధించాలనే విషయంలో భారత ప్రభుత్వానికీ సామ్రాజ్యవాదానికీ ఏకీభావం ఉంది. భారత ప్రభుత్వానికి ఈ దృక్పథం ఉండడానికి దాని వర్గస్వభావం కారణం. గ్రామీణ ప్రాంతాల ధనికవర్గాలు (భూస్వాములు, అభివృద్ధి చెందిన ప్రాంతాల ధనిక రైతాంగంలోని అగ్రభాగం) భారత పాలకవర్గాలలో ఒక సెక్షను. వాళ్ళ అవసరాలను సాధించడం, సంరక్షించడం భారత రాజ్యాంగయంత్రం కర్తవ్యాలలో ఒకటి. వాళ్ళ ప్రతినిధులు అన్ని పాలకవర్గ పార్టీలలోనూ పుష్కలంగా వున్నారు. లోక్‌సభలోని ప్రజాప్రతినిధులు ఏయే సామాజిక వర్గాలకు చెందినవారని కొచానెక్[2] చాలాకాలం క్రితం విశ్లేషణ చేశాడు. మొత్తం లోక్‌సభలోని కాంగ్రెస్ పార్టీ సభ్యులలో 71 శాతానికి గ్రామాలలో భూములు ఉన్నాయనీ, 42 శాతానికి భూమే ప్రధాన జీవనాధారం అనీ, 20 శాతానికి 50 ఎకరాల కంటే ఎక్కువ భూమి వుందనీ చెప్పాడు. తాము 'వకీళ్ళ'మని చెప్పుకున్న 54 మంది కాంగ్రెస్ పార్లమెంటు సభ్యులలో 38 మందికి భూములు కూడ వున్నాయనీ, తాము 'సంఘసేవకులము' అని చెప్పుకున్న 65 మందిలో 25 మంది భూములు గలవారనీ ఆయన అన్నాడు. రాష్ట్ర అసెంబ్లీలలో అయితే ఈ ఆసాముల సంఖ్య ఇంకా ఎక్కువగా వుందని అన్నాడు. ఈ గణాంకాలు రెండవ లోక్‌సభ (1957-62)కు సంబంధించినవి. 'హరిత విప్లవం' ఫలితంగా పార్లమెంటు, అసెంబ్లీలలోని 'వ్యవసాయదారుల' సంఖ్య క్రమంగా పెరుగుతోందే గాని తగ్గడం లేదని తరువాతి పరిశోధకులు అంటారు.[3] భారత రాజ్యాంగయంత్రం మీద భూస్వామ్యవర్గానికి గల పట్టుకు ఇది కారణం కాదు, ఫలితం.

పర్యవసానంగా భారత ప్రభుత్వం తన వ్యవసాయ అభివృద్ధి విధానంలో వ్యవసాయ సంబంధాలను ముట్టుకోవడానికి ఇష్టపడదు. సామ్రాజ్యవాదానికి కూడ ఈ విషయంలో అభిప్రాయ భేదం లేదు. భారత వ్యవసాయరంగంలోకి ఆమూలాగ్రం ప్రవేశించే అవసరంగానీ, ఉద్దేశంగానీ, సామర్థ్యంగానీ సామ్రాజ్యవాదానికి లేదు. అనుకూలమయిన ప్రాంతాలలో కొంత లోతుగానూ, ఇతర ప్రాంతాలలో పైపైన

మాత్రమే ప్రవేశించడం సామ్రాజ్యవాద పెట్టుబడి అవసరాలకు సరిపోతుంది. మొత్తంగా భూస్వామ్యవర్గమూ, అనుకూలమయిన ప్రాంతాలలో దానితోబాటు ధనిక రైతాంగ వర్గమూ సామ్రాజ్యవాదం మార్కెట్ అవసరాలకు సరిపోతాయి. ఈ వర్గాలకు తన సరుకులు అమ్ముకొని వీళ్ళ నుండి తనకు కావలసిన ముడిసరుకులు కొనుక్కుంటుంది. భారత ప్రభుత్వం ఈ వర్గాలకు చవకగా ఎరువులు, డీజిల్, కరెంటు, సేద్యపు నీరు సరఫరా చేయడమే కాక కాంట్రాక్టులు, సహకార బ్యాంకులు, మార్కెటింగ్ సంస్థలు, పంచాయతీ రాజకీయ వ్యవస్థలు వీళ్ళ చేతులలో పెట్టి వీళ్ళ సాంప్రదాయిక పెత్తనానికి కొత్త ఆలంబన కలిగించి, వీళ్ళ ఆదాయం అత్యధికంగా పట్టణాలలో అనుత్పాదక వ్యాపారం, వర్తకం, సినిమాలు, సారాయి కాంట్రాక్టులు, ఇళ్ళస్థలాలు తదితర రంగాల లోకీ, కొంతమేరకు పరిశ్రమలలోకీ పోవడానికి కావలసిన పూర్వ నిర్మాణ సదుపాయాలను (infrastructure) కలగజేస్తుంది. ఈ క్రమంలోనే సామ్రాజ్యవాదం అవసరాలు తీరుతాయి. ఉభయతారకమయిన ఈ ఏర్పాటే భారత ప్రభుత్వ వ్యవసాయ విధానానికి పునాది.

ఈ రాజకీయ చట్రంలో భాగంగానే నీటిపారుదల వసతులను అభివృద్ధి చేయడం జరుగుతోంది. ప్రభుత్వ ఆధ్వర్యంలోని ప్రాజెక్టుల మీద పెద్దఎత్తున పెట్టుబడులను కేంద్రీకరిస్తున్నారు. కాని చెరువుల వంటి చిన్న నీటి వనరుల నిర్వహణనూ, అభివృద్ధినీ నిర్లక్ష్యం చేస్తున్నారు. భూజలాల వినియోగాన్ని (బావులు, గొట్టపు బావులు) వ్యవసాయ దారులు తమ స్తోమతను బట్టి సమకూర్చుకోగల ప్రైవేట్ పెట్టుబడులకు వదిలేస్తున్నారు. ఆ ప్రైవేట్ పెట్టుబడిలో అధిక భాగాన్ని మళ్ళీ ప్రభుత్వమే ఆస్తులు గల వ్యవసాయదారులకు బ్యాంకు రుణాల రూపంలో సరఫరా చేస్తుంది. అతి కీలకమైన భూసార సంరక్షణ, భూ వనరుల నిర్వహణ గురించి మాత్రం అప్పుడప్పుడు ఉపన్యాసాలు ఇవ్వడంతో సంతృప్తి చెందుతున్నారు. తమ అవసరాలు సాధించుకోవడానికి, తమ ఆస్తులనూ పెత్తనాన్నీ కాపాడుకోవడానికీ ఇదే సరయిన వ్యూహం అని భారత పాలక వర్గాలూ సామ్రాజ్యవాదులూ స్పష్టంగానే అర్థం చేసుకున్నారు. స్తోమతగల వ్యవసాయదారులు భూవనరులను లాభదాయకంగా వినియోగించుకోవడం కోసమే వ్యవసాయ బ్యాంకులు, గ్రామీణ బ్యాంకులు, భూమి తనఖా బ్యాంకులు, కమర్షియల్ బ్యాంకుల గ్రామీణ శాఖలు, ఎ.డి.బి విభాగాలూ ప్రారంభించబడ్డాయి. వీటికి కావలసిన మూల ధనం రిజర్వు బ్యాంకు సరఫరా చేస్తుంది.

('సహకార బ్యాంకుల' పెట్టుబడిలో 50 శాతం రిజర్వు బ్యాంకు పెట్టుబడే.) వీటిలో కమర్షియల్ బ్యాంకుల శాఖలను మినహాయిస్తే తక్కిన వాటి మీద పెత్తనమూ గ్రామీణ భూస్వామ్య వర్గానిదే. అప్పులు ఎవరికి దొరికేదీ ఎంత దొరికేదీ ఏ మేరకు నిధులు స్వాహా చేసేదీ వాళ్ళే ప్రధానంగా నిర్ణయిస్తారు. వాళ్ళ భూస్వామ్య పెత్తనానికి సామ్రాజ్యవాద పెట్టుబడి ఒక కొత్త ఆలంబన. ఇక నదీజలాల ప్రాజెక్టులకు అవసరమయ్యే భారీ పెట్టుబడులలో చెప్పుకోదగ్గ భాగాన్ని సామ్రాజ్యవాదం అప్పుల రూపంలో సరఫరా చేస్తుంది. అందులోనూ ప్రధానంగా సామ్రాజ్యవాద ద్రవ్య పెట్టుబడికి (Finance Capital) కేంద్రం అయిన ప్రపంచ బ్యాంకు సరఫరా చేస్తుంది. నైసర్గికంగా అనుకూలమయిన ప్రాంతాలలో వేగంగా 'అభివృద్ధి' సాధించి అక్కడ ధనికవర్గాలను మరింత ధనవంతులను చేస్తూ, వారి సాంప్రదాయిక భూస్వామ్య పెత్తనానికి కొత్త వత్తాసు కలిగిస్తూ, తద్వారా తన అవసరాలు సాధించుకునే వ్యూహంలో భాగంగా ఈ పని చేస్తుంది.

'కరువు' వచ్చినప్పుడల్లా నదీజలాల ప్రాజెక్టుల గురించి పాలకవర్గాలు తమలో తాము కొట్లాడుకుంటాయి. ఇతర నీటివనరుల వినియోగం గురించి, భూవనరుల నిర్వహణ గురించి, భూసార సంరక్షణ గురించి, భూ జలాల పొదుపు గురించి మాట్లాడడం ఎవరికీ శ్రేయస్కరం కాదని వాళ్ళకు తెలుసు. నాగార్జునసాగర్ జలాలు, శ్రీశైలం కాలవ, కె.సి కెనాల్, రాజోలిబండ స్కీం, తెలుగుగంగ ప్రాజెక్టుల గురించి అసెంబ్లీలో గొడవలు పెట్టుకొని నిరాహారదీక్షకు పాల్పడే రాజశేఖరరెడ్డి, మైసూరారెడ్డి, రాంభూపాల్ చౌదరి తదితర కాంగ్రెస్ నేతలు తమ బంధుమిత్రులూ, సజాతులూ, సవర్గీయులూ తరతరాలుగా రాయలసీమలో భూములనూ, ఇతర వనరులనూ తమ గుప్పిట్లో పెట్టుకొని రాజ్యం ఏలిన వైనంగానీ, ఇవ్వాళ తాము ఆ ప్రాంతపు మిగులు సంపదనంతా కాంట్రాక్టులూ, వర్తకాలూ, సారాయి, ఇళ్ళస్థలాలూ తదితర అనుత్పాదక రంగంలోనూ, రాజకీయ పెత్తనం కోసం జరిపే ఆర్భాటంలోనూ, ముఠా తగాదాలలోనూ నిష్ప్రయోజనంగా వృథా చేస్తున్న వైనంగానీ 'కరువు'కు ఎంతగా దోహదం చేశాయో చెప్పడానికి ఇష్టపడరు. ఢిల్లీకి పోయి దెబ్బలు తిని వచ్చిన తెలుగుదేశం నాయకులు కూడ ప్రభుత్వ పెట్టుబడుల గురించి మాట్లాడతారే గానీ ఈ వాస్తవాన్ని చెప్పరు – ఇద్దరూ ఇద్దరే కాబట్టి.

## కరువు

అడవుల నష్టాన్ని గురించి బాధపడడం సమంజసమే గానీ దానికీ కరువుకూ గల సంబంధం ఏమిటో చూడకపోతే మన అంచనా అతిశయోక్తుల పాలవుతుంది. అడవులు వర్షాన్ని తేమ రూపంలో నిలుపుకుంటాయి. చెట్ల ఆకులు, వేర్లు, గడ్డి నీటిని నిలుపుతాయి. ఆ నీరు ఆవిరిగా మారి తిరిగి వర్షానికి దోహదం చేస్తుంది. అందువల్ల అడవుల నష్టం ప్రత్యక్షంగా అనావృష్టికి దారితీయగలదు. దక్షిణ అమెరికాలోని అమెజాన్ నదీలోయ అడవులను నాశనం చేయడం వల్ల బ్రెజిల్ దేశం అనావృష్టి పాలయి, తత్ఫలితంగా కరువుపాలయిందని అంటారు. అమెజాన్ నదీ లోయలో కురిసే వర్షంలో 75 శాతం అక్కడి అడవుల నుండి ఆవిరి అయ్యే నీరేనని అంచనా.

అయితే మన దేశంలో కరువుకు అనావృష్టి కారణం కాదు. వర్షపాతం గురించి లెక్కలు కట్టడం మొదలుపెట్టిన నాటి నుండి ఇప్పటిదాకా ప్రతీ సంవత్సరం వర్షపాతాన్ని గణాంకశాస్త్ర పద్ధతులలో విశ్లేషించిన పరిశీలకులు చెప్పేదేమిటంటే వర్షపాతంలో స్వాభావికంగా వుండే హెచ్చుతగ్గులే గాని (random variations) క్రమబద్ధమయిన తగ్గుదల (regular decline) లేదని. దేశం మొత్తం మీదే కాదు, కరువుకు ప్రత్యేకంగా పేరుపొందిన రాజస్తాన్ రాష్ట్రంలోనూ, మన రాష్ట్రంలోని రాయలసీమ జిల్లాలలోనూ కూడ వర్షపాతంలో గత వంద ఏళ్ళలో క్రమబద్ధమయిన తగ్గుదల ఏమీ లేదు.

మరి 'కరువు' ఎందుకు వస్తోందంటే కురిసిన వర్షాన్ని సక్రమంగా వినియోగించుకోవడంలో క్రమేపీ మనం మరింత విఫలం అవుతున్నాం. నదీజలాలకు ప్రాజెక్టులు కట్టలేకపోతున్నాం. కట్టిన ప్రాజెక్టులను సరిగ్గా నిర్వహించలేకపోతున్నాం. భూ వనరులను శాస్త్రీయంగా నిర్వహించకపోవడం వల్ల నేల మీద కురిసిన నీరు నేలలోకి ఇంకి, భూజలాలలో కలవకుండ వృధాగా పోతోంది. ఉన్న భూజలాలను కూడ మనం చాలా అశాస్త్రీయంగా వినియోగించుకుంటున్నాం. భూసారాన్ని సంరక్షించలేకపోవడం వల్లనే కురిసిన వర్షాన్ని నేల 'తేమ' రూపంలో నిలుపుకోలేక పోతోంది. వ్యవసాయ క్షేత్రాలుగా వున్నవి బంజర్లుగా మారుతున్నాయి.

ఇప్పుడు ప్రాజెక్టుల వైఫల్యాన్ని గురించి చాలా చర్చ జరుగుతోంది కాబట్టి చర్వితచర్వణంగా వాటి గురించి మళ్ళీ చెప్పనవసరం లేదు. పైన చెప్పినట్టు, కట్టగల ప్రాజెక్టులన్నీ కట్టేసి నదీజలాలను నూటికి నూరుశాతం వినియోగించేసుకున్నా అది మొత్తం సాగుభూమిలో 38 లేక 40 శాతానికి మాత్రమే నీరు ఇస్తుంది. తక్కిన 60

శాతం సాగుభూమి భూజలాల మీద, నేలలోని తేమ మీద ఆధారపడక తప్పదు. సాగులోకి తేగల నేలనంతా సాగులోకి తెస్తే ఇది 70 శాతానికి పెరుగుతుంది. కాబట్టి ఏనాడయినా భూవనరుల నిర్వహణ, భూసార సంరక్షణ, భూజలాల సక్రమ వినియోగం మన దేశంలో ప్రధాన సమస్యలుగానే ఉంటాయి. అడవుల సంరక్షణకు ఇందులో అంతర్భాగంగా ప్రాముఖ్యం ఉంటుంది.

నేలమీద మొక్కలు, గడ్డిచెట్లు వుంటే ఆ నేలలో పడిన వర్షం నెమ్మదిగా నేలలోకి ఇంకి భూజలాలలో కలవడమో, లేక చిన్న చిన్న వాగులలోకి ప్రవహించి చెరువులలోనూ నదులలోనూ చేరి ఉపరితల జలాలుగా ఉపయోగపడడమో జరుగుతుంది. మొక్కలు, చెట్లు, గడ్డి లేని నిస్సారమయిన నేల వర్షం నీటిని నిలపలేదు. ఆ నీరు భూమిలోకి ఇంకకుండ వేగంగా పల్లపు ప్రాంతాలకు వరద అయి ప్రవహిస్తుంది. ఆ క్రమంలో సారవంతమయిన మట్టి అంతా కొట్టుకొనిపోయి సారహీనమయిన గట్టి నేల మిగులుతుంది. ఇట్లా కొట్టుకుపోయిన మట్టి చివరకు చెరువులలో నదులలో చేరి వాటి 'గర్భం'లోని నేలమట్టాన్ని పెంచుతుంది. దానివల్ల చెరువులకు గండిపడడం, నదులలో అకస్మాత్తుగా వరదలు రావడం జరుగుతుంది. అందుకే కరువూ, వరదలూ పెనవేసుకొని పెరుగుతున్నాయి. కిందటి సంవత్సరం అసాధారణమైన కరువు పరిస్థితులు ఒకవైపు ఉండగా, ఆదిలాబాద్ జిల్లాలోని మంచిర్యాల దగ్గర ఒక వాగులో అకస్మాత్తుగా వరదలొచ్చి దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ కొట్టుకుపోయి చాలామంది చనిపోయారు. ఆ వాగులన్నింటినీ కలుపుకునే గోదావరికి ఏటూరు నాగారం దగ్గరా, భద్రాచలం దగ్గరా వరదలొచ్చి గ్రామాలకు గ్రామాలే కొట్టుకుపోయాయి. నాలుగు అయిదేళ్ళ క్రితం తెలంగాణ జిల్లాలలో చాలా చెరువులకు గండిపడి వరదలొచ్చాయి. ప్రాణనష్టం జరగలేదు గానీ సేద్యపు భూములలో ఇసుక మేటవేసి నిరుపయోగమయ్యాయి. నిజానికి తెలంగాణ, రాయలసీమ జిల్లాలలో చెరువుల గర్భంలోని నేలమట్టమెంతగా పెరిగిందంటే వేసవి కాలంలో చూస్తే అది చెరువు గర్భం అయిందీ, పచ్చిక బయలు అయిందీ తెలీదు.

భూవనరుల దుర్వినియోగం వలన ఉపరితల జలాలలోనూ, భూ జలాలలోనూ కలవవలసిన వర్షం నీరు ఈ విధంగా వరద అయి భూసారాన్నీ ప్రాణాలనూ నష్టపరచడమే కాకుండ ఎందుకూ పనికి రాకుండా పోతోంది. ప్రపంచంలోకెల్లా అత్యధిక వర్షపాతం లభించే ప్రాంతం అస్సాంలోని చిరపుంజి అని చిన్నప్పుడు స్కూల్లో చదువు కున్నాము. ఇవాళ అదే చిరపుంజి నీటి ఎద్దడిని ఎదుర్కొంటోంది. వర్షపాతం తగ్గడం దీనికి కారణం కాదు. వర్షం ఎప్పటిలాగ పడుతూనే ఉంది. అయితే అడవుల

నాశనం వల్ల నేల ఆ వర్షాన్ని నిలుపుకోలేకపోతోంది. అదంతా కొట్టుకొనిపోయి బ్రహ్మపుత్ర నదిలో చేరి అస్సాంలోనూ బంగ్లాదేశ్‌లోనూ వరదలకు కారణం అవుతోంది. వర్షాకాలం అయిపోగానే చిరపుంజి బావులలో నీళ్ళుండడం లేదు. మన దేశ నైసర్గిక పరిస్థితులలో అడవుల నష్టానికీ కరువుకూ వున్న సంబంధం యిదే. మనది బంగాళా ఖాతంలోనూ, అరేబియా సముద్రంలోనూ అల్పపీడనం ఏర్పడడం వల్ల కురిసే రుతుపవన వర్షపాతం కాబట్టి ఇక్కడ అడవుల నష్టానికీ, వర్షపాతం పరిణామానికీ సంబంధం పెద్దగా వుండదు. అడవుల నష్టం భూ వనరుల నష్టంలో అంతర్భాగంగా కరువుకు దోహదం చేస్తుంది. అయితే భూ వనరులంటే అడవులే కాదు. బంజర్లు, పచ్చిక బయళ్ళు, తోపులు, బీళ్ళు, సాగుభూములు, పడావు భూములు అన్నీ కలిస్తేనే భూ వనరులవుతాయి. వీటి అశాస్త్రీయ నిర్వహణకు అదే ఫలితం ఉంటుంది. వీటి దుర్వినియోగం వలన ఇప్పటికే 20 కోట్ల ఎకరాలు (దేశ విస్తీర్ణంలో 25 శాతం) నిరుపయోగం అయిపోయినాయనీ మరొక 20 కోట్ల ఎకరాలు ఏదో ఒక మేరకు వట్టిపోయినాయనీ, పైన చూశాము.

## వర్గవ్యవస్థ[1]

భూ వనరుల సక్రమ నిర్వహణకు భూమి కొద్దిమంది గుప్పిట్లో ఉండడం ప్రధాన అవరోధం. భూ వనరుల శాస్త్రీయ నిర్వహణ సమిష్టి ప్రాతిపదిక మీద మాత్రమే జరగగలదు. ఒక గ్రామంలో ఏయే పంటలు ఎంత పండించాలి, ఏ భూమిని సాగు కోసం వినియోగించాలి, ఏ భూమిని పచ్చిక బయళ్ళుగానో తోపులుగానో వినియోగించాలి, ఆ గ్రామంలో నీటివనరులు ఏ మాత్రం ఉన్నాయి, వాటిని పెంపొందించడం కోసం ఆ గ్రామ పరిసరాలలోని బంజర్లు, బయళ్ళు, తోపులు, అడవులు మొదలయిన భూ వనరులను ఏ విధంగా నిర్వహించాలి ఇట్లాంటి విషయాలన్నీ సమిష్టి ప్రాతిపదిక మీద నిర్ణయించినప్పుడే సక్రమమయిన నిర్వహణ సాధ్యం అవుతుంది. లేనప్పుడు ధనవంతులు తమ బలాన్ని బట్టి, పేదలు తమ అవసరాన్ని బట్టి వినియోగించుకోవడం జరుగుతుంది. వనరులను శాస్త్రీయంగా నిర్వహించడం ధనవంతుల వ్యక్తిగత ప్రయోజనాల దృష్టికి అవసరం కాదు. పేదలకేమో ఆచరణ సాధ్యం కాదు.

మన దేశంలో ఫ్యూడల్ దశలో గ్రామాలలోని బంజర్లు, బయళ్ళు, అడవులు మొదలయిన ప్రకృతి వనరులు భూస్వాములకు, ఇతర 'గ్రామ పెద్దలకు' పుల్లరి రూపంలోనూ, కలప తదితర వనసంపద రూపంలోనూ ఒక ప్రధాన దోపిడీ సాధనంగా

వుండేవి. బ్రిటిష్‌వాళ్ళు వచ్చిన తరువాత ఈ భూములను పట్టా చేసుకొని పూర్తిగా స్వంతం చేసుకునే అవకాశం వాళ్ళకు దొరికింది. ఆ వారసత్వం ఈనాటికీ కొనసాగు తోంది. గ్రామాలలోని భూ వనరులలో అత్యధిక భాగం నేటికీ కొద్దిమంది గుప్పిట్లోనే వుంది. సాగుభూమి మాత్రమే గాక బంజర్లు, బీళ్ళు, గ్రామ పరిసరాలలోని అడవులు కూడ కొద్దిమంది ప్రయోజనాలకే ఉపయోగపడుతున్నాయి. వాళ్ళు వాటి సంరక్షణ గురించిన ఆలోచన లేకుండ ధ్వంసం చేస్తున్నారు. పేద ప్రజల మాటకొస్తే వాళ్ళూ గత్యంతరంలేక వనరులను ధ్వంసం చేస్తున్నారు. తమకున్న కొద్దిపాటి భూమిని భూసారం క్షీణించే పద్ధతిలో వినియోగించడం అశాస్త్రీయం అని వాళ్ళకు తెలిసినా, పొట్టకూటి కోసం ఆ పనే చేస్తారు. దానివల్ల వాళ్ళ భూములు వట్టిపోవడమేగాక, ఆ వట్టిపోయిన నేలలో కురిసిన వర్షం వరదగా ప్రవహించి ఇతరుల భూములలోని భూసారాన్ని నాశనం చేస్తుందంటే అది తమ 'బాధ్యత'గా భావించడం వాళ్ళకు సాధ్యం కాదు. సాగుభూమే కాదు, బయళ్ళలో పశువులను మరీ ఎక్కువగా మేపినా, బంజర్లలో చెట్లు ఎక్కువగా కొట్టేసినా ఇదే జరుగుతుంది.

భారత ప్రభుత్వ వ్యవసాయ విధానం ఈ వ్యవస్థనే ప్రాతిపదికగా తీసుకుంది. గ్రామీణ ప్రాంతాలలో భూమి తదితర వనరులు ఉన్నవాళ్ళ అవసరాలు తీర్చడం కోసం ఎరువులు, మందులు, పెట్టుబడి, డీజెల్, కరెంటు సరఫరా చేయడం; వ్యవసాయ సహకార వ్యవస్థను, మార్కెటింగ్ వ్యవస్థను రూపొందించడం; గ్రామాలలో భూస్వాముల పెత్తనం కొనసాగడం కోసం పంచాయితీ, అసెంబ్లీ రాజకీయాలను ప్రవేశపెట్టి ఆ నిర్మాణాన్ని ప్రభుత్వరంగ 'అభివృద్ధి' విధానాలతో ముడిపెట్టడం; ఈ వర్గాన్నీ, అనువయిన ప్రాంతాలలో ఈ వర్గంతోబాటు ధనిక రైతాంగాన్నీ సామ్రాజ్యవాదులకు కావలసిన అమ్మకం – కొనుగోలు మార్కెట్‌గా తీర్చిదిద్దడం; ఇదీ భారత ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యవసాయ విధానం. ఈ వ్యూహంలో భూ వనరుల సక్రమ నిర్వహణకు స్థానం లేదు. నిజానికి గ్రామీణ ప్రాంతాల నుండి లభించే మిగులు సంపద భూవనరుల సక్రమ నిర్వహణకు సరిపోతుంది. కాని అది ప్రస్తుతం కొద్దిమంది గుప్పిట్లో వుంది. ప్రభుత్వం దాని మీద కనీసం ఆదాయపు పన్ను కూడ సేకరించదు. అంతేకాకుండా ఆ మిగులు సంపదను గ్రామాలలో మదుపు పెట్టవలసిన అగత్యం లేకుండ పట్టణాలకు తరలించి కాంట్రాక్టులు, సినిమాలు, వర్తకం, చిన్న పరిశ్రమ తదితర రంగాలలో మరింత లాభదాయకంగా వినియోగించడానికీ, రాజకీయ తంత్రాలలో కుతంత్రాలలో వెచ్చించి తమ పెత్తనం పెంచుకోవడానికీ కావలసిన నిర్మాణం అంతా ప్రభుత్వమే చేసిపెడుతోంది.

భూ జలాల విషయం కూడ ఇంతే. గ్రామాలకు కరెంటు, డీసెల్, పంపుసెట్లు, గొట్టపుబావులు వచ్చిన తరువాత వెనుకబడ్డ ప్రాంతాలలో కూడ స్తోమతగల భూస్వాములూ, ధనిక రైతులూ బావుల్ని లోతుగా తవ్వించుకొని పంప్ సెట్లు పెట్టించుకొని (లేదా బోర్‌వెల్స్ వేయించుకొని) భూజలాలను వెలికితీసి తమ పొలాలలో మాత్రం పంటలు పుష్కలంగా పండించుకోవడం చూస్తున్నాం. వాళ్ళు బోర్‌వెల్స్‌ను అంత లోతుగా వేయించుకుంటే తక్కిన రైతులకు మామూలుగా దొరికే నీళ్ళు కూడ దొరకవు. అంతకంటే ముఖ్యంగా దీనివలన భూజలాల సమతుల్యం దెబ్బతింటుంది. భూజలాల లోకి వచ్చి చేరే నీటి కంటే తీసే నీరు ఎక్కువ ఉంటోంది. ఈ రకంగా భూజలాలను దుర్వినియోగం చేయడమే రాయలసీమలో కరువుకు కారణం అనీ, వర్షపాతం ఎప్పుడూ ఇంతకంటే ఎక్కువ లేదనీ ఓల్సెన్ అనే పరిశోధకుడు అంటాడు. నిజానికి వర్షపాతం తక్కువగా వుండే రాయలసీమ లాంటి ప్రాంతంలో తరతరాలుగా పండిస్తోన్న రాగులు జొన్నలు సజ్జల బదులు నీరు ఎక్కువగా అవసరం అయ్యే వరి వంటి పంటలను ప్రోత్సహించడమే ప్రస్తుత వ్యవసాయ వర్గ వ్యవస్థ, వ్యవసాయ విధానం కల్పించిన అశాస్త్రీయ పరిణామం. నీటికి ప్రస్తుతానికి పెట్టుబడి దృష్టిలో ధర లేదు కాబట్టి అది విలువలేనిదయి పంపుసెట్లు, గొట్టపు బావులు వేసుకోగలవాళ్ళకు అది 'ఫ్రీగా' దొరుకుతోంది. నీటి ఖరీదు లెక్కగట్టకుండ అంచనా వేస్తే రాగులు జొన్నల కంటే వరిపంట మూడు నాలుగు రెట్లు ఎక్కువ దిగుబడి ఇస్తుంది కాబట్టి ఇది హేతుబద్ధమయిన విధానంగా చలామణి అవుతోందిగానీ, ఒక ఎకరానికి ఎంత దిగుబడి అని కాక ఒక ఎకరానికి, ఒక మి.మీ. వర్షపాతానికి ఎంత దిగుబడి అని లెక్కగడితే వరి కంటే జొన్నలు రాగులు ఎక్కువ దిగుబడినిస్తాయని గిరియప్ప అనే పరిశోధకుడు నిరూపిస్తాడు.

నీరు 'ఫ్రీ' కావడం వల్ల భూస్వాములకూ ధనిక రైతులకూ ఉపయోగపడే వ్యవసాయ విధానమే ఇప్పుడు అమలవుతోంది. మధ్యతరగతి రైతులు కూడ అపోసోపో చేసి వాళ్ళను అనుకరించే ప్రయత్నం చేస్తుంటారు. ఫలితంగా కరువు పెరుగుతుంది. కరువు పెరిగిన కొద్దీ బావులను మరింత లోతుగా తవ్వడం, పంపుసెట్లు పెట్టించడం, బోర్‌వెల్స్ వేయించడం ఎక్కువ అవుతుంది. గమనించవలసిన విషయం ఏమిటంటే బోర్‌వెల్ కంపెనీలు ఎక్కువగా కరువు ప్రాంతాల భూస్వామ్యవర్గానికి చెందిన వ్యక్తులవే ఉంటాయి. ముఖ్యంగా తెలంగాణలో నల్గొండ, రాయలసీమలో కర్నూలు జిల్లాలకు చెందిన వ్యక్తులు బోర్‌వెల్ కంపెనీలు పెట్టుకొని కరువు కాలంలో

లక్షాధికారులవుతున్నారు. (కాంగ్రెస్ నాయకుడు రాజశేఖరరెడ్డి వీరిలో ఒకరు.) బోర్‌వెల్ రిగ్గులు తయారుచేసేది సామ్రాజ్యవాద లేక స్వదేశీ గుత్త పెట్టుబడిదారులు అయితే వాటిని కొనుక్కొని బోర్‌వెల్ కంపెనీలు పెట్టుకునేది కరువు ప్రాంతాల భూస్వామ్య వర్గంలో పుట్టి రాజకీయాల ద్వారా, కాంట్రాక్టుల ద్వారా ఎదిగినవాళ్ళు; వాటిని ఉపయోగించుకునేది కరువు ప్రాంతాల భూస్వామ్య ధనిక రైతాంగ వర్గాలయితే వాటి వల్ల నష్టపోయేది కరువు ప్రాంతాలలో అసలే తక్కువయిన భూ జలాల మీద ఆధారపడే సామాన్య రైతాంగం.

వర్షం నీటిలో 30 శాతం మాత్రమే మనం వినియోగించుకుంటున్నామనీ, తక్కినది వృధా పోతోందనీ పైన చూశాము. వర్షం నీరు ఇసుక నేలలలో, రాతి నేలలలో వ్యవసాయానికి పనికిరాని వాగులలో పడి వృధా కాకుండ ఉండాలంటే, ఆయా ప్రాంతాల నైసర్గిక స్థితిని దృష్టిలో ఉంచుకొని చిన్న చిన్న ఆనకట్టలూ, కాలువలూ రిజర్వాయర్లూ, చెరువులు నిర్మించడం అవసరం అవుతుంది. ఇది భూవనరుల నిర్వహణకు అనుబంధంగా సాగాలి. ప్రస్తుతం కొన్ని గ్రామాలలో స్వయం సేవక సంస్థలు ఆదర్శవంతంగా ఈ పనిని చేపడుతున్నాయి. గుజరాత్‌లోని ఒక గ్రామంలో ఇటువంటి ప్రయోగం ద్వారా సేద్యపు నీరు 40 ఎకరాలకు లభించేది 800 ఎకరాలకు (20 రెట్లు) పెరిగిందని ఒక రిపోర్టు. ఇది సర్వత్రా సాధ్యం కావాలంటే వ్యవసాయ సంబంధాలు సమిష్టి ప్రాతిపదిక మీద నిర్మాణం కావడం అవసరం.

శాస్త్రీయమయిన నీటివనరుల నిర్వహణకు గానీ భూవనరుల నిర్వహణకు గానీ నిధులు పెద్దగా అవసరం లేదు. వ్యవసాయక విప్లవం విజయవంతమయి సమిష్టి లేక కమ్యూన్ వ్యవస్థ ఏర్పడితే, ప్రస్తుతం వ్యవసాయ రంగంలో ఏ పాటి మిగులు లభిస్తోందో అది సరిపోతుంది. కాని ప్రస్తుతం ఆ మిగులు కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతం అవుతోంది. దాని మీద ఆదాయపు పన్ను లేకపోగా అది వ్యవసాయానికి వినియోగం కాకుండ రాజకీయాలు, కాంట్రాక్టులు, సినిమాలు, గృహ నిర్మాణం, వర్తకం తదితర రంగాలలోకి పోతోంది. మన దేశంలో వ్యవసాయం కంటే పరిశ్రమల కంటే వేగంగా పెరుగుతున్నది ఈ 'తృతీయ రంగమే'. దీనికి చక్కటి సంకేతం గృహనిర్మాణ పరిశ్రమ. అన్ని సంక్షోభాలనూ తట్టుకొని పెరుగుతున్న గృహ నిర్మాణ రంగాన్ని పరిశీలిస్తే అందులో సంఖ్యరీత్యా స్వల్పభాగం పెద్ద నగరాలలోని మేడలు కాగా, అత్యధిక భాగం గ్రామీణ ప్రాంతాల భూస్వామ్యవర్గంలో పుట్టి 'తృతీయ రంగం' ద్వారా లక్షలు సంపాదించుకొని పట్టణాలలో మిద్దెలు కట్టుకుంటున్న కుటుంబాలవి.

ఈ ప్రస్తావన ఇక్కడ ఎందుకు తీసుకొస్తున్నానంటే గృహనిర్మాణ పరిశ్రమకూ, అడవుల నష్టానికీ సన్నిహిత సంబంధం వుంది. ప్రభుత్వం సామ్రాజ్యవాద పెట్టుబడికి ఉపయోగపడే యూకలిప్టస్ వనాలను ఎంతగా ప్రోత్సహిస్తోందో గృహోపకరణాలకు (తలుపు చెక్కలు, కుర్చీలు, బల్లలు, బీరువాలు వగైరా) అవసరం అయ్యే టేకు వంటి కలప రకాల ప్లాంటేషన్లనూ అంతగా ప్రోత్సహిస్తోంది. దొంగచాటుగా జరిగే స్మగ్లింగ్ వీటి కోసమే ఎక్కువగా జరుగుతుంది. ఈ కలప వాడకంలో అత్యసరమయిన దాన్ని మినహాయిస్తే ఆర్భాటపు కట్టడాలలో కనిపించేది సామాజికంగా నష్టదాయకమయిందే. ఈ కలపను అటవీశాఖవారి టింబర్ డిపోలలో కొనుక్కునే కాంట్రాక్టర్లు, రవాణాచేసే లారీ కంపెనీల యజమానులు, వాటిని ముడి సరుకుగా ఉపయోగించే 'కోత మిషన్ల' సేఠ్‌లు, ఫర్నిచర్ వ్యాపారంచేసే వర్తకులు, వాటితో ఆర్భాటంగా ఇళ్ళను అలంకరించుకునే ఘరానా వ్యక్తులు, అందరూ స్థానిక పెత్తందార్లే. వీళ్ళ జాతకాలు తీసిచూస్తే వీరిలో అత్యధిక భాగం ఇప్పుడు కాకపోతే తమ తాత తండ్రుల కాలంలో భూస్వాములయి వుంటారు. అడవుల నాశనానికి సామ్రాజ్యవాదులెంతగా బాధ్యులో వీళ్ళూ అంతగా బాధ్యులు. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయవలసిన మిగులు సంపద వీళ్ళ చేతులలో చిక్కి సామాజికంగా హానికరమయిన వినియోగానికి పోతోంది.

యూకలిప్టస్ పెంపకంలో కూడ సామ్రాజ్యవాదానికీ భూస్వామ్యవర్గానికీ ఉమ్మడి ప్రయోజనం కొంత వుంది. ప్రభుత్వం బంజరు నేలల్లో యూకలిప్టస్ వేయడాన్ని ప్రోత్సహించడమే కాక, స్వంత భూములలోనూ ప్రోత్సహిస్తోంది. దీనిని ఎక్కువగా ఉపయోగించుకుంటున్నది భూస్వామ్య ధనిక రైతాంగ వర్గాలకు చెందినవాళ్ళు, పట్టణాలలో వర్తకాలూ వృత్తులూ ఉన్నవాళ్ళు. 'కూలివాళ్ళ బెడద' తప్పించుకోవాలని ఆశించేవాళ్ళు గతంలో పళ్ళతోటలు వేసుకున్నట్టు ఇప్పుడు యూకలిప్టస్ తోటలు వేస్తున్నారు. ప్రభుత్వం వాళ్ళకు మొక్కలు చవగ్గా సరఫరా చేయడమే కాక, ఎదిగిన చెట్ల కొనుగోలుకు ఏర్పాటు కూడ చేస్తోంది. అయితే యూకలిప్టస్ చెట్టు వేళ్ళు భూమిలోకి బాగా లోతుగాపోయి భూజలాలను తీసుకుంటాయి. (గొట్టపు బావులు లాగ). దాని వలన భూజలాలు దెబ్బతిని పరిసర ప్రాంతాలలోని బావులు ఎండిపోయే ప్రమాదం ఉంది. దాని వలన నష్టపోయేది సామాన్య రైతాంగం కాగా లాభం పొందేది సామ్రాజ్య వాదులు, గుత్త పెట్టుబడిదార్లు, భూస్వాములు.

దీనిని బట్టి చూస్తే వ్యవసాయక విప్లవం ఇరుసుగా గల నూతన ప్రజాస్వామిక విప్లవమే కరువు సమస్యను పరిష్కరించగలదని అర్థం అవుతుంది. ఒక కాలు గ్రామాలలో, ఒక కాలు పట్టణాలలో పెట్టి బతుకుతున్న భూస్వామ్యవర్గానికి చెందిన భూములను మొత్తంగా తీసేసుకొని ప్రజలపరం చేయాలి. ధనిక రైతాంగం భూములకు ఒక కుటుంబానికి స్వంత శ్రమ మీద బ్రతకడానికి సరిపోయేంత పరిమితి విధించి తక్కినది ప్రజలపరం చేసి సమిష్టి వ్యవసాయ సంబంధాల ప్రాతిపదిక మీద వ్యవసాయాన్ని పునర్నిర్మించాలి. వ్యవసాయంలో వచ్చే మిగులులో దేశ పారిశ్రామీకరణకు పోయేదాన్ని మినహాయించి తక్కినదంతా గ్రామ వనరుల సమిష్టి నిర్వహణకూ, స్థానిక పరిశ్రమలకూ వినియోగించాలి. ఈ సమిష్టి గ్రామీణ వ్యవస్థ ప్రాతిపదికగా గల సమాజాన్ని నిర్మించుకున్నప్పుడే 'కరువు' సమస్య పరిష్కారం అవుతుంది. దానికి కావలసింది సామ్రాజ్యవాద వ్యతిరేక జాతి విముక్తి పోరాటం కాదు; భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక నూతన ప్రజాస్వామ్య విప్లవ పోరాటం.

**అరుణతార**

**అక్టోబర్ 1988**

---

పాదసూచికలు

1. ఈ సెక్షన్‌లోని వివరాలు ఈ క్రింది వ్యాసాల నుండి, పుస్తకాల నుండి తీసుకోవడం జరిగింది. అన్ని వివరాలు ఒకేచోట దొరకడం కష్టం. పైగా వేరు వేరు మూలాలలోని వివరాలకు పూర్తిగా పొంతన కూడ వుండదు. నీటి వనరుల గురించి 'నిపుణులకు' కూడ పెద్దగా తెలీదని అర్థం చేసుకోవలసి వుంటుంది.

   Seminar, June 1988 (కరువు ప్రత్యేక సంచిక)

   J. Bandopadhyay, India's Environment, Crisis and Response

   ఈయన గత 5 సంవత్సరాలలో ఈ విషయాల మీద రాసిన అనేక వ్యాసాలు, రిపోర్టులు అధ్యయనం చేయతగ్గవి.

   K.W. Olsen, EPW, March 14, 1987
   B.B. Vohra, Economic Times, September 10, 1987.
   Business Standard, September 5, 1987
   Amrita Rangaswami, EPW 1974
   S. Giriappa, Water use efficiency in Agriculture, 1983.
   India : Economic Information, Agarwal, Varma and Gupta, Year Book, 1987-88.
2. Stanley Kochanek, Journal of Commonwealth Studies, March 1988.
3. Congress in Indian Politics, Ed: Ram Joshi and R.K. Hebsur, Chapter 10.

# ఆదిలాబాద్‌లో కరువు, టాడా

ఆదిలాబాద్ జిల్లా కోర్టులు తెరవడానికి ఇంకా అరగంట సమయముంది. కోర్టు పక్కనుండి ఊరు బయటకు వెళ్ళే రోడ్డులో ఇప్పుడిప్పుడే సందడి మొదలవుతోంది. అనావృష్టి ప్రాంతాలలో ఉండే రోడ్లన్నిట్లాగే ఈ రోడ్డూ వెడల్పుగా, శుభ్రంగా – ఎందుకంటే అక్కడ భూమి ధరలు తక్కువ, బురదగా అవడానికి నీళ్ళు ఉండవు కదా – ఉంది. ఒకరో ఇద్దరో లాయర్లు గంజి పెట్టి ఇస్త్రీ చేసిన చొక్కాల పైన నల్ల కోట్లు వేసుకుని, అలవాటు లేని గాంభీర్యాన్ని కష్టపడి ముఖానికి పులుముకుని కోర్టు ఆవరణలోకి నడుచుకుంటూ వస్తున్నారు. కోర్టు ఎదురుగా ఉన్న టీ స్టాళ్ళ నుండి కప్పుల శబ్దాలు, కోర్టు పుకార్ల సంభాషణలు వినిపిస్తున్నాయి. ఈ పుకార్లకు మూలపురుషులు అనదగ్గ ముట్రిం, మున్షీ లాంటి మధ్యవర్తులెవరి మొహాల్లో చూసినా మనుషుల పట్ల విసుగు, వారి బాధల పట్ల ఒక పట్టనితనం కనిపిస్తూ ఉంటాయి. బాధిత ప్రజాసమూహాలు తిరుగాడే అన్ని చోట్లా – అవి కోర్టులైనా, ఆస్పత్రులైనా, జైళ్ళు అయినా – ఇవి ప్రస్ఫుటంగా కనిపిస్తుంటాయి. కోర్టును ఆవరించి ఉండే ఒక అనైతిక దుర్వాసన ఇప్పుడిప్పుడే మొదలవుతోంది. మధ్యాహ్నమయ్యేసరికి ఇది భరించలేనంత స్థాయికి పెరగడం చూస్తాం.

ఇంతలో చూడ్డానికి ఆదివాసిలా కనిపిస్తున్న ఒక శుభ్రమైన యువకుడు కట్టెలతో నిండిన ఒక ఎద్దుల బండి పక్కన నడుస్తూ వస్తున్నాడు. పిలవడానికి వేరే పదాలు లేక వాటిని బండి, ఎద్దులు అని అనాలే తప్ప అవి ఏ మాత్రం ఆ పేర్లకు తగ్గట్టుగా లేవు. అతి చిన్న చక్రాలూ, అతి పలచటి చట్రమూ ఉన్న బండి అది. ఆ ఎద్దులు ఎద్దుల్లా కంటే దూడల్లా ఉన్నాయని చెప్పడం సబబు. బండి కచ్చితంగా ఏ మారుమూల గోండు కుగ్రామానికో వెళుతూ ఉండొచ్చు. ఎందుకంటే దీని కంటే మంచి బండేదీ

ఆ ఎత్తుపల్లాల రోడ్లో వెళ్ళదు కాబట్టి. అటువంటి రోడ్లకు ఇదే 'సరైన' ప్రయాణ సాధనమని సరిపెట్టుకోవచ్చు గాని ఎద్దుల గురించి ఆ పాటి సమర్ధన కూడ ఇవ్వలేం. అవి తిండి లేక బక్కచిక్కి ఉన్నాయంతే. (నిజానికి ఇక్కడ 'సరైన' అనే పదం ఎందుకు వాడాలి మనం? ఆ ప్రాంతాలు ఎందుకెప్పుడూ అంత ఎగుడుదిగుడుగా, ప్రయాణానికి అననుకూలంగా ఉండాలనే ప్రశ్న వేసుకోం మనం?)

ఆ ఆదివాసీ యువకుడూ, అతని బండీ 'న్యాయ'స్థానం నీడలోకి వచ్చేసరికి ఎడమవైపు సందులో నుండి ఒక అరుపూ, దాని వెంట ఒక మధ్యవయస్కుడి శరీరమూ అతని మీదికి దూసుకు వచ్చాయి. వచ్చినవాడు బక్క మనిషే అయినా ఆ ఆదివాసీ యువకుడు భయంతో బిగుసుకుపోయాడు. ఆ వ్యక్తి అతని దగ్గరకు వెళ్లి ఏదో అడిగాడు. ఇద్దరి మధ్యా వాదన జరుగుతోంది. టీ స్టాళ్ళ దగ్గర ఉన్నవాళ్ళంతా ఆసక్తిగా చూస్తుండగానే కొద్దిసేపటికి వాదన ఆగిపోయింది. ఆ వ్యక్తి ఆదివాసిని చెంప మీద కొట్టి, ఎద్దుల్ని బండి నుండి ఊడదీశాడు. బండి నొసలు ఒరగడంతో బండిలో పేర్చిన కట్టె అంతా రోడ్డు మీద చెల్లాచెదురుగా పడిపోయింది. ఆదివాసి దీనంగా చూస్తుండగానే అతన్ని అటకాయించిన వ్యక్తి ఎద్దుల్ని అక్కడున్న ఒక స్తంభానికి కట్టేసి విజయగర్వంతో టీ స్టాల్ దగ్గరకు నడుచుకుంటూ వచ్చాడు. అడగకుండానే అప్పటిదాకా జరిగిన విషయాలను మాం..చి బూతులతో దట్టించిన ఉర్దూలో వివరించాడు. ఒకప్పుడు నిజాం రాజ్యంలో వీధి కొట్లాటలలో వినబడుతుండే భాష అది.

అతనో చిన్న వ్యాపారి. నిస్సందేహంగా మార్వాడీ అని చెప్పొచ్చు. కాకపోతే పేద మార్వాడీ. ఈ మధ్యే ఒక కొత్త వ్యాపారంలోకి ప్రవేశించాడు. ఆదివాసుల నుండి ఎద్దుల్ని కొని, వాటిని తిరిగి వాళ్ళకే వార్షిక ప్రాతిపదికన అద్దెకు ఇచ్చే వ్యాపారమది. ఆదివాసులు ఇటువంటి వ్యాపారానికి ఒప్పుకోవడం ఎంత తెలివితక్కువతనం అన్నాడు అప్పటిదాకా అతను చెపుతున్నదంతా వింటున్న ఒక మున్షీ (కోర్టు గుమస్తా). తమలపాకుతో పండిన పెదాల వల్ల అతను ఓ జ్ఞానిలా కనిపిస్తున్నాడు. మామూలు పరిస్థితుల్లో అది తెలివితక్కువ పనే అని వ్యాపారి కూడ ఒప్పుకున్నాడు. కాని పోయిన ఏడాది మామూలు ఏడాది కాదే; ఖరీఫ్, రబీ రెండు పంటలూ దాదాపు పూర్తిగా నాశనమయ్యాయి. ఖరీఫ్‌లో వర్షాలు ఎక్కువై పంటలు దెబ్బ తింటే రబీలో దాదాపు వర్షం లేక పంట ఎండిపోయింది. దానితో రైతులు, ముఖ్యంగా ఆదివాసి రైతులు – వారిలో అత్యధికులకు తాము సాగు చేసే భూములకు పట్టాలు ఉండవు కాబట్టి

బ్యాంకుల నుండి రుణాలు తీసుకునే అవకాశం కూడ ఉండదు – తిండి గింజలకు బాగా ఇబ్బందిపడ్డారు. ఎద్దుల్ని సంతలకు తీసికెళ్ళి అమ్ముకోవడం మొదలుపెట్టారు. చూస్తుండగానే జైనూర్ సంత ఒట్టి పశువుల సంతగా మారిపోయింది. కాని దీనికి ఆ వ్యాపారి చెప్పిన కారణం వేరు. మనిషి తాను చేసే స్వార్ధపూరిత పనులకు ఏదో ఒక నైతిక సమర్ధన వెతుక్కుంటాడని మనందరికీ తెలుసు, ఈ ఆదివాసులు కూడ అలాగే వెతుక్కుని గడ్డి దొరకకపోవడం వలన పశువుల్ని అమ్ముకుంటున్నామని చెపుతున్నారు, నిజానికి ఆ మూగజీవుల్ని ఈ స్వార్ధపరులు తమ తిండి కోసం అమ్ముకుంటున్నారు... వ్యాపారి అనర్గళంగా చెప్పుకుంటూ పోయాడు. ఈ చివరి మాట దగ్గర లిటిగెంట్ లాగా కనిపిస్తున్న ఒక వ్యక్తి అతన్ని ఆపి తిండికి లేకపోవడం అనే మాట పచ్చి అబద్ధం అన్నాడు. ప్రభుత్వం పేదలకు రెండు రూపాయలకే కిలో బియ్యం ఇస్తున్న విషయం మీకు తెలియదా, ఎన్టీఆర్ కీర్తిప్రతిష్టలను ఎంతగానో ఇనుమడింపజేసిన ఆ పథకం గురించి మీరు వినలేదా? అని మార్వాడీని అడిగాడు. వెంటనే మిగతావాళ్ళు అతని ఒంటి మీదున్న పసుపు చొక్కా వంక అనుమానంగా చూశారు. ఎన్టీఆర్ ఇచ్చే బియ్యం కొనాలంటే డీలర్లు బియ్యం ఇచ్చే సమయానికి మన దగ్గర వాటికి సరిపడా డబ్బు ఉండాలి, పేదల దగ్గర అలా ఉండడం చాలా కష్టం అన్నాడు గుంపు లోంచి ఒక వ్యక్తి. డీలరు దగ్గర సరుకు ఉన్నపుడు మన దగ్గర డబ్బు ఉండదు, మనం డబ్బు సమకూర్చుకునేసరికి డీలరు దగ్గర సరుకు ఉండదని చెప్పాడతను. బహుశా ఎన్టీఆర్ పథకాన్ని విజయవంతం చేయడం కోసమే ఆదివాసీ రైతులు తమ పశువుల్ని అమ్ముకుంటున్నారేమో!

ఇదంతా సరే. పశువుల్ని కొని ఆ మార్వాడీ మాత్రం ఏమి చేసుకుంటాడు? ఆ తర్వాత వాటి చేత దున్నించుకునేందుకు అతను ఆదివాసుల దగ్గర భూమి కూడ కొంటాడా? లేదు. ఈ మార్వాడీ ఇంకా భూమి కొనేదాకా రాలేదు (ఇతరులు కొన్నారనుకోండి). అలాగని కొన్న ఎద్దుల్ని వేరే వాళ్లకు అమ్మాలనే ఆలోచనలో కూడ లేడతను. అతను ఒక కొత్త లాభసాటి వ్యాపారం కనిపెట్టాడు. ఈ ఏడాది ఈ ప్రాంతాలలో ఈ వ్యాపారమే బాగా నడుస్తోంది. అదెలా మొదలైందంటే తిండిగింజలు కొనుక్కోవడానికి ఎద్దుల్ని అమ్ముకున్న ఆదివాసులకు వాటితో మళ్ళీ అర్జెంటు పని పడింది. కారణం మరేం లేదు – వర్షాకాలం సమీపిస్తోంది. దుక్కులు దున్నాలి. వాళ్ళ ఈ అవసరం కనిపెట్టి వ్యాపారులు కొత్త పద్ధతులకు దిగారు. వారికి ఎద్దుల్ని

తిరిగి అమ్మే బదులు ఏక్ సాల్ ప్రాతిపదికన అద్దెకు ఇవ్వడమనే కొత్త పద్ధతిని కనిపెట్టారు. ఏ రేటుకు? అబద్ధం చెపితే దేవుళ్ళకు కోపం వస్తుందని కాబోలు వ్యాపారి తాను 500 రూపాయలకు కొన్న ఎద్దుల జతకు ఏటా 400 రూపాయలకు తక్కువ కాకుండా అద్దె వసూలు చేస్తున్నట్టు నిజాయితీగా ఒప్పుకున్నాడు. అదీ ఆరంభంలోనే వసూలు చేసుకుంటాడట. ఎందుకంటే వాళ్ళు పైకి ఎంతో అమాయకంగా కనిపించినా మనం ఆదమరచి ఉన్నపుడు మన ఇంటి నుంచి మనలనే బయటకు గెంటేయగల సమర్థులట. అందుకే మొదట్లో వసూలు చేసుకోకపోతే ఇక ఎప్పటికీ చేసుకోలేమని అతని అభిప్రాయం. వింటున్న వాళ్ళలో ఒకడు మంచి వ్యాపారమే అని మెచ్చుకోలుగా అన్నాడు. మార్వాడీ అతని అభిప్రాయంతో ఏకీభవించాడు. దేవుళ్ళు తన పట్ల దయగా ఉన్నారన్నాడు. కాసేపయ్యాక ఎవరో ఒకతను రోడ్డుకు అటువైపున బిక్కుబిక్కుమంటూ కూర్చుని ఉన్న ఆదివాసిని చూపిస్తూ జరిగిన గొడవేమిటని అడిగాడు. వెంటనే వ్యాపారి గొంతు గాయపడ్డ ధర్మదేవత గొంతులా దుఖంతో ఒణికింది. ఆ కృతఘ్నుడు తిర్యానికి చెందిన గోండు లంజా కొడుకు అన్నాడు. మూడు నెలల క్రితం అతను జైనూర్ సంతలో తన పశువులను అమ్మి బియ్యం, నెయ్యి, పెరుగు దండిగా కొనుక్కుని తిని వాడూ, వాడి పెళ్ళాం ముండా తెగ బలిసారు. వర్షాకాలం దగ్గర కొచ్చేసరికి, ఆకాశంలో కాస్త మబ్బుతునక కనబడేసరికి, గాలిలో తేమ తగిలేసరికి వాడికి వాడి ఎద్దులు మళ్ళీ కావల్సి వచ్చాయి. కళ్ళ నీళ్ళతో తన ఎద్దుల్ని తనకు తిరిగి ఇవ్వమని – చూసారుగా ఎంత బలంగా ఉన్నాయో – అడగడానికి వచ్చాడు. వారంలో డబ్బు కడతానన్నాడు. నా మనసు అసలే నవనీతం, పైగా పుట్టుకతో వచ్చిన లక్షణం. ఇవ్వకుండా ఎలా ఉంటాను? ఈ నిర్దాక్షిణ్య ప్రపంచంలో ఇన్నేళ్ళూ మనమంతా ఒకరికొకరు సహాయం చేసుకుని ఉండకపోతే ఇప్పుడెక్కడ ఉండేవాళ్ళం? అందుకే ఆ కుక్కల నా కొడుకుకు వారంలో 400 రూపాయలు చెల్లించే షరతుపై ఎద్దుల్ని ఇచ్చాను. వారం గడిచిపోయింది. రెండు వారాలు గడిచిపోయాయి. మూడో వారం కూడ పూర్తయిపోతోంది. కాని వాడి జాడ లేదు. పోలీసులకు ఫిర్యాదు చేద్దామా అనుకుంటుండగా యాదృచ్ఛికంగా ఇక్కడ తారసపడ్డాడు. పైపెచ్చు దున్నడానికి కావాలని తీసుకెళ్ళిన ఎద్దుల్ని బండికి కట్టి – మీరే మీ కళ్ళతో చూశారుగా – కట్టెల్ని అక్రమంగా టౌన్ నుంచి తీసికెళ్ళి అమ్ముకోవాలని చూస్తున్నాడు.

ఈ దశలో కాస్త న్యాయబుద్ధి గల శ్రోత ఒకరు వ్యాపారి మాటలకు అడ్డం వచ్చి ఎవరూ కట్టెను టౌన్ నుండి అక్రమంగా తరలించరని, బయట నుండే టౌన్‌లోకి

తరలిస్తారని గుర్తు చేసాడు కాని వ్యాపారి గాయపడ్డ హృదయం అలాంటి హేతుబద్ధమైన ప్రశ్నలను పట్టించుకునే స్థితిలో లేదు. అతని మాటలను ఖాతరు చేయకుండా తన కధనాన్ని కొనసాగించాడు. వాడ్ని ఆపి సంజాయిషీ అడిగితే ఆ తలబిరుసు గాడేమి చెప్పాడో తెలుసా! భూమిలో పంట ఒక వారంలో పండదట; విత్తనాలు నాటడానికి, మొలకెత్తడానికి, మొక్కై పంట దిగుబడి రావడానికి చాలా సమయం పడుతుందట...ఆ విషయం మాకందరికీ తెలియనట్టు. అంతే కాదు..వాడు ఇంకా ఏమన్నాడో తెలుసా! ఇది చెప్పేటపుడు అతని గొంతు ఆగ్రహంతో ఊగిపోయింది. తన భూమి అప్పుడొకరికి, ఇప్పుడొకరికి అప్పులిచ్చి ఏడాది పొడవునా పంటను ఇంటికి తెచ్చుకునే మార్వాడీ లాంటిది కాదని అన్నాడు. ఆ మాటలన్నపుడే అతన్ని మొహం మీద కొట్టి, ఎద్దుల్ని విప్పదీసి స్తంభానికి కట్టేసానని చెప్పాడు. ఆ సరికి శ్రోతలకు వాళ్ళ గొడవ మీద ఆసక్తి తగ్గిపోయింది.

దేనికో దానికి ఆదిలాబాద్ జిల్లా ఈ మధ్య నిత్యం వార్తల్లో ఉండడం చూస్తున్నాం. పోలీసులు గ్రామాల నుండి ఆదివాసీ యువకుల్ని పట్టుకుపోయి కాల్చేస్తున్నారనో (గుర్తుతెలియని నక్సలైట్ల పేరుతో ఎన్‌కౌంటర్ చేస్తున్నారనో); నక్సలైట్లు మందుపాతరలు పెట్టి పోలీసు జీపులను పేల్చేస్తున్నారనో; బూటకపు ఎన్‌కౌంటర్ హత్యలను ఆపమంటూ తెలుగుదేశం పార్టీ నాయకులు నిరాహారదీక్ష చేస్తున్నారనో; ఆదివాసులు ఆకలికి తాళలేక టౌన్లలో, పెద్ద గ్రామాలలో నివసించే వ్యాపారస్తుల, వడ్డీ వ్యాపారస్తుల ఇళ్ళు, దుకాణాలపైన దాడులు చేస్తున్నారనో; ఇలా నిత్యం ఏవో వార్తలు వింటూనే ఉంటున్నాం. ఈ చివరిది చరిత్రకారులకు ప్రజా ఉద్యమాల గురించి, ప్రజా చైతన్యం గురించి రకరకాల కొత్త సూత్రీకరణలు చేయడానికి అద్భుతమైన ముడిసరుకుగా కూడ ఉపయోగపడుతోంది. మొదటి దాడి ఖానాపూర్ తాలూకాలోని పెంబి గ్రామంలో 1988 అక్టోబర్ 3 న జరిగింది. ఆ తరువాత పెంచికలపేట, తోషం, జైనత్, తలమద్ది, రాజుర, దండేపల్లిలలో, ఇంకా సరిహద్దుకావల మహారాష్ట్రలోని కొన్ని గ్రామాలలో కూడ జరిగాయి. ప్రతి సంఘటనలోను 200 నుండి 300 మంది దాకా ఆదివాసులు సాయుధ నక్సలైట్లు వెంట రాగా వడ్డీ వ్యాపారస్తుల ఇళ్ళపైన దాడులు చేసి డబ్బుతో పాటు వారి దగ్గర కుదువ ఉన్న తమ వస్తువులను పట్టికెళ్ళిపోయారు; ధాన్యం దుకాణాలపైన దాడి చేసి తినడానికి బియ్యం, పంట వేసుకోవడానికి జొన్నలు ఎత్తుకెళ్ళారు; ఇతర వ్యాపారస్తుల ఇళ్ళు, షాపులపై కూడ దాడులు చేసి చేతికి ఏది అందితే అది డబ్బు, బట్టలు, నగలు తీసుకుపోయారు.

ఈ దాడులకు నేపథ్యం గత ఏడాది జరిగిన అసాధారణమైన పంట నష్టం. మంచి వర్షాలు పడ్డాయని చెబుతున్న సంవత్సరంలో (మొత్తం వర్షపాతం రీత్యా), అందునా మూడు వైపులా గోదావరి, దాని ఉపనదులైన ప్రాణహిత, పెన్ గంగ, స్వర్ణ, కడెం ప్రవహిస్తున్న జిల్లాలో అంత పంట నష్టం సంభవించడంలో నిజానికి 'సహజమైనది' ఏమీ లేదు. సహజం కాకపోయినా నష్టం మాత్రం వాస్తవమే. జిల్లాలోని 52 మండలాలకు గాను 45 మండలాలను ప్రభుత్వమే అనావృష్టి ప్రాంతాలుగా ప్రకటించింది. ఖరీఫ్ పంటలు (పత్తి, వరి, జొన్నలు, పప్పు ధాన్యాలు) పాక్షికంగా దెబ్బ తిన్నాయని, రబీ పంటలు (జొన్నలు, పప్పుధాన్యాలు, నువ్వులు) పూర్తిగా పోయాయని జిల్లా కలెక్టరే స్వయంగా ప్రకటించారు. ఆయన అంచనా ప్రకారం పంట నష్టం 36.92 కోట్ల రూపాయలు. కాని రైతుల లెక్క వేరు. నాట్లు వేసిన పొలాలలో పైర్ల దిగుబడిలో వచ్చిన తగ్గుదలను మాత్రమే కలెక్టర్ లెక్క వేశారు కాని అసలు నాటకుండా వదిలేసిన పొలాల వల్ల తగ్గిన పంట దిగుబడిని ఆయన లెక్కలోకి తీసుకోలేదని వారు చెపుతారు. ఇది నిజమే. ఎందుకంటే వరసగా పంట నష్టం జరుగుతున్నపుడు పైరు వేయకుండా వదిలేసే పొలాలు ఎక్కువే ఉంటాయి కాబట్టి వాటిని కూడ పరిగణనలోకి తీసుకోవాలి. అప్పుడు పంట నష్టం ఇంకా చాలా ఎక్కువే అవుతుంది. జిల్లాలో గత ఏడాది ఖరీఫ్ లో నాట్లు ఎప్పటిలానే పడ్డా, రబీలో మాత్రం సాధారణం కంటే దాదాపు 40 శాతం తక్కువ పడ్డాయి. రైతుకొచ్చే ఆదాయానికి అది చాలా పెద్ద నష్టం. కాని అధికారిక గణాంకాలు ఈ నష్టాన్ని ఎప్పుడూ గుర్తించవు.

నైరుతి రుతుపవనాలపుడు కుంభవృష్టి, ఈశాన్య రుతుపవనాలపుడు అనావృష్టి – ఈ విచిత్రమైన పరిస్థితి వల్లనే పోయిన ఏడాది పంటలు అంత ఘోరంగా దెబ్బ తిన్నాయి. మొదట ఎడతెరిపి లేని వానలు కురవడం వల్ల పొలాలలో నీరు నిలబడిపోయి, పైమట్టి కొట్టుకుపోయి చెరువులకు గండ్లు పడ్డాయి. నిజానికి దేశమంతటా ఉందీ సమస్య. అయినా ఎక్కడా ఎవరూ దానిని పరిష్కరించే ప్రయత్నం చేయనపుడు ఇక ఆదిలాబాద్ వంటి మారుమూల జిల్లాను ఎవరు పట్టించుకుంటారు? భూమిని, నీటి వనరులను సక్రమంగా నిర్వహిస్తుంటే కనక ఈ భారీ వర్షాలు – కనీసం ఒక మేరకు – వరప్రదాయిని అవుతాయి గాని ఇవ్వాళ ఉన్న పరిస్థితుల్లో మాత్రం వాటిని విపత్తుగానే భావించాల్సి ఉంటుంది. ఆదిలాబాద్ తూర్పు, దక్షిణ మైదాన ప్రాంతాలలోని రైతులు ఈసారి తమ గ్రామ చెరువులు ఒక్కొక్కటిగా గండ్లు పడి నీరు వృథాగా పోవడం చూశారు. అక్కడి చెరువుల నిర్మాణం ఎలా ఉంటుందంటే

ఐదారు చెరువులు కలిసి ఒక సముదాయంగా ఉంటాయి. వీటిని గొలుసుకట్టు చెరువులు అంటారు. పైనున్న చెరువు నిండాక ఆ నీళ్ళు కింది చెరువుకు, అదీ నిండాక దాని కింది చెరువుకు ఇలా ప్రవహిస్తాయి. మామూలు రోజుల్లో ఇది మంచి ఏర్పాటే కాని పైనున్న చెరువుకు గండి పడితే మాత్రం ఈ నిర్మాణ సదుపాయమే నష్టదాయకం అవుతుంది. ఉన్నట్టుండి నీళ్ళు ఉధృతంగా రావడంతో పై మట్టంతా కొట్టుకుపోయి కిందనున్న చెరువుల చుట్టూ మేట వేస్తుంది. వాటికీ గండ్లు పడి వాటి చుట్టూ ఉండే పొలాలన్నీ దెబ్బ తింటాయి. మట్టి కొట్టుకుపోవడం వల్ల మెరక భూములకు నష్టం జరిగితే మట్టి మేట వేసి పల్లపు భూములకు నష్టం జరుగుతుంది. చివరికి వానలు ఆగిపోయేసరికి చెరువుల్లో నీళ్ళూ ఉండవు, భూమిలో సారమూ ఉండదు.

ఈ వర్షాలకు అన్నిటి కంటే బాగా దెబ్బ తిన్న ప్రాంతం ఆదిలాబాద్ ఉత్తర భాగం. అదంతా ఎగుడుదిగుడుగా ఉండే పీఠభూమి ప్రాంతం. ముఖ్యంగా జైనూర్, సిర్పూర్, నార్నూర్, తిర్యాని రెవిన్యూ మండలాలతో కూడిన ఉత్తర, మధ్య ప్రాంతం. ఇవన్నీ పోలీసు కాల్పుల కారణంగా ప్రసిద్ధి చెందిన ఇంద్రవెల్లి గ్రామానికి ఉత్తరం వైపున ఉంటాయి. ఒక సభ కోసం పెద్దఎత్తున గుమిగూడిన ఆదివాసులపై పోలీసులు 1981 ఏప్రిల్ 20 న కాల్పులు జరపడంతో ఆ ఊరు ప్రసిద్ధి చెందింది. ఈ మండలాలన్నిట్లో సాగునీటి వసతి బాగా తక్కువ. చెరువులు, బావులు ఏమీ లేవు. నేల ఎగుడుదిగుడుగా, ఎక్కువ భాగం అడవిలా ఉంటుంది. జనాభాలో అధిక భాగం ఆదివాసులే. అయితే ఈ భూములకు నీటి వసతి లేకపోవడానికి కారణం అక్కడి నేలతీరు కాదు. నిజానికి మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు కట్టడానికి అది భౌగోళికంగా చాలా అనువైన ప్రాంతం. ఎక్కడెక్కడ కట్టవచ్చో ఆదివాసులే మనకు చెపుతారు. రెండు మూడు వందల ఎకరాలకు నీళ్ళు ఇవ్వగల ప్రాజెక్టులను ఎక్కడెక్కడ ఏ ఏ అడవి ఏరుల మీద కట్టవచ్చో వాళ్ళే ఆ స్థలాలను చూపిస్తారు కూడ. కాని ప్రభుత్వం ఎన్నడూ వారి ప్రతిపాదనలను సీరియస్‌గా తీసుకుని పరిశీలించలేదు. మొత్తం ఆదిలాబాద్ జిల్లాలోని వ్యవసాయయోగ్యమైన భూమిలో కేవలం 9.2 శాతం భూమికి మాత్రమే సాగునీటి వసతి ఉంది (రాష్ట్ర సగటు దాదాపు 34 శాతం). ఈ 9.2 శాతంలో ఎక్కువ భాగం జిల్లా దక్షిణ, పడమర ప్రాంతాలలో ఉన్నాయి. వాటికి కడెం, స్వర్ణ, గోదావరి నదులపైన కట్టిన ప్రాజెక్టుల ద్వారా, చెరువులు, బావుల ద్వారా నీరు అందుతోంది.

మళ్ళీ వర్షాల దగ్గరకు వస్తే వానలు కుండపోతగా కురిసినప్పుడు ఈ ఉత్తర, మధ్య మండలాల రైతులందరూ చెరువుల్లా మారిన తమ పొలాల వంక నిస్సహాయంగా చూస్తుండిపోవడం తప్ప ఏమీ చేయలేకపోయారు. అవన్నీ నల్ల రేగడి మట్టి నేలలు అవడం వల్ల పొలంలోకి దిగి పనులు చేసుకునే పరిస్థితి కూడ లేకపోయింది. వానల వల్ల విపరీతంగా పెరిగే కలుపును తీయడానికి సైతం వీలు కాని స్థితి. అప్పుడప్పుడే మొలకెత్తిన జొన్న, పత్తి, ఆస్మాన్ తరి (వర్షాధార వరి) పూర్తిగా నీట మునిగాయి. ఈ వానలు వారాల తరబడి కురిశాయి. అయినా మొదట్లో రైతులు అంత ఆందోళన చెందలేదు. వానలు ఆగాక నేలలో ఎలాగూ చెమ్మ ఉంటుంది కాబట్టి మళ్ళీ నాట్లు వేసుకుని మంచి దిగుబడి తెచ్చుకోవచ్చనుకున్నారు. కాని వానలు ఆగాక – కొట్టుకుపోయిన మట్టి కొట్టుకుపోగా – మిగిలిన మట్టిలోని తేమ కూడ క్రమంగా తగ్గిపోతూ వచ్చింది. దాని వల్ల రెండోసారి వేసిన పంట కూడ పూర్తిగా ఎండిపోయింది. మామూలుగా ఈశాన్య రుతుపవనాలు చురుగ్గా ఉండే నవంబర్ డిసెంబర్ నెలల్లో కూడ ఈసారి చుక్క వాన పడకపోయేసరికి ఒక్క పంటా ఇంటికి రాలేదు.

చాలా త్వరగా వాళ్ళు ఆకలికి అలమటించే పరిస్థితికి చేరుకున్నారు. ఏటా కూడ వేసవి తర్వాత అక్కడ వ్యవసాయేతర పనులు దొరకడం చాలా తక్కువ. వేసవిలో మాత్రం అడవిలో బీడీ ఆకులు (తునికాకు) తెంపే పని ఒక రెండు నెలలు ఉంటుంది. సి.పి.ఐ ఎం.ఎల్ గ్రూపుల ప్రోద్బలంతో జరిగే ఉద్యమాల ఫలితంగా ఈ పనికి వారికిప్పుడు మంచి వేతనాలే దొరుకుతున్నాయి. తునికాకు కూలి రేట్లు గోదావరి లోయ ప్రాంతమంతటిలోను గత పదిహేనేళ్ళలో ఆరింతలు పెరిగాయి. ఈ నెలలలో వారికి దొరికే మరొక పని రోడ్లు వేసే పని. వర్షాకాలం రాగానే ఆ పని కూడ ఆగిపోతుంది. మామూలు సంవత్సరాలలో వారికి అదేమంత పెద్ద విషయం కాదు కాని ఈసారి అకస్మాత్తుగా పంటలు పూర్తిగా దెబ్బ తినడంతో ఏ పనులూ లేకపోవడం వారిని మరిన్ని ఇక్కట్లపాలు చేసింది. దానితో వలసలు మొదలయ్యాయి. కొందరు పనులు వెతుక్కుంటూ ఆదిలాబాద్ తూర్పు ప్రాంతంలో ఉండే సింగరేణి బొగ్గు గనులకు వెళితే, కొందరు కాలువల కింద సాగయ్యే దక్షిణ తాలూకాలలో దొరికే రబీ వ్యవసాయ పనుల కోసం వలస పోయారు. ఇంకా కొందరు కరీంనగర్ జిల్లాలోని బొగ్గు గనులకు, థర్మల్ విద్యుత్ కేంద్రాలకు వెళ్ళారు. ఆదివాసులలో సంచార అలవాటు ఉన్న లంబాడాలు, ఆదివాసేతర పేదలు పెద్ద సంఖ్యలో వలస పోగా ఆదివాసులలోని

వెనుకబడిన జాతులవారు, వలస పోవడం అంతగా అలవాటు లేని జాతులవారు – ప్రధానంగా గోండులు, కొలాములు – తక్కువ సంఖ్యలో వెళ్ళారు. వెళ్ళకుండా ఉండిపోయినవారికి రెండే బతుకు తెరువులు మిగిలాయి. ఒకటి అడవి, రెండోది వడ్డీ వ్యాపారి. అడవుల నుండి రకరకాల ఆహారం సంపాదించుకోవడం ఆదివాసులకు బాగానే తెలుసు. ఆహారం దొరకకపోతే ఇతర వస్తువులను సేకరించి ఆహారం కోసం మార్పిడి చేసుకోవడం కూడ వారికి తెలుసు. రెండో మార్గమే కష్టమైనది. ప్రతి పంట సీజన్ కు రూపాయికి 50 పైసల వడ్డీ చొప్పున అప్పు తెచ్చుకుని కడుపు నింపుకునే మార్గం అది. అంటే ఏడాదికి 100 శాతం వడ్డీ చెల్లించి తెచ్చుకునే అప్పు.

మొదటి మార్గమైన అడవులు వారిని ఎప్పటిలాగే ఆదుకున్నాయి కాని వడ్డీ వ్యాపారస్తులు మాత్రం అడ్డం తిరిగారు. దానికి కారణం పత్తి పంట పూర్తిగా తుడిచిపెట్టుకు పోవడమే. ఇక్కడి సాగు భూమిలో పత్తి పండించే భూమి 21 శాతం దాకా ఉంటుంది. ఇది జొన్న విస్తీర్ణంలో సగం, వరి విస్తీర్ణానికి రెట్టింపు. అయితే ఈ ప్రాంతంలో పత్తిని మొదట ప్రవేశపెట్టినపుడు ఏ పద్ధతులైతే అనుసరించారో ఇప్పటికీ అవే పద్ధతులు వాడుతున్నందు వల్ల ఇక్కడ గుంటూరు తదితర కోస్తా జిల్లాలలో వచ్చే పత్తి దిగుబడితో పోల్చితే నాలుగో వంతు మాత్రమే వస్తుంది. అయినా వాణిజ్య పంట వాణిజ్య పంటే. వడ్డీ వ్యాపారస్తుడి దృష్టిలో దానికే విలువ. అందుకే పత్తి వేసే రైతుకు ప్రతి సీజన్ లోను వంద శాతం వడ్డీపై షావుకారు పెట్టుబడి ఖర్చును అప్పుగా సమకూర్చేవాడు. దాన్ని సీజన్ చివర్లో వారు తిరిగి చెల్లించేవారు. ధరలు ఎక్కువగా ఉండే కాలంలో వడ్డీ వ్యాపారస్తులు ఈ అప్పును ఆహార ధాన్యాల రూపంలోనూ, విత్తనాల రూపంలోనూ ఇస్తారు. తిరిగి తీసుకునేటప్పుడు మాత్రం నగదు రూపంలోనే తీసుకుంటారు. ఎందుకంటే అప్పటికి ధాన్యం రేటు తగ్గిపోతుంది కాబట్టి.

ఈ వడ్డీ వ్యాపారస్తులలో ఎక్కువమంది మార్వాడీలు, తెలుగు కోమట్లు ఉంటారు. కొందరు మాత్రం ముస్లింలు. అందరూ ధాన్యం వర్తకులు, పత్తి డీలర్లు లేదా భూస్వాములై ఉంటారు. వీరందరూ మండల కేంద్రాలలో లేదా పెద్ద గ్రామాలలో ఉంటారు. అప్పు చెల్లించలేక ఆదివాసులు చాలాసార్లు మళ్ళీ మళ్ళీ బకాయి పడిపోతారు. అయినా సరే మైదాన ప్రాంత గ్రామాలలోని దళితుల లాగా వెట్టిచాకిరీకి చచ్చినా ఒప్పుకోరు. పోడు చేసుకోవడానికి ఏ కొంచెం అడవి భూమి దొరికినా, దాని వల్ల ఎంతటి కష్టనిష్టూరాలు ఎదురైనా ఆ పని చేయడానికి ఇష్టపడతారే తప్ప ఎవరి చేతి

కిందా పని చేయడానికి మాత్రం ఇష్టపడరు. దానితో చివరికి ఏమవుతుందంటే కుదువ పెట్టిన వస్తువుల ధర కంటే తాము తీసుకున్న అప్పు ఎక్కువై పోయినప్పుడు వాళ్ళు తమ భూమిని వడ్డీ వ్యాపారస్తులకు ఇచ్చేస్తారు. ఇదేమీ కాగితాల మీద జరగదు. ఎందుకంటే చాలాసార్లు ఆదివాసీకి తాను సాగు చేస్తున్న భూమికి పట్టా ఉండకపోవచ్చు, ఒకవేళ ఉన్నా షెడ్యూల్డ్ ప్రాంతంలో వారి భూమిని ఆదివాసేతరుడికి బదిలీ చేయడానికి చట్టం అంగీకరించదు. అయినా సరే చాలామంది వడ్డీ వ్యాపారస్తులు వారి భూముల్ని తీసుకుని 70, 80 ఎకరాల భూస్వాములుగా మారిపోయారు.

క్లుప్తంగా చెప్పాలంటే ఆదిలాబాద్ ఇంకా 20 వ శతాబ్దపు ఉత్తరార్థంలోకి ప్రవేశించలేదు; 19 వ శతాబ్దపు చారిత్రక అవశేషంగానే ఉంది. కనీసం ఆదివాసీ-వడ్డీ వ్యాపారస్తుల సంబంధాల విషయంలో.

మళ్ళీ పంటల విషయానికి వస్తే గత ఏడాది పంటలు పూర్తిగా దెబ్బ తిన్నపుడు ఎప్పటిలాగే వడ్డీ వ్యాపారస్తుల నుండి అప్పు తీసుకుని మళ్ళీ వర్షాకాలం వచ్చేదాకా ఎలాగోలా గడిపేద్దామనుకున్నారు ఆదివాసులు. కాని వ్యాపారస్తులు ఈసారి అప్పు ఇవ్వడానికి ఏ మాత్రం సుముఖంగా లేరని చూశాం కదా! వాణిజ్య పంటకు పెట్టుబడి ఖర్చు సమకూర్చడానికీ, కరువు కాలంలో తిండిగింజల కోసం అప్పు ఇవ్వడానికీ వాళ్ళ దృష్టిలో చాలా తేడా ఉంది. మామూలు రోజుల్లోనే డబ్బులు దాచుకోవడం పట్ల ఆసక్తి లేనివాళ్ళు ఇక ఇప్పుడు ఏ విధంగా అప్పు తిరిగి చెల్లిస్తారని వ్యాపారుల భయం. అందువల్ల ససేమిరా ఇవ్వం పొమ్మన్నారు. ఇది ఆదివాసులకు చాలా కోపం తెప్పించింది. ఎందుకంటే వాళ్ళు ఇంతకుముందెప్పుడూ అప్పు ఎగ్గొట్టలేదు. పైపెచ్చు తమ విలువైన వస్తువులు చాలా ఇంకా వారి వద్దే తాకట్టులో ఉన్నాయి. అలాంటప్పుడు అప్పు ఇవ్వమనడం నమ్మక ద్రోహంగా, వెన్నుపోటుగా భావించారు వాళ్ళు. 'తూర్పు గుజరాత్ లోని భిల్లులు, షాహుకార్లు' (సబాల్టర్న్ స్టడీస్, వాల్యూం 5) అనే శీర్షికతో వ్యాసం రాసిన సబాల్టర్న్ చరిత్రకారుడు డేవిడ్ హార్డిమన్ మాటల్లో చెప్పాలంటే ఆదివాసులకు 'నైతిక ఆగ్రహం' కలిగింది.

ప్రజా చైతన్యాన్ని నిష్పక్షపాతంగా బేరీజు వేసే విషయంలో సబాల్టర్న్ పండితులకు ఉండే సాధారణ వ్యతిరేకతను పక్కన పెడితే ఈ 'నైతిక ఆగ్రహం' అనేది చాలా సంక్లిష్టమైన భావన. కేవలం ఆకలి ఏ రోజూ తిరుగుబాటుకు దారి తీయలేదనేది కాసేపు (కాసేపే) నిజమే అనుకున్నా, సమాజం బాధ్యతలుగా జనం అర్థం చేసుకున్న

వాటి ఉల్లంఘున జరిగినప్పుడే వాళ్ళు ఈ నైతిక ఆగ్రహం ప్రదర్శించారని ఒప్పుకున్నా, ఇందులో నిజానికి ఇమిడి ఉన్నది 'తిరుగుబాటు (యొక్క) న్యాయబద్ధత' అనే అంశం. ఈ న్యాయబద్ధత అనేది మార్పు చెందని శాశ్వత సత్యమేమీ కాదు; ప్రజాచైతన్యం తనంతతానుగా నిర్ణయించుకునే భావనా కాదు. అణచివేతకు గురయ్యే వారందరికీ తమ అణచివేత పరిస్థితుల గురించి స్వతఃసిద్ధంగా తెలిసినట్లుగా ఇది కూడ తెలుస్తుందని అనుకోవడానికి లేదు.

నిజానికి ప్రతి అసమ సంబంధం, ప్రతి ఆధిపత్య సంబంధం ఉద్రిక్తతతో కూడిన సంబంధమే. అయినా అటువంటి సంబంధాలు సమాజంలో ఏర్పడుతూ ఉండడమే కాక ఎప్పటికప్పుడు పునరుత్పత్తి అవుతున్నాయంటే దాని అర్థం ఆ అసమానతకు, ఆధిపత్యానికి న్యాయబద్ధతను కల్పించే ఒక ఉమ్మడి నైతిక నియమావళి ఉందనీ, ఇరువైపులవారూ దానిని తమలో అంతర్లీనం చేసుకున్నారనీ అనుకోవాలి. అయితే అదే సమయంలో ఆధిపత్యంలో ఉండేవారు పీడితులకు కాస్త వెసులుబాటు ఉండేలా ఎక్కడో ఒక గీత గీసుకుంటారు. పీడన ఆ గీత దాటితే మాత్రం ఆ చర్యను ఖండిస్తారు. హార్డిమన్ ప్రకారం 'తూర్పు గుజరాత్ కు చెందిన భిల్లులు, షాహుకార్లు రెండు వేర్వేరు సామాజిక వ్యవస్థలకు, నైతిక నియమావళులకు చెందిన సమూహాలు కావడం వలన కలిసి బతికే క్రమంలో ఆ రెండింటి మధ్య అప్పుడప్పుడు ఘర్షణ వస్తుంటుంది.' కాని నిజానికి వారు రెండు వేర్వేరు సామాజిక వ్యవస్థలకు చెందిన వారేమీ కాదు, ఒకే సామాజిక వ్యవస్థకు చెందిన రెండు వర్గాలవారు. అదెలా ఉన్నా వారిలో ఎవరికీ రెండోవారి మీద 'నైతిక ఆధిపత్యం' లేదన్న ఆయన ముక్తాయింపు సూత్రీకరణ పూర్తిగా ఆయన ఊహే తప్ప తార్కిక ప్రాతిపదికపై నిలబడే నిర్ధారణ ఎంతమాత్రం కాదు. ఈ ఉమ్మడి నైతిక నియమావళి అన్నది విభిన్న పక్షాల అకాంక్షల మధ్య పెనుగులాటలో ఏర్పడే 'సమతూకం' లేదా 'యథాతథ స్థితి' నుంచి పుట్టుకొచ్చే సమతుల్యతా స్థితి కూడ కాదు. దానికి పూర్తిగా భిన్నమైనది. ఆధిపత్య సంబంధాలు దీర్ఘకాలం కొనసాగాలంటే ఆధిపత్య నైతిక భావజాలంతో సహా అన్ని రకాల ఆధిపత్య భావజాలం గొడుగు కిందే అది సాధ్యపడుతుంది.

అయితే న్యాయబద్ధతను కల్పించే ఈ నైతికత అన్నది అట్టడుగు జనాల సమస్త చైతన్య సారాంశాన్ని నిర్ణయించే ఏకసూత్ర భావజాలం కాదు. మార్క్సిస్టులు తొందరపాటుతో అలా పరిగణించడాన్ని సబాల్టర్న్ పండితులు విమర్శించడం ఆ

మేరకు సబబే. (సబాల్టర్న్ పండితుల పరిశోధన ఎంత సూక్ష్మంగా ఉంటుందో వారి రాజకీయ విమర్శ అంత గొట్టుగా ఉంటుందనిపిస్తుంది.) అయితే న్యాయబద్ధతను కల్పించే ఒక నైతికత ఉండడమనేది, దానిని వారు అంతర్లీనం చేసుకోవడమనేది వాస్తవం. అంతర్లీనమైన ఈ న్యాయబద్ధతే (లెజిటిమసీ) ఇరుపక్షాలవారి సామాజిక ప్రవర్తనను కొలవడానికీ, దాని న్యాయబద్ధతను నిర్ణయించడానికీ నైతిక ప్రమాణంగా పని చేస్తుంది. పీడకుల, పీడితుల ఉమ్మడి సామాజిక అంతరాత్మగా ఒక నైతిక ప్రమాణం ఆవిర్భవించడమనేది ఆధిపత్యానికున్న పార్శ్వాలలో ఒకటి. ఒక పద్ధతి లేదా కట్టుబాటు అని జనం అనుకునే వాటి ఉల్లంఘన జరిగినపుడు వారికి కోపం రావడానికి కారణం ఈ ఉమ్మడి నైతిక నియమావళి ఉల్లంఘన జరిగిందని కాదు, సామాజిక అంతరాత్మ నిర్దేశిస్తున్న నైతిక ప్రమాణాల ఉల్లంఘన జరిగిందని. ప్రజాచైతన్యంలో ఎవరి ప్రభావానికీ లోబడని స్వతంత్ర భాగం ఒకటుందని పార్థా చటర్జీ మనలను నమ్మమంటున్నారు కానీ అలాంటిదేమీ ఉండదు. (తాను రాసింది మామూలు పాఠకులకు అర్థమయ్యేలా రాయాలనే కోరిక పార్థా చటర్జీ గారిని ఇతర సబాల్టర్న్ సిద్ధాంతకర్తల నుండి వేరు చేస్తుంది.) ప్రజా చైతన్యం, అట్టడుగు జనాల చైతన్యం అనేవి రెండు వేరు వేరు విషయాలు కాదు. ఏదైనా విషయాన్ని అవి వేరు వేరుగా ఏమీ చూడవు. రెండింటి మధ్యా ఒక అవిచ్ఛిన్నమైన కొనసాగింపు ఎప్పటికీ ఉంటుంది. వారి సమస్త చైతన్యాన్నీ ఆవరించి అల్లుకుని ఉండే ఆధిపత్య నైతికత క్రమంగా దాని లోపలికి చొచ్చుకుని పోతుంది. ప్రజల వస్తుగత జీవితం నుండి ఆవిర్భవించే ఆలోచనలు, విలువలు స్కాలర్లు 'శిష్ట వర్గం' అని పిలిచేవారి ఆలోచనలు, విలువలతో ప్రతి విషయంలోను – ఒక్క మాటలో చెప్పాలంటే వారి భావజాలంతో – అడుగడుగునా ప్రభావితం అవుతూనే ఉంటాయి. కరువు పీడిత ఆదివాసులతో కరువు గురించి మాట్లాడండి, వాళ్ళ అభిప్రాయాలు, విశ్లేషణ; ఊహలు, కథలు; కారణాలు, కల్పితాలు; అన్నీ కలగలిపి చెప్పుకుంటూ పోతారు. అందులో అడవివాసుల పట్ల బ్రాహ్మణీయ వర్గాలలో ఉండే చిన్నచూపు, తమ దయా దాక్షిణ్యాలపై ఆధారపడి జీవించే మనుషులన్నట్టుగా చూసే అధికార యంత్రాంగం ధోరణి – షెడ్యూల్డ్ తెగ అని వాళ్ళను పిలవడంలోనే అదంతా కనిపిస్తుంది – ఇవన్నీ కూడ విమర్శనారహితంగా కలిసిపోయి ఉంటాయి. ఈ విషయంలో మార్పు రావాలంటే, పాలక వర్గాల భావజాలం నుండి ప్రజల అభిప్రాయాలను వేరు చెయ్యాలంటే రాజకీయ ప్రయత్నం, ఉద్యమం అవసరం. అది బయటి నుంచే రావాలనేమీ లేదు, అలా అని లోపలి నుంచి మాత్రమే

వస్తుందనీ కాదు. ప్రజల చైతన్యం ఎటువంటి ప్రభావాలకూ లోబడకుండా స్వతంత్రంగా రూపొందుతుందనే అభిప్రాయం వల్ల ఒక ఉద్యమం లేదా ఆందోళన ద్వారా అటువంటి మార్పు తీసుకు రావొచ్చనే ఆలోచనను తిరస్కరిస్తున్నారు.

ఆధిపత్యానికి న్యాయబద్ధత కల్పించడంతో పాటు పీడితుల వ్యతిరేకతకు కూడ చోటు కల్పించాల్సి ఉన్నందున ఈ సామాజిక నైతికత పీడకుల ప్రవర్తనకు ఒక పరిధిని నిర్వచించాల్సి వస్తుంది. అది దాటితే పీడకుల ప్రవర్తన సహించరానిదవుతుంది, పీడితుల తిరుగుబాటు న్యాయబద్ధమవుతుంది. భర్త చేతిలో నిర్లక్ష్యానికి గురయ్యే భార్య తన బాధను మౌనంగా భరించాలని సమాజం భావిస్తుంది. కాని ఆ భర్త మరో స్త్రీని ఇంటికి తీసుకొచ్చినప్పుడు ఆమె దానికి వ్యతిరేకంగా తిరగబడితే ఆమె కోపాన్ని అర్థం చేసుకుంటుంది. ఇరువర్గాల ప్రవర్తనలో ఏది న్యాయబద్ధమైనది, ఏది కాదు అని నిర్ణయించే ఈ గీత పీడకుల, పీడితుల మధ్యనున్న సంఘర్షణ స్థాయిని బట్టి ఉంటుంది. ఆ ఘర్షణను ముందుకు తీసుకెళ్లడంలో రాజకీయ నాయకత్వం పాత్ర చాలా కీలకమైనది. ఆ నాయకత్వం పీడిత వర్గాల నుండి రావొచ్చు, లేదా పీడక వర్గాల నుండి రావొచ్చు. పీడిత వర్గాల నుండి ఎప్పుడు వస్తుందంటే ఈ నైతికత పీడకుల ఆధిపత్యానికి న్యాయబద్ధత కల్పిస్తోందనే ఎరుక కలిగిన వారు ఆ స్థానాలలోకి వచ్చినప్పుడు వస్తుంది. పీడక వర్గాలలో ఎప్పుడు వస్తుందంటే వేరే సమాజపు సాంస్కృతిక ప్రభావం వల్ల కావొచ్చు, వ్యక్తిగతంగా సున్నిత మనస్కులై ఉండడం వల్ల కావొచ్చు, వారిలో ఈ పరిస్థితి పట్ల అయిష్టత, వ్యతిరేకత ఏర్పడ్డప్పుడు వస్తుంది. అటువంటి నాయకత్వం పీడకులు అనుమతించే కొన్ని ఉల్లంఘనలను మాత్రమే వ్యతిరేకించి ఊరుకోకుండా – అసలు అణచివేతకే వ్యతిరేకంగా జరిగే ఆందోళనలను విస్తరించి, ప్రజామోదాన్ని సాధించి వాటికి న్యాయబద్ధతను కల్పించగలదు. సాధారణంగా పీడిత వర్గాలకు చెందిన రకరకాల వ్యక్తులు రాజకీయంగా సంఘటితమైనప్పుడే అప్పటిదాకా ఉన్న నైతికత పరిధి రద్దయి, అన్యాయాన్ని తక్కువగా సహించే మరో పరిధి నిర్వచించబడుతుంది. ప్రజా చైతన్యంలో ఇదొక ముందడుగు అని అంటే సబాల్టర్న్ స్కాలర్లు ఒప్పుకోకపోవచ్చు. వాళ్ళ దృష్టిలో ఇది శిష్ట వాదం (Elitism), అట్టడుగు వర్గాల వారికి ఏది మంచిదో చెప్పే తీర్పరితనం(డేవిడ్ హార్డిమన్). కాని ఇది కచ్చితంగా ముందడుగే. ఎందుకంటే ఆధిపత్యపు దారుణ రూపాలలోని అన్యాయాన్ని మాత్రమే గుర్తించి ఊరుకోకుండా ఆధిపత్యంలోనే అన్యాయం ఉందని గుర్తిస్తుంది. 'కచ్చితమైన శాస్త్రీయ–హేతువాద దృక్పథం' లేకపోవడం అన్నది భిల్లులను

గాని, ఇతర చోట్ల ఇతర అణగారిన వర్గాలవారిని గానీ తిరగబడకుండా ఆపలేదు. ఈ వాస్తవం నుంచి ఆ దృక్పథం ఉండడం వల్ల ఆ ప్రజలకు మరింత ప్రయోజనం చేకూరి ఉండేది కాదన్న అర్థం లేని అభిప్రాయానికి మనం రానక్కరలేదు. చైతన్య స్థాయి పెరిగాక ఏ చిన్న అసమానత, అణచివేతకైనా వ్యతిరేకంగా వారు తిరగబడొచ్చు. డేవిడ్ హార్డిమన్ నమ్మకపోవచ్చు కాని వీటన్నిటి గురించి మళ్ళీ ఆలోచిస్తే బహుశా ఆకలి వల్లే ఎక్కువ ఆహార దాడులు జరిగాయనిపిస్తోంది.

తిరిగి 1988–89 నాటి ఆదిలాబాద్‌కు వస్తే – నక్సలైట్ల నాయకత్వం లేకపోయి ఉంటే ఆదివాసులు వడ్డీ వ్యాపారస్తులకు వ్యతిరేకంగా తిరగబడేవారా అంటే జవాబు చెప్పడం కష్టం. ఎందుకంటే ముఖాముఖీ మాట్లాడినా కూడ (ఇక అధికారిక శవపరీక్ష నివేదికలు చదివి తెలుసుకునే దాని గురించి ఏమి చెప్పాలి?) ప్రజా చైతన్యాన్ని అర్థం చేసుకోవడం కష్టం. అది సాధారణంగా సామాజిక ఆమోదం ఉన్న విషయాలను మాత్రమే వ్యక్తపరుస్తుంది; మరీ ముఖ్యంగా ప్రభుత్వ అధికారులతో, అధ్యయనానికి వచ్చిన స్కాలర్స్‌తో, పౌరహక్కుల కార్యకర్తలతో, న్యాయస్థానాలలో మాట్లాడేటపుడు. ఈ ఘర్షణల మీద నివేదికలు రాసి పంపే ప్రభుత్వాధికారులు కూడ వాటికి కారణాలను పైపై విషయాలలో, ఇంకా చెప్పాలంటే సామాజిక ఆమోద చట్రం లోపలే వెతుక్కుంటారు. వాళ్ళు చాలా అలోచించి ఆ పని చేస్తారనే కంటే వారి సామాజిక నైతికత కూడ అదే కావడం వల్ల అలా చేస్తారనుకోవచ్చు. దాని కంటే ప్రజా చైతన్యాన్ని అర్థం చేసుకోవడంలో తమకు అధ్యయన పద్ధతికి సంబంధించిన ఇబ్బందులు ఏమీ లేనట్టు సబాల్టర్న్ పండితులు అనుకోవడాన్ని చూస్తే వృత్తిరీత్యా చరిత్రకారులు కానటువంటి వారికి సైతం అది అత్యంత ఆశ్చర్యంగా అనిపిస్తుంది. ఒక గ్రామంలోని పేదవాళ్ళు భూస్వామిని కొట్టారంటే దానికి వంద కారణాలు ఉండొచ్చు. కాని ఎందుకు కొట్టారని అడిగితే వాళ్ళు తమ స్త్రీలపై జరిగిన బలాత్కారాలను ముఖ్య కారణంగా చెప్పొచ్చు. ఎందుకంటే సమాజం కూడ వాటిని అప్రతిష్టాకరమైన పనులని భావిస్తుంది కనుక. ఇంకేముంది? వెంటనే మన పండితులు ఇందులో భూమి సమస్యేమీ లేదని, వర్గ వైషమ్యం అసలే లేదని, ఇది కేవలం 'పరువు'కు సంబంధించిన వ్యవహారమని తీర్మానించేస్తారు. ప్రతి తిరుగుబాటు చర్యా మన చట్టంలో నేరంగా నిర్వచించబడ్డాక సామాజిక ఆమోదం ఉన్న పరిధిలోనే వాటి గురించి మాట్లాడడం అనివార్యమవుతుంది. యజమానిని కొట్టిన ఒక కూలివాడు తనను అరెస్టు చేయడానికి వచ్చిన పోలీసు

ఇన్స్‌పెక్టర్‌తో ఎవరి పెళ్ళికో లేదా సంతకో వెళ్ళడానికి సెలవు ఇవ్వనందునే కొట్టానని చెప్పాడనుకోండి. ఇన్స్‌పెక్టర్ నాలుగు వేట్లు వేయడమే కాదు బద్ధకస్తులైన కూలివాళ్ళ కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ ఎంతగా నాశనమై పోతోందో పెద్ద లెక్చర్ ఇచ్చినా ఇవ్వగలడు. అదే తండ్రికి కొరివి పెట్టడానికి సెలవు అడిగితే ఇవ్వలేదని కొట్టానని చెప్పాడనుకోండి – దాన్ని ఆ ఇన్‌స్పెక్టర్ నమ్మితే మాత్రం – కొంత ఉదారంగా ఉండే అవకాశం ఉంది. ఇదే స్పందన రేపు అతని కేసు కోర్టులో విచారణకు వచ్చినప్పుడు జడ్జి కూడ చూపెట్టే అవకాశం ఉంది. అన్ని శిక్షా వ్యవస్థలలోను ఈ సామాజిక న్యాయసమ్మత సిద్ధాంతం పని చేస్తుంది. అందువల్లే తిరుగుబాటు చర్యలు వాటి చట్టవిరుద్ధతకే కాదు సామాజిక న్యాయవిరుద్ధతకు కూడ శిక్షింపబడతాయి.

అందుకే తమ నేరాలకు ఒక న్యాయబద్ధమైన కారణం వెతుక్కోవడం ఆదిలాబాద్ ఆదివాసులకు చాలా ముఖ్యమైన విషయమైంది. అసలే గత ఏడాదంతా వారానికొక ఎన్‌కౌంటర్ జరిగిన 'తీవ్రవాద పీడిత' ప్రాంతంలో బతుకుతున్నవారు వాళ్ళు. వీలైన మేరకు సమాజ నైతికతా చట్రంలోనే వాళ్ళు తమ వర్గ ప్రయోజనాలు చూసుకోవడాన్ని కపటమనో లౌక్యమనో అనుకోనక్కరలేదు. తీసుకున్న అప్పులను అణాపైసలతో సహా చెల్లిస్తూ వచ్చినా ఇవ్వాళ తాము క్లిష్ట పరిస్థితిలో ఉన్నపుడు వడ్డీ వ్యాపారస్తులు అప్పు నిరాకరించారనేది వారికి చాలా కోపం తెప్పించిన మాట వాస్తవం. అయితే దాన్నే వారు బయటికి చెప్పడానికి కారణం మాత్రం దానికైతేనే జర్నలిస్టయినా, పరిశోధకుడైనా, ప్రభుత్వాధికారైనా కొంత సానుభూతి చూపగలడని; పోలీసువారి కోపం కూడ కాస్త తగ్గొచ్చని. నిజానికి దాడుల గురించి మాట్లాడగానే వాళ్ళు చెప్పే మొదటి కారణం అదై ఉండవచ్చు కాని కాసేపు మాట్లాడాక, అప్పు ఇవ్వలేదని దాడులు చేయడం సబబేనా లాంటి ప్రశ్నలు అడిగామనుకోండి కొద్దికొద్దిగా మనసు విప్పి అసలు విషయాలకు వస్తారు. ఉన్నట్టుండి వారిలోని ఒక యువకుడో, మరో ధైర్యవంతుడో రోజంతా పని చేసే ఆదివాసులకు తిండి ఎందుకు దొరకదు, ఏ పనీ చేయని వ్యాపారస్తులు మాత్రం రోజురోజుకీ ఎలా ధనవంతులై పోతున్నారు అని అడుగుతాడు. కొందరికి భూమి ఎందుకు ఎక్కువ ఉంది, కొందరికి ఎందుకు లేదు అని అడుగుతాడు. బ్యాంకుల నుండి రుణాలు తీసుకోవడానికి అవసరమైన యాజమాన్య పట్టాలు ఆదివాసేతరులకు అంత సులభంగా ఎలా లభిస్తాయి, అదే అప్పు కోసం ఆదివాసులు వడ్డీ వ్యాపారస్తుల దగ్గరికి ఎందుకు వెళ్ళాల్సి వస్తోంది అని అడుగుతాడు. ఇచ్చిన అప్పుకు ఏడాదిలోనే రెట్టింపు వసూలు చేసే వడ్డీ వ్యాపారస్తుడి

చర్యను దోపిడీయో దొంగతనమో ఎందుకు అనరు, ఆదివాసులు తమకు చెందినదాన్ని తాము తిరిగి తీసుకుంటే మాత్రం ఎందుకు అంటారు అని అడుగుతాడు. ఈ దశలో వారి పెద్దవాళ్ళలోని సంప్రదాయ ఆలోచనాపరులు జోక్యం చేసుకుని యువకులను కోప్పడి నోరు మూయిస్తారు. అందరికీ తెలిసిన విషయాల గురించి వాపోయి ప్రయోజనం ఏమిటని అడుగుతారు. అవి అలాగే ఉంటాయి, అలా ఉండాలనే రాసి పెట్టి ఉందని అంటారు. వారు నమ్మే నైతికత అదే. కాని యువత ఈ అభిప్రాయాలతో సంతృప్తి చెందడం లేదు. వారి అసంతృప్తి, ఆగ్రహం ఈ నైతికతను ఏనాడో విడనాడి 'ద్రోహపూరితం'గా మారింది. ఈ విషయం ఎందరికి అర్థమవుతుంది? కరువు మీద, దాడుల మీద కమీషనర్లు, కలెక్టర్లు రాసి పడేసే నివేదికలన్నీ ఎంతో జాగ్రత్తగా చదివినా ప్రజా చైతన్యంలో వచ్చిన ఈ 'న్యాయ విహిత' కోణం మనకు అర్థమవుతుందా అనేది ఆలోచించాల్సిన అంశం.

ఈ చర్చ కాసేపు పక్కన పెట్టి మళ్ళీ ఆదిలాబాద్ పరిస్థితికి వస్తే వడ్డీ వ్యాపారస్తులపై గోండులు, కొలాములు, లంబాడాలు 1988 అక్టోబర్‌లో మొదలుపెట్టిన దాడులు ఈ ఏడాది వర్షాకాలం దాకా కొనసాగాయి. ఒకవైపు వడ్డీ వ్యాపారులు అప్పులు ఇవ్వకపోవడం, మరోవైపు ప్రభుత్వం కరువు సహాయ పనులేమీ చేపట్టకపోవడంతో పోయిన ఏడాది చలికాలం వచ్చేసరికే ఆదివాసులు తిండి కోసం అడవుల మీద ఆధారపడక తప్పలేదు. ఇప్ప పూలు, వెదురు బియ్యం, విషపూరితమైన మాటి గడ్డలతోనే వారు కడుపు నింపుకోవాల్సి వచ్చింది. ఇప్ప పూలను వారు రకరకాల పద్ధతులలో ఆహారంగా తీసుకుంటారు. వెదురు బియ్యం ఒక రకమైన ధాన్యమే కాబట్టి దానితో వారికి సమస్య ఏమీ లేదు కాని మాటి గడ్డలతోనే వారికి సమస్య. వాటి నుంచి విషాన్ని తొలగించి తినడానికి వీలుగా మార్చుకోవడమనేది చాలా శ్రమతో కూడుకున్న పని. అయినా సరే ఆదివాసులు ఆ పని చేస్తున్నారంటే వారి పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ గడ్డలను వాళ్ళెలా సేకరిస్తారో, దఫా దఫాలుగా ఉడకబెట్టి ఎలా తింటారో 'గిరిజన రైతు కూలీ సంఘం' ప్రచురించిన ఒక పుస్తకంలో వివరంగా ఉంది.

"ఈ గడ్డలను మాటి గడ్డలంటారు. వీటిని ఎవరూ పండించరు. అడవుల్లో దొరుకుతాయి. అడవి జంతువులు, ముఖ్యంగా పందులు వాటిని తవ్వి తీసి తింటాయి. ఈ గడ్డల్లో ఆరు రకాలున్నాయి. అవి కెహెక్కా మాటి, నొస్కా మాటి, కిర్సి మాటి, తెత్రే మాటి, బొండి మాటి, నుల్ మాటి. వీటిల్లో మొదటి రెండూ విస్తృతంగా

దొరుకుతాయి కాని దురదృష్టవశాత్తూ అవే ఎక్కువ విషపూరితమైనవి. మిగతా నాలుగూ విషపూరితం కాదు కాని అవి ఎక్కువ దొరకవు.

ఒక భార్యాభర్తల జంట రోజంతా ప్రయత్నించినా రెండు కేజీల దుంపల కంటే తవ్వి తీయలేరు. ఆ తర్వాత వాటిని చిన్న చిన్న ముక్కలుగా కోసి ఏటి నీళ్ళలో మూడు రోజులు నానబెట్టి కడగాలి. వరసగా ఏడు రోజుల పాటు ఉడకబెట్టాలి. ప్రతిసారీ దుంపలోంచి కొంత విషం నీళ్ళలోకి పోతుంది. ఆ నీళ్ళను పారేసి మళ్ళీ ఉడకబెట్టాలి. ఏడు సార్ల తర్వాత చన్నీళ్ళలో కడిగి చివరగా మరోసారి ఉడకబెట్టాలి. ఇదంతా పూర్తవ్వాలంటే ఐదారు రోజులు పడుతుంది. అప్పుడే అవి తినడానికి పనికొస్తాయి."

ఇన్నిసార్లు ఉడకబెట్టాక ఇంక దానిలో పౌష్టికాహారం ఏమి మిగిలి ఉంటుంది?

తిండి కోసం మనుషులే ఇన్నిన్ని అవస్థలు పడుతుంటే ఇక పశువుల సంగతి చెప్పేదేముంది? వారాంతపు సంతల్లో వాటిని అమ్మితే వాటికి తిండి పెట్టలేక పోతున్నామనే బాధా వారికి తప్పుతుంది, తాము తిండి కొనుక్కోవడానికి కాస్త డబ్బైనా చేతికి వస్తుంది. ఈ పరిస్థితిలో కూడ వారు మామూలుగా అయితే వ్యాపారస్తుల, వడ్డీ వ్యాపారస్తుల ఇళ్ళ మీద, షాపుల మీద దాడులు చేసేవారా అంటే అనుమానమే. ఎందుకంటే ఆదిలాబాద్ గోండులు ఇటీవలి చరిత్రలో ఎక్కడా అటువంటి దాడులు చేసిన దాఖలాలు లేవు. అయితే వారిని వారి ఆలోచనలకు విడిచి పెట్టలేదు మరి.

ఈ ఏడాది వర్షాకాలం దగ్గరకొచ్చేసరికి ఈ దాడులు మరింత పెరిగాయి. అందుకు కనీసం రెండు కారణాలున్నాయి. ఒకటి – ఖరీఫ్ పంట కోసం భూమిని దున్నాల్సి ఉన్నందున వారికి అడవికి వెళ్లి ఇప్పపూలను, మాటి గడ్డలను సేకరించి తెచ్చుకునే వ్యవధి లేకపోయింది. రెండు – జొన్న పంట వేయడానికి జొన్న విత్తులు అవసరం కనుక వాటిని వ్యాపారుల దగ్గర నుండి తెచ్చుకోవడం కంటే వారికి మరో సులభమైన మార్గం ఏముంటుంది? ఋణ రూపేణా జొన్నలు ఇవ్వడానికి ఐ.టి.డి.ఎ ముందుకొచ్చింది కాని అప్పటికే చాలా దాడులు జరిగిపోయాయి. బహుశా ఆ దాడుల వల్లే ఇవ్వడానికి ముందుకొచ్చిందేమో కూడ! (ఇది ఐ.టి.డి.ఎ అధికారుల చిత్తశుద్ధి మీద వ్యాఖ్య కాదు, వారిలో కొందరు ఈ రాష్ట్ర అధికార యంత్రాంగంలోనే ఉత్తమమైనవారిగా పేరొందిన వారు.)

ఈ దశలో పోలీసులు రంగంలోకి దిగారు. మన రాష్ట్ర ప్రభుత్వానికి – ఐ.టి.డి.ఎ వారి అత్యవసర సందేశాలకు స్పందించడానికి సమయం పట్టొచ్చు గానీ, జిల్లా కలెక్టర్ అడిగినంత ఇవ్వడానికి మనస్కరించక పోయుండొచ్చు కాని (43 కోట్ల సహాయం అడిగితే 45 లక్షలు మాత్రమే ఇచ్చింది) పోలీసులను దింపే విషయంలో మాత్రం వారికి ఎలాంటి ఆలస్యం, నిధుల లేమి అడ్డం రాలేదు. పోలీసులు వచ్చీ రాగానే వందలాది ఆదివాసులను టాడా (టెర్రరిస్ట్ మరియు విచ్ఛిన్నకర కార్యకలాపాల చట్టం) కింద అరెస్టు చేయడం ప్రారంభించారు. ఒక్క దండేపల్లి దాడికి సంబంధించే జైనూర్, నార్నూర్, సిర్పూర్, తిర్యాని మండలాలలోని పలు గ్రామాల నుండి 160 మందిని అరెస్టు చేశారు. ఈ దాడులకు సంబంధించి జిల్లా మొత్తంలో 600 మందిని దాకా అరెస్టు చేశారు. ఆదిలాబాద్‌లో సరైన జైలు లేకపోవడం వల్ల వారందరినీ నిజామాబాదు, వరంగల్ లాంటి దూర ప్రాంతాలలోని జైళ్లకు తీసికెళ్ళి నిర్బంధించారు. బెయిల్ రావడానికి బాగా కష్టమైంది. కొందరికి ఇప్పటికీ రాలేదు. ఇదంతా వర్షాకాలం సమీపించాక జరగడంతో పొలం దున్ని నాట్లు వేసుకోవాల్సిన సమయంలో వాళ్ళంతా జైళ్లలో ఉండాల్సి వచ్చింది. పోయిన ఏడాది అనావృష్టి వల్ల పంట నష్టమైతే ఈ ఏడాది టాడా వల్ల వాళ్ళు పంట కోల్పోయే పరిస్థితి వచ్చింది. ఫలితంగా ఏ మాత్రం చదువు రాని ఆదివాసులకు సైతం ఈ రాక్షస చట్టం క్లుప్త నామం 'టాడా' అనేది నోటికి వచ్చేసింది. తమ సంక్షేమాన్ని చూసే ఐ.టి.డి.ఎ పేరు నోటికి రావడానికి వారికి చాలా సమయం పట్టిందేమో కాని టాడా మాత్రం కొద్ది వారాల్లోనే వారికి చిరపరిచితమైన పేరుగా మారిపోయింది.

నక్సలైట్లకు అన్నం పెడుతున్నారని, ఆశ్రయం ఇస్తున్నారని లేదా వారి రాజకీయాలను సమర్థిస్తున్నారని ఖమ్మం, తూర్పు గోదావరి, విశాఖపట్నం జిల్లాలలో 'టాడా' కింద అరెస్టు చేసిన ఆదివాసులను కూడ కలిపితే ఈ సంఖ్య 1000 దాకా ఉండొచ్చు. ఇవన్నీ ఒక సంవత్సరం పై చిలుకు కాలంలో జరిగిన అరెస్టులు. రాజీవ్ గాంధీ నిరంకుశ ప్రభుత్వానికి ప్రజాస్వామ్య ప్రత్యామ్నాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చి ఎన్నికల్లో పోటీ చేస్తున్న నేషనల్ ఫ్రంట్ చైర్మన్ ఎన్టీఆర్ హయాంలో జరిగిన అరెస్టులే ఇవన్నీను. భారత ప్రజాస్వామ్యం, అది అందివ్వగల ప్రత్యామ్నాయాల గొప్పతనం ఇదే కాబోలు!

**ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ**

**25 నవంబరు 1989**

*'Drought & TADA in Adilabad'* వ్యాసానికి స్వేచ్ఛానువాదం : వేమన వసంతలక్ష్మి

# కరువు సంవత్సరం?

నైరుతి రుతుపవనాలు ఆంధ్రప్రదేశ్ ఆకాశం నుండి వెళ్ళిపోవడానికి రెడీగా ఉన్నాయి. మొదటి ఆరు వారాలు సోమరిపోతుల్లా తిరిగి తర్వాతి ఆరు వారాలు హఠమేసుకున్నట్టు ఒక్క చుక్క నీరు కూడ రాల్చకుండా గడిపేసి ఇప్పుడిక బయల్దేరడానికి సిద్ధమై పోయాయి. వచ్చే ఏడాది ఎక్కడ ఎంత కరువు ఉండబోతుందో లెక్కలేసుకునే పనిలో జనం పడ్డారు. ఏ జిల్లాలో ఎంత వర్షపాతం నమోదైందో, అది సాధారణ వర్షపాతం కంటే ఎంత ఎక్కువో, ఎంత తక్కువో చెప్పే ప్రభుత్వ లెక్కలన్నీ ఎంత నిరర్థకమైనవో మరోసారి చెప్పడం అనవసరం. వర్షపాతాన్ని వర్షపు నీటిని నిల్వ చేయడానికి తీసుకున్న చర్యలతో అనుబంధంగా చర్చించాలని చెప్పడం కూడ కొత్త విషయమేమీ కాదు. అలా చర్చించినప్పుడే ఒక అర్థవంతమైన చట్రంలో పరిష్కారాన్ని వెతకగలుగుతాం. అయితే కొత్తగా, మళ్ళీ మళ్ళీ, భయం కలిగించేటన్ని వివరాలతో చెప్పాల్సింది మాత్రం నీటి వనరుల నిర్వహణలో ఇప్పటిదాకా జరిగిన నిర్లక్ష్యం, వాటి అపసవ్య నిర్వహణ, విధ్వంసాల గురించి. ఎందుకంటే వర్షపాతంతో నిమిత్తం లేకుండా వివిధ ప్రాంతాలలో ఏదో ఒక మేరకు నిరంతరం కరువు ఉండడానికి ఇవే ప్రధాన కారణం. కాని వర్షపాతం తక్కువైన సందర్భాలలో మాత్రమే నీటి వనరుల నిర్వహణలోని ఈ లోపాలు, ఏకపక్ష అభివృద్ధి విధానాలు బలంగా చర్చకు వస్తాయి. అప్పుడు కూడ దీన్ని కేవలం అనావృష్టి సమస్యగా, తప్పంతా రుతుపవనాలది అయినట్టు మాట్లాడతారు.

అనావృష్టికి అడవుల విధ్వంసమే కారణమని ఈ మధ్య ప్రభుత్వం సైతం ఒప్పుకుంటున్న మాట నిజమే. ఒప్పుకోవడమే కాదు అడవుల పునరుద్ధరణపై చెప్పుకోదగ్గ శ్రద్ధ కూడ పెడుతోంది. సమశీతోష్ణ మండలాలలోని దేశాలు తమ దేశాలలోని అడవుల రక్షణకు కృషి చేయాలని అంతర్జాతీయ పర్యావరణ సంస్థల

నుండి ఒత్తిడి పెరగడంతో రాబోయే రోజుల్లో ఈ శ్రద్ధ మరింత పెరిగే అవకాశం కూడ ఉంది. వాళ్ళు ఒక్క మూడవ ప్రపంచ దేశాలలోని అడవుల పరిరక్షణ మీద మాత్రమే ఒత్తిడి పెట్టడం పట్ల మన ప్రభుత్వానికున్న అభ్యంతరాన్ని అర్థం చేసుకోవచ్చు కాని – అయితే ఈ ఏకపక్ష వ్యవహారం అణుశక్తి నుండి అడవుల దాకా అన్నిట్లోను కనబడుతూనే ఉంది. అందువల్ల చాలా ప్రపంచ సంస్థల పేర్లలోని 'అంతర్జాతీయ' అనే పదానికి అర్థం లేకుండా పోయింది కూడ – అడవుల సంరక్షణ అవసరమన్న విషయంలో భిన్నాభిప్రాయమేమీ ఉండనక్కరలేదు. కాకపోతే కరువుకు పరిష్కారం ఒక్క అడవుల సంరక్షణలో మాత్రమే ఉన్నట్టు చర్యలు తీసుకోవడం వల్ల ఏళ్ళ తరబడి, కొన్ని సందర్భాలలో దశాబ్దాల తరబడి సాగు చేసుకుంటున్న భూముల్ని పేదలు కోల్పోవాల్సి వస్తోంది. అడవుల పెంపకం గురించి అధికారులు ఒక పవిత్ర కార్యంలా మాట్లాడుతుండడంతో తమ భూమి హక్కుల గురించి మాట్లాడడం అపరాధమేమో అనే అభిప్రాయంలో ఉన్నారు వాళ్ళు. నిజానికి అనావృష్టికి కారణమైన 'మన పాపాల్లో' ఒక్క అడవుల విధ్వంసం అంశాన్ని మాత్రమే అంగీకరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అనావృష్టికి, అడవుల నరికివేతకు మధ్య సంబంధం ఉన్నట్లుగానే నీటి సంరక్షణలో ప్రభుత్వ విధానాల లేమి లేదా తప్పుడు విధానాలు ఈ సమస్యలో అంతర్భాగమని భావించరు. దాన్ని ఒప్పుకుంటే చాలామంది చాలా భద్రంగా ఇంతకాలం కాపాడుకుంటున్న వారి స్వప్రయోజనాలకు నష్టం కలిగే ప్రమాదముంది మరి! వాటి ముందు అడవుల పెంపకం వల్ల భూములు కోల్పోయే పేదల స్వప్రయోజనాలెంత?

జూలై మూడవ వారం వచ్చేసరికి ఆంధ్రప్రదేశ్‌లో వానలు ఎంత తక్కువ పడ్డాయంటే ఈ ఏడాది ఎలా గడుస్తుందని భయపడేంతగా. 23 జిల్లాలకు గాను 18 జిల్లాలలో సాధారణ వర్షపాతం కంటే చాలా తక్కువ పడింది. కొన్ని చోట్లయితే సాధారణ వర్షపాతంలో 15 – 20 శాతం మాత్రమే పడింది. ఉదాహరణకు – రంగారెడ్డి జిల్లా పరిగిలో మామూలు సంవత్సరాలలో జూలై చివరి నాటికి మామూలుగా 1600 మి.మీ వర్షం పడేది. కాని ఈ ఏడాది జూలై మూడవ వారం నాటికి 330 మి.మీ లు మాత్రమే పడింది.

## వానల కోసం పూజలు

ఆందోళన చెందిన ప్రభుత్వం వాన దేవుడైన వరుణుడిని ప్రసన్నం చేసుకోవడానికి అధికారికంగానే పూజలు, ఇతర వైదిక క్రతువులు జరపమని ఆదేశాలు జారీ చేసింది.

అందరి కంటే దేవుళ్ళకు సన్నిహితమైన శాఖగా భావించడం వల్ల కాబోలు ఆ బాధ్యతను దేవాదాయ ధర్మాదాయ శాఖకు అప్పగించారు. అయినా ప్రభుత్వం మీద ఆధారపడకుండా ప్రజలు ఎవరి పూజలు వారు చేయాలని – ప్రైవేటు ప్రయత్నాలకు పెరిగిన ఇప్పటి ప్రాధాన్యం రీత్యా – మంత్రులు జనానికి సూచించారు. ఎలాగూ బ్రాహ్మణులకు దేశంలో కొరత లేదు. దానితో పాటు ప్రభుత్వం మబ్బులను మచ్చిక చేసుకోవడానికి లౌకిక ప్రయత్నాలను కూడ ప్రారంభించింది. కొన్ని ఎంపిక చేసిన చోట్ల మేఘమథనం ప్రయోగాలు చేసింది. సరిగ్గా అదే సమయంలో విషయాలను మరింత అయోమయంలో పడేయడానికా అన్నట్టు బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. కారణమేదైతేనేం చివరికి వర్షమైతే కొంత పడింది కాని ఏ కారణం వల్ల పడిందని నిర్ణయించడానికి ఇప్పటిదాకా కనిపెట్టబడని గణాంక విశ్లేషణా పద్ధతిని వెతుక్కోవాల్సి వచ్చింది. తమ వల్లనేనని గుజరాత్ నుండి వచ్చిన మేఘమథనం నిపుణులు జబ్బలు చరుచుకోవడాన్ని ఆంధ్రా యూనివర్సిటీ వాతావరణ శాస్త్రవేత్తలు తప్పుబట్టారు కూడ. మేఘాల దగ్గరకు వెళ్ళి చేసే మేఘమథనం మెరుగా, నేల మీంచి చేసే మేఘమథనం మెరుగా అనేదాని మీద కొంత పండిత చర్చ కూడ జరిగింది. ఈలోగా అన్ని రకాల హేతువాదులు బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం వల్లే వర్షాలు పడ్డాయనేది స్పష్టమేనని, అనవసరంగా క్రతువుల మీద ప్రజాధనాన్ని వృథా చేసారని ప్రభుత్వం మీద విరుచుకుపడ్డారు. ఎంచేతో బ్రాహ్మణులు ఈ చర్చలో పాల్గొనలేదు. వాళ్ళ పారితోషికాలు వాళ్లకు ఎలాగూ వచ్చాయనుకోండి.

వరుణదేవుడు 'జాగ్రత్తపరుడు' కావడం వల్ల కాబోలు మబ్బుల్లేని ఖాళీ ఆకాశం నుండి వర్షం కురిపించి తప్పుడు సంప్రదాయం నెలకొల్పకుండా బంగాళాఖాతంలో అల్పపీడనం లాంటి ప్రకృతిపరమైన ఏర్పాట్ల ద్వారా మాత్రమే వానలు కురిపించాలని నిర్ణయించు కున్నట్టున్నాడు. ఏమైతేనేం రెండు వారాలపాటు వానలు – మేఘమథనం జరిగిన కొన్ని ప్రాంతాలలో కొంత భారీగా – పడ్డాయి. వర్షపాతం గణాంకాలు పెరిగాయి. ప్రభుత్వానికి కావాల్సింది అదే. అప్పటిదాకా తక్కువ వర్షాలు పడ్డాయనుకున్న చాలా చోట్ల వర్షపాతం గణాంకాలు దాదాపు సాధారణానికి చేరుకున్నాయి. ఒక దశలో ప్రభుత్వం పది జిల్లాలలో మాత్రమే వర్షాభావం ఉందని ధైర్యంగా ప్రకటించింది కూడ. కాని ఆ తర్వాత ఏ 18 జిల్లాలలో అయితే మొదట వర్షపాతం తక్కువగా ఉందని ప్రకటించిందో వాటిలో 15 జిల్లాలలో వర్షాభావం

ఉందని ఒప్పుకోక తప్పలేదు. కాకపోతే జూలై చివరి నాటికి ఉన్నంత వర్షాభావం ఆగస్టు చివరి నాటికైతే లేదు. ఆ రగడ అక్కడితో ముగిసింది.

కాని ప్రజల సమస్య వర్షపాతం లెక్కలు కాదు, పడిన వర్షం వల్ల ఎంత ప్రయోజనం లభించిందనేది; లభించకపోతే ఎందుకు లభించలేదనేది. అనావృష్టి అసలు అర్థం వారి దృష్టిలో అదే. మొత్తం వర్షపాతం ఎంత నమోదయ్యిందనే దానికంటే వానలు పడ్డ తీరు, తేమను మట్టి ఏ మేరకు నిలుపుకోగలిగింది, భూగర్భ జలాల మట్టం ఏ మేరకు పెరిగింది, ఎంత ఖర్చుతో వాటిని వెలికి తీయడానికి వీలుంది, చెరువులకు మరమ్మత్తులు జరిగాయా లేదా, చెరువుల్లో, రిజర్వాయర్లలో పూడికలు తీశారా లేదా, నదీపరీవాహక ప్రాంతాలు పదిలంగా ఉన్నాయా లేదా, చెరువులకు నీళ్ళు సరఫరా చేసే ఏర్లలో ఇసుక ఎంత లోతుగా తవ్వారు మొదలైన విషయాల దగ్గర నుండి గ్రామీణ బ్యాంకులిచ్చే పంట రుణాల వరకు అన్నిటికీ ఈ అసలు అర్థంతో సంబంధం ఉంది. ఉదాహరణకు నల్లగొండ జిల్లాలోని నిత్య కరువు పీడిత ప్రాంతమైన దేవరకొండ తాలూకాలో వర్షాకాలం మొదట్లో ఒకసారి కొద్దిసేపు గట్టి వర్షం పడింది, మళ్ళీ నెల తర్వాత మరోసారి పడింది. తక్కువ 'జాగ్రత్తపరులైన' రైతులు రెండుసార్లూ మరింత వర్షం పడుతుందని ఆశించి తమ ప్రాంతపు ప్రధాన పంటలైన ఆముదాలు, జొన్నలు, సజ్జలు నాటుకుంటూ పోయారు. జాగ్రత్తపరులు మాత్రం తెలివిగా నాట్లు వేయకుండా ఊరుకున్నారు. ఎందుకంటే ఆ తర్వాత మళ్ళీ వర్షం పడలేదు. ఫలితంగా మట్టిలో గింజ మొలకెత్తి బతికేందుకు కావలసినంత తేమ మిగలలేదు. జూలై చివర్లో మూడోసారి వర్షం పడ్డప్పుడు మాత్రం చాలామంది నాట్లు వేసుకున్నారు. దాని వల్ల విత్తనానికి డిమాండ్ పెరగడంతో మార్కెట్‌లో వాటి రేటు 50 నుండి 100 శాతం దాకా పెరిగిపోయింది. బ్యాంకులు మాత్రం రుణాలు ఇవ్వడానికి ఏ మాత్రం సుముఖంగా లేవు. ప్రత్యేకంగా రైతులకు పంట రుణాలు ఇవ్వడానికే నెలకొల్పబడ్డ గ్రామీణ బ్యాంకులు, రైతుల సహకార బ్యాంకులు కూడ గత సీజన్లో బకాయి పడ్డ డబ్బు చెల్లించని వారికి ఈసారి పంట రుణాలు ఇచ్చేది లేదని నిర్మొహమాటంగా చెప్పేసాయి. దేవరకొండలో గత ఏడాది కూడ అనావృష్టి పరిస్థితులే ఉన్నందువల్ల చాలామంది పేద, మధ్యతరగతి రైతులు పంట రుణాలను చెల్లించలేకపోయారు కాబట్టి కొత్త రుణాలను పొందే అర్హతను కోల్పోయారు.

## అవకతవకల నీటి పారుదల విధానం

ఇక్కడ గమనించాల్సిందేమిటంటే చెదురుమదురు వర్షాలు గాని, తక్కువ వర్షాలు గాని దేవరకొండకు కొత్తేమీ కాదు. ఇఅది 'సహజమైన' సమస్య కాబట్టి – రాజకీయ నాయకులు ఎలాగూ దాని గురించి నిత్యం మాట్లాడుతుంటారు కాబట్టి – మనం కూడ పాత, కొత్త ప్రాజెక్టుల ద్వారా దేవరకొండకు కృష్ణా నీళ్ళను తరలించడం గురించి మనకు తోచిన మాటలు మనం మాట్లాడొచ్చు. కాని ఎన్ని కొత్త ప్రాజెక్టులు కట్టినా మన దేశ వ్యవసాయంలో ఒక పెద్ద భాగం – ముఖ్యంగా రాయలసీమ, తెలంగాణ వంటి ప్రాంతాలలో – రాబోయే చాలాకాలం పాటు వర్షాధారంగానే ఉండబోతుంది. వర్షాధారం కాని భాగంలో కూడ నీటిపారుదల ప్రాజెక్టుల కింద సాగయ్యే భూముల కంటే స్థానిక వర్షపాతం వల్ల నిండే బావులు, చెరువుల కింద సాగయ్యే భూములే ఎక్కువగా ఉంటాయి. అందువల్ల వాన నీళ్ళను మట్టిలోనూ, మట్టి అడుగునా, చెరువుల్లోనూ సంరక్షించుకోవాల్సిన అవసరముంది. ఒక ప్రాంతానికి వర్షపాతం సరిపోయిందా లేదా అనేది వాటిని చూసి నిర్ణయించాలి. ప్రభుత్వానికి వీటి గురించి తెలియదని కాదు. భూసార పరిరక్షణ, భూగర్భ జలాల పెంపుదల వారు సాధించాల్సిన లక్ష్యాల జాబితాలో చాలాకాలంగా ఉన్నాయి. కాని నదులపై కట్టే ప్రాజెక్టుల విషయంలో వారు చూపే ఆత్రుత వీటి విషయంలో పూర్తిగా మృగ్యమని చెప్పాలి. మొదటిది భారత రాజకీయాలలో నిరంతరం వినిపిస్తుంటుంది కాని రెండోది మాత్రం రాజకీయ సంవాదాలలో గాని వివాదాలలో గాని ఎక్కడా వినబడదు. జయలలిత చేసిన నిరాహార దీక్షల్లాంటి వైతే అసలే కనబడవు.

భూసార పరిరక్షణ, మైనర్ ఇరిగేషన్, భూగర్భ జలాల సంరక్షణల మీద చాలా డబ్బు ఖర్చు పెడుతున్నట్టు భారత ప్రభుత్వం చెప్పుకుంటున్నప్పటికీ వారివద్దనున్న ఒకే ఒక నీటిపారుదల విధానం ప్రపంచ బ్యాంకో, మరొక సంస్థో అప్పు ఇచ్చినప్పుడు నదుల మీద డ్యాములు కట్టి నీటిపారుదల వసతి లభించే భూముల సంఖ్యను గణనీయంగా పెంచినట్టు చూపించుకోవడమే. అది కాకుండా వాళ్ళు చేసేది ఇంకేదైనా ఉందా అంటే సొంతంగా బావులు తవ్వుకుని తమ భూములకు తామే నీటి వసతి కల్పించుకునే బాధ్యతను రైతుమీద పూర్తిగా వదిలివేయడం. కాకపోతే పంపుసెట్లకు కావాల్సిన డీజిల్, కరెంటులను చాలా చోట్ల సబ్సిడీ రేట్లకు అందజేస్తున్నది. ప్రభుత్వం చేస్తున్న మరో సహాయం ఏమిటంటే గత రెండు దశాబ్దాలలో రైతులకు, బోర్‌వెల్

కంపెనీలకు కూడ రుణాలు ఇచ్చి బాగా లోతుగా బోరుబావులు తవ్వే సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించడం. అయితే బావి పారుదలకు కొనసాగింపుగా వచ్చిన ఈ సాంకేతికతను అంత డబ్బు పెట్టుబడి పెట్టలేని వారు సహజంగానే ఉపయోగించుకోలేక పోయారు. చెరువుల్ని కావాల్సి ధ్వంసం చేయడం; వర్షాధార భూముల అభివృద్ధికి కంటితుడుపు చర్యలు చేపట్టడం; కొండప్రాంతాలు, ఎగుడుదిగుడు నేలలు ఎక్కువగా ఉండే తెలంగాణ లాంటి ప్రదేశాలలో మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు కట్టడానికి పుష్కలంగా అవకాశాలు ఉన్నా వాటిని నిర్లక్ష్యం చేయడం – ఈ వక్ర విధానానికి అనుబంధంగా సాగిన నష్టదాయక చర్యలు. వర్షాలు పడనప్పుడు ఈ లోటుపాట్లు మరింత ప్రస్ఫుటంగా కనిపిస్తాయి కాబట్టి వెంటనే దానికి కరువు పేరు పెట్టేస్తారు.

## పెద్ద ప్రాజెక్టులకే ప్రాధాన్యం

ప్రాంతీయ రాజకీయాలను శాసించే గ్రామీణ సంపన్న వర్గానికి ఈ విషయాలేమీ తెలియవని కాదు – ఆ మాటకొస్తే అనావృష్టి ప్రాంతాలలో జీవించే నిరక్షరాస్య రైతుకు సైతం ఈ విషయాలు బాగానే తెలుసు. అయినప్పటికీ నాయకులెవరూ వాటి గురించి మాట్లాడరు. ఒకేసారి ఐదు లక్షల ఎకరాలకు నీళ్ళిచ్చే లాంటి భారీ గణాంకాలను చూపెట్టగల పెద్ద ప్రాజెక్టులన్నిటికీ  శాస్త్రీయ భావజాల ప్రపంచంలో ఒక ఆరాధన ఉంటుంది. బహుశా దాని వల్లే నాయకులు, ప్రజలు కూడ విషయాలు తెలిసీ మాట్లాడలేకపోతున్నారేమో! ఆ తర్వాత ఇంకేముంది? కరువుకు సైన్సునో, బూర్జువా మగవాడినో, పాశ్చాత్యులనో, శ్వేతజాతినో వారి వారి సైద్ధాంతిక ఇష్టాలను బట్టి నిందించవచ్చు. వేరు వేరు ప్రాంతాలలో కొద్ది కొద్దిగా ఫలితాలనిచ్చే చర్యలు తీసుకోవడం కంటే నాటకీయ ఫలితాలను చూపించగలిగే పరిష్కారాల పట్ల గ్రామీణ రాజకీయ శిష్ట వర్గానికి ఎక్కువ మోజు ఉంటుంది. దీనికి కారణాలు అనేకం. వాళ్ళకు రాజకీయ ఆయుష్షు తక్కువ. చాలాసార్లు ఐదేళ్ళు కూడ ఉండదు. అందువల్ల వారి రాజకీయ ఆలోచనలు, భాష దానికి తగ్గట్టే ఉంటాయి. ఐదు లక్షల ఎకరాలకు నీళ్ళు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నప్పుడో, ఇస్తామని వాగ్దానం చేస్తున్నప్పుడో వాళ్ళు ఏ ఐదు లక్షల ఎకరాలకు ఇవ్వాలని అడుగుతున్నారో లేదా ఇస్తామని చెపుతున్నారో, ఎప్పటిలోగా ఆ పని జరగాలంటున్నారో లేదా జరుగుతుందని అంటున్నారో ఆ వివరాలేమీ చెప్పాల్సిన అవసరం ఉందని వారు అనుకోరు. ప్రభుత్వమో, ప్రతిపక్షమో, ప్రపంచ బ్యాంకో ప్రశ్నలు వేసి విసిగిస్తారని అనుకోకపోతే అనతి కాలంలో నియోజకవర్గం

మొత్తాన్నీ సాగునీటితో నింపేస్తానని అనగలరు. భూసార పరిరక్షణ విషయంలో అలాంటి ఆర్భాటమైన ప్రకటనలు చేయడం కూడ సాధ్యం కాదు. నీటి పారుదల కాలువల వల్ల అంతా లాభమే జరుగుతోంది కాని (కనీసం అలా అనుకుంటున్నారు కాబట్టి) భూసార పరిరక్షణ, చెరువుల నిర్వహణ, భూగర్భ జలాల పెంపుదల విషయంలో ప్రయోజనం కలగాలంటే ప్రజల నుండి – ముఖ్యంగా ఏ అపరాధ భావమూ లేకుండా సహజ వనరులను దుర్వినియోగం చేస్తున్న గ్రామీణ సంపన్న వర్గం నుండి – కొంతైనా త్యాగం అవసరమవుతుంది. పెద్ద ప్రాజెక్టులు రాజకీయ నాయకులకు పలుకుబడి, డబ్బు తెచ్చి పెడతాయి. వాళ్ళు స్వయంగా సివిల్ కాంట్రాక్టర్లు కాకపోతే (ఎక్కువ మంది వాళ్ళే) వారి స్నేహితులైనా అయి ఉంటారు. అయినా, కాకపోయినా ప్రతి ప్రాజెక్టూ, కాలవ కాంట్రాక్టూ వారికి భారీగా కమిషన్లు తెచ్చిపెడతాయి. ఇతర నీటి వనరుల విషయంలో అంత కమిషన్ మొత్తాన్ని ఊహించను కూడ ఊహించలేము. ఉదాహరణకు కోట్ల విజయభాస్కర్ రెడ్డి అసెంబ్లీకి ఎన్నికయ్యేందుకు వీలుగా తన పాణ్యం శాసనసభా స్థానాన్ని ఖాళీ చేసి ఇచ్చిన ఎం.ఎల్.ఎ రాంభూపాల్ రెడ్డి శ్రీశైలం కుడి గట్టు కాలవ ప్రాజెక్టు కింద తన నియోజకవర్గంలో కొంత దూరం కాలవలు తవ్వుతున్న నిర్మాణ కంపెనీ నుండి 'రక్షణ సొమ్ము' గా 50 లక్షల రూపాయలు తీసుకున్నట్టు విశ్వసనీయ వర్గాల భోగట్టా. మన దేశ నీటిపారుదల పాలసీ మరింత ప్రజాస్వామికంగా ఉండి ఉంటే ఒక స్థానిక శాసనసభ్యునికి అందులో నూరో వంతు మొత్తం కూడ ముడుపుగా వచ్చేదని ఊహించలేం.

అందుకే ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన వర్షాభావ ప్రాంతాలైన రాయలసీమ, దక్షిణ తెలంగాణలకు సంబంధించి జరిగే కరువు/అనావృష్టి చర్చలన్నీ కొత్త ప్రాజెక్టుల కోసం ఏ మాత్రం నీళ్ళు మిగలని కృష్ణా నదిపై కట్టే ప్రాజెక్టుల చుట్టూనే నడుస్తుంటుంది. రాజకీయ నాయకులు కృష్ణా జలాలను జిల్లాకు తీసుకొస్తామని నిరంతరం వాగ్దానాలు చేస్తుంటారు, తమ జిల్లా ఎక్కడైనా ఉండనీ గాక. కోస్తా జిల్లాల వారు ఇప్పటికే రెండుసార్లు కృష్ణా జలాల వల్ల లాభం పొందారని ఈ ప్రాంతాలవారు చేసే ఫిర్యాదు వాస్తవమైనదీ, న్యాయబద్ధమైనదీ కూడ. బ్రిటిష్ వారు 1850 లలో కృష్ణా నదిపై ప్రకాశం బ్యారేజి కట్టినప్పుడు ఒకసారి, స్వాతంత్రానంతరం నాగార్జునసాగర్ కట్టినపుడు రెండోసారి – ప్రాజెక్టులు 'ఆధునిక దేవాలయాలు' అని నెహ్రూ అన్న సందర్భాలలో ఇదొకటి – ఆంధ్ర కోస్తా తీరంలోని మధ్య ప్రాంతమంతటికీ అన్ని దిక్కులా కాలవలు

తవ్వి మరీ ఇవ్వాళ హరిత విప్లవ క్షేత్రాలుగా భావిస్తున్న పొలాలకు నీటిని పారించారు. నదికి ఎగువన కట్టిన శ్రీశైలం ప్రాజెక్టును జల విద్యుత్తుకు పరిమితం చేశారు. దక్షిణ తెలంగాణ, రాయలసీమ ప్రాంత ప్రజల, నాయకుల నిరంతర ఆందోళనల ఫలితంగా దాన్ని ఎట్టకేలకు బహుళార్థ సాధక ప్రాజెక్టుగా మార్చి తెలంగాణలోని నల్లగొండ జిల్లాకు, రాయలసీమలోని కర్నూలు, కడప జిల్లాలకు కొంతమేరకైనా నీళ్ళిచ్చేందుకు కాలవలు తవ్వే పని మొదలుపెట్టారు. దేవుడు లేదా ప్రపంచ బ్యాంకు అనాలేమో సంకల్పిస్తే ఆ పని త్వరలో పూర్తి కావొచ్చు.

## చెరువుల వినాశనం

శ్రీశైలం ప్రాజెక్ట్‌లో మార్పు మంచి పరిణామమే. ఇందులో తెలంగాణ, రాయలసీమలలోని  అనావృష్టి ప్రాంతాలకు చెందిన భూస్వామి–రాజకీయవేత్తల ఒత్తిడి ఏ మేరకు పని చేసినా అది నిస్సందేహంగా ఒక నిర్మాణాత్మక విజయమే. అయితే ఈ వర్గం తాము, తమ ప్రభుత్వం బాధ్యత వహించాల్సిన చెరువుల విధ్వంసం, భూగర్భ జలాల విచ్చలవిడి వినియోగం వంటి 'పాపాల' గురించి మాత్రం ఎప్పుడూ మాట్లాడదు. వర్షాధార భూముల గురించైతే అసలే మాట్లాడరు. డబ్బులున్నవాళ్ళు బోర్‌వెల్ వేసుకుంటారు, లేనివాళ్ళు శంకరగిరి మాన్యాలు పట్టి పోతారు మనకెందుకనేదే వారి వైఖరి.

క్షేత్ర స్థాయిలోని వాస్తవాలు వీరి ప్రాధాన్యాలకు పూర్తి భిన్నమైనవి. దక్షిణ తెలంగాణలో 84 శాతం, రాయలసీమలో 82 శాతం సాగు భూమి వర్షాధారంతో పండేదే. నీటి వసతి ఉన్న భూములలో కూడ రాయలసీమలో 65 శాతం, దక్షిణ తెలంగాణలో 62 శాతం  చెరువుల కింద, బావుల కింద సాగవుతున్నాయి. మిగతాది మాత్రమే కాలవల కింద పంటలు పండుతున్న భూమి. శ్రీశైలం ఎడమ, కుడి గట్టు సాగునీటి కాలవల నిర్మాణం పూర్తయ్యాక కూడ ఈ చిత్రంలో గణనీయమైన తేడా ఏమీ రాదు. తెలంగాణ, రాయలసీమలలోని అత్యధిక సాగు భూములు వర్షాధారంగానే ఉండబోతాయి. కరువుపై జరిగే రాజకీయ సంవాదంలో మాత్రమే ఈ భూమి ఏదో ఒకరోజు కృష్ణా జలాలతో – ఇంకా చెప్పాలంటే గోదావరి వంటి సుదూర నదీ జలాలతో – తడవబోయే భూములుగా ఉండబోతాయి.

చెరువుల విధ్వంసం జరిగిన తీరు నేరపూరితమైనదే కాక దయనీయమైనది. తెలంగాణ, రాయలసీమ రెండు ప్రాంతాలలోను చెరువులు ఎక్కువే. తెలంగాణకు

నీరందించే వనరులలో చెరువులు, బావుల వాటా సమానంగా ఉంటే రాయలసీమలో చెరువుల కంటే బావుల కింద ఉన్న పారుదలే ఎక్కువ. రాయలసీమలో ఎక్కువ చెరువులను కట్టించింది రాయల వంశస్థులైతే (వారి పేరు మీదే ఆ ప్రాంతానికి ఆ పేరు వచ్చింది) తెలంగాణలో కాకతీయ రాజుల కాలం నుండి అందరు రాజులూ చెరువుల నిర్మాణం, అభివృద్ధిపై బాగా దృష్టి పెట్టినవారే.

మనకు అలవాటయిపోయిన ఊహ ఒకటి ఉంది – చెరువుల నుండి ప్రయోజనం పొందే 'గ్రామ జనమే' (Village Community) ఒకప్పుడు దాని నిర్వహణ బాధ్యతను తీసుకునేదని. చెరువుల నిర్వహణలో 'గ్రామ జనమే' (దాని అర్థం ఏమైనప్పటికీ) చురుకైన పాత్ర పోషించేవారనేది నిజమే కానీ అదేమీ ఉదాత్తంగా జరిగిన వ్యవహారం కాదు. దళితుల, ఇతర అట్టడుగు కులాల నిర్బంధ శ్రమ ద్వారా మాత్రమే చెరువుల నిర్వహణ జరిగేది. అగ్రకులాలు కూడ ఈ శ్రమలో పాల్గొన్నాయంటే దానికి కారణం చెరువుల వలన ప్రధానంగా లాభపడింది వారే కాబట్టి. ఆ కులాలవారి మధ్య కూడ చెరువు నీటి పంపకం సమానంగా ఏమీ జరగలేదు. అగ్ర కులాలకు చెందిన భూకామందులకు తొలి ప్రాధాన్యం లభించేది. వారి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి మిగతా వాళ్ళకు నీరు అందేది. కనీసం ఈ శతాబ్దపు తొలి దశకాలలో మనకు తెలిసిన పరిస్థితి అయితే ఇదే. సమానత్వ స్ఫూర్తితో అందరూ నీటిని పంచుకున్న స్వర్ణయుగం ఒకటి ఉండేదనీ, అది బ్రిటిష్ వారి పాలనలో, అంటే మనం కలికాలమని భావించే కాలంలో, పచ్చి స్వార్థపరత్వానికి దిగజారిందనీ నమ్మడానికి ఆధారాలేమీ లేవు. ఇవ్వాల్టి కంటే మధ్యయుగాలకు చెందిన భారతదేశపు గ్రామాలలో మరింత సాముహిక స్ఫూర్తి ఉంటే ఉండి ఉండొచ్చేమో కాని అప్పుడైనా గ్రామం గ్రామం ఒకే విధంగా అలోచించి ఒకే తాటి పైన నడిచిందని కాదు. ఈ సామూహిక స్ఫూర్తి కులం కేంద్రంగా పని చేసిందే కాని అన్ని వేళలా మొత్తం గ్రామానికీ విస్తరించలేదు. చెరువుల కింద జరిగే నీటి పారుదల కుల ప్రాతిపదికపై నిర్మాణమైన భారత గ్రామీణ సామాజిక వ్యవస్థకు అనుబంధంగా ఉన్నపుడు మాత్రమే పటిష్టంగా సాగింది. కుల కట్టుబాటు పేరిట అట్టడుగు వర్గాల వారు నిర్బంధ చాకిరీ చేస్తుంటే పైవాళ్ళు ప్రయోజనం పొందడం జరిగేది.

ఈ కుల వ్యవస్థను నిర్మూలించడానికి తర్వాత వచ్చిన బ్రిటిష్ వారు కూడ ఏమీ చేయలేదు కాని వారు విధించిన భారీ పన్నులు, వాటికి అనుబంధంగా జరిగిన కొన్ని

మార్పులు పాత వ్యవసాయ పద్ధతులను పలు రకాలుగా ఛిన్నాభిన్నం చేసాయి. ప్రజాస్వామ్య ఆలోచనలు, ఉద్యమాలు వ్యాపించాక కులం పేరుతో తమతో ఇంతకాలం చేయించుకుంటున్న చాకిరీకి దళితులు స్వస్తి పలికారు. ఆ తర్వాత ఆధునిక భారత రాజ్యం దానిని చట్టబద్ధంగానే రద్దు చేసింది. ఆ పరిస్థితులలో చెరువుల నిర్వహణ భారాన్ని ప్రభుత్వమే చేపట్టి ఉండాల్సింది కాని అది ఆ పని చేయలేదు. పేదలు ఉచితంగా చేయని ఆ పనిని తామే తలకెత్తుకోవడానికి గ్రామీణ సంపన్న వర్గం సిద్ధంగా లేదు. చెరువుల బదులు బావుల ద్వారా చేసే వ్యవసాయం పట్ల మొగ్గు చూపడం ప్రారంభించారు. తర్వాతి సంవత్సరాలలో ఎలక్ట్రిక్/డీజిల్ పంపుసెట్లు బిగించడం, బోర్‌వెల్స్ వేసుకోవడం లాంటి సాంకేతికతతో బావి పారుదలనే మెరుగు పరుచుకున్నారు. తమ పొలాల అవసరాలకు వారికి అవి సరిపోయేవి. అయితే చెరువులు ఇంకా సక్రమంగా ఉన్న చోట్ల ఆ నీటిని పారించుకోవడంలో గతంలో తమకున్న తొలి ప్రాధాన్యాన్ని మాత్రం వాళ్ళు వదులుకోలేదు. నిర్లక్ష్యం కారణంగా చాలాచోట్ల చెరువులు పూర్తిగా పాడుబడ్డా వాళ్ళు వాటి బాగు కోసం ఏమీ చేయలేదు. వాటి ఖర్మానికి వాటిని వదిలేసారంతే. కరెంటు మోటార్లను బిగించుకోవడం, ఇంకా ఇంకా లోతుగా బోర్‌వెల్స్‌ను తవ్వుకోవడం కాక తమ రాజకీయ అనుచరులను సంతృప్తి పరచడం కోసం ఎక్కడో దూరంగా ఉన్న నదులపై ప్రాజెక్టులు కట్టి నీళ్ళు తీసుకురమ్మని ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తూ కాలం గడిపేశారు. ఈ లోగా 'గ్రామ పెద్దలు' తమ ప్రయోజనాలను తాము చూసుకున్నారు. మెరకేసిన చెరువు శిఖం భూములను పొలాలుగా మార్చుకుని తమలో తాము పంచుకోవడంతో పాటు విధేయులైన తమ అనుచరులకు కొంత కట్టబెట్టారు. పట్టణాలకు దగ్గరగా ఉన్న చెరువులనేమో అందరి సహకారంతో ఇళ్ళస్థలాలుగా మార్చుకున్నారు. ఆ విధంగా చెరువు గర్భం లోపలే కాలనీలు కాలనీలు వెలిసాయి. చెరువుల్లోపల ఇటుక బట్టీలు పెట్టుకున్నవాళ్ళు కూడ ఉన్నారు.

ఈ విషయంలో తెలంగాణలోను, రాయలసీమలోను కూడ ఒకే విధమైన పరిణామాలు కనిపిస్తాయి. ఒకవైపు ప్రభుత్వానికి పెద్ద ప్రాజెక్టుల పట్ల పెరిగిన ఆసక్తి, విచక్షణారహితంగా పెరిగిన బావుల వ్యవసాయం – భౌగోళికంగానే కాదు, ఈ రోజుల్లో నీళ్ళ కోసం 170–220 అడుగుల లోతు వరకు కూడ తవ్వేస్తున్నారు; మరోవైపు శరవేగంగా క్షీణిస్తున్న చెరువుల వ్యవస్థ, విపరీతంగా నిర్లక్ష్యం చేయబడ్డ భూసార పరిరక్షణ, చెరువులు, వాగుల పరీవాహక ప్రాంతాల పరిరక్షణ – సమాంతరంగా జరిగాయి. రాయలసీమలో వర్షపాతం తక్కువ కాబట్టి భూసార సంరక్షణ, వాన నీటి

సంరక్షణ, చెరువుల నిర్వహణ మరింత జాగ్రత్తగా చేయాల్సిన అవసరం ఉండింది. అవి జరగనందువల్ల తెలంగాణ కంటే రాయలసీమ ఎక్కువ మరింత ఇక్కట్లు పడింది కాని తెలంగాణలో కూడ కొన్ని ప్రాంతాలు, ముఖ్యంగా నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలు రాయలసీమతో సరితూగగల కష్టాలు అనుభవించే ప్రమాదం కనిపిస్తోంది.

ఒక ఉదాహరణ ఇస్తాను. అనంతపురం జిల్లాలోని గుత్తిలో ఒక పెద్ద చెరువు ఉంది. అనంతపురం జిల్లా దేశంలోని అనావృష్టి పీడిత జిల్లాల్లోకెల్లా అత్యంత అనావృష్టి జిల్లా అవడం వల్ల ఈ చెరువు చాలా ఏళ్ళ క్రితమే పూర్తిగా ఎండిపోయింది. ఎవరూ పట్టించుకోకపోవడంతో చెరువులో మట్టి మేట వేయడమే కాక కట్ట కూడ పాడైపోయింది. హఠాత్తుగా నాలుగేళ్ల క్రితం పరీవాహక ప్రాంతంలో భారీ వర్షాలు కురవడంతో నీళ్ళు వరదలా చెరువులోకి వచ్చేసి చూస్తుండగానే చెరువు నిండిపోయింది. కట్ట సరిగ్గా లేనందువల్ల వెంటనే గండి పడి ఆ నీరంతా బయటికి ప్రవహించడంతో గుత్తి–గుంతకల్లు రోడ్డు, దానికి అటూ ఇటూ ఉన్న పొలాలలోని పంటలూ కొట్టుకుపోయాయి. ఎంతగానో ఎదురు చూసిన వానలు పడి కూడ ఎవరికీ ప్రయోజనం లేకపోయింది. పంటలూ పాడయ్యాయి, చెరువూ ఖాళీ అయింది. ఒక స్థానిక అధికారి ఇప్పటి చెరువుల దుస్థితి గురించి వ్యాఖ్యానిస్తూ "పాత రోజుల్లో రెడ్డి ఇలా చిటికేస్తే చాలు కూలీలు పరిగెత్తుకుంటూ వచ్చి గండి పడ్డ చోట మరమ్మత్తులు చేసేవారు. ..ఇవ్వాళ అటువంటి గౌరవాన్ని పొందుతున్న వ్యక్తులు ఎవరున్నారు?.." అన్నాడు. (రాయలసీమలో రెడ్డిని కుల నామంగాను, గ్రామ పెద్ద అనే అర్థంలోను రెండు రకాలుగాను వాడతారు.) సామాజిక శాస్త్ర తలపోత వ్యాసాలలో వ్యక్తమయ్యే ఒక ఆదర్శ గ్రామీణ భావనకు కాస్త అటూ ఇటూగా ఉండే భావనే ఇది. ఇటువంటి అభిప్రాయాలను బట్టి గ్రామాలలో ఎటువంటి పెత్తందారీతనం ఉండేదో సూక్ష్మంగానైనా అర్థం చేసుకోవచ్చు.

రాయలసీమ రెడ్లు ఇప్పటికీ చిటికెలు వేయడం మానలేదు కాని వాటిని ఇప్పుడు వారు ఇతర పనులకు – ఎన్నికల రోజున దొంగ ఓట్లు వేయించడం లాంటి పనులకు – వాడుతున్నారు. వారి చిటికెలకు విధేయత ప్రకటించేవారు కూడ దాన్ని కుల కట్టుబాటుకు తల వంచడంగా కాకుండా వారి సామాజిక, రాజకీయ అధికారానికి తల వంచడంగా చేస్తున్నారు. ఇందులో చెరువుల మరమ్మత్తు లాంటి పనులకు చోటు లేదు. ఆ విధంగా గుత్తి చెరువు నాలుగేళ్ళు అయినా మరమ్మత్తుకు నోచుకోకుండా అలాగే ఉండిపోయింది. కట్ట తెగినప్పుడు ఇసక బస్తాలు వేసి తాత్కాలికంగా చేసిన

మరమ్మత్తు తప్ప మళ్ళీ ఏమీ చేయలేదు. ఈ ఏడాది మళ్ళీ గుత్తి చెరువు పరీవాహక ప్రాంతమైన కర్నూలు జిల్లాలోని కొండ ప్రాంతాలలో భారీ వర్షం కురిసింది. చెట్టూ చేమా లేని ఆ కొండల మీద నుంచి నీళ్ళు వేగంగా వచ్చి గుత్తి చెరువును నింపి మరోసారి కట్టను తెంపాయి. ఈ సారి రైతుల పొలాలతో పాటు హైదరాబాద్–బెంగళూరు జాతీయ రహదారి, మద్రాసు–బొంబాయి రైలు మార్గం మునగడంతో అది జాతీయ స్థాయి వార్త అయింది. చెరువు యథావిధిగా మళ్ళీ ఖాళీ అయింది. ఈ ఏడాది అనంతపురంలో వర్షాలు సగటు కంటే ఎక్కువే పడ్డాయి కాబట్టి నీటి కోసం ఇబ్బంది పడక్కరలేదని ప్రభుత్వం ప్రకటనలు ఇస్తుంటే ఈ చెరువు ఆయకట్టుదారులకు నవ్వాలో ఏడవాలో తెలియడం లేదు.

## కబేళాకు తరలిపోతున్న పశువులు

ఇంతకు ముందే చెప్పినట్టు చెరువుల విధ్వంసానికి సమాంతరంగా మితి మీరిన భూగర్భ జలాల వాడకం జరిగింది. ఈ విషయంలో ఘోరంగా నష్టపోయిన జిల్లా నల్లగొండ. ఈ జిల్లాలోని మెట్ట ప్రాంతాల రైతులెవరూ ఇప్పుడు 'తవ్వే బావుల' గురించి మాట్లాడడం లేదు. అవి ఇప్పటికీ ఉన్నాయి కానీ ఎందులోనూ చుక్క నీరు లేదు. వాటిని పట్టించుకునే వారు కూడ ఎవరూ లేరు. మొదట వర్షాభావం వల్ల బావుల్లో నీరు తగ్గి, ఆ తర్వాత బోర్లు వచ్చాక పూర్తిగా ఎండిపోయాయి. ఇప్పుడక్కడ బావుల గురించి మాట్లాడడమంటే బోరు బావుల గురించి మాట్లాడడమే. అంటే అది రైతాంగంలో ఒక వర్గం మాత్రమే మాట్లాడగల విషయమైపోయింది. బోరు బావులు భూమి లోతుల్లోకి వెళ్ళే కొద్దీ భూగర్భ జలాలు అందని రైతుల సంఖ్య పెరుగుతూ పోయి ఆ వర్గం వ్యవసాయం నుంచే బయటికి పోతోంది. ఆకలి గొన్న ఒక మహావృక్షం వేర్లలా అవి వరి పొలాలను తడపడానికి భూమి లోతుల్లోకి వెళ్ళి నీటిని పైకి తీసుకురావడం వల్ల చుట్టుపక్కల ఉన్న మిగతా బోర్లన్నీ ఎండిపోతున్నాయి. బోర్‌వెల్ కంపెనీల యజమానులలో ఎక్కువమంది వ్యాపారస్తులుగా మారిన ఒకనాటి గ్రామీణ సంపన్నులే ఉంటారు. అందరూ దాదాపుగా ఈ జిల్లా వాళ్ళే. భూగర్భ జలాలపై జరుగుతున్న ఈ దండయాత్రలో అందరికంటే ముందువరసలో నిలబడ్డది వారే.

మరి ఈ పరుగు పందెం నుండి బయటికి తోసేయబడ్డ వారి గతి ఏమిటి? ఈ సారి వానలు పడకపోతే వారు కూడ పందెంలో అసలెన్నడూ లేని జనం పక్కకెళ్ళి నిలబడక తప్పదు. ముందుగా ఒక్కొక్క జత ఎడ్లనూ అమ్ముకుంటూ వెళతారు. వానలు

పడితే ఒక జత అయినా అవసరం అవుతాయని చివరి జతను చివరిదాకా అమ్మకుండా ఉంచుకుంటారు. అవసరం పడ్డప్పుడు మళ్ళీ కొనాలంటే ఒక్క ఎద్దుకే 3000 రూపాయల దాకా పెట్టి కొనాల్సి ఉంటుందని తెలిసి కూడ జత ఎద్దులను కేవలం వెయ్యి రూపాయలకే సంతలకు తీసికెళ్ళి అమ్ముకుంటారు. పట్టణాలలో, రోడ్డు పక్కన గ్రామాల్లో జరిగే సంతలే తెలంగాణ, రాయలసీమ ప్రాంతాలలో పశువుల క్రయవిక్రయాలకు నేటికీ ప్రధాన కేంద్రాలు. మామూలు రోజుల్లోనూ కొన్ని పశువులు కబేళాకు వెళతాయి కాని వాటి సంఖ్య తక్కువ. రైతుల నుండి రైతులకు దళారీల ద్వారా జరిగే క్రయవిక్రయాలే ఎక్కువ. కరువు పరిస్థితులు ఏర్పడగానే ఈ వారాంతపు సంతల నిండా కబేళాల వారే కనిపిస్తారు. అన్ని కరువు జిల్లాలలోని పశువుల సంతల నుండీ వారం వారం డజన్ల కొద్దీ లారీల్లో పశువులు కబేళాలకు తరలి వెళుతుంటాయి. లారీల నుండి దూకకుండా ఉండేందుకు వాటి కాళ్ళను మోకాళ్ళ దగ్గర విరగ్గొట్టి మరీ తీసుకెళతారు.

ఒకనాడు ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు సబ్సిడీ ధరలపై పశుగ్రాసం అందజేసే విధానాన్ని ప్రభుత్వాలు అనుసరించేవి. అవసరంతో పోల్చితే వాళ్ళు సరఫరా చేసేది చాలా చాలా తక్కువే అయినా – వాళ్ళ సహాయం ఎలా ఉంటుందంటే అవసరమున్న రైతులు వందమంది ఉంటే వారిలో ఒక్కరికి, ఒక్క జత పశువులకు, ఒక్క వారానికి సరిపడా పశుగ్రాసాన్ని అందించే పద్ధతిలో ఉంటుంది – కనీసం ఆ నామమాత్రపు సహాయమైనా చేసేవారు. ఈ సీజన్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆ పాటి కూడ చేయలేదు. పైపెచ్చు తక్షణ సహాయ చర్యల మీద ఖర్చు పెట్టడం వల్ల బడ్జెట్ మీద భారం పెరిగిపోవడమే తప్ప శాశ్వత ప్రయోజనాలు కలగడం లేదని, అందువల్ల ఇంకుడు గుంతలు (పెర్కులేషన్ ట్యాంకులు), చెక్ డ్యాములు, తాగునీటి కోసం బోరుబావులు వంటి దీర్ఘకాలిక ప్రయోజనం కలిగించే చర్యల మీద మాత్రమే ఖర్చు పెడతామని చాలా ఆర్భాటంగా ప్రకటించింది. పశువులు దీర్ఘకాలిక సంపద అయినపుడు వాటికి స్వల్పకాలిక సహాయంగా అవసరమైన పశుగ్రాసాన్ని నిరాకరించడం వల్ల రైతుకు కలిగేది దీర్ఘకాలిక నష్టమా, స్వల్పకాలిక నష్టమా? చెక్ డ్యాములు, పెర్కులేషన్ ట్యాంకులు ఎంత దీర్ఘకాలికమైనవంటే అవి ఎప్పటికీ కార్యరూపం ధరించనంత దీర్ఘకాలికమైనవి. తాగునీటి కోసం వేసే దీర్ఘకాలిక బోరులు స్వల్ప కాలంలోనే చుక్క నీరు లేకుండా ఎండిపోతుంటాయి కదా, మరి అవి దీర్ఘకాలిక ప్రయోజనాలు ఇస్తున్నట్టు ఎలా అనుకోగలం? ఇంత గందరగోళం ఉండడం వల్లే రైతులు దీర్ఘకాలిక, స్వల్పకాలిక

పదాలకు అసలైన అర్థాలు ఏమిటో తెలియక భాషాపరమైన అయోమయంలో పడిపోయారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి (IMF) ఆధ్వర్యంలో ప్రస్తుతం అమలవుతున్న ద్రవ్య విధానాల పునర్నిర్మాణంలో భాగంగా కరువు సహాయం వంటి వృధా ఖర్చులకు ప్రభుత్వాల దగ్గర నిధులు, విధానాలు లేకుండా పోయాయనేది అసలు నిజంలా ఉంది.

పశువులు ఒక రకమైన కబేళాలకు వెళుతుంటే వాటి యజమానులు మరో రకం కబేళాలకు తరలిపోతున్నారు. (నాలుగు కాళ్ళ పశువు, రెండు కాళ్ళ పశువు అని ఏ మాత్రం మొహమాటం లేకుండా మొదట వాడింది మన దేశపు ఋషులే.) దగ్గరలో కాలవల కింద పండే భూములుంటే తక్కువ కూలీకే వరి నాట్లు వేయడానికి, కలుపులు తీయడానికి అక్కడికి పోతున్నారు; దగ్గరలో అలాంటివేవీ లేకపోతే హైదరాబాద్‌కు లేదా అన్ని మురికివాడలకు పుట్టినిల్లు అయిన బొంబాయికి వలస పోతున్నారు. దక్షిణాదివారిని, ముస్లింలను బొంబాయి నగరం వదిలేలా చేసిన గత డిసెంబర్, ఈ ఏడాది జనవరిలో జరిగిన దారుణాలను చాలావరకు మరిచిపోయి వెళుతుంటారు; అయినా అక్కడ నుంచి తిరిగి వచ్చిన వాళ్ళు, ఇప్పుడు వెళుతున్న వాళ్ళు వేరు వేరు కదా! చవకగా దొరికే వలస కార్మికులను పనిలో పెట్టుకునే ఆ నగర యజమానులకు, శివసేనకు ఇప్పుడు వేరే బాధితుల గుంపులు దొరికాయి.

అన్ని జిల్లాలలోకెల్లా పెద్దఎత్తున జనం వలస వెళుతున్న జిల్లా మహబూబ్‌నగర్ జిల్లా. అదో నిత్య కరువు పీడిత ప్రాంతం. నిజాం రాజు మహబూబ్ అలీ ఖాన్ పేరు పెట్టేంత వరకు దాని పేరు పాలమూరు. అందుకే అక్కడి కార్మికులు పాలమూరు లేబర్‌గా ప్రసిద్ధి చెందారు. ప్రభుత్వం కరువు సంవత్సరమని ప్రకటించినా, ప్రకటించకపోయినా ఏటా ఐదు లక్షల మంది దేశంలోని వివిధ ప్రాజెక్టుల వద్ద పని చేయడానికి ఏడాదిలో 9 నెలలు వలస పోతారని ఒక అంచనా. ప్రాజెక్ట్ నిర్మాణ కంపెనీల వారు లేబర్ కాంట్రాక్టర్ల ద్వారా వారిని కాంట్రాక్టుకు కుదుర్చుకుని తీసికెళతారు. గ్రామంలోనే కొంత మొత్తం అడ్వాన్సుగా ఇచ్చి ఇంత కాలానికని – సాధారణంగా ఖరీఫ్‌లో నాట్లు పడ్డాక మళ్ళీ ఖరీఫ్ సీజన్ రావడానికి కొంచెం ముందు దాకా, అంటే తొమ్మిది నెలల కాలానికి – మాట్లాడుకుంటారు. వారి శ్రమకు దేశం నలుమూలలా అనేక భారీ ప్రాజెక్టులను సాకారం చేసిన ప్రతిష్ట ఎంతగా ఉందో, వారి పని పరిస్థితులు అంత దుర్భరంగా ఉంటాయనే నిజం కూడ అంతే జగద్విదితమైన విషయం. తక్కువ వేతనాలు, నాసిరకం ఆహారం, గాలీ వెలుతురు సోకని ఇళ్ళు,

అనేకరకాల జబ్బులకు గురయ్యే పరిస్థితులు, అన్ని రకాల చట్టబద్ధమైన హక్కుల నిరాకరణ, స్త్రీలపై లైంగిక హింస మధ్య వారు జీవించాల్సి వస్తోంది. సాధారణ సంవత్సరాలలో ఈ వలసలు ఐదు లక్షల దాకా ఉంటే ప్రభుత్వం అధికారికంగా కరువు సంవత్సరమని ప్రకటించిన సంవత్సరాలలో ఇంకా చాలా ఎక్కువగా ఉంటుంది.

## ఇసుక తవ్వకం వల్ల జరిగే నష్టాలు

ఎంత వర్షం నీరు చెరువుల్లో, మట్టిలో తిరిగి ఉపయోగించడానికి వీలుగా నిల్వ అవుతోందో, ఎంత వృధాగా పోతోందో ఆ గణాంకాలకు – ప్రస్తుత ప్రభుత్వ అనుకూల మేధో వాతావరణంలో – పెద్ద గౌరవం ఇవ్వాల్సిన అవసరం లేదు గాని ఇంచుమించుగా వర్షపు నీటిలో సగమే ఉపయోగపడుతున్నదని చెప్పుకోవచ్చు.

ఇంతకుముందే చెప్పినట్టు తెలంగాణ ప్రాంతం ఎత్తుపల్లాలతో, గుట్టలతో నిండి ఉన్న ప్రాంతం. దాని వల్ల అసంఖ్యాకమైన చిన్నా పెద్దా ఏర్లు కనిపిస్తాయిక్కడ. పెద్దవాటిని ఏర్లు అని, చిన్నవాటిని వొర్రెలని (తెలంగాణకు ప్రత్యేకమైన పదం) పిలుస్తారు. పెద్దవాటి అడుగు భాగం ఇసుకతో నిండి ఉంటుంది కాని వొర్రెలకు స్థిరమైన అడుగుభాగం అంటూ ఏదీ ఉండదు. లోతుగా చీలిన నేల మధ్య నుంచి నీరు వెళ్లిపోతున్నట్టు ఉంటాయి. ఈ వాగులు, వొర్రెల నుండి వచ్చే నీళ్ళ ఆధారంగా గతంలో ఎన్నో చెరువులు కట్టారు. ఇవి సాధారణంగా గొలుసుకట్టు చెరువుల్లాగా ఉంటాయి. పైనున్న చెరువు నిండాక కిందనున్న చెరువుకు నీళ్లు వచ్చేలా కట్టిన చెరువులివి. రెండు నుంచి ఆరు దాకా ఒక సముదాయంగా ఉంటాయి. ఆధునిక ఇంజనీరింగ్ పద్ధతులును ఉపయోగించి వీటిని మెరుగు పరిచే అవకాశం ఉంది. వాటి గురించి నాయకుల మాటల్లో, అధికార పత్రాలలో ప్రస్తావనలు కనిపిస్తాయి కాని వాస్తవంగా మాత్రం ఏమీ జరగదు. ఈ విషయంలో రాయలసీమ పరిస్థితి ఇంకా అధ్వాన్నం. ఎందుకంటే అక్కడి నేల తెలంగాణతో పోల్చితే నీటి నిల్వకు అంత అనుకూలంగా ఉండదు. అయితే దాని కంటే అసలు సమస్య పడిన వర్షాన్నంతటినీ ప్రజల తాగునీరు, సాగునీరు అవసరాలకు ఉపయోగపడేలా చేయాలన్న సంకల్పం ప్రభుత్వానికి లేకపోవడం.

నిర్మాణాత్మక కృషి లోపించడంతో పాటు అభివృద్ధి పేరిట అపరిమితమైన మార్పులు చేసుకుంటూ పోవడం నీటి పారుదల విషయంలో అనేక వ్యతిరేక ఫలితాలకు దారి

తీస్తోంది. ప్రతి గ్రామంలో తాగునీటిని సరఫరా చేసేందుకు ఒకటి కంటే ఎక్కువ బోర్‌వెల్‌లను ఏర్పాటు చేసి ప్రభుత్వం అధికారికంగా మంచినీటి సమస్యను పరిష్కరించిన మాట నిజమే కాని ఇంతకుముందే చెప్పినట్టు బోర్‌వెల్‌ల సంఖ్య, లోతు పెరిగాక భూగర్భ జలాలు అడుక్కి వెళ్ళిపోవడంతో చాలా గ్రామాలలో మంచినీరు కూడ దొరకని పరిస్థితి ఏర్పడింది. చెరువు గర్భాలలో సేద్యం జరగడం గురించి, ఇళ్ళ కాలనీలు, ఇటుక బట్టీలు ఏర్పడడం గురించి ఇంతకుముందు చెప్పుకున్నాం. కొత్తగా మరోటి కూడ జరుగుతున్నది. గత దశాబ్ద కాలంలో హైదరాబాద్‌లో నిర్మాణ పనుల వేగం పెరిగిన కొద్దీ రియల్ ఎస్టేట్ వ్యాపారులు నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలలో చెరువులకు నీళ్ళందించే అసంఖ్యాకమైన ఏర్లలోని ఇసుకను పెద్దఎత్తున తవ్వి తీసికెళ్ళిపోతున్నారు. రాజధానికి 100–150 కిలోమీటర్ల దూరంలోని చాలా ఏటి గర్భాలలో ఇప్పుడు ఇసుకనేదే లేకుండా పోయింది. గట్టి నేల మాత్రమే మిగిలింది. ఏటిలో ఇసుక ఉన్నప్పుడు నీరు క్రమంగా భూమిలోకి ఇంకి, భూగర్భ జలాల నీటిమట్టాన్ని పెంచేది. మిగతా నీరు చెరువులోకి వెళ్ళిపోయేది. కాని ఇప్పుడు నీరు వచ్చినప్పుడు ఆకస్మిక వరదలా వచ్చి పడి చెరువు కట్టలను తెంపడమేకాక, చుట్టుపక్కల ప్రాంతాన్నంతటినీ ముంచెత్తుతోంది. ఈ నష్టాన్ని మొదట గుర్తించింది ఏటి చుట్టుపక్కల ఉన్న రైతులే. అసలే కరువు పీడిత జిల్లాలుగా ఉన్న ఈ రెండు జిల్లాలకు ఇప్పుడీ కొత్త సమస్య వచ్చి పడడంతో బాధిత రైతులు ఆందోళన బాట పడుతున్నారు.

వర్షపు నీటి సంరక్షణలో నిర్మాణాత్మక విధానాల కొరత, 'సహజం' పేరిట జరుగుతున్న అభివృద్ధి ప్రక్రియ నీటి నిల్వలను, నీటి మట్టాన్ని ఎలా ధ్వంసం చేస్తున్నాయో చెప్పడానికి మరెన్నో సంఘటనలను కూడ ఉదాహరణలుగా చెప్పవచ్చు. ఇదంతా వర్షాభావం ఉన్నా లేకపోయినా వచ్చే 'కరువు'లో భాగమే. కాకపోతే వర్షాలు పడని సంవత్సరాలలో ఈ లోపాలన్నీ – పశువులను కబేళాకు తరలించే దృశ్యాల రూపంలో, నెర్రలు బారిన పొలాల రూపంలో, ఒకటీ అరా ఆకలి చావుల రూపంలో – వార్తలకెక్కి మనకు కనిపిస్తుంటాయి.

**ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ**

**18 సెప్టెంబర్ 1993**

*'Year of drought?' ఆంగ్ల వ్యాసానికి అనువాదం : వేమన వసంతలక్ష్మి*

# 'విజన్ 2020' లో బక్క రైతుకు ఏదీ భరోసా?

ఈమధ్య మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును ఎవరు ఏ సమస్యల గురించి అడిగినా 'విజన్ 2020 లో ఉంది చూడండి' అని జవాబు చెపుతున్నారట. కానీ అది అందుబాటులో లేదు కాబట్టి దాన్ని సంపాదించి చదవడం సామాన్యులెవరికీ సాధ్యమయ్యే పని కాదు. ఇంకో తొమ్మిది నెలల తర్వాత నారా చంద్రబాబునాయుడు ప్రభుత్వం ఉంటుందో లేదో ఇప్పుడే ఎవ్వరూ చెప్పలేరు కాబట్టి 'విజన్ 2020' లో ఏముందో తెలుసుకోకపోతే మాత్రం ఏం అని అనుకోవడం పొరపాటవుతుంది.

ఈ 'విజన్'లోని విధానాలను చంద్రబాబునాయుడు ఆవేశంగా భుజానికి ఎత్తుకుని ప్రచారం చేస్తున్నారు కానీ అందులో నిజానికి అతని ఆలోచనలకు ప్రత్యేకమైన విషయాలేవీ లేవు. ఏవైనా ఉంటే అవి కేవలం వివరణకూ, వివరాలకూ సంబంధించినవి. ఈ విధాన దృష్టి సమకాలీన మూడవ ప్రపంచ దేశాల పాలకుల సామాన్య 'విజన్'. చొరవను బట్టి హెచ్చుతగ్గులుంటే ఉండవచ్చు కాక. ప్రపంచ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచ వాణిజ్య సంస్థల వంటివి నిర్దేశిస్తున్న దృక్కోణం కూడ ఇదే.

రేపు రాబోయే ఎన్నికలలో ఈ ప్రభుత్వం పోయి వేరేది వచ్చినా ఇంతకంటే మౌలికంగా భిన్నమైన దృష్టితో మనలను పరిపాలించబోదు. (కాబట్టి ఈ ప్రభుత్వాన్నే మళ్ళీ ఎన్నుకుందామని చెప్పడం నా ఉద్దేశం కాదు. పార్టీలను దాటి కొంచెం లోతుగా ఆలోచించడం అవసరమని చెప్పడం మాత్రమే.)

‘విజన్ 2020’ లో ఎవరికి ఏముందో తెలుసుకోవడం సామాన్యులెవ్వరికీ సాధ్యం కాదు కాబట్టి ఒక మామూలు రైతును ఉదాహరణగా తీసుకుని అందులో ఆ వర్గానికి ఏముందో చూద్దాం. అంతకంటే నికృష్టంగా బతికే వాళ్ళను (అంటే రైతు అనిపించుకొనడానికి కావలసిన భూమి సైతం లేని వాళ్ళను) ఉదాహరణగా తీసుకుని ప్రయోజనం లేదు. ఎందుకంటే ‘విజన్’లో వాళ్ళకు ఏమీ లేదు (రోడ్డు పని, మట్టి పని కల్పిస్తామన్న హామీ తప్ప). రైతులకు ఏదో ఉందన్న అభిప్రాయం ఉంది కాబట్టి రెండుమూడు ఎకరాలతో, నీటి వసతి ఉండీ లేక వ్యవసాయం చేసే రైతును (అంటే మన ముఖ్యమంత్రి చిన్ననాటి పరిస్థితి అని చెప్పుకుంటే సరిపోతుంది) ప్రమాణంగా తీసుకుని పరిశీలిద్దాం.

ఈ రైతులు పెట్టుబడిదారీ విధానంలో భాగంగా అభివృద్ధి చెందాలని ‘విజన్ 2020’ కోరుకుంటుంది. చిన్న రైతులు సైతం పెట్టుబడిదారీ పద్ధతిలో బాగుపడాలని ఆశ పడుతున్నారనడానికి సందేహించనవసరం లేదు. పెట్టుబడిదారీ వ్యవస్థను సూత్రప్రాయంగా వ్యతిరేకించే మాబోటి వారు సైతం ఈ వాస్తవాన్ని ఒప్పుకోక తప్పదు. ఒప్పుకోకపోవడం ఆత్మవంచన అవుతుంది.

కానీ పెట్టుబడిదారీ ‘ఆధునీకరణ’ ద్వారా జీవితాలు బాగుపరచుకోవాలని ప్రయత్నం చేసిన చిన్న, మధ్యతరగతి రైతులందరూ తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటున్నారు. గత సంవత్సరం పెద్ద సంఖ్యలో ఆత్మహత్య చేసుకున్న రైతుల కథ ఇదే. ఆ ఆత్మహత్యలు ఈ సంవత్సరం కూడ కొనసాగుతున్నాయి. ‘విజన్ 2020’ ఈ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు ఏ జవాబూ చెప్పకుండా అదే మార్గంలో మరింత వేగంగా ముందుకు పోవాలంటుంది.

అవసరానికి తగ్గ రుణాలు అందుబాటులో లేకపోవడం పత్తి రైతులు ఎదుర్కొన్న ముఖ్యమైన సమస్యలలో ఒకటి. వ్యవసాయ పరపతి సంఘాలు, గ్రామీణ బ్యాంకులు, పెద్ద బ్యాంకుల గ్రామీణ శాఖలు వీరికి రుణాలు ఇవ్వాలి. ఒకప్పుడు వ్యవసాయాన్ని ప్రాధాన్యతారంగంగా భావించి అప్పులివ్వాలన్న నియమం ఈ రుణ సంస్థలకు ఉండేది. కానీ ‘విజన్ 2020’ ఆమోదించే ఆర్థిక పునర్వ్యవస్థీకరణలో భాగంగా వాణిజ్య సంస్థలకు ఈ దశాబ్దకాలంలో కఠినమైన నియమాలు పెట్టారు. సెక్యూరిటీ లేకుండా అప్పులివ్వకూడదని, గత సంవత్సరం తీసుకున్న రుణం తీర్చని వారికి

అప్పులివ్వకూడదని, ఇతర వాణిజ్య సంస్థలకు బకాయిలున్న వారికి సైతం ఇవ్వకూడదని, ఒక్క మాటలో చెప్పాలంటే 'కమర్షియల్ వయబులిటీ'ని బట్టి రుణాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. దానికి అనుగుణంగానే వ్యవసాయ పరపతి సంఘాలకు కల్పించే పెట్టుబడి వనరులను దారుణంగా తగ్గించేశారు. 'ఆధునీకరణ' లోనూ 'అభివృద్ధి' లోనూ భాగం కాదలచుకున్న రైతులకు అవసరమైన రుణాలలో రూపాయిలో ఇరవై పైసలు సైతం ఈ బ్యాంకులు, పరపతి సంఘాలు ఇవ్వలేక పోతున్నాయి. పత్తి రైతుల ఆత్మహత్యలకు నేరుగా దారితీసిన కారణాలలో ఇదొకటి.

దీనికి రెండేళ్ళుగా ఏ జవాబూ చెప్పలేకుండా ఉన్న చంద్రబాబు ప్రభుత్వం 'విజన్ 2020' లో ఇదే ఆధునీకరణ విధానాన్ని మరింత పెద్దఎత్తున ప్రతిపాదిస్తున్నది. ఆ నమూనాలో ఆంధ్రప్రదేశ్ 2020 నాటికి అత్యాధునిక ఆర్థిక వ్యవస్థగా రూపొందుతుందని 'విజన్' హామీ ఇస్తుంది. ఇది కేవలం కొద్దిమంది రైతులు పత్తి వంటి వాణిజ్య పంటలు వేయడం ద్వారా చేపట్టే ఆధునీకరణ కాదు. క్రీ.శ. 2020 నాటికి ఒక లక్షా 60 వేల కోట్ల రూపాయల పెట్టుబడితో పళ్ళు, పూలు, కూరగాయల ఎగుమతితోనూ, పాడి పరిశ్రమ, కోళ్ళ పరిశ్రమలతోనూ, వీటన్నింటికీ కావలసిన రోడ్లు, రైళ్ళు, టెలిఫోన్లు, ప్రత్యేక కార్గో ప్లేన్లు, కోల్డ్‌స్టోరేజ్ వ్యవస్థతోనూ సాధించే విస్తృతమైన వ్యవసాయ వ్యాపారీకరణ. ఇప్పటికే వ్యవసాయంలో వ్యాపారీకరణ చెప్పుకోదగ్గ మోతాదులో ప్రవేశించింది గానీ వ్యవసాయాన్ని వట్టి వ్యాపారంగా నిర్వహిస్తున్న వ్యవసాయదారులు కొద్దిమందే. ఇంటికి అవసరమైన తిండి గింజలు కొద్దిగా పండించుకుంటూ దానితో పాటు వ్యాపార పంటలు కూడ చేపట్టే రైతులే ఎక్కువ. కాని ఇప్పుడు వ్యవసాయాన్ని పూర్తిగా వ్యాపారీకరించాలని 'విజన్' భావిస్తుంది. నీటి వాడకం ఉన్న కోస్తా జిల్లాలు ఒక రకమైన వ్యాపార పంటలు చేపట్టాలని, నీళ్ళు తక్కువ ఉన్న తెలంగాణ, రాయలసీమ జిల్లాలు ఆహార పంటల సేద్యాన్ని మొత్తంగా పక్కనపెట్టి, పళ్ళ తోటలు, కోళ్ళ మేతకు అవసరమైన మొక్కజొన్న సాగు, గొర్రెల పెంపకానికి అవసరమైన పచ్చికబీళ్ళ నిర్వహణ చేపట్టాలని 'విజన్' అంటున్నది.

దేశీయ విదేశీయ కార్పొరేషన్ల కొనుగోలుతో ముడిపడి ఉన్న 'అభివృద్ధి' లో భాగంగా ఉంటూ ప్రయోజనం పొందాలని పెద్దరైతులే కాదు, చిన్నరైతులు కూడ ఆశపడవచ్చు. కానీ చిన్నరైతులు ఈ 'అభివృద్ధి' ఆటుపోట్లను తట్టుకోగలరా అన్నది ప్రశ్న. తట్టుకోవడానికి కావలసిన ఏర్పాట్లేవయినా 'విజన్' లో ఉన్నాయా అన్నది ఇంకొక ప్రశ్న.

వ్యవసాయ వ్యాపారీకరణలో పెద్దఎత్తున పాల్గొనాలంటే రైతులకు పెట్టుబడి కావాలి. పెద్ద రైతులు స్వంతంగా సమకూర్చుకోగలరేమో గానీ చిన్న రైతులకు వ్యవస్థిత రుణ సదుపాయం అవసరం. అది లోపించడం ఈ మధ్య జరిగిన పత్తి రైతుల ఆత్మహత్యలకు గల ముఖ్య కారణాలలో ఒకటని చెప్పాను. కానీ వ్యాపారీకరణను సమగ్రంగా పెంచదలచుకున్న 'విజన్'లో దీనికి స్పష్టమైన జవాబేమీ లేదు. గ్రామీణ బ్యాంకుల వ్యాపార నియమాలలో 1990 తర్వాత ప్రవేశపెట్టిన ప్రమాణాలలోనూ, తీసుకుని వచ్చిన మార్పులలోనూ సడలింపు ఉంటుందన్న హామీ ఏదీ లేకుండానే గ్రామీణ బ్యాంకులు ఈ అవసరాన్ని తీరుస్తాయని 'విజన్' హామీ ఇస్తుంది. లేకపోతే 'స్వయం సేవక బృందాలు' ఈ పని చేస్తాయని అంటుంది. అవేమిటో ఎట్లా ఉంటాయో కూడ చెప్పదు.

పండించే పంటకు గిట్టుబాటయ్యే ధర ఉంటుందన్న హామీ కూడ రైతులకు అవసరం. మార్కెట్‌లో సరి అయిన ధర పలకకపోతే 'ప్రభుత్వ కొనుగోలు సంస్థలు' తగిన ధర ఇచ్చి కొంటాయన్న భరోసా కావాలి. అది లేకపోతే వ్యవసాయాన్ని వ్యాపారంగా నిర్వహించడం సాధ్యం కాదు. పెద్ద రైతులు ఒక సంవత్సరం నష్టపోయినా మరొక సంవత్సరం కోలుకోగలరేమోగానీ చిన్న రైతులు కోలుకోలేరు. కోలుకోలేనంతగా అప్పుల పాలవుతారు.

నిన్న మొన్నటి రైతుల ఆత్మహత్యలకు గల కారణాలలో ఇది కూడ ఒకటే. 'విజన్' లో దీనికి జవాబు ఏమీ లేదు కానీ వ్యవసాయ వ్యాపారీకరణను అది నూరు శాతానికి పెంచాలని చూస్తుంది. పైగా రైతుల దగ్గర ప్రస్తుతం కొనుగోళ్ళు చేస్తున్న స్థానిక వ్యాపారస్తుల స్థానాన్ని 'విజన్' లో దేశీయ విదేశీయ కార్పొరేషన్లు ఆక్రమించుకున్నాయి. వాళ్ళ దగ్గర గిట్టుబాటు ధర పొందడం రైతులకు మరీ కష్టం. వారిచేత ఇప్పించడం ప్రభుత్వానికి అసాధ్యం. రైతులు కొంచెం పట్టుదలగా ఉంటే స్థానిక వర్తకులు కొంత అయినా ధర పెంచక తప్పదు. కానీ దేశంలోనూ, దేశ దేశాలలోనూ పలుచోట్ల కొనుగోలు చేసే కార్పొరేషన్‌లకు అటువంటి 'కర్మ' ఏమీ లేదు.

రైతులకూ కార్పొరేషన్‌లకూ మధ్య కొనుగోలు కాంట్రాక్టులు కుదిర్చే చట్టాలు చేస్తామని, ప్రభుత్వం ఆ చట్టాలలో మూడవ వ్యక్తిగా ఉంటుందని 'విజన్' అంటుంది. కానీ ప్రభుత్వం పాత్ర ఆ కాంట్రాక్టును అమలు చేయించే పాత్రే కాగలదు. తప్పనిసరిగా కొనుగోలు కాంట్రాక్టు చేసుకోవాలని చట్టం చెప్పలేదు. ప్రభుత్వమూ ఒత్తిడి చేయలేదు.

ఏ ధరకు కాంట్రాక్టు చేసుకోవాలన్నది కూడ కంపెనీ ఇష్టానికి వదిలేయక తప్పదు. వాళ్ళు ఒకచోట కాకపోతే మరొక చోట కొనగలరు. కాబట్టి వాళ్ళ మీద ఒత్తిడి పెట్టడం అసాధ్యం.

అసలే అస్థిరమైన వ్యవసాయం వ్యాపార కార్పొరేషన్ల ప్రవేశం వల్ల, చిన్న రైతులకు అనుకూలమైన రుణ వ్యవస్థ లోపించడం వల్ల మరింత అస్థిరంగా తయారవుతుంది. కానీ 'విజన్' దీనిని కేవలం ప్రోత్సహించి వదిలేయడం లేదు. ఇది తప్ప వేరే గత్యంతరమేదీ లేని పద్ధతిలో ఒత్తిడి పెడుతుంది. ప్రభుత్వం కల్పించే వసతులు, మార్కెట్ వ్యవస్థ, ప్రభుత్వ వ్యవసాయ అధికారుల విస్తరణ కార్యక్రమాలు అన్నీ దీనికే అనుగుణంగా ఉండబోతాయి. ఇష్టమున్నా లేకపోయినా 'అభివృద్ధి' కావాలంటే రైతులు అత్యంత అస్థిరమైన ఈ 'కార్పొరేషన్ల'తో ముడిపడిన వ్యాపారీకరణలో భాగం కావాలన్న ఒత్తిడి బలంగా పని చేస్తుంది.

తెలంగాణ, రాయలసీమ జిల్లాలు ఈ ఒత్తిడి వల్ల మరింత నష్టపోతాయి. ఎందుకంటే వర్షపాతం తక్కువగా ఉన్న ఈ ప్రాంతాల భూములు తిండి గింజల కన్నా పళ్ళతోటలకూ, పశువుల పెంపకానికి అవసరమైన పచ్చికబీళ్ళకూ, కోళ్ళ పరిశ్రమకు అవసరమైన మొక్కజొన్న సాగుకూ తగినవని 'విజన్' ప్రకటించేసింది. అంటే ఈ రకమైన భూమి వినియోగానికి అవసరమైన వసతులు, విస్తరణ మాత్రమే అందుబాటులో ఉండబోతాయి. కానీ సరైన రుణ వ్యవస్థ లేకుండా గిట్టుబాటు ధరలకు హామీ లేకుండా చిన్న రైతులు సాహసానికి ఒడిగడితే బాగా దెబ్బతినే ప్రమాదం ఉంటుంది.

అప్పుడు ఆత్మహత్య వద్దనుకున్న రైతులు తమ భూముల్ని అవే కార్పొరేషన్లకు అమ్ముకుని లేక కౌలుకిచ్చి కూలివాళ్ళుగా మారిపోవలసి ఉంటుంది. వ్యవసాయ ఉత్పత్తులతో వ్యాపారం చేసే కంపెనీలకు సీలింగ్ చట్టం అడ్డం రాకుండా ఉండేందుకు, వారు భూముల్ని పెద్దయెత్తున కౌలుకు తీసుకుని వ్యాపార పంటల ఉత్పత్తిని భారీగా చేపట్టేందుకు చట్టం ద్వారా సదుపాయం కల్పిస్తామని 'విజన్' హామీ ఇస్తున్నది. కాబట్టి వ్యాపార పంటల విషవలయంలో చిక్కుకున్న చిన్న రైతులు రెండు మూడేళ్ళ తర్వాత కొనుగోలు కంపెనీలకే తమకున్న ఒకటి రెండు ఎకరాలు లీజుకు ఇచ్చి కూలీ చేసుకుని బతికే పరిస్థితి రావచ్చు.

నేను మరీ 'అతి'గా ఊహిస్తున్నానని అనుకోనక్కరలేదు. వరంగల్‌లోనూ, ఇతర జిల్లాలలోనూ గత సంవత్సరం ఆత్మహత్య చేసుకున్న రైతులే దీనికి నిదర్శనం. పత్తి పండించి జీవితాలు బాగుచేసుకుందామని ప్రయత్నం చేసిన వెనుకబడిన ప్రాంతాల రైతులందరూ నష్టపోలేదు. నష్టపోయిన వారందరూ మళ్ళీ కోలుకోలేనంతగా నష్టపోలేదు. అందరూ ఆత్మహత్యలు చేసుకోలేదు. కానీ చాలామంది కోలుకోలేనంతగా నష్టపోయారు. ఆత్మహత్య చేసుకున్నారు. వీరిలో దాదాపు అందరూ చిన్న రైతులే, బి.సి, ఎస్.సి కులాల వారే. అంతేకాక నష్టపోయినవారు మళ్ళీ పత్తిపంటే వేస్తున్నారు. ఇది పెట్టుబడి చిన్న రైతులకు కల్పించే విషవలయం. ఒక మార్గంలో నష్టపోయినవారు బయటపడాలంటే మళ్ళీ ఆ మార్గంలోనే బయటపడాలి. ఎందుకంటే అందులోనే మళ్ళీ లాభం పొంది జీవితాన్ని శాశ్వతంగా బాగుచేసుకునే అవకాశం లేకపోలేదు.

కాబట్టే వేరే ఏ విధంగానూ దారిద్ర్యరేఖ అంచులు దాటి పైకి పోయే అవకాశం కనిపించని సాధారణ రైతులు సైతం వీటి పట్ల ఆకర్షితులవుతారు. కొందరిని 'అదృష్టం వరిస్తుంది'. కొందరు శాశ్వత దారిద్ర్యం నుంచి శాశ్వత అస్థిరతలోకి పోతారు. కొందరు అస్థిరత అంచు నుంచి కిందికి జారి ఆత్మాహుతి తప్ప గత్యంతరం లేదన్న నిర్ణయానికి వస్తారు.

'విజన్' చూపించే దృశ్యంలో ఈ సంక్షోభం మరింత తీవ్ర రూపంలో ఉంటుంది. మన ఆర్థిక వ్యవస్థ 'మొత్తంగా' అభివృద్ధి చెందినా చెందవచ్చు. 'విజన్' ఊహించేటంత పెరుగుదల రేటు సాధించినా, సాధించకున్నా ఆ మార్గంలో కొంత స్థూలమైన అభివృద్ధి సాధిస్తే సాధించవచ్చు. కానీ ఆ 'అభివృద్ధి రైలుబండి' నుంచి అడపాదడపా ఒక శవం కిందికి జారిపడుతూ ఉంటుంది. అది రైలెక్కకుండా ఉండిపోయిన వ్యవసాయ కూలీ శవం కాదు, రైలెక్కిన మామూలు రైతు శవం.

**ఆంధ్రప్రభ దినపత్రిక**
**18 మార్చి 1999**

# విజన్ 'చూపు'లో వివక్ష

ప్రాంతీయ అసమానతలు తీవ్రస్థాయిలో ఉన్నాయని రాజ్యాంగమే గుర్తించిన మూడు రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటి (మిగిలిన రెండు మహారాష్ట్ర, గుజరాత్). ఆ అసమానతలను కొంత మేరకయినా తగ్గించడానికి ఆర్టికల్ 371-డి లో పార్లమెంట్ కొన్ని ఆదేశాలను చేర్చింది. అవి ప్రధానంగా విద్యా ఉద్యోగ అవకాశాలలో మూడు ప్రాంతాల మధ్య ఉన్న అసమానతలను తొలగించడానికి – ఇంకా నేరుగా చెప్పాలంటే కోస్తా జిల్లాలవాళ్ళే విద్యా, ఉద్యోగ రంగాలను పూర్తిగా ఆక్రమించుకోకుండా చూడడానికి ఉద్దేశించిన ఆదేశాలు.

అవి సక్రమంగా అమలు కావడం లేదన్నది ఒక విషయం కాగా, ప్రాంతీయ అసమానతలు, వివక్ష కేవలం విద్యా ఉద్యోగ రంగాలకే పరిమితం కాలేదన్నది మరింత ముఖ్యమైన విషయం. ఆర్టికల్ 371-డి స్ఫూర్తిని కాపాడుకోవడం ఎంత ముఖ్యమో అందులో ప్రస్తావనకు నోచుకోని ఇతర రూపాల వివక్షను ఎదుర్కొనే పాలనా విధానాలను సాధించుకోవడం కూడ అంతే ముఖ్యం. భాషా సంస్కృతుల నుండి సాగునీటి వరకు అన్ని రంగాలలోనూ వివక్ష, చిన్నచూపు, అసమాన ప్రతిపత్తి కనిపిస్తాయి.

మరొక 20 సంవత్సరాలలోగా మనకు స్వర్ణాంధ్రప్రదేశ్ అందించే వ్యూహం రచించానని చెబుతున్న ముఖ్యమంత్రి ఈ వివక్షనూ, అసమానతలనూ అంతం చేయడానికి ఆ వ్యూహంలో ఏమి చెప్పారో తెలుసుకోవాలన్న కుతూహలం ఉండడం సహజం. స్వర్ణాంధ్రప్రదేశ్‌లో అన్ని రకాల అసమానతలూ పోతాయని 'విజన్ 2020' పదేపదే అంటుంది కాబట్టి, ప్రాంతీయ అసమానతలు పోగొట్టడానికి అందులో ఏ ఆలోచనలు పొందుపరచబడ్డాయో చూడాలనుకోవడం సహజం.

తెలంగాణ, రాయలసీమ ప్రాంతాల ఉద్యమ ఆకాంక్షలు సాగునీటికి చాలా ప్రాముఖ్యం ఇచ్చాయి. సాగునీటితో అన్ని సమస్యలూ పోవు గానీ తీవ్ర దారిద్ర్యాన్ని తగ్గించవచ్చు. సాగునీటి ప్రాతిపదికన జరిగే అభివృద్ధికి కొంత విస్తృత ప్రాతిపదిక ఉంటుంది. కొద్దిమందికి ఎక్కువ ప్రయోజనం కల్పించడమే కాక ఎక్కువ మందికి కొంత ప్రయోజనం కూడ కల్పిస్తుంది. దానివల్ల ఎక్కువ మంది చేతిలో కొంత మిగులు ఉంటుంది. దానితో ఆ వర్గాలలోని మలితరం కొంతయినా చదువుకొని, సాంకేతికంగా పురోగమించిన జీవిత రంగాలలోకి ప్రవేశించగలదు. లేదా అది వర్తక, పారిశ్రామిక పెట్టుబడిగా మారగలదు.

కోసాంధ్ర జిల్లాల చరిత్ర ఈ వాస్తవాన్ని కళ్ళకు కట్టినట్టు చూపిస్తుంది. అయితే సాగునీరంటే నదీజలాలే కానవసరం లేదు. చెరువులు, బావులు కూడ సాగునీటి సాధనాలే. చెరువుల నిర్మాణానికీ, మరమ్మత్తుకూ, నిర్వహణకూ హేతుబద్ధమైన విధానం ప్రభుత్వం దగ్గర ఉండాలి. ఇప్పటిదాకా అటువంటిది ఏమీ లేకపోవడం తెలంగాణ, రాయలసీమలకు చాలా నష్టం కలిగించింది. ఎప్పుడో కాకతీయులూ కుతుబ్‌షాహీలూ విజయనగర రాజులూ అసఫ్‌జాహీలూ తవ్వించిన చెరువులే తప్ప కొత్తవేవీ లేకపోగా ఆ చెరువుల నిర్వహణ సహితం తీవ్రంగా నిర్లక్ష్యం చేయబడిన విషయాలలో ఒకటి.

స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనలో భాగంగానయినా చెరువు నీటివనరుల సంరక్షణ గురించి చంద్రబాబు ప్రభుత్వం ఏమైనా చెబుతుందేమోనని చూసినవారికి 'విజన్' నిరాశే కలిగిస్తుంది. కోట్ల పెట్టుబడి దిగుమతి చేసుకొని సాధించే కార్పొరేట్ అభివృద్ధి మీదే 'విజన్' దృష్టి అంతా.

చెరువుల తర్వాత బావుల కింద వ్యవసాయం తెలంగాణకూ, రాయలసీమకూ అతి ముఖ్యం. ఇందులో ప్రభుత్వం చేసేది ఏమీ లేదు – కరెంటు సరఫరా చేయడం తప్ప. ఇప్పటిదాకా కరెంటు సబ్సిడీ ఉండబట్టి బావుల కింద వ్యవసాయం ఈ రెండు ప్రాంతాలలోనూ బాగానే విస్తరించింది. గ్రామీణ జీవితం రూపురేఖలను కొంతమేరకు అది మార్చగలిగింది. కానీ ఇది ఎక్కువ రోజులు నిలిచేటట్టు లేదని 'విజన్' వైఖరి చూసినా, విద్యుత్ బోర్డు పునర్వ్యవస్థీకరణ చూసినా తెలుస్తుంది. అభివృద్ధికి అవసరమైన రోడ్లు, రైల్వేలైన్లు, ఓడరేవులు, కరెంటు మొదలయిన నిర్మాణపరమైన వ్యవస్థలను పెంపొందించడం మాత్రమే ప్రభుత్వం బాధ్యత అనీ, దాని కోసం పెద్దఎత్తున పెట్టుబడులు ఆహ్వానించాలని 'విజన్' దృక్పథం ఎంతగా చెబుతుందో, ఈ

నిర్మాణాలకయ్యే ఖర్చు, నిర్వహణ వ్యయం వాడకందారుల ముక్కు పిండి వసూలు చేయాలని కూడ అంతే గట్టిగా చెబుతుంది. ప్రభుత్వం విద్యుచ్ఛక్తిని రైతులందరికీ శాశ్వతంగా చవగ్గా సరఫరా చేయాలని నేననడం లేదు. అందరికీ చేయనక్కరలేదు గానీ సాగునీటి విషయంలో తీవ్రమైన లేమి అనుభవిస్తున్న ప్రాంతాలలోని సామాన్య రైతాంగానికి ఇవ్వడం అవసరం. సమంజసం కూడ. దీనికి కూడ తావు లేకుండా చేసే 'విజన్' వైఖరి తెలంగాణ, రాయలసీమలకు చాలా అన్యాయం చేస్తుంది. ఈ ప్రాంతాల అభివృద్ధిని 20 ఏళ్లు వెనక్కి తీసుకుపోతుంది. వీరికి సబ్సిడీ ఇవ్వడం కోసం అభివృద్ధి చెందిన ప్రాంతాల రైతుల నుండి (ఇక్కడి భూస్వాముల నుంచి కూడ) పూర్తి కరెంటు ఛార్జీ వసూలుచేసినా అభ్యంతరం చెప్పనవసరం లేదు. (కాల్దారి రైతాంగ పోరాటం పేరిట గోదావరి డెల్టా రైతులకు సైతం కరెంటు సబ్సిడీ కొనసాగించాలని వాదించిన వారికి ఇది నచ్చకపోవచ్చుగాక. ఆ వైఖరి మొత్తంగానే సబ్సిడీల ఎత్తివేతకు మార్గం సుగమం చేస్తుంది.)

నిజానికి సాగునీటి విషయంలో దేశంలో అతికొద్ది రాష్ట్రాలకున్న సంపద మన రాష్ట్రానికి ఉంది. సాగునీటి వనరులను సక్రమంగా, సమదృష్టితో వాడుకుంటే ప్రతి ఒక్క ఎకరం సాగుభూమికి ఒక పంటకు సాగునీరు అందించవచ్చునని మన రాష్ట్రం గురించి అంచనా. కానీ ఇన్నేళ్ళ అభివృద్ధి ఇచ్చిందేమిటంటే కొన్ని ప్రాంతాలకు రెండు, మూడు పంటలకు నీళ్ళు, కొన్ని ప్రాంతాలకు ఒట్టి వర్షం నీళ్ళు. చెరువుల నిర్వహణ పట్ల ఇప్పటికీ ఏ మాత్రం పట్టింపు చూపించని ప్రభుత్వ భవిష్యదర్శిని వైఖరి, బావినీళ్ళ వాడకానికి అత్యవసరమైన కరెంటు సబ్సిడీ పట్ల ఆ దర్శిని ప్రదర్శించే వ్యతిరేక వైఖరి ఈ అసమానతను తీవ్రంగా పెంచుతాయే తప్ప తగ్గించవు.

పోనీ నదీజలాల వాడకం విషయంలో సమదృష్టి ఏమైనా పెరిగిందని 'విజన్' చూపిస్తుందా? ఇప్పటికే ఈ విషయంలో జరిగిన అన్యాయం గురించి కొత్తగా చెప్పనవసరం లేదు. గోదావరిలో కావలసినన్ని నీళ్ళున్నా మన పాలకులు దానిని సాగునీటి కోసం వాడడంలో పెద్దగా ఆసక్తి చూపలేదు. దీనివల్ల ఉత్తర తెలంగాణ జిల్లాలు తీవ్రంగా నష్టపోయాయి. కృష్ణానదిలో అవసరం కంటే బాగా తక్కువ ఉన్న నీళ్ళను వాడే విషయంలోనూ మన రాష్ట్రంలో చాలా అన్యాయం జరిగింది. వర్షపాతం సాపేక్షంగా సమృద్ధిగా ఉన్న ప్రాంతాలకే కృష్ణానది నీళ్ళు మొదట లభించాయి. సరే, అది బ్రిటిష్ హయాంలోననుకుందాం. కానీ తెలుగువాళ్ళందరి కోసం విశాలాంధ్ర నినాదంతో ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత కృష్ణానదిపైన నిర్మించిన మొదటి ప్రాజెక్టు

కూడ ప్రధానంగా ఆ ప్రాంతానికే మళ్ళీ నీళ్ళిచ్చింది. రాయలసీమ, దక్షిణ తెలంగాణ ప్రాంతాలు (కృష్ణానది మీద ఆధారపడక తప్పని ప్రాంతాలు) నీళ్ళడిగేసరికి ఆ నదిలో మిగుల జలాలే తప్ప నికర జలాలు లేవన్నారు.

నదీజలాల ప్రాజెక్టులలో ఇప్పటికే కేంద్రం అనుమతి పొందిన వాటి జాబితా, అనుమతి కోసం ప్రయత్నం చేస్తున్న వాటి జాబితా 'విజన్ 2020'లో ఇచ్చారు. రాయలసీమవాసులు గొంతెండిపోయేలా ఆందోళన చేస్తున్న హంద్రీ-నీవా, గాలేరు-నగరి ప్రాజెక్టులు ఈ రెండు జాబితాలలోను లేవు. ఎందుకని అడిగితే అవి మిగులు జలాల ప్రాజెక్టులని జవాబు చెబుతారేమో! కానీ కృష్ణాడెల్టా స్థిరీకరణ కోసం ఉద్దేశించిన పులిచింతల కూడ మిగులు జలాల ప్రాజెక్టే. కాని దానిని మిగులు జలాల ప్రాజెక్టుగా కాక, కృష్ణా డెల్టాను ఆధునీకరించడం వల్ల మిగిలే తొమ్మిది టియంసిల నికర జలాలు ఉపయోగించుకునే ప్రాజెక్టుగా చూపించి ఇప్పటికే కేంద్రం అనుమతి కూడ సంపాదించేశారు.

ఈ అబద్ధం ఒకవేళ నిజమే అయితే – అంటే ఆ తొమ్మిది టియంసిల నీరు కృష్ణా డెల్టాను ఆధునీకరించడం వల్ల మిగిలే నికరజలాలే అయితే ఆ నీటిని ఇప్పటికే కృష్ణా జలాలు అత్యధికంగా వాడుకుంటున్న కృష్ణా, గుంటూరు జిల్లాల ఆయకట్టు స్థిరీకరణ అనే లగ్జరీ కోసం వాడకుండా నది పైభాగాన శ్రీశైలం దగ్గరే ఆపేసి నల్లగొండకు నీరిచ్చే శ్రీశైలం ఎడమ కాలువ ప్రాజెక్టులో పారించవచ్చు గదా? ఆ రకంగా శ్రీశైలం ఎడమ కాలువకు కొంతయినా నికర జలం అందించవచ్చు కదా? మిగులు జలాన్ని నికర జలంగా చూపించి అబద్ధం చెప్పి పులిచింతలకు ఆమోదం తేగల వాళ్ళు మరో అబద్ధం చెప్పి (హంద్రీ అనే నదిలో చాలా నీళ్ళున్నాయనీ, గాలేరు అనేది జీవనది అనీ చెప్పి) హంద్రీ-నీవాకు, గాలేరు-నగరికి కూడ కేంద్రం అనుమతి తీసుకురావచ్చు కదా!

ఇవేవీ చేయబోవడం లేదనీ, నదీజలాల వాడకం విషయంలో స్వర్ణాంధ్రప్రదేశ్‌లో కొత్త ఏమీ లేదనీ 'విజన్ 2020' చెబుతుంది. అయినప్పటికీ అది స్వర్ణాంధ్రప్రదేశ్ ఎలా అవుతుందో చంద్రబాబునాయుడుకే తెలియాలి.

సాగునీటి విషయంలో కొత్త ఏమీ లేకపోగా ఇప్పటిదాకా బావులకూ, బోర్లకూ అందించిన కరెంటు సబ్సిడీ సైతం తీసేయబోయేటట్టయితే మరి తెలంగాణ రాయలసీమల వ్యవసాయ అభివృద్ధి గురించి 'విజన్ 2020' ఏం చెబుతుంది?

ఏమీ చెప్పకుండా పోలేదు. కానీ ఏం చెప్పిందో చదివిన తర్వాత ఏమీ చెప్పకుండా ఆ ప్రాంతాల రైతులను వారి పాటికి వారిని వదిలేస్తేనే బాగుండేదేమోనన్న సందేహం రాకమానదు. మెట్ట భూములను మాగాణిగా మార్చే పథకమేదీ లేని 'విజన్' మెట్ట భూములలోకి పెట్టుబడిని భారీగా ఆకర్షించే మార్గాన్ని మాత్రం అన్వేషిస్తుంది. తెలంగాణ మొక్కజొన్న సాగుకు అనువైన ప్రాంతమనీ, రాయలసీమ పళ్ళ తోటలకు అనువైన ప్రాంతమనీ, రెండు ప్రాంతాలూ పశుపోషణకు అనువైన పచ్చికబయళ్ళు విస్తారంగా కలిగి ఉన్నాయనీ 'విజన్' గుర్తించింది. మొక్కజొన్న కోళ్ళ దాణాగా ఉపయోగపడుతుందనీ, పళ్ళ తోటలున్న చోట ఫ్రూట్ జ్యూస్ పరిశ్రమ బాగా అభివృద్ధి చెందగలదనీ, పచ్చిక బీళ్ళున్న చోట పాల ఉత్పత్తుల పరిశ్రమ వర్ధిల్లగలదనీ కూడ 'విజన్' గుర్తించింది. కాబట్టి ఆ మూడు పరిశ్రమలకూ ముడిసరుకు సరఫరా చేసే రంగాలుగా తెలంగాణ, రాయలసీమల వ్యవసాయ క్షేత్రాలను 'విజన్' అర్థం చేసుకుంటుంది.

దీనివల్ల 'అభివృద్ధి' రానే రాదని అనలేం. గ్రామీణ ప్రాంతాల స్థలాల ఆదాయం పెరుగుదల రేటు కొంతకాలం మెరుగుపడవచ్చు. (ఆపైన కోళ్ళ పరిశ్రమ, ఫ్రూట్ జ్యూస్ పరిశ్రమ, పాల ఉత్పత్తుల పరిశ్రమ దేశీయ విదేశీయ మార్కెట్‌లలో ఎదుర్కొనే ప్రతి సంక్షోభానికీ ఈ అభివృద్ధి కూడ గురికాగలదు.) కానీ ఈ అభివృద్ధికి స్థిరత్వం లేకపోవడమే కాదు, విస్తృతి ఉండదు. ఆయా రంగాలలో పెట్టుబడి పెట్టే కంపెనీలతో రైతాంగం అమ్మకం, కొనుగోలు సంబంధాలు పెట్టుకొని వారి కనుసన్నలలో బతకాలి. ఇక మీదట ప్రభుత్వ బ్యాంకులూ, పరపతి సంఘాలూ పెట్టుబడి రుణాలను ఎక్కువగా ఇవ్వవు కాబట్టి రైతాంగం తీర్చలేకపోతే తమ భూములు వారికే లీజుకిచ్చుకొని కూలి చేసుకొని బతకాలి.

మెట్టసాగును పెట్టుబడితో ముడిపెట్టజూసే ఈ 'విజన్ 2020' అభివృద్ధి పథం తెలంగాణ, రాయలసీమల గ్రామీణ జీవితాలకొక వికృత రూపం ఇస్తుంది. కొద్దిమంది విపరీతంగా ప్రయోజనం పొందగలరు. కాని వారంతా స్థానికులే కానవసరం లేదు. కొంతమంది కొంత పొందుతూ కొంత పోగొట్టుకుంటూ అస్థిరంగా కొట్టుమిట్టాడుతూ బతుకుతారు. మెజారిటీకి మాత్రం ఈ వ్యూహం ఏమీ ఇవ్వదు. కనీసం కూలి చేసుకునే అవకాశం కూడ కల్పించదు. మొక్కజొన్న చేలు, పళ్ళతోటలు, పచ్చికబీళ్ళు ఎంతమందికి ఎన్ని దినాలు పని కల్పిస్తాయి?

**ఆంధ్రప్రభ దినపత్రిక**
**15 ఏప్రిల్ 1999**

# మళ్ళీ రైతుల ఆత్మహత్యలు

రైతుల ఆత్మహత్యలు మళ్ళీ వార్తలలో తరచుగా కనిపిస్తున్నాయి.

ఇప్పటిదాకా మెదక్ జిల్లాలో ఎక్కువ జరిగినట్టున్నాయి. చనిపోయిన వారి కుటుంబాలతో మాట్లాడితే వర్షాభావం ప్రధాన హేతువుగా కనిపిస్తుంది. కానీ అదే నిజమయితే ఆత్మహత్యల సంఖ్య ఈ మధ్య కాలంలోనే పెరగవలసిన అవసరం లేదు. వర్షాభావం రైతులకు – అందులోనూ తెలంగాణ రైతులకు – కొత్త కాదు.

సంప్రదాయక పంటలు వేసిన రోజులలో – పోతే వేసిన గింజలు పోతాయి, వస్తే నాలుగు గింజలు మిగులుతాయి అనే పరిస్థితి ఉండేది. ఆ బతుకులో ఆశకు తావు లేదు. ఆత్మహత్యలకు హేతువు లేదు.

అయితే అట్లాగే బతికితే ఒక తరానికీ రెండవ తరానికీ తేడా ఏమీ ఉండదు. పెద్దలు చేసిన గొడ్డు చాకిరీయే పిల్లలూ చేస్తారు, వాళ్ళ పిల్లలూ చేస్తారు. వాళ్ళు బతికినట్టే వీళ్ళూ బతుకుతారు... 'అభివృద్ధి' అనేది తెలియనప్పుడు ఎన్ని తరాలైనా ఇట్లాగే బతికారేమో గానీ ఆ భావనతో పరిచయం ఏర్పడిన తరువాత అదింక సాధ్యం కాదు.

దురదృష్టమేమిటంటే అభివృద్ధి అనే దానిమీద కోరిక పుట్టిన రైతాంగానికి అందుబాట్లో ఉండే అభివృద్ధికి ఒక నిర్దిష్టమైన రూపం ఉంది. దానిని కేవలం 'బూర్జువా అభివృద్ధి' అనలేం. బూర్జువా అభివృద్ధికి సాధారణంగా ఉండే అవలక్షణాలకు మరికొన్ని అవలక్షణాలు వచ్చి చేరగా రూపం తీసుకున్న అభివృద్ధి ఇది. స్థిరమైన సాగునీటి వనరుల లేమి, అదుపులేని ఎరువుల, మందుల ధరలు, భరోసాలేని వాటి నాణ్యత, 'పెద్ద కులాల' వారికి తప్ప ఇతరులకు సులభంగా అప్పుపుట్టని ఆర్థిక జీవితం, ఎప్పుడొస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని కరెంటు, చిన్న రైతులకు పనికి రాకండా

పోతున్న గ్రామీణ బ్యాంకుల వ్యవస్థ, గిట్టుబాటు ధరకు పంట కొనుక్కోవడానికి ముందుకు రాని ప్రభుత్వ మార్కెటింగ్ సంస్థలు మొదలయినవన్నీ కలిసి తెలంగాణలో చిన్న రైతుల చావుకొచ్చింది. ఆశపడడానికి సహితం ఈ మాత్రం అవకాశం లేని కారణంగా కాబోలు రాయలసీమలో రైతులకు అభివృద్ధీ లేదు, ఆత్మహత్యలూ లేవు.

జొన్నలు తిని జొన్నలు ఏరిగి బతకకుండ పత్తి మీదికి మనసెందుకు పోవాలని వాళ్ళనే తిట్టొచ్చు. వాన కురవకపోతే చంద్రబాబు నాయుడేం చేస్తాడని దబాయించవచ్చు. అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకునే పిరికితనానికి సానుభూతి కూడానా అని వెక్కిరించవచ్చు.

ఎన్ని వ్యాఖ్యలయినా చేయొచ్చు గానీ ఒక సత్యాన్ని ఎవ్వరూ కాదనలేరు. కొంచెం బాగుపడదామని ఆశపడే రైతు అప్పుల సుడిగుండంలో ఇరుక్కునే 'రిస్క్' తీసుకోక తప్పని పరిస్థితి ఈ రోజు ఉంది. చెప్పుకోవలసిందేమిటంటే ఇది ఎంత మాత్రం 'అనివార్యం' కాదు, 'సహజం' కాదు. ఇదొక అభివృద్ధి నమూనా పర్యవసానం. ఏవో కాల్పనిక ప్రత్యామ్నాయాలను దృష్టిలో పెట్టుకొని ఈ మాటలు అనడం లేదు. ఏ కష్టాలూ ఏ సంక్షోభం లేకుండా ఒకరి అభివృద్ధి అందరి అభివృద్ధిగా సమాజం సమిష్టిగా పురోగమించే చిత్రం కల్పన అనే ప్రస్తుతానికి అనుకుందాం. ఎందుకంటే దానిని నిర్మించే మార్గం తమకు తెలుసుననుకున్న వారు ఈ శతాబ్దంలో ఘోరంగా భంగపడ్డారు. కానీ దాని అర్థం ఆ ఆదర్శం చచ్చిందనీ కాదు, పెట్టుబడిదారీ నమూనాకు అందరూ ఇంక దాసోహమనాలనీ కాదు, దానిని మరింత వికృతంగా తయారుచేసే నైసర్గిక, సాంఘిక, చారిత్రక పరిస్థితులకు దాసోహమనాలని అంతకంటే కాదు.

ఒక ప్రభుత్వమనేది లేకపోతే మనుషులు ఒకరి ప్రాణాలనూ ఆస్తినీ మరొకరు దోచుకుంటారని చెప్పి 'ప్రభుత్వం' ఏర్పడిందని ఒక సిద్ధాంతం ఉంది. అది నిజమో కాదో కానీ ప్రభుత్వం అనేది ఏర్పడిన తరువాత మనుషులు ఒకరి శ్రమనూ ఆత్మగౌరవాన్నీ స్వేచ్ఛనూ మరొకరు దోచుకోకుండా అదుపు చేసే బాధ్యత దానిపైన ఉందన్న అభిప్రాయం ఉనికిలోకి వచ్చింది. ప్రచారమయ్యింది. అనేక రకాల అసమానతలు రాజ్యం ఏలుతున్న మన సామాజిక పరిస్థితులలో ప్రభుత్వం ఈ బరువు స్వీకరించడం చాలా అవసరం.

అదేమీ తనకు లేదని ప్రభుత్వం అనుకోవడం తెలంగాణలో జరుగుతున్న రైతుల ఆత్మహత్యలకొక ముఖ్య కారణం అని రెండేళ్ళనాడు పెద్ద సంఖ్యలో జరిగిన

ఆత్మహత్యలపైన పరిశోధన జరిపిన వారందరూ అన్నారు. పెట్టుబడిదారీ అభివృద్ధిలో రైతులు పాల్గొనాలనీ, పాల్గొని తాము బాగుండడమే కాక రాష్ట్ర వ్యవసాయరంగం పెరుగుదల రేటును పెంచాలనీ కోరుకోవచ్చు. కానీ అందులో పాల్గొనాలంటే రైతులకు పెట్టుబడి కావాలి. పరిస్థితులు ఎప్పుడూ ఒకలాగ ఉండవు కాబట్టి రైతు ఎక్కడికీ పారిపోడు లెమ్మన్న భరోసాతో అప్పులిచ్చే వాళ్ళు కావాలి. ప్రైవేట్ ఫైనాన్షియర్లు ఆ పనిచేయరు కాబట్టి ప్రభుత్వ బ్యాంకులు ఆ పాత్ర నిర్వహించాలని 30 ఏళ్ళనాడు అనుకున్నాము. అందుకోసమే బ్యాంకులను జాతీయం చేస్తున్నామన్నారు.

పెట్టుబడి పెట్టి పత్తిలాంటి వ్యాపార పంటలు పండిస్తే గిట్టుబాటయ్యే ధర పలకాలి. మార్కెట్ పరిస్థితులు అందుకు అనుకూలంగా లేకపోతే పంట కొనుక్కుని అవసరమైతే నిలవ ఉంచుకొని రైతులను బతికించే కొనుగోలు వ్యవస్థ ఉండాలి. ప్రైవేట్ కొనుగోలుదార్లు ఈ పని చేయరు కాబట్టి ప్రభుత్వ కొనుగోలు సంస్థలు ఈ పాత్ర నిర్వహించాలి.

'అభివృద్ధి'కి తోడ్పడే విలువైన పంటలు వేయాలంటే ఎరువులు, మందులు కావాలి. వాటి ధరలపైన, నాణ్యతపైన నియంత్రణ ఉండాలి. ఈ పని ప్రభుత్వం మాత్రమే చేయగలదు.

ఈ 'విలువైన' పంటలకు సాగునీరు కావాలి. ప్రాజెక్టులయితే రైతులు కట్టుకోలేరు. ప్రభుత్వమే ఆ పని చేయాలి. బావులకయితే అప్పులు ఇవ్వాలి, కనీసం పేద రైతులకు చవగ్గా కరెంటు ఇవ్వాలి. కరెంటు తగిన మోతాదులోనూ, రీతిలోనూ వచ్చేటట్టు చూడాలి. ఈ బాధ్యతలు ప్రభుత్వం నిర్వర్తిస్తేనే రైతులు 'అభివృద్ధి' బాటలోకి అడుగుపెట్టి చావకుండా బయటపడగలరు.

ఈ బాధ్యతల నుండి ప్రభుత్వం వెనక్కి తగ్గడం ఒక దశాబ్దకాలంగా చూస్తున్నాం. రైతుల ఆత్మహత్యల వెనక ఉన్న అనేక కారణాలలో అతి ముఖ్యమైనది ఇది.

చంద్రబాబు 'విజన్' ఈ వైఖరికి మరింత సంపూర్ణ రూపం ఇస్తుంది. రైతులనూ వ్యవసాయాన్నీ వ్యవసాయ ఉత్పత్తులతో వ్యాపారం చేసే కార్పొరేషన్లతో ముడిపెట్టి ప్రభుత్వం తప్పుకోవడం 'విజన్' ప్రతిపాదించే వ్యవసాయ విధానం. రైతులకు అప్పులిచ్చేదీ ఉత్పత్తులు కొనుక్కునేదీ ఆర్చేదీ తీర్చేదీ ఇక ఈ కార్పొరేషన్లే.

ఇంకా అంత దూరం పోకుండానే ఇన్ని ఆత్మహత్యలు చూస్తున్నాం. 'స్వర్ణాంధ్రప్రదేశ్'లో ఇంకెన్ని చూడనున్నామో!

**ప్రజాతంత్ర**

**23 జనవరి 2000**

# కార్పొరేట్ వాదనకు 'కలిసొచ్చే' కరువు

తమిళనాడులో టీ ఆకు పండించే చిన్న రైతులు, కాశ్మీర్‌లో ఊలు అమ్ముకొని బతికే గొర్రెల పెంపకందార్లు, హిమాచల్ ప్రదేశ్‌లో ఆపిల్ పళ్లతోటలు పెట్టుకున్న చిన్న రైతులు తమ భవిష్యత్తు గురించి చెందుతున్న ఆందోళన ఆయా రాష్ట్రాల పత్రికలు ప్రముఖంగానే రాస్తున్నాయి. ఊలుకూ ఆపిల్ పళ్లకూ తేయాకుకూ సంబంధమేమిటా అని ఆశ్చర్యపోవద్దు. ఒక సంబంధం ఉంది. మారుతున్న ప్రపంచ వాణిజ్య నియమాలను అనుసరించి దేశంలోకి పెద్దఎత్తున దిగుమతి అవుతున్న గ్రామీణ ఉత్పత్తులు ఇవి. ఇంకా ఇతర రాష్ట్రాలలో ఇటువంటి సరుకులనేకం ఉన్నాయి.

దిగుమతుల పోటీ వల్ల వీటి ధరలు పడిపోయి రైతులు గతంలో ఎన్నడూ లేనంతగా నష్టపోతున్నారు. ఒకవేళ దిగుమతులతో నాణ్యత విషయంలో మన రైతుల ఉత్పత్తులు పోటీ పడగలిగినా, 'మార్కెటింగ్'లో పోటీ పడలేరు. ఉత్పత్తులు ఎంత నాణ్యమైనవనేది కాదు, ఎంత సమర్థంగా వాటిని 'మార్కెట్' చేయగలరనేది అమ్మకాన్ని నిర్ణయిస్తుంది. ఈ 'మార్కెట్' చేయగలగడం అనేదాన్ని నిర్ణయించే విషయాలలో సరుకు నాణ్యత ఒకటి మాత్రమే.

అందుకే వ్యవసాయ ఉత్పత్తులలో కూడ స్వేచ్ఛా విపణిని ఏర్పాటు చేస్తే అది 'మన రైతులు కూడ ఉపయోగించుకోగల వ్యవస్థ' కాగలదనుకోవడం భ్రమ. కాని వ్యవసాయ ఉత్పత్తుల ప్రపంచీకరణను సమర్థించేవాళ్ల వాదన వేరు. ఆస్ట్రేలియా ఆపిల్ పళ్లు మన మార్కెట్‌లోకి వచ్చి కాశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్ ఆపిల్ తోటలు నష్టపోతే పోవచ్చునుగానీ, పంజాబు ఆలుగడ్డలు ఆస్ట్రేలియాకు ఎగుమతయి వాటిని పండించే రైతులు బాగా లాభాలు సంపాదించుకోగలరనీ, మొత్తం మీద వ్యవసాయంలో

అపారమైన అనుభవం ఉన్న మన రైతులే లాభాలు ఎక్కువ పొందగలరనీ రైతుల పట్ల సానుభూతిగలవారు సైతం వాదిస్తున్నారు.

అమ్మకపు మార్కెట్ల మీద ఆధిపత్యం నెలకొల్పే పద్ధతుల గురించి సరైన అవగాహన లేకపోవడం వల్ల కలిగే అభిప్రాయాలివి. వ్యవసాయ ఉత్పత్తుల ప్రపంచీకరణ నుండి మనం కూడ ప్రయోజనం పొందాలంటే ఇతర దేశాల మార్కెట్లలో ఎటువంటి ఉత్పత్తులకు గిరాకీ ఉందో తెలియాలి. అటువంటి ఉత్పత్తులు చేపట్టడానికి అవసరమయిన పెట్టుబడులు పెట్టగలగాలి. ఇతర మార్పులూ చేసుకోగలగాలి. ఉత్పత్తి అయిన సరుకును నిలువ ఉంచే పద్ధతిలో ప్యాకింగ్ చేసి రవాణా చేయగలగాలి. ఆకర్షణీయంగా ప్రచారం చేసి అమ్మగలగాలి. ఒక్కమాటలో చెప్పాలంటే వ్యవసాయంలో మెలకువలు తెలిస్తే చాలదు, 'అగ్రి బిజినెస్' తెలియాలి. పాశ్చాత్యదేశాలు మనం వాడే పురుగుల మందుల పైననో, ఎరువుల పైననో నెపం పెట్టి మన ఎగుమతులను అడ్డుకోకుండా ఉంటారనుకున్నా, అభివృద్ధి చెందిన వ్యవసాయ వ్యాపార వ్యవస్థ లేనిదే మన వ్యవసాయదారులు ఈ ప్రపంచీకరణ వల్ల ప్రయోజనం పొందలేరు.

అది నెమ్మదిగా అభివృద్ధి చెందుతుందనుకోవచ్చు. కానీ అంతవరకు ఆగితే చంద్రబాబు వంటి నాయకులు కోరుకునే విపరీతమైన పెరుగుదల రేట్లు ఎక్కడినుండి వస్తాయి? కాబట్టి ఈ లోపలే మన వ్యవసాయ ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లోకి ప్రవేశించాలంటే 'అగ్రి బిజినెస్'లో ఆరితేరిన విదేశీ కార్పొరేషన్లనే మళ్లీ ఆహ్వానించి మన భూములను మన రైతులను వారికి అప్పగించడానికి మన పాలకులు సిద్ధపడుతున్నారు.

అంటే విదేశీ కార్పొరేషన్లు చేసే వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతుల పోటీకి తట్టుకోలేక మన రైతులు పతనమైతే, ఎగుమతులు మనకు చేతకావు కాబట్టి తిరిగి అవే కార్పొరేషన్లను దేశంలోనికి ఆహ్వానించి వాటిద్వారా ఎగుమతులు చేసి మన రైతులు 'ప్రయోజనం' పొందాలి. రెండు వైపులా బహుళజాతి అగ్రి బిజినెస్ కార్పొరేషన్లకు మేలు చేసే విధానం ఇది.

దీని ఫలితంగా దిగుమతుల వల్ల మన రైతులు నష్టపోవడమే కాక ఎగుమతుల వల్ల వచ్చే లాభం కార్పొరేషన్ల జేబుల్లోకి పోతుందనేది ఒక్కటే మన బాధ కాదు. అగ్రి బిజినెస్‌తో ముడిపడిన ఎగుమతి  రంగంలోకి ప్రవేశించే రైతుల జీవితాలు చాలా అభద్రంగా ఉంటాయనేది కూడ చాలా ఆందోళన కలిగించే విషయమే. పెట్టుబడి

పెట్టిన తరువాత ఆ పంటకు ఆ సంవత్సరం అంతర్జాతీయ మార్కెట్‌లో గిరాకీ లేదని ఆ కంపెనీ కొనుక్కోకపోవచ్చు. రైతుల దగ్గర మిగిలిపోయిన పంటను కొనుగోలు చేసి భద్రపరిచి తిరిగి మార్కెట్‌లో గిరాకీ ఉన్నప్పుడు అమ్ముకునే ప్రభుత్వ మార్కెటింగ్ సంస్థలు ఇకమీదట ఉండబోవని మన పాలకులు స్పష్టం చేస్తున్నారు కాబట్టి ఆ రైతుల గతేం కావాలి?

లేదా ఈ సంవత్సరం లాగ కరువు తీవ్రంగా వచ్చిందనుకోండి. ఈ సంవత్సరం గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాలలో జిల్లాలకు జిల్లాలే తరలిపోయిన రైతుల భూములు ఏ అగ్రి బిజినెస్ కంపెనీతోనో ముడిపడిన భూములనుకోండి. మెట్టపంటలకు కూడ ఆ భాగ్యం కలిగిస్తామని మన పాలకులు అంటున్నారు కాబట్టి ఇందులో ఊహకందనిది ఏమీ లేదు. ఈ సంవత్సరం వారు ఆ కంపెనీ నుండి అప్పుచేసి లేదా అడ్వాన్స్ కింద తెచ్చుకున్న పెట్టుబడిని కోల్పోవడమే కాదు, వచ్చే సంవత్సరం వానలు బాగా కురిసినా తిరిగి పంట వేయడానికి వారికి పెట్టుబడి దొరకడం కష్టం. కాబట్టి వారితో వ్యాపార సంబంధమే తప్ప వేరే ఏ సంబంధం లేని కంపెనీ ఇంక వీరితో లాభం లేదని వేరే ఎక్కడో తనకు కావలసిన సరుకు నిచ్చే రైతులను వెతుక్కుంటుంది. వీళ్ల పాత బాకీ ఉండిపోతుంది. గిరాకీ తరలిపోతుంది. తిరిగి మళ్లీ ఒక కొనుగోలుదారును వెతుక్కొని స్థిరపడాలంటే ఒక కరువు కాదు, రెండు కరువులు దాటాలి. 'అగ్రి బిజినెస్'తో వ్యవసాయాన్ని బంధించే ప్రయత్నం మరీ ఇంత దూరం సాగకముందే పత్తి రైతుల ఆత్మహత్యల వార్తలు విరివిగా వింటున్నాం. ఇంక రేపేం కానుందో! ఈ చిత్రం మన పాలకుల ఊహలకు అందకపోలేదు. అందుకే రైతులను అగ్రి బిజినెస్‌తో ముడిపెట్టే ఈ అస్థిరమైన వ్యవస్థ కంటే, కంపెనీలే రైతుల భూములు కొనేసి, లేక లీజుకు తీసుకొని వారిని కూలీలుగా పెట్టుకొని పని చేసుకునే ఏర్పాటు మంచిదని వారు అంటూనే ఉన్నారు.

ఈ 'ముందుచూపు' అందరి కంటే మొదట చంద్రబాబు ప్రదర్శించారు. రెండు మూడెకరాల రైతులను ఉండనిచ్చి, వారి చేతకాని వ్యవసాయాన్ని కార్పొరేషన్లతో ముడిపెట్టడం కంటే వారి భూములను కార్పొరేషన్లకే చేరవేసే ఏర్పాటు చేసేస్తే 'రాష్ట్ర ఆదాయం' మరింత వేగంగా పెరుగుతుంది కదా (అందులో చిన్న రైతుల ఆదాయం తగ్గితే తగ్గిందిగాక) అని ఆయన 'విజన్ 2020' రాయించిన నాటి నుండి అంటున్నారు. 'చిన్న వ్యవసాయాలు దండగ' అని కూడ చాలా ఉధృతంగా ప్రచారం చేస్తున్నారు.

అంతేకాదు, ఈ దండగమారి చిన్న రైతుల కమతాలను వ్యవసాయ వ్యాపారం చేసే పెద్ద రైతులకు, లేక కంపెనీలకు బదలాయించే అవకాశం లేకుండా చేసే భూసంస్కరణల చట్టాలను సవరించాలనీ అంటున్నారు.

నిన్నగాక మొన్న అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ కూడ ఈ మాటే అంది. భారతదేశంలో పేదరికం తొలగకపోవడం విచారకరం అని అంతర్జాతీయ ద్రవ్యనిధి అన్నదని పత్రికలలో చదివి అందరూ ఆశ్చర్యపోయే ఉంటారు. అయితే ఈ వార్తను తరచి చదివితే ఆ సంస్థ దృష్టిలో ప్రధానమైన అభ్యంతరమేమిటో అర్థం అవుతుంది. 'కమతాల పరిమాణంపైన ఉన్న పరిమితులను సడలించలేకపోవడం' ఒక అవరోధమనీ, 'కార్మికుల తొలగింపుపైన ఉన్న నియంత్రణను సడలించలేకపోవడం మరొక అవరోధమనీ' అంతర్జాతీయ ద్రవ్యనిధి అన్నది. మామూలు మాటలలో చెప్పాలంటే భూసంస్కరణ చట్టాలను రద్దు చేయాలి, కార్మిక చట్టాలను 'సరళతరం' చేయాలి.

ఈ సంవత్సరం దాదాపు దేశవ్యాప్తంగా నెలకొన్న కరువును కూడ ఈ సూచనలకు బలం కలిగించడానికి వీరు వాడుకోగలరు. కరువెప్పుడొచ్చినా పేద రైతులు భూములమ్ముకొని పోవడం దానికి గల ఒకానొక ఫలితంగా ఉంటున్నది. ఆ భూమిని మరొక పేద రైతు కొనుక్కుంటే పరిస్థితిలో ఏ మార్పూ రాదనీ, పెద్ద రైతులు కొనుక్కోవడానికి సీలింగ్ చట్టాలు అడ్డమున్నాయనీ, కార్పొరేషన్లే గనక ఊర్లు ఖాళీచేసి పోతున్న దిక్కుమాలిన రైతులందరి భూములనూ కొనేసుకోగలిగితే, సీలింగ్ చట్టం దానికి అడ్డం రాకుండా ఉంటే గుజరాత్‌లోగానీ రాజస్థాన్‌లోగానీ ఇంకొకసారి ఎప్పుడూ కరువు రానంత అభివృద్ధి వచ్చేసేదని ఈ సంవత్సరం తిరిగే లోపల మేధావులు వాపోబోతారని కచ్చితంగా చెప్పగలం. చాలామంది అవుననబోతారని కూడ చెప్పగలం.

**ఆంధ్రప్రభ దినపత్రిక**
**27 ఏప్రిల్ 2000**

# ఈ కరువు మళ్లీ వస్తుంది జాగ్రత్త

కరువు ఈ సంవత్సరం పెద్దఎత్తునే వచ్చింది. గుజరాత్, రాజస్థాన్ దృశ్యాలు హృదయవిదారకంగా ఉన్నాయి.

కరువొచ్చినప్పుడు చర్చ తక్షణ ఉపశమన చర్యల మీదనే ఎక్కువ ఉంటున్నదనీ, దీర్ఘకాలిక నివారణోపాయాల మీద ప్రధానంగా దృష్టి పెట్టడం అవసరమనీ అంటుంటారు. ఈ మాటలు కూడా కరువొచ్చినప్పుడే అంటుంటారు.

అయినప్పటికీ అది కరెక్టే.

అయితే ఇంకొంచెం దూరం పోయి ఆలోచించవలసిన అవసరం కూడ ఉంది. కరువు నివారణకు దీర్ఘకాల నివారణోపాయాలు రూపొందించడానికి కావలసిన చోటు ప్రభుత్వ సామాజిక ఆర్థిక విధానాలలో ఉందా? ఒక సంవత్సరం కాకపోతే ఒక సంవత్సరం కరువొస్తుంటుంది కాబట్టి అటువంటి నివారణోపాయాలకు చోటు ఉండాలనేది సామాజిక ఆర్థిక విధానాల పునాది లక్షణాలలో ఒకటయి ఉండాలి కదా?

ప్రకృతి వనరులను, మానవ పరిశ్రమ వాటిలో తీసుకురాగల అభివృద్ధిని ఏ విధంగా చూస్తామనేది ఇక్కడ కీలకమైన ప్రశ్న. మనుషుల జీవనానికి ఆధారంగా చూస్తామా, లేక సామాజిక సంపద పెరుగుదలకొక సాధనంగా చూస్తామా? సామాజిక సంపద పెరుగుదలకు సాధనంగా చూసినప్పుడే అవి ఏదో ఒక రోజు అందరికీ జీవనాధారం కూడ కల్పించగలుగుతాయనీ, కేవలం జీవనాధారంగా చూస్తే అభివృద్ధికి నోచుకోక పెరుగుతున్న జనాభాకు జీవనాధారంగా కూడ సరిపోవనీ వాదించడం ప్రస్తుత అధికార అభివృద్ధి సిద్ధాంతం.

ఇది నిజమేనా? ప్రకృతిని పెట్టుబడికి వనరుగా మాత్రమే చూస్తూ 'ఏదో ఒకరోజు అభివృద్ధే అందరికీ తిండి పెడుతుంది' అని హామీ ఇవ్వడంలో గల సౌలభ్యం ఏమిటంటే ఆ 'ఏదో ఒక రోజు' ఎప్పుడొస్తుందో చెప్పలేకపోవడం, చెప్పవలసిన అవసరం లేకపోవడం. ఇప్పుడు మనవాళ్ల నమూనాలో ఆ అభివృద్ధికి పెట్టుబడి ప్రధానంగా బయటి నుండి రావాలి. దానికి మూల్యం సంపద తరలింపు రూపంలో చెల్లించుకోవాలి. ఆ బయటి పెట్టుబడిని ఆకర్షించడం కోసం ఇక్కడి పట్టణ ప్రాంత ఎగువ, మధ్య తరగతులలో విలాసవంతమైన జీవనశైలిని ప్రోత్సహించాలి. సంపద పెంచుకునే అవకాశాన్నీ, దాచుకునే అవకాశాన్నీ భద్రంగా కాపాడాలి. దీనికి కూడ ప్రకృతి చాలా మూల్యం చెల్లించాలి. 'అనివార్య'మైన ఈ అవాంతరాలను దాటి అభివృద్ధి ఏ రోజు పేదలకందరికీ అందుతుంది? కొందరికి కొంచెం కొంచెం అందుతూ ఉంటుంది. అది ఈ 'అభివృద్ధి'కి రాజకీయ పునాదిని ఒక మేరకు కల్పించడానికి మాత్రం పనికొస్తుంది.

ప్రకృతి వనరులను మనుషుల జీవనాధారంగా చూసినట్టయితే అభివృద్ధి శూన్యమైన జీవితమే శరణ్యమా? పెరుగుతున్న జనాభా వల్ల జీవన ప్రమాణాలు పడిపోకుండా కాపాడుకోవడంతోనే సరిపోతుందా? మనుషుల జీవనాన్నీ జీవితాన్నీ ప్రమాణంగా పెట్టుకొని అందరినీ ఒకే తాటి మీద ('ఏదో ఒక రోజు' కాకుండా) ముందుకు నడిపించే విధాన రచన కోసం 20వ శతాబ్దంలో కమ్యూనిస్టు పాలకులు చేసిన ప్రయత్నాలు విఫలమైన మాట సత్యమే కాని దానికి ఏ ప్రత్యామ్నాయమూ లేదా? కమ్యూనిస్టులు ఊహించుకునే భూలోక స్వర్గం కాకపోయినా కనీసం మానవీయత లక్షణంగా గల జీవితం సాధ్యం కాదా?

21వ శతాబ్దం ఈ అన్వేషణలో ఉంటుందని నేను అనుకుంటున్నాను. కానీ దానికి 'స్టార్టింగ్ ట్రబుల్' చాలా ఉంది. కమ్యూనిస్టు ప్రయోగం విఫలమయిందని కమ్యూనిస్టులు ఒప్పుకోరు. ఒక ప్రత్యామ్నాయం సాధ్యం కాగలదేమో చూద్దామని ఇతరులనుకోరు.

కరువు మాటకొస్తే, ఇప్పుడున్న అధికార దృక్పథం దీనికి ఏం జవాబు చెప్పగలదు? చిన్న కమతాల సేద్యానికి సెలవు చెప్పి, పెద్ద పెద్ద క్షేత్రాలలో పెట్టుబడిదారీ సేద్యాన్ని, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి దిగుమతులనూ ప్రోత్సహించాలనేది చంద్రబాబు

నుండి అటల్ బిహారీ దాకా ఇప్పుడు మన పాలకులందరి విధానం. ఈ విధానానికి కరువు నివారణతో ప్రత్యక్ష సంబంధమేమీ లేదు. కరువులు ఎప్పటిలాగే వస్తూనే ఉండవచ్చు. భూమిని పెట్టుబడికి వనరుగా చూడడం పెరిగే కొద్దీ భూవనరుల విధ్వంసం, భూగర్భజలాల దుర్వినియోగం ఎక్కువ జరిగి కరువులు మరింత ఎక్కువగా కూడ రావచ్చు.

అప్పుడు గ్రామీణ పేదలకు ఇప్పుడున్న పాటి భద్రత – రెండెకరాల రాళ్లకూ పుట్టలకూ తిండిలేని రెండెడ్లకూ యజమాని కావడం అనే భద్రత – ఉండదేమో. తిండి కోసం, నీళ్ల కోసం వలసలు ఇప్పటిలాగే జరుగుతుంటాయి. అయితే సంవత్సరానికో రెండేళ్లకో వర్షాలు పడి నేల పచ్చబడితే తిరిగి రావడానికి ఆ రెండెకరాల భూమి కూడ ఉండదు కాబట్టి ఏ పట్టణంలోనో రిక్షా తొక్కుకుంటూనో మూటలు మోస్తూనో జేబులు కత్తిరిస్తూనో ఉండిపోవచ్చు.

ఒక్క తేడా ఉంటుంది. ఇప్పుడింకా ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అనేదొకటి ఉంది. దాని గిడ్డంగులలో ధాన్యం ఉంది. కరువు కాలంలో ఆ ధాన్యం కరువు ప్రాంతాలకు పోగలదు. గంజి కేంద్రాలనైనా నడిపించగలదు. ఈ గిడ్డంగులను ఒక్కసారిగా మూసేసే ఆలోచనేదీ ఇప్పట్లో లేకపోవచ్చును గానీ నేల పచ్చగా ఉన్న రోజులలో ఈ గిడ్డంగులూ, వాటి కోసం మిల్లులపైన విధించే లెవీలూ స్వేచ్ఛా విపణికి ఆటంకం కలిగించే అసమర్ధపు పాత విధానాల అవశేషాలుగా కనిపిస్తాయి కాబట్టి 'ప్రభుత్వం ఇచ్చేది కాదు, అవకాశాలు కల్పించేది మాత్రమే'ననే ప్రస్తుత పాలక సిద్ధాంతం రాబోయే రోజులలో ఈ వ్యవస్థను క్రమంగానైనా క్షీణింపజేయదన్న నమ్మకమేమైనా ఉందా?

పదేళ్ల తరువాత మళ్లీ ఇటువంటి కరువొస్తే ఆ చిత్రం ఇంకా భయంకరంగా ఉంటుదేమో? ఈ ఊహ అయినా మన పాలకుల కళ్లు, మేధావుల కళ్లు కొంచెం తెరిపిస్తుందా? లేకపోతే డాలర్లు విరజిమ్మే వెలుగుల చీకట్లు ఈ చిత్రాన్ని కూడ కమ్మేస్తాయా?

**ప్రజాతంత్ర**

**30 ఏప్రిల్ 2000**

# కార్పొరేట్ సేద్యానికేనా జల 'సంరక్షణ'!

మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుగారికి కొన్ని ప్రాథమిక సత్యాలు కూడ చెప్పవలసి వస్తున్నది.

నీళ్లంటే ఆయన భూగర్భ జలాలేనని ఎందుకు అనుకుంటున్నారు? నీటిని జాగ్రత్త చేయడమంటే భూమిలోకి పంపించడమేనని ఎందుకు అనుకుంటున్నారు? చెరువంటే ఊట చెరువేనని ఎందుకనుకుంటున్నారు? నీళ్లు ఏ కొంచెం ఆవిరైనా ఏ కొంచెం సముద్రంలోకి పోయినా అది 'వృథా'యేనని ఎందుకు అనుకుంటున్నారు?

కురిసిన వర్షం కొంత నేల లోనికి ఇంకుతుంది. కొంత నేల మీద మట్టిలో నిలుస్తుంది. కొంత ఆవిరి అవుతుంది. కొంత సముద్రంలో కలుస్తుంది. సముద్రంలో కలిసినది మళ్లీ ఆవిరి అవుతుంది. ఆవిరి అయినది గాలిలో తేమ అవుతుంది. తిరిగి వర్షమవుతుంది. భూమిలోకి ఇంకినది తిరిగి నేలపైకి (మానవ పరిశ్రమ ఫలితంగా) వచ్చి నేలమీద మట్టిని తడుపుతుంది. మొక్కలకు, మనుషులకు ప్రాణం పోస్తుంది. తిరిగి మట్టి నుండి, మొక్కల నుండి, మనుషుల ఒంటిమీది స్వేద బిందువుల నుండి ఆవిరి అవుతుంది. మళ్ళీ వర్షమవుతుంది.

ఇదొక 'సైకిల్'. దీనిని ఎక్కడో ఒకచోట తెంపేస్తే ఏమవుతుందో చెప్పడం కష్టం. ప్రపంచంలోని మనుషులంతా ఒక్క మనసుతో ప్రతీ వర్షం నీటి చుక్కనూ నేలలోకి తొక్కేసి ఆవిరి కాకుండా, సముద్రంలో కలవకుండా చేసేస్తే సముద్రాలు ఏమవుతాయో, చేపల వంటి సముద్ర జీవులేమవుతాయెూ, గాలిలో తేమ తగ్గిపోయి ఋతుపవనాలేమవుతాయో చెప్పడం అంత సులభం కాదు. మానవ మనుగడపైన దాని ప్రభావం ఎలా ఉంటుందో కూడ చెప్పడం కష్టం. భగ్నమయిన వాతావరణ

సమతుల్యాన్ని పునరుద్ధరించే ప్రయత్నంలో భాగంగా వాటర్‌షెడ్లకు సంబంధించిన ఆలోచన పుట్టింది. వ్యవసాయాన్ని ప్రకృతిపైన దాడిగా భావించే కార్పొరేట్ పెట్టుబడిదారీ దృక్పథానికి దానిని అనుసంధానం చేయాలని చంద్రబాబు నాయుడు ప్రయత్నిస్తున్నాడు. వాటర్‌షెడ్ల ద్వారా భూగర్భ జలాలను పెంపొందించాలనీ, ఒక్క చుక్కనీరు కూడ ఆవిరి కాకుండా, సముద్రంలోకి పోకుండా భూగర్భ జలాశయంలోకి పోవాలనీ ఒక పక్క అంటాడు. అదే సమయంలో పాశ్చాత్య ఆగ్రోబిజినెస్ కంపెనీలను రాష్ట్రంలోకి ఆహ్వానించి, వారి ఎగుమతి దిగుమతి వ్యాపారానికి రాష్ట్ర వ్యవసాయరంగాన్ని కార్యక్షేత్రంగా మలచే వ్యవసాయ విధానాన్ని ప్రకటిస్తాడు. ఆ ఆగ్రోబిజినెస్ కంపెనీలు ఏం చేస్తాయి? విపరీతంగా నీళ్లు తాగే కొత్త వంగడాలను విస్తారంగా పండించి, లేదా రైతుల చేత పండింపచేసి ఎగుమతి చేస్తాయి. ఇప్పుడు రాష్ట్రంలోని కరువు ప్రాంతాలలో 300 అడుగుల లోతుకు (రాయలసీమలో కొన్ని చోట్ల 500 అడుగులదాకా) బోర్లు వేస్తున్నారు. చంద్రబాబు ఆహ్వానిస్తున్న కార్పొరేషన్లు ఇంకొక 100, 200, 300 అడుగుల లోతుకు బోర్లు వేసి అయిదేళ్లు కష్టపడి కాపాడిన వాటర్‌షెడ్ ఫలితాన్ని ఒక కారు పంట కోసం పీల్చేయగలవు.

అప్పుడేమి చేయాలంటే ఇంకా ఇంకా చెట్లు పెంచాలి. ఎక్కడ ఖాళీ జాగా దొరికితే అక్కడ చెట్లు పెంచి వర్షం ఇంకా బాగా పడేటట్లు చూడాలి. అలా పడిన వర్షమంతా భూగర్భ జలాశయంలోకి పోయేటట్టు చూడాలి. మళ్లీ లోతుగా బోర్లు వేసి ఆ నీటినంతటినీ ఒక రివర్స్ జలపాతంలాగా పైకి లాగేసి, విపరీతంగా నీళ్లు తాగే ఎగుమతి బ్రాండు వ్యవసాయ ఉత్పత్తులు చేపట్టి, కార్పొరేషన్ల ద్వారా ఎగుమతి చేసి...

ఆధునీకరణ ఉన్మాదం ఇది. ఆధునీకరణ వల్ల దెబ్బతిన్న పర్యావరణాన్నీ, నేలకింద ఉన్న నీటి వనరులనూ, నేలమీది మట్టినీ చెట్లనూ కాపాడి ప్రకృతికీ మనిషికీ స్నేహ సంబంధాన్ని పునరుద్ధరించడం కోసం పుట్టిన పర్యావరణ పరిరక్షణ ఉద్యమాన్ని – అందులో భాగమైన జల సంరక్షణ ఉద్యమాన్ని – అదే ఉన్మాదానికి బలిపెట్టే వ్యవసాయ విధానం చంద్రబాబుది.

నీళ్లంటే భూగర్భ జలాలు మాత్రమే కాదు. ఉపరితల జలాలు కూడ. నీటితో మనిషికి స్నేహ సంబంధమున్న రోజులలో రెండింటినీ సమతూకంగా వాడుకున్న సమర్థమైన సాగునీటి వ్యవస్థ ఉండేది. తెలంగాణలోనూ, రాయలసీమలోనూ చక్కటి చెరువుల వ్యవస్థ ఉండేది. చెరువులు ఇప్పటికీ ఉన్నాయిగానీ అవి చాలావరకు

శిథిలమయి ఉన్నాయి. ఉన్నమేరకు 'వ్యవస్థ'గా లేవు. ఒక చెరువు అలుగు పారితే మరో రెండు చెరువులలోనికీ, వాటి అలుగులు పారితే ఇంకొక మూడు చెరువులలోనికీ నీరు చేరే వ్యవస్థ ఉండేది. ఇప్పుడు చెరువులన్నీ పూడిపోయి క్రికెట్ మైదానాలలాగా ఉన్నాయి. కట్టలు పాడయి, నిలిచిన కొద్దినీరు అలుగు మీద నుండే కాక కట్ట కింది నుండి కూడ పలుదిక్కుల ప్రవహిస్తున్నాయి. అలుగు పారిన నీటిని కింది చెరువులోకి చేర్చే కాలువలు పాడవడం వల్ల నీరు అస్తవ్యస్తంగా ప్రవహించి కింది చెరువులలోకి చేరడం లేదు.

యాభై ఏళ్లుగా ఈ చెరువుల గురించి పట్టించుకున్న ప్రభుత్వమేదీ లేదు. జలసంరక్షణ గురించి ఇంత పెద్దఎత్తున ఇప్పుడు ప్రచారం చేస్తున్నారు కదా – ఇప్పుడయినా చెరువుల వ్యవస్థను బాగుచేసే ఆలోచన చేయొచ్చు కదా? పూర్వపు స్థాయికి వాటిని తీసుకువచ్చినట్లయితే కురిసిన ప్రతి వర్షం చుక్కా కాకపోయినా చాలాభాగం చెరువులలో నిలుస్తుంది. భూగర్భ జలాల ఊట పెంచడానికి పనికొస్తుంది. తూముల ద్వారా పారించుకుని పంటలు పండించుకోవడానికీ పనికొస్తుంది.

చెరువు నీళ్లందని ప్రాంతాలుంటాయి. చెరువులే లేని గ్రామాలు కూడ ఉంటాయి. వాటికి బావినీళ్లే శరణ్యం కాబట్టి బావులలో ఊట పెంచే జలసంరక్షణ విధానాలు అక్కడ అవలంబించవచ్చు. శతాబ్దాలుగా చెరువులు, బావుల (ఉపరితల, భూగర్భ జలాల) సమన్వయం ద్వారానే వ్యవసాయం నడిచింది తెలంగాణ, రాయలసీమలలో. ఇప్పుడు అకస్మాత్తుగా నీళ్లంటే భూమి లోపలివే ఎందుకయ్యాయి? నీటిని భద్రపరచడమంటే భూగర్భ జలాశయాలలో భద్రపరచడమే ఎందుకయింది?

చెరువుల కింద ఆగ్రోబిజినెస్ కార్పొరేషన్లు వ్యవసాయ వ్యాపారం చేపట్టడం కష్టం. కొన్ని వందల ఎకరాలు లీజుకు తీసుకుని (దీనికోసం భూమి గరిష్ట పరిమితి చట్టాలను సవరించాలన్నది చంద్రబాబు వ్యవసాయ విధానంలోని ఒక ముఖ్య ప్రతిపాదన), ఎరువులు సమృద్ధిగా వేసి, నీళ్లు సమృద్ధిగా పారించుకుని విదేశాలలో బాగా అమ్ముడుపోయే మేలురకం వ్యవసాయ ఉత్పత్తులను సాగు చేయడం చెరువుల కింది వ్యవసాయంలో సాధ్యం కాదు. కావలసినన్ని చోట్ల బోర్లు వేసుకుని భూగర్భ జలాలను పెద్ద మొత్తంలో పీల్చుకుంటేనే సాధ్యం అవుతుంది. దానికి కాకతీయుల, రాయల కాలం నాటి చెరువుల వ్యవస్థ అక్కరలేదు. చెరువులన్నీ ఊటచెరువులుగా

మారిపోవాలి, బోర్లకు నీళ్లు అందించాలి. వాగులు, వంకలు చెరువులలోకి నీళ్లు చేరవేయనక్కరలేదు. నేలలోకి చేరవేయాలి. బోర్లకు అందివ్వాలి.

చెరువుల వ్యవస్థను లెక్కలోకి తీసుకోకుండా వాటర్‌షెడ్ల కోసం చెక్‌డ్యాంలు కట్టడం వల్ల ఇప్పటికే సగం ఎండిపోయిన చెరువులు పూర్తిగా ఎండిపోతున్నాయన్న ఫిర్యాదు వినవస్తున్నది. మహబూబ్‌నగర్ జిల్లా నాగర్‌కర్నూల్ దగ్గర కేసరి సముద్రం అనే చెరువు ఉంది. అది అయిదు చెరువుల వ్యవస్థలో ఒకటి. విపరీతమైన పూడిక వల్ల, కట్ట పాడు కావడం వల్ల పనికిరాకుండా పోతున్న ఆ చెరువులోకి నీళ్లు చేరవేసే ఒర్రెలు వాటర్‌షెడ్లలో భాగమైపోవడం వల్ల అసలే అందులోకి నీళ్లు రావడం లేదన్న ఫిర్యాదు ఉంది.

చెరువు ఆయకట్టులో ఉన్న రైతులు ఖర్చు లేకుండా సాగునీరు పొందగలరు. కాని బావులు ఖర్చుతో కూడుకున్న పని. నిజానికి బోర్లు వచ్చిన తర్వాత బావులనేవి కేవలం అలంకారప్రాయంగా మిగిలాయి కాబట్టి భూగర్భ జలాలు ఉపయోగించు కోవాలంటే బోర్లు వేసుకోవాలి. మోటార్లు పెట్టుకోవాలి. పెరుగుతున్న కరెంట్ ఛార్జీలు కట్టుకోవాలి. కార్పొరేట్ వ్యవసాయం రంగప్రవేశం చేసిన తర్వాత వాళ్లు వేసినంత లోతుగా వేరెవరూ బోర్లు వేయలేరు. కాబట్టి ఇకపై భూగర్భ జలాలన్నీ వారివే. కరెంట్ ఉత్పత్తికయ్యే ఖర్చు మొత్తం వినియోగదార్లే పెట్టుకోవాలనే ప్రపంచబ్యాంకు నియమాన్ని మన పాలకులే మొట్టమొదటగా అమలు చేస్తున్నారు కాబట్టి కార్పొరేషన్లు, వారి కనుసన్నలలో వ్యవసాయం చేసే ధనిక రైతులు తప్ప వేరే ఎవరూ బోర్లు వేసుకునే స్థితిలో – భూగర్భ జలాశయాలలోని నీటిని వ్యవసాయం కోసం వాడుకునే స్థితిలో – ఉండబోరు. చెరువుల వ్యవస్థను పునరుద్ధరించి, దానికి పోటీగానో, ప్రత్యామ్నాయం గానో కాక అనుబంధంగా భూగర్భ జలసంరక్షణ చేపట్టి లోతయిన బోర్లు ఎవ్వరూ వేయడానికి వీలులేదన్న చట్టం చేసినట్లయితే చాలా భిన్నమైన సామాజిక చిత్రం కనిపిస్తుంది. అయితే అందులో 'విజన్ 2020' నమూనా ఆధునీకరణకు చోటు అంతగా ఉండకపోవచ్చు.

**ఆంధ్రప్రభ**
**8 జూన్ 2000**

# అక్కరకు రాని పంట బీమా పథకం

వేరుశెనగ పంట మూడవవంతు ధ్వంసమయిన అనంతపురం జిల్లాలో ఇప్పటికి 24 మంది ఆత్మహత్య చేసుకున్నారని పత్రికలు చెప్తున్నాయి.

వర్షాలు ఎన్నడూ లేనంత బాగా కురిసిన ఈ సంవత్సరంలోనే, ఎవరికీ అంతుచిక్కని పురుగు పంటను నాశనం చేయడం వేరుశెనగ రైతులకు ఒక షాక్ అయితే, వరుసగా జరుగుతున్న ఆత్మహత్యలు రెండవ షాక్.

అయితే మూడవది ముందుంది. ఇది పంటల బీమా పేరు మీద జరగనున్న ప్రహసనం. దేశంలో ఒక పంట బీమా పథకం ఉందని అందరికీ తెలుసుగానీ దాని స్వరూపమేమిటో చాలా మందికి తెలీదు. దాని పేరు బీమా పథకం కాబట్టి రైతులకు దాని వలన ఎంతో కొంత ప్రయోజనం వస్తుండవచ్చుననే అందరూ అనుకుంటారు బహుశా. నిత్య క్షామపీడిత ప్రాంతాల రైతులు ఈ పథకం కింద ప్రీమియం చెల్లించుకుంటారు తప్ప ప్రతిఫలం పొందేదేమీ ఉండకపోవచ్చునని చెప్పినా, నిరుటిదాకా ఒకవేళ కొంచెం ప్రయోజనం పొంది ఉన్నా, ఈ సంవత్సరం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఏకపక్ష నిర్ణయం వల్ల ఆ మాత్రం కూడ దక్కదని చెప్పినా 'మరీ ఇంత అన్యాయం ఉంటుందా' అని ఆశ్చర్యపోవచ్చు. కానీ ఈ మాటలలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు.

మొదటి విషయమేమిటంటే 'రాష్ట్రీయ కృషి బీమాయోజన' అని పిలువబడే ఈ పథకం పంట బీమా పథకం కాదు, పంటరుణాల బీమా పథకం. అంటే ఈ పథకం 'ఇన్సూర్' చేసేది రైతు వేసే పంటను కాదు. పంట వేయడం కోసం రైతు ప్రభుత్వ ద్రవ్య సంస్థల నుండి తీసుకునే రుణాన్ని.

తన ద్రవ్య సంస్థలను కాపాడుకోవడం ప్రభుత్వం లక్ష్యం కాబట్టి ఈ పథకాన్ని ప్రభుత్వం రైతులకు వాళ్ళ ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా 'కంపల్సరీ' చేసింది.

పంట నష్టాలు తరచుగా జరిగే ప్రాంతాలుగా గుర్తించబడిన ప్రాంతాలలో (నోటిఫైడ్ ఏరియాలలో), తరచుగా నష్టాలకు గురయ్యే పంటలుగా గుర్తించబడిన పంటలు (నోటిఫైడ్ క్రాప్స్) పండించే రైతులు ప్రభుత్వ ద్రవ్య సంస్థల నుండి రుణం తీసుకున్నట్టయితే ఆ రుణానికి తప్పనిసరిగా బీమా చేయవలసిందే.

రైతులు బీమా తప్పనిసరిగా చేయవలసిందే గానీ ఆ బీమా పథకం రూపురేఖలు, నియమాలను ప్రభుత్వమే ఏకపక్షంగా నిర్ణయిస్తుంది. రైతులకు నిర్ణయాధికారమే కాదు, సమాచారం కూడ ఉండదు. నిరుడు వేరుశెనగ పంటకు ప్రీమియం 10 వేల రుణానికి 100 రూపాయలుండింది. ఈ సంవత్సరం ఎవ్వరికీ ఏమీ చెప్పకుండ, అడగకుండ దానిని 350 రూపాయలకు పెంచారు. 'ఇష్టం లేకపోతే కట్టొద్దు' అనడానికి ఇది స్వచ్ఛందంగా రైతులు చేరే బీమా పథకం కాదని పైన చెప్పాను.

రైతులు ఏ కారణంగానయినా పంట నష్టపోతే బీమా పథకం కింద వారికి నష్టపరిహారం లభిస్తుందని మనం అనుకుంటాము. కానీ ఈ పథకం స్వభావం ఎట్లాంటిదంటే, అది ప్రతీ సంవత్సరం వచ్చే నష్టానికి ఏ నష్టపరిహారమూ ఇవ్వదు, అప్పుడప్పుడు వచ్చే నష్టానికి మాత్రమే ఇస్తుంది. అంటే ఇది అనంతపురం, మహబూబ్‌నగర్ వంటి నిరంతర కరువు ప్రాంతాలకు పనికొచ్చే పథకం కాదు. సాధారణంగా మంచి పంటలు పండుతూ, ఎప్పుడయినా సైక్లోన్ వల్లనో ఇంక దేని వల్లనో పంట నష్టపోయే ప్రాంతాలకు పనికొచ్చే పథకం. ప్రీమియం ఇన్సూరెన్స్ రూపంలో వారికి తిరిగి రాదు. ఇతర కారణాల వల్ల కాకతాళీయంగా ఆ సంవత్సరం పంట నష్టపోయిన సుభిక్ష ప్రాంతాలకు తరలిపోతుంది. ఇంతకంటే వికృతమైన సాంఘిక న్యాయం ఉండజాలదు.

పంట నష్టానికిచ్చే నిర్వచనంలోనే సమస్యంతా ఉంది. ఆ ప్రాంతంలో కురిసే సగటు వర్షపాతంతో ఆ ప్రాంతంలో ఉండే నేలలు ఇచ్చే సగటు ఉత్పత్తిని (విపరీతమైన వర్షాభావంగానీ అకాల వర్షాలుగానీ విత్తనాల వైఫల్యం గానీ అసాధారణమైన పురుగు దెబ్బగానీ లేని పరిస్థితిలో ఇచ్చే ఉత్పత్తిని) ప్రమాణంగా తీసుకొని, అంతకంటే తక్కువ పండినట్టయితే ఆ తగ్గుదల మేరకు నష్టపరిహారం ఇచ్చే బీమా పథకం అన్ని ప్రాంతాలకూ ఒకే రకంగా న్యాయం చేయగలగుతుంది. కానీ ప్రస్తుతమున్న రాష్ట్రీయ కృషి బీమా పథకం ఇచ్చే నిర్వచనం అది కాదు.

'శెనక్కాయ'నే ఉదాహరణగా తీసుకున్నట్టయితే, ఆ మండలంలో గడచిన అయిదు సంవత్సరాలలో పండిన సగటు పంటలో 80 శాతం కంటె తక్కువ పండినట్టయితే ఆ తక్కువకు నష్టపరిహారం ఇస్తుంది ఈ పథకం. రెండేళ్ళకొకసారి కరువు వచ్చే ప్రాంతాలలో 'గడచిన అయిదు సంవత్సరాల సగటు' అనేదే చాలా తక్కువ ఉంటుంది కాబట్టి అందులో 80 శాతం కంటె తక్కువ పండితేనే బీమా పైసలు వస్తాయనడంలో బొత్తిగా అర్థం లేదు.

గత సంవత్సరం రాష్ట్రమంతటా కరువు తీవ్రంగా ఉండిందని అందరికీ జ్ఞాపకం ఉండే ఉంటుంది. అయినప్పటికీ అనంతపురం జిల్లాలో నాలుగు మండలాల రైతులకు ఈ బీమా పథకం కింద దాదాపు ఏమీ రాలేదు. ఎందుకంటే ఆ నాలుగు మండలాలలో అంతకుముందు అయిదేళ్ళ పరిస్థితి కూడ ఆ సంవత్సరం కంటె మెరుగుగా లేదు కాబట్టి.

అనంతపురం రైతుల విషాదగాథ అక్కడితో అయిపోలేదు. కరువు కాలంలో బీమా పథకం వారిని ఆదుకోలేదు గానీ నిరుడు వచ్చిన కరువు నుండి ప్రభుత్వం ఒక 'గుణపాఠం' తీసుకుంది. పంటల దిగుబడి ఇంత హీనంగా పడిపోగల ప్రాంతాలలో 'గడచిన అయిదు సంవత్సరాల దిగుబడిలో 80 శాతం' అనే ప్రమాణం పెట్టుకున్నా తన బీమా పథకానికి నష్టమొచ్చే ప్రమాదం ఉందని భావించి, ఈ సంవత్సరం నుండి వేరుశనగకు సంబంధించిన ప్రమాణాన్ని 'గడచిన అయిదు సంవత్సరాల సగటు దిగుబడిలో 60 శాతం'కు తగ్గించింది. అంటే పురుగు తిని పోయిన అనంతపురం రైతు శెనక్కాయ పంట గడచిన అయిదు సంవత్సరాల సగటు పంటలో 60 శాతం కంటే తక్కువ ఉన్నట్లయితేనే ఆ 60 శాతం కంటే తక్కువ పండిన మేరకు నష్టపరిహారం బీమా పథకం కింద లభించబోతుంది.

అనాలోచితమైన ఈ మార్పు చేసే ముందు ప్రభుత్వం వైపు నుండి ఒక ప్రకటనగానీ సూచనగానీ లేదు. సంప్రదింపు అసలే లేదు. 'వృధాగా ప్రీమియం చెల్లించి మా కడుపులు మాడ్చుకొని వేరే ప్రాంతాల రైతులకు బీమా మేమెందుకు ఇవ్వాలి? మా ప్రీమియం మాకు వెనక్కిచ్చేయండి. మీకూ మీ బీమా పథకానికీ ఒక దండం' అని అనంతపురం రైతులు ఆందోళన చేయాలేమో!

**ప్రజాతంత్ర**

**29 అక్టోబర్ 2000**

# ఇది కూడ గో హత్యే

గోవధ నిషిద్ధమంట గానీ గోవులు మేత లేక ఛస్తే ఫరవాలేదంట.

అసలు మేత ఉంటే గోవులను 'కోత'కు ఏ రైతు పంపుతాడు?

ఈ సంవత్సరం ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే ఎన్ని వేల ఆవులూ, ఎడ్లూ, బర్రెలూ, దున్నపోతులూ కోతకు పోయాయో తెలుసుకున్న పార్లమెంటు సభ్యుడొకడయినా ఉన్నాడా? అయిష్టంగా పశువులను అమ్ముకున్న రైతుల కన్నీళ్ళు ఏ సంఘ్ పరివార్ నాయకుడయినా చూశాడా? మేతలేని పశువులకు తప్పనిసరిగా మేత పెట్టాలని ఒక బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టరాదూ? దేశమంతటా వర్షాభావం ఉన్నప్పుడు అటువంటి చట్టం చేసినా ప్రభుత్వం మేత ఎక్కడినుండి తీసుకొస్తుందని అంటారేమో! ఆ దబాయింపుతోనే చంద్రబాబు ప్రభుత్వం ఈ సంవత్సరం కాలాన్ని నిష్క్రియగా వెళ్ళదీస్తున్నది. నిజంగానే ఎక్కడా నీళ్ళు లేవని అందరూ అనుకుంటున్నారు కాబట్టి ఆ దబాయింపు సాగుతున్నది.

నిజానికి గోదావరి డెల్టాలో ఈసారి నీళ్ళున్నాయి. కోనసీమ, భీమవరం, నరసాపురం ప్రాంత రైతులు రెండవ పంట కూడ వేశారు. మన రాష్ట్రంలో వర్షం ఎక్కువ పడకున్నా గోదావరి నది ఎగువ భాగాన కురిసిన వాన వల్ల కాబోలు, గోదావరిలో సుమారుగా నీళ్ళున్నాయి. వారికి అలవాటయిన పంటలు వేసే బదులు పశుగ్రాసంగా పనికొచ్చే పంటలు వేయమని ప్రభుత్వం గోదావరి డెల్టా రైతులను కోరి ఉండవచ్చును. ఆ పంటను తాను కొనుక్కొని కరువు ప్రాంతాల రైతులకు సబ్సిడీతో అమ్మి ఉండవచ్చును. కొనుగోలుకు గ్యారంటీ ఉన్నట్టయితే ఏ పంట అయినా వేయడానికి రైతులలో చాలా మంది సిద్ధంగా ఉంటారు. కాబట్టి ఇది ఫలించగల విధానమే. పైగా ఇది కొత్త ఆలోచన కూడ కాదు. గతంలో చాలా సందర్భాలలో

ప్రభుత్వం ఈ పనే చేసింది. డెల్టా రైతులను పశుగ్రాసం పండించమని పురమాయించి వారి దగ్గర కొనుక్కొని కరువు ప్రాంతాలకు గూడ్సు బండ్లలో తరలించింది. అన్ని పశువుల ప్రాణాలనూ ఆనాడు కూడ ప్రభుత్వం కాపాడలేదు గానీ కొన్నిటినైనా కాపాడింది. ఈసారి ఆ ఆలోచన సహితం చేయలేదు.

దాని బదులు కరువు గ్రామాల రైతులకే విత్తనాలు ఇచ్చి 'ఎవరయినా సరే పశు గ్రాసం పండిస్తే ప్రభుత్వం కొనుక్కుంటుంది' అని ప్రకటించారు. కొన్ని చోట్ల పెద్ద రైతులు ఎంఆర్వోల పోరు పడలేక విత్తనాలు కొని ఇంట్లో దాచుకున్నారు. వేయడానికి నీళ్ళుంటే కదా? నీళ్ళు లేని గ్రామాలకే పశుగ్రాసం విత్తనాలు సరఫరా చేసే తెలివి తేటలను ఏమనాలి? కలెక్టర్లతో మాట్లాడితే, ఒక్క రైతు బోరయినా పని చేయకుండ ఉంటుందా అని ఈ ఎత్తుగడ వేశాం అంటున్నారు. పశువులకు నోరుంటే ఈ తెలివికి జోహార్లు చెప్పి ఉండేవి. ఈ సంవత్సరం 1000 అడుగుల లోతు బోరు వేసినా ఒక్క చుక్క నీరు దొరకని గ్రామాలు – ఉదాహరణకు కడప జిల్లాలో – ఉన్నాయి. 'ఇంకొక్క 200 అడుగులు తవ్వితే పెట్రోలే దొరికేదేమో కదా' అని రైతులు తమ గురించి తామే జోకులు వేసుకుంటున్నారు. అటువంటి చోట ఏ ఒక్క రైతు పొలంలోనయినా నీళ్ళు ఉండకపోతాయా అని భావించడాన్ని తెలివితక్కువతనమని కూడ అనకూడదు. నిర్లక్ష్యమే దానికి సరయిన పేరు.

ఈ నిర్లక్ష్యం ఫలితమేమిటంటే రైతులు పశువులను పెద్దసంఖ్యలో అమ్ముకుంటున్నారు. మన దేశ పాలకులు గోసంరక్షకులు కాబట్టి వారికి తెలియవల సిందేమిటంటే రైతులు పశువులను అమ్ముకోక తప్పనప్పుడు మొదట ఆవులనే అమ్ముకుంటారు. ఎడ్లను కాదు బర్రెలను కాదు. ఎడ్లను అమ్ముకోవడమే లేదని కాదు, ఒక జత మిగుల్చుకొని మిగిలినవి అమ్ముకున్న రైతులు రాష్ట్రంలో వేల సంఖ్యలో ఉన్నారు. రేపు మళ్ళీ కొనాలంటే పదివేలు ఖర్చయ్యే పశువును ఇప్పుడు నాలుగు వేలకు, అయిదు వేలకు అమ్ముకున్నారు. సహనం మనిషిలో గొప్ప గుణమనడంలో అభిప్రాయ భేదం ఉండదు గానీ ఇటువంటి సమయంలో సహనాన్ని చూస్తే కోపం వస్తుంది. ఎవరినో కొట్టమనో తన్నమనో కాదు, ఇంతటి నిర్లక్ష్యాన్నీ బాధ్యతారాహిత్యాన్నీ ఊరికే సాగనియ్యవద్దని. 'రైతులలో ఐకమత్యం లేదు' అనీ, 'ఒకరు ఏదయినా మొదలు పెడితే ఇంకొకరు కలిసిరారు' అనీ గ్రామాలలో తరచుగా అంటుంటారు. ఐక్యమై గొడవ ఎందుకు చేయరు అన్న ప్రశ్నకు జవాబుగా ఈ వివరణ ఇస్తారు. ఈ ప్రాంతం

ఆ ప్రాంతం అన్న తేడా లేకుండ అన్ని ఊర్లలోనూ ఈ మాటే అంటారు కాబట్టి ఇది నిజమైన ప్రతిబంధకమేననుకోవాలి. దీనిని ప్రభుత్వం నిస్సిగ్గుగా వాడుకొని కరువు నివారణ కోసం ఏమీ చేయకుండ కాలక్షేపం చేస్తున్నది.

రైతుల ఈ బలహీనత కారణంగానే కరువు సమయంలో ప్రభుత్వం ఏం చేయాలన్నది ఒక చట్టం రూపంలో ఉండడం  అవసరం అని ఈ రోజు అందరూ భావిస్తున్నారు. ప్రభుత్వానికి ఒక కచ్చితమైన కరువు నియమావళి ఉండాలి. అందులో కనీస రక్షణకు హామీ ఉండాలి, అది చట్ట రూపంలో ఉండాలి. అందులో పశు గ్రాసం, తాగు నీరు, మనుషులకు పని అనే మూడు విషయాలకు కచ్చితమైన భరోసా ఉండాలి. ప్రజలలో ప్రజాస్వామ్య చైతన్యం పెరిగేకొద్దీ, చట్టాల అవసరం లేకుండానే కరువు సహాయం ప్రభుత్వం నుండి అందుతుందని ఆశించిన రోజులు లేకపోలేదు గానీ, మన ప్రభుత్వాలు ప్రజా చైతన్యానికి అంత గౌరవం ఇవ్వవని ఇప్పుడు అందరికీ స్పష్టం అయింది. ప్రజా చైతన్యం బలమైన ఉద్యమం రూపమయినా తీసుకోవాలి. అది సాధ్యం కానప్పుడు చట్టం రక్షణ అయినా ఉండాలి. కరువు కాలంలో పశువులను నిందించడం భావ్యం కాదనుకోకపోతే ఈ ప్రభుత్వాన్ని నిస్సంకోచంగా దున్నపోతు అనవచ్చు.

**ప్రజాతంత్ర**
**14 ఏప్రిల్ 2003**

# 'పునఃపంపిణీ' జరగకుండా కరువు సమస్య తీరుతుందా?

ఎప్పుడూ కరువు ఉండే ప్రాంతాలలోనే కాక హెచ్చుతగ్గులుగా రాష్ట్రమంతటా ఈ సంవత్సరం కరువు ఉండడం వల్ల 'కరువు సమస్య' అన్నిచోట్లా చర్చకు వస్తున్నది. పత్రికలూ ఇతర ప్రసార సాధనాలూ కరువును ఒక ప్రధాన విషయంగా చర్చిస్తున్నాయి.

అంతవరకు మంచిదే. కానీ దినపత్రికలలో కరువు గురించి రాస్తున్న వారు గతంలో ఆ విషయాన్ని పట్టించుకున్నవారు కాకపోవడం వల్ల వారు చేస్తున్న చర్చ దుర్భర పరిస్థితుల వర్ణనను దాటిపోవడం లేదు.

కరువంటే వర్షాభావం కాదు. కరువంటే నీటి ఎద్దడి. మొక్కలకూ మనుషులకూ పశువులకూ కావలసినంత నీరు దొరకకపోవడం కరువు. వర్షపాతంలో లోటు దానికి ఉండగల ఒకానొక కారణం మాత్రమే. వర్షం ఎక్కువ పడినా అది అకాల వర్షమో, అకస్మాత్తు వర్షమో అయితే కరువును తప్పించుకోలేకపోవచ్చు. వర్షం తక్కువ పడినా నీటివనరుల సమర్థ వినియోగం అలవరచుకున్న చోట కరువును తప్పించుకోవచ్చు. వర్షాభావం ఉన్న సంవత్సరాలలో నీటి కొరతకు గల ఇతర కారణాలు ఒకదానికొకటి తోడయి కరువును పెంచుతాయనేది సత్యమే. కానీ వర్షాభావమే కరువుకు కారణం కాదు.

మహబూబ్‌నగర్ జిల్లాలోనూ, దీనికి పొరుగున ఉన్న నల్లగొండ, రాయలసీమ జిల్లాలలోనూ కరువు నిత్యం ఉంటుంది. వాతావరణ నిపుణులు రుతుపవనాలు సకాలంలో వచ్చి సమృద్ధిగా వానలు కురిపించాయని ప్రకటించిన సంవత్సరాలలోనూ కరువు ఉంటుంది, లేని సంవత్సరాలలోనూ ఉంటుంది. లేని సంవత్సరాలలో మరి

కొంచెం ఎక్కువ ఉంటుందంతే. 'కరువు ప్రాంతాలు'గా పేరుగాంచిన అన్ని ప్రాంతాలకూ ఇదే వర్తిస్తుంది.

ఇక్కడ కరువు ఒక వ్యవస్థ, వైపరీత్యం కాదు. సగటు పరిస్థితి, విపరీత పరిస్థితి కాదు. పనులు దొరకక వలస పోవడం, పశువులకు మేత దొరకక కోతకు తోలడం, మంచినీటి కోసం మైళ్ళకు మైళ్ళు వెళ్ళిరావడం ఇక్కడ నిత్యజీవిత పరిస్థితులు.

దీనికి పరిష్కారం దొరకాలంటే వానదేవుడిని తిట్టుకుని ప్రయోజనం లేదు, పూజలూ యాగాలూ చేసీ ప్రయోజనం లేదు. పూజల వల్ల వర్షం కురుస్తుందని ఒకవేళ మనం నమ్మినా అది కురిసిన సంవత్సరం కూడ ఇక్కడ కరువే కాబట్టి వాటి వల్ల ప్రయోజనమేమీ లేదు.

మనకు అందుబాట్లో ఉన్న నీటి వ్యవస్థను ఎంత న్యాయంగా, ఎంత సమర్థంగా వాడుకుంటున్నామన్నదే మనం చూడవలసిన విషయం. పరిగెత్తే నీటికి నడక నేర్పించాలనీ, కురిసే వాన మొత్తం భూగర్భ జలాలలో చేరి బావుల ఊట పెరిగేటట్టు చూడాలనీ మన ముఖ్యమంత్రి మనల్ని ఊరికే ఊదరగొడుతుండడం వల్ల భూగర్భ జల వ్యవస్థ గురించి మాత్రం కొంచెం అవగాహన పెరిగింది.

కానీ మన ప్రభుత్వం అదొక్కటి మాత్రమే ఎందుకు మాట్లాడుతుంది? వర్షం నేల మీద మాత్రమే కురవదు. వాగులలో, వంకలలో, కుంటలలో, చెరువులలో, నదులలో అన్నిచోట్లా కురుస్తుంది. వీటన్నిటినీ 'ఉపరితల జలవనరులు' అంటారు. భూగర్భ జల వ్యవస్థ గురించి ఎంతగా ఆలోచించాలో, ఉపరితల జల వ్యవస్థ గురించి కూడ అంతగా ఆలోచించాలి కదా! ప్రభుత్వం ఆలోచించకపోతే మనమైనా ఆలోచించాలి కదా!

మహబూబ్‌నగర్‌నే తీసుకున్నట్టయితే కృష్ణానది ఈ జిల్లాకు స్వతస్సిద్ధమైన వనరు. ఆ నది నీటిలో న్యాయబద్ధమైన వాటా మహబూబ్‌నగర్‌కు అందినట్టయితే వర్షాభావం ఉన్న సంవత్సరాలలో కూడ పరిమితమైన కరువుతో ఈ జిల్లా తప్పించుకోగలుగుతుంది.

మహబూబ్‌నగర్‌కు ప్రధానంగా వర్తించే ఈ విషయం నల్లగొండకు, రాయలసీమ జిల్లాలకు కూడ వర్తిస్తుంది. అయితే చారిత్రకంగా నెలకొన్న చేదు వాస్తవమేమిటంటే కృష్ణానదీ జలాలలో పెద్ద వాటా దిగువన ఉన్న సర్కారు జిల్లాలు తీసుకుంటున్నాయి. అక్కడ సగటు వర్షపాతం ఇక్కడి కంటే బాగా ఎక్కువ. కాబట్టి

నేలలో తేమ ఎక్కువ. భూగర్భ జలాలు ఎక్కువ. 'నీటికి నడక నేర్పించినట్ట'యితే భూగర్భ జలాలను పెంపొందించుకునే అవకాశమూ ఎక్కువ.

అయినా ఆ ప్రాంతానికే నదీ జలాలలో పెద్ద వాటా ఇచ్చి వర్షపాతం తక్కువ ఉన్న జిల్లాలను ఎండబెట్టడం సమైక్య ఆంధ్రలో యాభై ఏళ్ళుగా జరిగిన వంచన.

దీని గురించి మాట్లాడకుండ కరువు సమస్య గురించి మాట్లాడగలమా? తరలిపోతున్న కూలి జనం ఫోటోలు, బక్కచిక్కిన పశుగణం చిత్రాలు ఎన్ని ప్రచురించినా కరువు సమస్యను పూర్తిగా చూపించినట్టవుతుందా? కృష్ణా నదీ జలాల అసమాన పంపిణీని అంతమొందించడం కరువు సమస్య పరిష్కారానికి ఒక ముఖ్య సాధనం అని ప్రకటించకుండ కరువు చర్చను ముగించగలమా?

ఇది ఆకలి దప్పుల చర్చ మాత్రమే కాదు, జీవన్మరణ సమస్య. ఈ సంవత్సరం మే నెల మొదటి వరకే మహబూబ్‌నగర్ జిల్లాలో 28 మంది తిండిలేక చనిపోయారు. కరువు వ్యవసాయం బరువు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న వారినీ, తిండిలేక ఒంట్లో సత్తువ లేక వడదెబ్బకు చనిపోయిన వారినీ, తిండి కోసం దూరప్రాంతానికి కూలీలుగా వలసపోయి దిక్కులేని మరణం పాలయిన వారినీ కూడ లెక్కపెట్టుకుంటే ఈ సంవత్సరం కరువుకు ప్రత్యక్షంగానో పరోక్షంగానో మహబూబ్‌నగర్ జిల్లావాసులు వందమంది దాకా బలి అయి ఉంటారు.

పరిస్థితి ఇంత ఘోరంగా ఉన్నా మన రాష్ట్ర ప్రభుత్వం కృష్ణానదీ జలాల పునః పంపిణీ సంగతి అటుంచి, అనుమతి పొందిన ప్రాజెక్టుల విషయంలో సహితం వివక్షను విడిచిపెట్టడం లేదు. మే నెల మొదటి వారంలో చంద్రబాబు నాయుడు కృష్ణా జిల్లా నందివాడలోనూ, మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్‌లోనూ కృష్ణానదీ జలాల ప్రాజెక్టుల గురించి ఉపన్యసించాడు. అక్కడ పులిచింతల గురించి, ఇక్కడ భీమా గురించి మాట్లాడాడు. ఇవి రెండూ ఒకే ప్రాతిపదికన నికరమైన నీటి కేటాయింపు పొందిన ప్రాజెక్టులు. మొదటిది సంపన్నమైన కృష్ణా డెల్టా స్థిరీకరణ కోసం ఉద్దేశించిన ప్రాజెక్టు కాగా, రెండవది కరువు పీడిత మహబూబ్‌నగర్ ప్రజలకు ప్రాణం పోయడం కోసం రూపొందించిన ప్రాజెక్టు. అయితే నందివాడలో మాట్లాడుతూ పులిచింతలను 'త్వరలోనే' పూర్తి చేస్తానని హామీ యిచ్చిన ముఖ్యమంత్రి, భీమా గురించి మాట్లాడేటప్పుడు ప్రాజెక్టుకు నిధులు సేకరించే ప్రయత్నంలో ఉన్నామని ఆశ చూపిస్తూ (పులిచింతలకు

ఉన్న నిధులు భీమాకు ఎందుకు లేకుండా పోయాయో) భీమా ప్రాజెక్టులో ఒక భాగంగా చూపించబడుతున్న 15 వేల ఎకరాల ఆయకట్టు గల 'సంగంబండ రిజర్వాయరు' పరిపూర్తి గురించి మాత్రమే హామీ ఇచ్చాడు. సంగంబండ రిజర్వాయర్‌ను అక్కడికే పరిమితం చేస్తే భీమా ప్రాజెక్టు అనేదేదీ ఉండదని ముఖ్యమంత్రికి తెలియదనుకోవాలా?

ఇప్పుడు అమలవుతున్న ఈ వివక్ష నుంచి రేపు జరగవలసి ఉన్న పునఃపంపిణీ దాకా అన్ని విషయాలూ చర్చించుకుందాం రమ్మని ఆహ్వానిస్తూ...

**12 మే 2003**

మే 16 న మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్‌లో జరిగిన సదస్సు కోసం రాసిన ఈ కరపత్రం కృష్ణానదీ జలాల పునఃపంపిణీ ఉద్యమం కరపత్రంగా వచ్చింది

# కరువు, కరువు పనులు, కరువు దాడులు

ఇరుగు పొరుగున ఉన్న నాలుగు మండలాలలో మినహాయింపు లేకుండ ప్రతీ ఒక్క ఇంటికీ తెల్లకార్డుందంటే నమ్ముతారా? తెల్లకార్డు ఉండడమంటే ప్రభుత్వం గుర్తించిన దారిద్ర్యరేఖకు దిగువన ఉండడం. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు డివిజన్‌లోని జైనూర్, నార్నూర్, సిర్‌పూర్ (యు), తిర్యాని మండలాలలో ప్రతీ ఇంటికీ తెల్లకార్డు ఉందని ఆయా మండలాల ఎం.ఆర్.వోలే అంటున్నారు.

'ప్రతీ ఇంటికీ' అంటున్నామే తప్ప 'ప్రతీ కుటుంబానికీ' అనడం లేదు. కార్డులు ఇచ్చిననాడు కుటుంబాలనే గుర్తించి ఉండవచ్చును గానీ అవి ఇచ్చి ఎంతలేదన్నా 12 ఏళ్ళు గడిచాయి. ఇచ్చిన తరువాత 'బోగస్ కార్డులను' ఏరివేశారే తప్ప కొత్త కార్డులు ఇయ్యలేదు. ఒక్కొక్క ఇంటికి కేటాయించిన బియ్యం కోటా పెంచలేదు. ఈ 12 ఏళ్ళలో పిల్లలు పుట్టారు. అంతకు ముందు పిల్లలుగా ఉన్న వారు పెరిగి పెద్దవారయి వేరుపడ్డారు. పెళ్ళిచేసుకొని పిల్లల్ని కన్నారు. కానీ ఆ ఇంటికిచ్చిన బియ్యం కోటా పెంచలేదు, పెరిగి పెద్దవారయి తామే కుటుంబ పెద్దలయిన వారికి కొత్త కార్డులు ఇయ్యలేదు. ఒకనాటి కుటుంబానికి ఇంటి నెంబర్ మాత్రమే చిహ్నంగా మిగిలింది. అందుకే కార్డు ఉన్నది ఇంటికే నంటున్నారు తప్ప కుటుంబానికి కాదు.

ఇక్కడి నేలలు నిన్న మొన్నటి దాకా దట్టమయిన అడవిని మోసిన ఎగుడు దిగుడు నేలలయినప్పటికీ చాలా సారవంతమయిన నల్లరేగడి నేలలు. కొంచెం శ్రద్ధ పెట్టే పాలకులుంటే బంగారం పండించగలవు. కానీ ఇక్కడి జనం అత్యధికంగా ఆదివాసులు కావడం వల్ల వీరి విషయంలో శ్రద్ధ పెట్టవలసిన అగత్యం ఉన్నట్టు ఈ రాష్ట్రాన్ని

ఏలిన ఏ పార్టీ భావించలేదు. నిజానికి ఇది ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీ తాలూకాలకే కాదు మొత్తంగా ఆ జిల్లాకే వర్తిస్తుంది. ఆ జిల్లాలో బలమైన స్థానిక శూద్ర వ్యవసాయదారుల కులమేదీ లేదు. దేశంలో అటువంటి ప్రాంతాలేవీ గడచిన యాభై ఏళ్ళలో వ్యవసాయ అభివృద్ధిని సాధించలేదు.

ఆదివాసీ ప్రాంతమయిన ఉట్నూర్ డివిజన్ పరిస్థితి మరింత అధ్వాన్నంగా ఉండడంలో ఆశ్చర్యపోవలసింది లేదు. ఆ ప్రజల కష్టాలను మొదట బయటపెట్టి అప్పటి నిజాం సర్కారు చేత కొన్ని సంస్కరణలు చేపట్టించిన ఘనత పాశ్చాత్య సామాజిక శాస్త్రవేత్త హెమెండార్ఫ్‌ది కాగా, తరువాతి తరంలో ఆ ప్రజల రాజకీయ చైతన్యానికి తన నమూనాలో నుంచి వారికొక గొంతునందించింది పీపుల్స్‌వార్.

1989లో కాబోలు ఈ రోజు వచ్చినట్టే తీవ్రమైన కరువు వచ్చింది. ఉట్నూర్ డివిజన్‌లోని ఆదివాసులు తీవ్రమైన ఆకలికీ అనారోగ్యానికీ గురయ్యారు. పీపుల్స్‌వార్ దళాల ప్రోత్సాహంతో తిర్యాని, సిర్పూర్ (యు), జైనూర్ మండలాల ఆదివాసులు తూర్పు వైపు గుట్టలు దిగి దంతేపల్లి షావుకార్లపైన దాడిచేసి ధాన్యం, విత్తనాలు తీసుకుపోయారు. అప్పట్లో పోలీసులు వందమందికి పైగా ఆదివాసుల్ని 'టాడా' కింద అరెస్టు చేశారు. ఆ కేసు కిందటి సంవత్సరం దాకా (అంటే ఒక దశాబ్దం పైగా) నడిచి చివరికి అందరూ నిర్దోషులుగా ప్రకటించబడ్డారు. కానీ  జైలు నిర్బంధం, కోర్టు కేసుల కారణంగా ముద్దాయిలయిన ఆదివాసులు అనుభవించిన ఇక్కట్లు అంతా ఇంతా కాదు.

ఇది నక్సలైట్ ఉద్యమం ఆధ్వర్యంలో తెలంగాణలో జరిగిన మొదటి కరువు దాడి. ఆనాడు పోలీసులు దానిని నేరం అని ఉండవచ్చు. టెర్రరిస్టు నేరమనీ అని ఉండవచ్చు. కానీ స్థానిక ప్రజలలో – ఆదివాసీయేతరులలో సహితం – ఆ కరువు దాడి పట్ల వ్యతిరేకత రాలేదు. దంతేపల్లి షావుకార్లకు ఎవరూ సానుభూతి చూపించలేదు.

ఆ తరువాత కూడ కరువులొచ్చాయి. ఇక్కడా అక్కడా కరువు దాడులూ జరిగాయి. కానీ వాటిలో ప్రజాబాహుళ్యం భాగస్వామ్యం కంటే దళ సభ్యుల, మిలిటెంట్ల భాగస్వామ్యం ఎక్కువ ఉండింది. 1995–96 సంవత్సరాలలో కరీంగనర్ జిల్లా కాటారం ప్రాంతంలో ఒక కొత్త వరవడి మొదలయింది. ఒక ఊరిలో జరిగే కరువు దాడిలో ఆ ఊరి ప్రజలు పాల్గొనరు. చుట్టుపక్కల ఊర్ల ప్రజలు పాల్గొంటారు. అంతేకాక కరువు

దాడిలో ధాన్యం గింజలే కాక డబ్బు, బట్టలు, బంగారం, రేడియోలు ఇత్యాది కూడా ఎత్తుకు పోవడం, తీసుకుపోని వస్తువుల్ని ధ్వంసం చేయడం జరిగింది.

ఈ సంవత్సరం ఉత్తర తెలంగాణ వెలుపల జరిగిన కరువు దాడులలో ఈ లక్షణాలన్నీ పునరావృతమయ్యాయి. పుస్తెల తాళ్ళు తెంపడం గురించి రాద్ధాంతం చాలా జరిగింది గానీ ఒక రాజకీయ పార్టీ నిర్వహించే కరువు దాడులలో ప్రజలకు ఇయ్యవలసిన మార్గదర్శకత్వం గురించి కొంచెం ఎక్కువ చర్చ జరిగి ఉంటే బాగుండేది. పుస్తెలకే విమర్శ పరిమితం కావడం వల్ల దబాయించి నోరు మూయించే అవకాశం పీపుల్స్‌వార్ నాయకత్వానికి లభించింది.

ఏమయితేనేం, ప్రస్తుతం ఉట్నూరు ఆదివాసులు అల్లరికి దిగకుండ ప్రభుత్వం ఇచ్చిన నాలుగు గింజల బియ్యం వండుకొని తింటున్నారు. గింజలు దొరకని నాడు పస్తులుంటున్నారు. 'కరువు జన్మభూమి' అనీ, 'గ్రామసభల'నీ ప్రజలను పదే పదే సమీకరించి మీలో ఎంతమందికి పనులు కల్పించాలో, ఎంతమందికి ఉచిత బియ్యం ఇయ్యాలో తేల్చండని చెప్పే ప్రభుత్వం ఇప్పటిదాకా చేసింది చాలా స్వల్పం. 'కరువు జన్మభూమి'లో నమోదు చేసుకున్న వారి సంఖ్యను బట్టి లెక్కగడితే ఎన్ని దినాల పని ప్రభుత్వం కల్పించవలసి ఉండిందో అందులో సగటున 7 లేక 8 శాతం మాత్రమే 'పనికి ఆహారం' పథకం కింద కల్పించింది. కిలో 3 రూపాయలకు ఇచ్చే చవక బియ్యం అయితే (దీనికి 'అంత్యోదయ అన్న యోజన' అని పేరు) దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ఈ ప్రజలలో నూటికి పది మందికి ఇస్తున్నారు. ఉచితంగా ఇచ్చే 'అన్నపూర్ణ' బియ్యమైతే నూటికి ఒకరికీ మాత్రమే ఇస్తున్నారు.

అవసరానికి ఎంత మాత్రం సరితూగని ఈ సంక్షేమం అట్లాగుంచి ఆదివాసీ ప్రజలు అనేదేమిటంటే, మాకు నికరమైన ఉపాధి కల్పిస్తే ఇవి అవసరమే ఉండవు కదా అని. అంటే పొలాలకు సాగునీరు, యువతకు ఫ్యాక్టరీలలోనో వేరొక చోటనో ఉద్యోగాలు కల్పించమంటున్నారు. సాగునీటి వ్యవస్థను పెంపొందించడానికి ఉట్నూరు పీఠభూమిపైన ఉన్న ఎగుడు దిగుడు నేలలలో అవకాశం పుష్కలంగా ఉంది. ఏ గ్రామానికి పోయినా తమ పొరుగున ఉన్న ఒక వాగు గురించో, ఒక వంక గురించో, దానిపైన కట్టగల ఆనకట్ట గురించో చెప్తారు. పదే పదే జరిగే 'జన్మభూముల' పైన పెట్టే ఖర్చు వీటిపైన పెడితే ఈ పొలాలకు సాగునీరు లభిస్తుంది కదా, అప్పుడు

వర్షాభావం ఉన్న సంవత్సరాలలో సహితం తినడానికి ఇంత ఉంటుంది కదా అంటారు. ఐ.టి.డి.ఏ స్కూళ్ళ పుణ్యాన అంతో ఇంతో చదువుకుంటున్న ఆదివాసీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే 'పనికి బియ్యం' పథకం కోసం ఎదురుచూడరు కదా అంటారు. ఈ మాటలు వినడానికి మన రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా లేదు. పోనీ తాను ఆర్భాటంగా ప్రకటించుకునే కరువు సహాయ పథకాలనయినా సమగ్రంగా అమలు చేస్తుందా అంటే పది శాతం కూడ చేయదు. మరి ప్రజల గతి ఏం కావాలి?

**ప్రజాతంత్ర**

**19 మే 2003**

# రైతుల ఆత్మహత్యల్ని ఆపుదాం

రోజుకు పదిమందికి తక్కువ కాకుండా చేజేతులా ప్రాణాలు తీసుకుంటున్న రైతుల మరణాలు అందరినీ కలవరపరుస్తున్నాయి. 1998లో వరంగల్, కరీంనగర్‌లలో మొదలయి ఆ తరువాత అనంతపురానికీ, ఇతర తెలంగాణ రాయలసీమ జిల్లాలకూ పాకిన ఈ బలవన్మరణాలు ఈ నెల రోజుల కాలంలో రాష్ట్రమంతటా జరుగుతున్నాయి. ఉత్తరాంధ్రలో అత్యల్పంగానూ, తెలంగాణలో అత్యధికంగానూ జరుగుతున్న ఆత్మహత్యలు ఏ ఒక్క జిల్లాను వదిలిపెట్టలేదు. అభివృద్ధికి పర్యాయపదంగా ఉన్న కృష్ణా, గుంటూరు జిల్లాలలో సహితం చెప్పుకోదగ్గ సంఖ్యలో రైతులు తమ ప్రాణాలు తాము తీసుకుంటున్నారు. ఎవరెన్ని విజ్ఞప్తులు చేసినా ఈ ఆఘాయిత్యాలు ఆగడం లేదు.

బాధాకరమైన విషయం ఏమిటంటే సమాజం – ముఖ్యంగా పట్టణ ప్రాంతాల లోని బుద్ధిజీవులు – బాధిత రైతాంగం పట్ల సానుభూతి చూపించే బదులు అతి తెలివి వ్యాఖ్యలు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తానంటున్నది కాబట్టి అందుకోసం ప్రాణాలు తీసుకుంటున్నారని కొందరు, దాని వల్లనే ఏవేవో చావులను అప్పుల వల్ల జరిగిన ఆత్మహత్యలుగా చూపిస్తున్నారని మరికొందరు బుద్ధికి తోచిన మాటలు అంటున్నారు. రైతులు తిన్నది అరగక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని మాజీ కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ గతంలో అన్నప్పుడు అందరికీ కోపం వచ్చింది గానీ ఇప్పుడు వినిపిస్తున్న వ్యాఖ్యలు అంతకంటే భిన్నమైనవి కావు.

మానవహక్కుల వేదిక 14 జిల్లాలలో 50 కి పైగా ఘటనలపై నిజనిర్ధారణ జరిపింది. మృతుల గ్రామాలకు పోయి వారి కుటుంబ సభ్యులతోనూ, ఇరుగుపొరుగు వారితోనూ వివరంగా మాట్లాడింది. రెండే రెండు ఘటనలలో వేరే కారణాల వల్ల

జరిగిన ఆత్మహత్యకు వ్యవసాయ రుణాలను కారణంగా చూపించే ప్రయత్నం జరిగిందనే అనుమానానికి ఆస్కారం ఉండింది.

యాభైలో రెండంటే కేవలం నాలుగు శాతం.

ఇక నష్టపరిహారం కోసం ఆత్మహత్య చేసుకుంటున్నారా అంటే – ఈ అనుమానం వక్తం చేసేవాళ్ళతో మీ కుటుంబ సభ్యులకు చందాలు వేసుకొని రెండు లక్షలిస్తాం, మీరు పురుగుల మందు తాగుతారా అని ఎదురు ప్రశ్న వేస్తే కోపం వస్తుంది. మేము పర్యటించిన ఏ ఒక్క గ్రామంలోనూ మృతుని గురించి 'ప్రభుత్వం భార్యా పిల్లలకు నష్టపరిహారం ఇస్తానని అనకపోతే చచ్చిపోక పోతుండె'నని కుటుంబసభ్యులు గానీ ఇరుగుపొరుగు గానీ అనలేదు. అసలు ప్రభుత్వ హామీల ప్రస్తావనే ఎవరూ ఎక్కడా చేయలేదు.

నిజానికి 1998 తరువాత మన రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు ఆగిందెన్నడు? నష్టపరిహారం ఒకటి రెండు ఘటనలలో ఇచ్చినప్పుడూ జరిగాయి. ఇవ్వడం మానేసినాక కూడ జరిగాయి. అయ్యో పాపం అన్నప్పుడూ జరిగాయి. ఒళ్ళు బలిసి చస్తున్నారన్నప్పుడూ జరిగాయి. పత్రికలకు ఈ బాధలు కొంతకాలం వార్తలుగా ఉండి ఆ తరువాత తెరమరుగయ్యాయి. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఆత్మహత్యలను సీరియస్ విషయంగా తీసుకొని ఆపడానికి ప్రయత్నిస్తామని ప్రకటించడంతో ఈ చావులు మళ్ళీ వార్తలయ్యాయి. అంతకంటే తేడా వచ్చిందని నమ్మడానికి ఆధారాలు లేవు.

కాబట్టి నిరర్థకమైన ఈ అతి తెలివి అనుమానాలను పక్కనపెట్టి రైతాంగాన్ని నిరాశలోనికీ, నిస్పృహలోనికీ నెడుతున్న కారణాల గురించి చెప్పుకుందాం. ప్రాణం తీసుకుందామన్న చివరి నిర్ణయాన్ని ప్రభావితం చేసేవి వేరే ఎన్ని కారణాలయినా ఉండవచ్చునేమో గానీ వారిలో ఈ నిరాశా నిస్పృహలు తీవ్రంగా ఉన్నాయనడంలో మాత్రం సందేహమేమీ లేదు.

ఆత్మహత్య చేసుకున్న రైతులందరూ వ్యాపార పంటలు వేసి పెట్టుబడులు భారీగా పెట్టి నష్టపోయిన వారు కారు. తాత తండ్రుల నాటి బావుల కింద, కాలానుగుణంగా వచ్చిన కొద్దిపాటి మార్పులను మినహాయిస్తే ఆనాటి పద్ధతిలోనే జీవనం వెళ్ళదీస్తున్న రైతులూ ఉన్నారు వీరిలో. అడపాదడపా నెలకొంటున్న వర్షాభావ పరిస్థితులు వారిని

## కొన్ని ఆత్మహత్య ఘటనలు

ఇవి ఆత్మహత్యల వెనక ఉన్న కారణాలను సూచించే ఉదాహరణలు మాత్రమే.

**–దాసరి కృష్ణయ్య (35)** మహబూబ్‌నగర్ జిల్లా నాగర్‌కర్నూలు మండలం నాగనూరు వాస్తవ్యుడు. సొంత భూమి రెండెకరాలకు తోడు రెండెకరాలు కౌలుకు తీసుకున్నాడు. బావిగానీ, బోరుగానీ ఏదీ లేదు. ఆ ఊరిలో 600 ఎకరాల పారకం ఉన్న చెరువుంది గానీ అది క్రమంగా ఎండిపోయి రెండేళ్ళ నుంచి చుక్కనీరు లేకుండా ఉంది. తన భూమి పత్తి పండే భూమి కాకపోయినా గతంలో మూడు సంవత్సరాలు వర్షాధారంగా పత్తి వేశాడు కృష్ణయ్య. మూడేళ్ళూ నష్టపోయాడు. తరువాత ఒక సంవత్సరం భార్యాభర్తలు హైదరాబాద్ పోయి కూలి చేసుకొని వెనక్కి వచ్చారు. తిరిగి మొక్కజొన్నలు వేశాడు గానీ వానలు లేక ఫలం దక్కలేదు. లక్ష రూపాయలు అప్పయింది. అప్పిచ్చిన ఆసామీ ఒకడు 42 వేలు కట్టమని నోటీసు ఇచ్చాడు. కృష్ణయ్య మే 21 నాడు ఇంట్లోనే పురుగుల మందు తాగి చనిపోయాడు.

**–మేడ వీరభద్రం (35)** ఖమ్మం జిల్లా కొణిజెర్ల మండలం బస్వాపురం నివాసి. ఒక్కప్పుడు బాగా భూమి ఉన్నవారే గానీ చెల్లెళ్ళ పెళ్ళిళ్ళకూ, ఇతర ఖర్చులకూ అమ్ముకోగా మూడున్నర ఎకరాలు మిగిలాయి. అవి నాగార్జునసాగర్ ఎడమ కాలువ చివరి భూములు. నాలుగేళ్ళుగా నీళ్ళు రావడం లేదు. ఒకదాని వెంబడి ఒకటి రెండు బావులు తవ్వాడు. ఒకటి పూర్తిగా ఎండిపోయింది. రెండవది నిరుడు వేసిన మిర్చి పంటకు ఇంకా ఒక తడి అవసరం ఉండగా ఎండిపోయింది. అప్పటికే రెండు లక్షల రూపాయలు అప్పయింది. అయినా ధైర్యంచేసి పత్తికి ఎకరానికి 15,000, మిర్చికి ఎకరానికి 25,000 రూపాయలు పెట్టుబడి పెట్టి పంట వేశాడు. అయితే బావి మధ్యలో ఇంకిపోవడమే కాక మిర్చి ధర ఫిబ్రవరిలో క్వింటాలుకు 4,000 రూపాయలుండింది, తన తోట కోసేసరికి 2,400 కు పడిపోయింది. మే నెల 24న వీరభద్రం ఉరి పెట్టుకుని చనిపోయాడు.

**–కైతేపల్లి శ్రీనివాసరావు (65)**కు మూడెకరాల సొంత భూమి ఉండేది. కూతుళ్ళ పెళ్ళికి ఆ భూమి అమ్మేశాడు. 50 సంవత్సరాల వయసొచ్చేదాకా తన కులవృత్తి

అయిన మంగలి పని చేసేవాడు. ఆ తరువాత అది సాధ్యంకాక కృష్ణా డెల్టా కాలువ కింద నాలుగెకరాలు కౌలుకు తీసుకున్నాడు. మూడు సంవత్సరాలుగా కృష్ణా డెల్టా కాలువలకు నీళ్ళు సరిగా రాకపోవడం వల్ల రెండేళ్ళు పంట బాగా నష్టం అయింది. నిరుడు కొంచెం వచ్చేదే గానీ తుపానులో పోయింది. పెద్దమ్మాయికి కిడ్నీ జబ్బేదో ఉండడం వల్ల రోజుకు 60 రూపాయలు మందులకవుతాయి. ఈ క్రమంలో శ్రీనివాసరావు రెండు రూపాయలు వడ్డీకి 47,000 రూపాయలు అప్పు తెచ్చాడు. కానీ ఈ సంవత్సరం పంట వేయడానికి అప్పు పుట్టే పరిస్థితి కనిపించక మే 28న ఇంట్లోనే ఉరిపెట్టుకొని చనిపోయాడు.

**–గవ్వల రాజయ్య (45)**ది కరీంనగర్ జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి. చాకలి కులస్తుడు. చాకలి పనిలో ఒకప్పుడు మిగులు ఉండేది గానీ సర్ఫ్, సోడా, బ్లీచింగ్ పౌడర్ వాడనిదే బట్టలు వేసేవారు సంతృప్తి చెందని దశ వచ్చేసరికి ఖర్చు లెక్కువయి మిగులు పోయింది. రాజయ్య 1982లో నాలుగెకరాల భూమి కొని బావి తవ్వించాడు. అయితే ఊరిలోని ఇతర రైతులు బోర్లు వేయడం మొదలుపెట్టేసరికి ఇతని బావి ఎండిపోయింది. దానిలోనే ఒక బోరు వేశాడు. అది రెండు సంవత్సరాల తరువాత వట్టిపోయింది. ఆ తరువాత మూడు బోర్లు వేశాడు. రెండు అసలే పారలేదు. ఒకటి కొంచెం పారుతున్నది. దాని కింద నిరుడు రెండెకరాలు వరి సాగయింది గానీ వడగండ్ల వాన వచ్చి నాశనం అయింది.. ఈ లోపల అప్పు మూడు లక్షలయింది. ఏ యేటికాయేడు పండిన పంట వడ్డీలకు సరిపోలేదు. ఇద్దరు బిడ్డలకు పెళ్ళిళ్ళు చేశాడు గానీ అల్లుళ్ళకు ఇస్తామన్న కట్నం ఇవ్వలేదు. అది కూడ బాకీయే! రాజయ్య మే 17 నాడు ఆత్మహత్య చేసుకున్నాడు.

**–కొంగంటి కొమురయ్య (45)** వరంగల్ జిల్లా హసన్‌పర్తి మండలం జయగిరి (జాగీర్)కు చెందిన కురుమ కులస్తుడు. ఒకనాడు 60 గొర్రెలుండె. వాటికి మేత దొరకక ఏడేళ్ళ కింద గొర్రెలమ్మి ఒక దొర దగ్గర 8 ఎకరాలు గుట్ట పక్కన కంచె భూమి ఎకరా 45,000 కు కొన్నాడు. బాగుచేయించి బావులు తవ్వాడు. ఒక్కదానిలో మాత్రం నీరు పడింది. నాలుగింటిలో బోర్లు వేశాడు. వాటిలోనూ నీళ్ళు పారలేదు. రెండు మూడేళ్ళుగా ఏ పంటా పండడం లేదు. ఐదు లక్షల

అప్పయింది. ఎనిమిదిలో ఆరెకరాలు అమ్మి రెండున్నర లక్షలు తీర్చాడు. ఇంకా రెండున్నర లక్షలు మిగిలాయి. పెళ్ళికెదిగిన ఇద్దరమ్మాయిలు మిగిలారు. అవివాహితుడైన కొడుకు కష్టపడి బి.కాం. పూర్తిచేశాడు గానీ ఉద్యోగం కనుచూపు మేరలో లేదు. వ్యవసాయం చేయలేడు. కొమురయ్య మే 28న ఆత్మహత్య చేసుకున్నాడు.

**–నారిశెట్టి నాగేశ్వరరావు (40)** గుంటూరు జిల్లా రాజుపాలెం మండలం గణపవరం నివాసి. సాగర్ కుడికాలవ కింద ఒకటిన్నర ఎకరం ఉండేది. చివరి భూములు కావడం వల్ల నీళ్ళు లేక ఆ భూమిని బీడుపెట్టి నాలుగెకరాల మెట్టభూమిని కౌలుకు తీసుకొని మిర్చి వేశాడు. నీళ్ళు సరిగా లేక 'తెల్లకాయ' రావడం వల్ల మిర్చి రేటు పడిపోవడం వల్ల ఆ ప్రయత్నమూ విఫలం అయింది. లక్షన్నర అప్పు పేరుకుపోగా మూత్రపిండం అమ్మి తీరుద్దామనుకున్నాడు గానీ ఏ కారణంగానో అది సాధ్యంకాక మే 23న ఆత్మహత్య చేసుకున్నాడు.

**–హర్రెడ్డి లక్ష్మారెడ్డి (42)** నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం బచ్చువారి గూడెంకు చెందిన రెండెకరాల రైతు. అందులో మామిడితోట ఉంది. అంతర్ పంటలుగా కూరగాయలు, మిర్చి వగైరాలు వేశాడు. రెండు మూడు బోర్లు వేసినా నీళ్ళు పడలేదు. రెండు లక్షల అప్పు మిగిలింది. అప్పులవాళ్ళు వచ్చి అసభ్యంగా తిట్టిపోవడంతో మే 24వ తేదీన ఆత్మహత్య చేసుకున్నాడు.

**–తిప్పన్న (35)** అనంతపురం జిల్లా కంబదూరు మండలం డి. చెన్నేపల్లి గ్రామానికి చెందిన ఐదెకరాల రైతు, దళితుడు. ఇతను నాలుగేళ్ళ క్రితం 50,000 రూపాయలు అప్పు చేశాడు. తరువాత నాలుగు సంవత్సరాలలో పంట చేతికి రాకపోవడం వల్ల ఆ అప్పు తీర్చలేకపోవడమే కాక కొత్తగా అప్పు తేవలసి వచ్చింది. ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో మళ్ళీ పెట్టుబడి కోసం ప్రయత్నం చేస్తే అప్పు ఎక్కడా దొరకలేదు. ఇక వ్యవసాయం చేసే అవకాశమే లేదని, అప్పు తీర్చే ఆశ లేదని నిస్పృహ చెంది మే 19న ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

క్రమంగా అప్పుల ఊబిలోకి నెట్టాయి. చెరువులు నాశనం కావడం వల్ల గ్రామాలలో నీటి నిలువ అనేది లేకుండ పోయింది. భూగర్భ జలమట్టం పడిపోయింది. రెండేండ్లు

వానలు పడకపోతే బావులలో ఊట తగ్గిపోయింది. బావిని మరింత లోతు చేయించవలసి వచ్చింది. అయినా ఫలితం లేకపోతే కొత్త బావి తవ్వవలసి వచ్చింది. ఆయిల్ ఇంజను పెట్టవలసి వచ్చింది. బోరు వేయవలసి వచ్చింది. అయినప్పటికీ ఫలం దక్కకపోతే భూమి బీడు పెట్టవలసి వచ్చింది.

మరొకపక్క రైతుల నిర్ణయాలతోనూ ఇష్టాయిష్టాలతోనూ నిమిత్తం లేకుండా జీవితపు ఖర్చులు పెరుగుతున్నాయి. రోగమొస్తే ప్రభుత్వ ఆస్పత్రికి పోయి బతికినా చచ్చినా ఖర్చెక్కువ కాకుండా కథ ముగించిన రోజులు పోయాయి. అతి పేదలు సహితం వేలు గుమ్మరించి ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించే స్థితి వచ్చింది. పెండ్లి ఖర్చులు అన్ని కులాలలోనూ విపరీతంగా పెరిగాయి. కట్నమంటే ఎరుగని కులాలకూ ఆ జాడ్యం అంటుకుంది. ఇంక పిల్లలలో ఒకరినైనా కొంచెం చదివించుకుందామన్న కోరిక పొరబాటున కలిగినా ఆ ఖర్చు స్వల్పం కాదు. పూర్వీకులు కట్టిచ్చిన ఇల్లు పాడయిపోతే దానిని బాగుచేసుకోవాలనుకున్నా, కొత్తది కట్టుకోవాలన్నా ఆనాడు గ్రామాలలో ఖర్చులేకుండా దొరికిన కట్టెగానీ, రాయిగానీ ఇవ్వాళ లేవు. అన్నీ డబ్బు పెట్టి కనుక్కోవలసిందే.

ఇవేవీ దురాశ వల్ల, స్థోమతను మించి బతికే ప్రయత్నం చేయడం వల్ల పెరిగిన ఖర్చులు కావు. రైతుల అదుపులో లేని కారణాల వల్ల పెరుగుతున్నవి. ఒకవైపు వర్షాభావ పరిస్థితుల వల్ల, సాగునీటి లేమి వల్ల ఎండిపోతున్న పంటలు, బీడుపడుతున్న భూములు, ఇంకొకవైపు తప్పనిసరిగా పెరుగుతున్న జీవన వ్యయం రైతులను అప్పుల ఊబిలోకి నెడుతున్నాయి. ఇంక అప్పు తీర్చలేమన్న స్థితి వచ్చినప్పుడు – అంతకంటే ముఖ్యంగా, ఇంక అప్పు పుట్టదన్న స్థితి వచ్చినప్పుడు – బలవన్మరణమే శరణ్యమవుతున్నది. అది ఆత్మహత్య రూపంలో రావచ్చు, ఆకలిచావు రూపంలోనూ రావచ్చు. పేగులలో మెతుకు ముక్క లేకుండా చస్తేనే అది ఆకలిచావు అన్న తాసీల్దార్ నిర్వచనాన్ని వదలిపెట్టి, తీవ్రమైన ఆకలి, పోషకాహార లోపం ఇతర రోగాలకూ, అంటువ్యాధులకూ తోడయినప్పుడు ప్రాణాంతకం కాగలదని గ్రహించినట్టయితే రాష్ట్రంలో ఆకలి చావులూ చాలానే జరుగుతున్నాయని గుర్తిస్తాం.

పెరుగుతున్న జీవన వ్యయాన్ని ఎదుర్కోవాలన్నా, బొటాబొటీగా సాగుతున్న జీవితాన్ని మెరుగుపరచుకోవాలన్నా సాగునీరు కల్పించుకొని, పెట్టుబడులు

సమకూర్చుకొని, అంగట్లో అమ్ముడుపోయే పంటలు పండించడమొక్కటే మార్గం. రాష్ట్రంలో లక్షలాది రైతులు ఈ మార్గాన్నే ఎంచుకున్నారు. ఇది 'వ్యవసాయ అభివృద్ధి'కి దారి తీస్తుంది కాబట్టి ప్రభుత్వానికీ ఇష్టమే. కానీ ఈ మార్గంలో ఎదురయ్యే సవాళ్ళను ఎదుర్కొనడానికి ప్రభుత్వం రైతులకు ఏ ఆసరా ఇవ్వడం లేదు. ఇది ఈ రోజు ప్రధానంగా చర్చించుకోవలసిన విషయం. ప్రభుత్వం సాగునీరు కల్పించదు, రుణాలు తగినంత ఇవ్వదు, గిట్టుబాటు ధర దక్కేటట్టు చూడదు, విత్తనాలలో, పురుగుల మందులలో, ఎరువులలో కల్తీని నిరోధించదు. కనీసం ఏవి వాడాలో, ఏవి వాడకూడదో సలహా కూడ సరిగా ఇవ్వదు. బరువంతా రైతులే మోయాలి. వారికది జీవనం సమస్య కాబట్టి చచ్చినట్టు మోస్తారు. మోయలేకపోతే చస్తారు. వారు సాధిస్తే మాత్రం ఆ 'అభివృద్ధి' పాలకుల ఘనత అవుతుంది. చస్తే అది వారి పిరికితనమో, చేతకానితనమో, దురాశో అవుతుంది.

ప్రభుత్వం ప్రాజెక్టులు కట్టి రైతులకు చవకగా నీరందించిన రోజులు ఉండేవి. పాత ప్రాజెక్టుల కింద నీళ్ళు చవకగానే ఇప్పటికీ అందిస్తున్నారు గానీ కొత్తవేవీ చేపట్టక రెండు దశాబ్దాలయింది. ఈ కాలంలో సాగునీటి కల్పన రైతులు సొంత ఖర్చుతో బోర్ల ద్వారా చేసుకోవలసి వచ్చింది. తెలంగాణ, రాయలసీమ జిల్లాలలోనూ, కోస్తా జిల్లాలలోని కొన్ని మెట్ట ప్రాంతాలలోనూ లక్షల సంఖ్యలో బోర్లు వేశారు. తగ్గిపోతున్న భూగర్భ జలమట్టాన్ని తరుముతూ బోర్లు లోలోపలికి వేసేకొద్దీ ఇవాళ వేసిన బోరు కొన్నాళ్ళకు ఎండిపోతే మరొక బోరు వేసి, అది ఎండిపోతే ఇంకొక బోరు వేసి – ఒక్కొక్కసారి వెంట వెంటనే మూడు నాలుగు బోర్లు వేసి – రైతులు భారీ వ్యయంతో సాగునీరు కల్పించుకున్నారు. బోరులకు మోటారు పెట్టుకోవాలి. మోటారుకు కరెంటు కనెక్షన్ ఇవ్వడానికి అవసరం అయ్యే ఏర్పాటు యావత్తూ రైతే చేసుకోవాలి. ఒక్కొక్క బోరుకు మోటారుతో సహా సగటున 50 వేల రూపాయలవుతుంది కాబట్టి బోర్ల కోసం లక్షలు ఖర్చు పెట్టుకున్న రైతులున్నారు.

ఖర్చుకు ఇది మొదలు మాత్రమే. ఎక్కువ దిగుబడి రావాలంటే మేలురకం విత్తనాలు వేయాలి. మంచి మంచి ఎరువులు వేయాలి. పంటకు పట్టే పురుగులు చావాలంటే ఘాటయిన మందులు వేయాలి. వీటిలో ఏది నిజంగా మేలయినదో, ఏది నిజంగా ఘాటయినదో రైతులకు చెప్పేవారు లేరు. అందుకోసమే జీతాలు తీసుకునే వ్యవసాయ శాఖ అధికారులు ఎప్పుడో కానీ పల్లెలకు రారు, వచ్చినా నిర్దిష్టమైన సలహా లివ్వరు.

**ఇవీ ఆకలి చావులే**

**ఎమ్మార్వోలూ, ఆర్డీవోలూ ఒప్పుకుంటారో ఒప్పుకోరో గానీ ఇవీ ఆకలి చావులే.**

**–నీరుడి లక్ష్మి (35)** మెదక్ జిల్లా గజ్వేల్ మండలం అహ్మదీపూర్ నివాసి. ఆమె భర్త బతికి ఉండగా వారికి ఎకరం భూమి ఉండింది. అతనికి ఏదో పేరు తెలియని రోగం ఉండింది. వైద్యానికని ఉన్న ఎకరం అమ్మేశారు గానీ అతనికి బాగు కాలేదు, చనిపోయాడు. లక్ష్మి ఇద్దరు పిల్లలను పెట్టుకొని కూలిచేసుకొని బతకసాగింది. అయితే ప్రధానంగా బోర్ల మీద ఆధారపడిన ఆ ప్రాంతపు వ్యవసాయం బోర్లన్నీ ఎండిపోవడం వల్ల లక్ష్మి వంటి కూలి వాళ్ళకు పని కల్పించలేకపోయింది. తినడానికి తగినంత తిండి దొరకక లక్ష్మి ఆరోగ్యం కూడ క్రమేపీ క్షీణించసాగింది. పోషకాహారం లేమి ఆ రోగానికి తోడయి లక్ష్మి మే 8న కన్ను మూసింది.

**–కందుకూరి నందయ్య (25)** వరంగల్ జిల్లా ధర్మసాగర్ మండలం క్యాతంపల్లి నివాసి. కుల వృత్తి వడ్రంగం. ఆ వృత్తికి అవకాశం తగ్గిపోగా సొంత భూమి 35 గుంటలకు ఎకరం 5 గుంటలు వేరొకరి దగ్గర పాలికి తీసుకున్నది జతచేసి రెండెకరాలు సాగుచేయసాగాడు. గ్రామంలోని చెరువు ఎండిపోయి, వర్షాధారం కావడంవల్ల సరిగ్గా పండక మూడేళ్ళుగా తిండికి కూడ కటకటగా ఉంది. 45 వేలు అప్పు చేశాడు. ఒక కొడుకు హైదరాబాద్‌లో కూలి చేసుకొని బతుకు వెళ్ళదీస్తున్నాడు. ఇంకిద్దరు కొడుకులూ, కూతురూ తండ్రితోనూ ఉన్నారు. 20 సంవత్సరాలుగా క్షయ రోగంతో బాధపడుతున్న నందయ్య అర్ధాకలితో బతకలేక క్షీణించిపోవడం చూసి తోటి గ్రామస్తులు మే 25న హెల్ప్‌లైన్‌కు ఫోన్‌చేసి నందయ్య ఆత్మహత్య చేసుకుంటాడేమోనని అధికార యంత్రాంగాన్ని హెచ్చరించారు. కాని అధికార యంత్రాంగం (అంటే ఎమ్మార్వో) కదిలి వచ్చేసరికే నందయ్య చనిపోయాడు. అతను ఆత్మహత్య చేసుకోలేదు కాని ఆహార లేమి, క్షయ రోగం కలిసి అతనిని మే 27న కబళించి వేశాయి.

రైతులు ఒకరిని చూసి ఒకరు, అడ్వర్టయిజ్‌మెంట్లు చూసి అందరూ నిర్ణయాలు తీసుకుంటుంటారు. చాలా తరచుగా మోసపోతుంటారు. విత్తనాలు, మందులు, ఎరువుల 'కల్తీ'కి రైతుల ఆత్మహత్యల కథలలో పెద్ద పాత్రే ఉంది. కల్తీని నిరోధించే అధికారమూ బాధ్యతా కూడ ప్రభుత్వానికి ఉన్నాయి గానీ అదేమీ అమలు కాదు.

అన్నింటికంటే ముఖ్యమైనది రుణ సదుపాయం. బోర్లు వేసుకోవడానికీ విత్తనాలూ, ఎరువులూ, మందులూ కొనుక్కోవడానికీ అవసరమైన పెట్టుబడి సగటు రైతు దగ్గర ఉండదు. ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతులు సగటున మూడు నాలుగెకరాల ఆసాములేనని గుర్తుంచుకోవాలి. వీరు పెట్టుబడుల కోసం ప్రభుత్వేతర రుణ దాతల మీద ఆధారపడవలసి రావడం ఆత్మహత్యల వెనక ఉన్న అత్యంత కీలకమైన కారణం. వ్యవసాయదారులకు పంట రుణాలూ, పెట్టుబడి రుణాలూ ఇవ్వడం కోసమే ఏర్పడిన సహకార పరపతి సంఘాలు, గ్రామీణ బ్యాంకులు, జాతీయ బ్యాంకుల వ్యవసాయ అభివృద్ధి శాఖలూ ఉన్నమాట వాస్తవమే. ఈ వ్యవస్థలు రైతు రుణ అవసరాలను ఒకనాడు కొంచెం భిన్నంగా చూసిన మాటా వాస్తవమే. అయితే 1990 లలో ఆర్థిక సంస్కరణలు మొదలయిన తరువాత, వీరికి జ్ఞానోదయమై 'అప్పు అప్పే, తీసుకున్న వాడెవడైతేనేమి – అందరికీ వ్యాపార నియమాల ప్రకారమే అప్పులిస్తాం' అని నిర్ణయించుకున్నారు. లాభార్జన కోసం పెట్టుబడి పెట్టడానికి రుణాలు తీసుకునే వర్తకుడినీ, బతకడం కోసం, బతుకు కొంచెం మెరుగుపరచుకోవడం కోసం అప్పు అడిగే రైతులనూ ఒకేరకంగా చూడసాగారు. పాత బాకీ తీర్చేదాకా కొత్త అప్పు అడగొద్దు అనసాగారు. రెండు సంవత్సరాలు వరుసగా పంట నష్టమయితే ప్రభుత్వరంగ రుణవ్యవస్థలో అప్పు పుట్టడం అసాధ్యం అయింది.

అందువల్ల ఆత్మహత్య చేసుకుంటున్న రైతులు ప్రధానంగా బాకీ ఉన్నది ప్రైవేట్ వ్యక్తులకూ, సంస్థలకూ. ప్రధానంగా ఎరువుల అంగళ్ళకూ, పురుగుల మందు అంగళ్ళకూ, మార్కెట్ యార్డులోని కమిషన్ ఏజెంట్లకూ. (ఇతర రైతులకూ, బంధు మిత్రులకూ, డ్వాక్రా గ్రూపులకూ కూడ రుణపడి ఉన్నప్పటికీ ఈ అప్పే ప్రధానం.) ఈ అప్పుకు వడ్డీ నెలకు వందకు రెండు రూపాయల నుంచి నాలుగు రూపాయల దాకా ఉంటుంది. ఆరునెలలకో, సంవత్సరానికో ఒకసారి వడ్డీని అసలుకు కలిపి మళ్ళీ లెక్క కొత్తగా రాయడం జరుగుతుంది – అంటే ఇది చక్రవడ్డీకి ఇచ్చే అప్పు. ఏ పంట కోసం అప్పు తీసుకున్నారో ఆ పంటను అప్పిచ్చిన ఆసామీకే అమ్మాలన్న నియమమూ తరచుగా ఉండడం వల్ల అమ్మకం ధర విషయంలోనూ రైతులు నష్టపోయే స్థితి ఉంది.

అట్లా కాకుండా మార్కెట్‌లోనే అమ్మినప్పటికీ ధర పలకక నష్టపోవడం తరచుగా జరుగుతుంటుంది. ఈ సంవత్సరం గుంటూరు మార్కెట్‌లో మిర్చి ధర రెండు నెలల

**...ఓడితే రైతు ఒక్కడే చస్తాడు**

రైతులు భారీగా పెట్టుబడులు పెట్టి వ్యాపార పంటలు పండించి వ్యవసాయ ఉత్పత్తులు పెంచాలని కోరుకునే వాళ్ళు సమాజంలో చాలామంది ఉన్నారు. ప్రభుత్వ మొక్కటే కాదు.

పురుగుల మందు కంపెనీల వాళ్ళు, ఎరువుల కంపెనీల వాళ్ళు కూడ అదే కోరుకుంటారు. హైబ్రిడ్ విత్తనాల తయారీదార్లూ కోరుకుంటారు. వీటి హోల్‌సేల్ డీలర్లు, రిటైల్ అమ్మకందార్లు, మార్కెట్‌లో సేఠ్‌లు, కమిషన్ ఏజెంట్లు కూడ కోరుకుంటారు. బోర్‌వెల్ కంపెనీల వాళ్ళు, రిగ్గులు తయారు చేసేవాళ్ళు, కరెంటు మోటార్లు, పైపులు తయారు చేసేవాళ్ళు కూడ కోరుకుంటారు. ఉత్పత్తి పెరుగుదల రేటు నాగరికత పురోగమనాన్ని సూచిస్తుందని నమ్మే సామాజిక శాస్త్రవేత్తలు సైతం కోరుకుంటారు. మార్కెట్ వర్ధిల్లితే అందరూ వర్ధిల్లుతారని నమ్మే ఆర్థిక శాస్త్రవేత్తలూ, ప్రపంచ బ్యాంకు పెద్దలూ కోరుకుంటారు. మండలానికొక ఇంజనీరింగ్ కాలేజి పెట్టి విద్యార్థుల కోసం ఎదురుచూస్తున్న విద్యావేత్తలూ కోరుకుంటారు. కడుపునొప్పి అంటే చాలు అపెండిసెక్టమీ నుంచి హిస్టరెక్టమీ దాకా ఏదైనా చేసేయడానికి రెడీగా తాలూకా కేంద్రాలలో సహితం కత్తులు నూరుకొని రెడీగా ఉన్న వైద్య నిపుణులూ కోరుకుంటారు. అర్బన్ మార్కెట్‌తో సంతృప్తి చెందక గ్రామాలవైపు ఆశగా చూస్తున్న టి.వి. కంపెనీల వాళ్ళు, ద్విచక్ర వాహన తయారీదార్లు మొదలయిన వారంతా కోరుకుంటారు.

పెట్టుబడులు పెరుగుతున్న వ్యవసాయ ఆర్థిక వ్యవస్థలో చిక్కుకున్న రైతులు విజయవంతంగా బయటపడితే వీళ్ళంతా వర్ధిల్లుతారు. అపజయం పాలయితే రైతు మాత్రమే చస్తాడు.

కాలంలో దాదాపు 2000 రూపాయలు పడిపోవడం సాగర్ ఆయకట్టు రైతాంగాన్ని చాలా నష్టానికి గురిచేసింది. పంట బాగా పండి, పండినదంతా ఒకేసారి మార్కెట్‌కు వచ్చినప్పుడు ధర పడిపోవడం సహజం అని వ్యాపారస్తులు అంటుండగా, వర్తకులు సిండికేట్ అయి ధర పెరగకుండా చూస్తున్నారని రైతుల అభియోగం. మద్దతు ధరకు కొనుక్కోగల ప్రభుత్వ మార్కెటింగ్ సంస్థలు చాలా పరిమితంగా కొనడం, ధర పెరిగే

దాకా ఆగడానికి కావలసిన స్టోరేజ్ వ్యవస్థ రైతులకు అందుబాట్లో లేకపోవడం రైతులకు మార్కెట్‌లో రక్షణ లేకుండా చేస్తున్నాయి.

ఈ కారణాలన్నీ కలిసి రైతులు అప్పుల విషవలయంలో చిక్కుకునేట్టు చేస్తున్నాయి. అప్పు చేసేకొద్దీ మరింత అప్పుచేసి మరింత పంట తీస్తే తప్ప ఈ అప్పు తీరని పరిస్థితి కలుగుతున్నది. బోర్లు మరింత లోతుగా వేసి మరింత ఖరీదయిన ఎరువులూ, మందులూ వాడి మరింత ఆదాయం సంపాదించడం తప్ప వేరే మార్గం రైతుకు కనబడదు. చివరికి ఇంక అప్పే పుట్టని స్థితి వచ్చినప్పుడు కథ ముగింపు కొస్తుంది. 'సరిగ్గా ఇప్పుడే ఎందుకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు?' అని చాలా మంది అడుగుతున్నారు. ఇది ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యే దశ. పెట్టుబడులు సమకూర్చుకొని విత్తనాలూ వగైరా కొనుక్కునే దశ. పోగుపడిన అప్పు కారణంగా ఇంక అప్పు పుట్టదేమోనన్న భయం పట్టుకున్న రైతుకు సమీప భవిష్యత్తు అంధకారంగా కనిపిస్తుంది. చావు ఒకానొక పరిష్కారంగా కనిపిస్తుంది. చివరి నిర్ణయానికి ఇదే కారణమని చాలా సంఘటనలలో బంధుమిత్రుల అభిప్రాయం. ఇంకొక్కసారి అప్పు పుట్టేటట్టయితే ఇంకొక్క ప్రయత్నం చేయడానికి సిద్ధపడే రైతు కూడ ఆ అవకాశం మూసుకుపోయేసరికి మృత్యువును ఆహ్వానిస్తున్నాడు.

అందుకే రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చేయవలసిన పని, ప్రస్తుత అవసరాల మేరకు వ్యవసాయ రుణాలు ఏదో ఒక రూపంలో ప్రభుత్వం నుంచి లేక ప్రభుత్వ ద్రవ్య సంస్థల నుంచి లభించే ఏర్పాటు చేయడం. ఆ ఏర్పాటు చేసి దానిని వెంటనే ఆచరణలో పెట్టి ఈ విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేసినట్టయితే ఆత్మహత్యలు గణనీయంగా ఆగుతాయి.

అంతకంటే ముఖ్యంగా, ఆత్మహత్యల వెనుక ఏవో అపసవ్యమైన కారణాలున్నాయని అనుమానించడం మానేసి అప్పుల ఊబిలో కూరుకున్న రైతాంగానికి మానసిక స్థైర్యం ఇవ్వడం మనందరి కర్తవ్యం.

1. వ్యవసాయానికి అవసరమైన పెట్టుబడి రుణాలు ప్రధానంగా ప్రభుత్వరంగ (లేక సహకారరంగ) ద్రవ్య సంస్థలే ఇచ్చేటట్టు ప్రభుత్వం విధాన రూపకల్పన చేయాలి. వ్యవసాయ రుణాలను వ్యాపార రుణాలుగా కాక జీవనానికి సంబంధించిన ఆసరాగా అర్థం చేసుకోవాలి.

2. విత్తనాలు, మందులు, ఎరువులలో కల్తీని నివారించడానికీ కల్తీకి పాల్పడే వారిని శిక్షించడానికీ ఇప్పటికే ఉన్న చట్టాలను పదునుపెట్టి సమర్థంగా అమలు చేయాలి. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే ప్రభుత్వ సిబ్బందిపైన తగు చర్య తీసుకోవాలి.

3. వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలుకు ఉద్దేశించబడ్డ ప్రభుత్వ కొనుగోలు సంస్థల పరిధినీ, వాటికి కేటాయించే నిధులనూ పెంచి రైతులు మార్కెట్‌లో నష్టపోకుండ ఆసరా కల్పించాలి. వివిధ పంటలకు తగిన స్టోరేజ్ సదుపాయం కల్పించాలి.

4. భూగర్భ జలాలపైన ఆధారపడే మెట్ట ప్రాంతాల సాగునీటి అవసరాలపైన ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. నీటి పారుదల ప్రాజెక్టుల నుంచి చెరువుల మరమ్మత్తు, భూగర్భ జలాల పెంపుదల దాకా అన్ని చర్యలూ చేపట్టాలి.

5. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం ఇంకా ఆలస్యం చేయకుండ వెంటనే ఇవ్వాలి.

**మానవహక్కుల వేదిక కరపత్రంగా వచ్చింది**

**12 జూన్ 2004**

# అక్రమ కనెక్షన్ల క్రమబద్ధం మేలు!

'అక్రమ విద్యుత్ కనెక్షన్లు' తొలగించడం మీద చాలా రభస జరుగుతున్నది.

తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీలు చేస్తున్న రభస గురించి పెద్దగా మాట్లాడుకోవడం అనవసరం. పాలనా వ్యవహారాలలో ఔదార్యం ప్రదర్శించే ఏ ప్రయత్నమైనా తలకు మించిన భారాన్ని నెత్తికెత్తుకునే ప్రమాదం ఎప్పుడూ ఉంటుంది. ఔదార్యం పట్లనే వ్యతిరేక ఉన్నవారికి అది సంతోషం కలిగించవచ్చును. 'గొప్పలకు పోదామనుకున్నావు కదూ – బాగా అయింది' అని వారు సంబరపడవచ్చు. అది వారి చవుకబారు రాజకీయనీతిని సూచిస్తుంది తప్ప వేరే ఏమీ కాదు.

వామపక్ష పార్టీలు చేస్తున్న రభసను బాధ్యత లేని వారి 'ప్రివిలేజ్'గా కొట్టి పారేయాలనిపించవచ్చును కానీ వారు – ముఖ్యంగా సి.పి.ఐ(ఎం) అంటున్న మాటలు కొంచెం ఆగి ఆలకించడం మంచిది. వ్యవసాయానికి మొత్తంగానే కరెంటు ఫ్రీ అనే బదులు కరెంటు వాడకం స్థాయిని, బోర్లు కాక ఇతర నీటి వనరుల అందుబాటును, కమతం పరిమాణం తదితర అంశాలను లెక్కలోకి తీసుకొని హెచ్చుతగ్గుల సబ్సిడీ ఇచ్చివుంటే ఉచితంగా ఉండేదని వారు అంటున్నారు. ఈ రోజు కాదు, కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత కరెంటు విధానాన్ని ప్రకటించిన రోజే అన్నారు. ఆ పని చేసి వుంటే 'అక్రమ' కనెక్షన్లన్నింటినీ క్రమబద్ధం చేసి అదే పద్ధతిలో వాటికి కూడ హెచ్చుతగ్గుల సబ్సిడీ ఇచ్చి ఉండవచ్చు. అప్పుడైనా మొత్తం ఆర్థిక భారం ఇప్పుడున్న దానికంటే ఎక్కువ ఉండేది కాదు.

అదట్లాగుంచి, అక్రమ కరెంటు అనగానే అదేదో చేయరాని దొంగతనమైనట్లు భావించడమెందుకు? కరెంటు 'దొంగిలించిన' రైతు దానిని దాచుకొని బ్లాక్‌లో అమ్ముకోడు. సమాజానికి హానికరమైనవి ఏవీ చేయడు. ఇంకొంచెం ఎక్కువ పంట

పండిస్తాడు. ఇంకొంచెం తరచుగా కడుపునిండా తింటాడు. స్థూల వ్యవసాయ ఉత్పత్తిని మరికాస్త పెంచి దేశ 'అభివృద్ధి'కి తోడ్పడతాడు.

అంటే ఇది మౌలికంగా అభివృద్ధికరమైన చౌర్యం. దానిని నిషేధించే ఆలోచనలు కాక క్రమబద్ధం చేసే ఆలోచనలు చేయడమే ఉచితం. ఆ ప్రయత్నంలో సమస్యలేవీ ఉండవని కాదు, ఉంటాయి. కానీ వాటిని అధిగమించే హేతుబద్ధమైన ప్రయత్నం దానికి జవాబవుతుందే తప్ప సమస్యలున్నాయని తప్పించుకోవడం జవాబు కాదు.

అసలు సమస్య ఎక్కడొస్తుందంటే బడుగువర్గాల జీవితాలు బాగుపడడాన్ని మనం ఇంకా 'అభివృద్ధి'గా అర్థం చేసుకోవడం లేదు. సంక్షేమంగా మాత్రమే అర్థం చేసుకుంటున్నాం. 'అభివృద్ధి' ఆదాయాన్ని తెచ్చిపెడితే 'సంక్షేమం' ఖర్చును పెంచుతుందని చెప్పి దానిని ఒక కంట కనిపెట్టి ఉంచాలనుకుంటాం. చవక బియ్యం, ఉచిత కరెంటు, ఎస్.సి, బి.సి స్కాలర్‌షిప్‌లు, వికలాంగులకు బస్‌పాసులు, ఇవన్నీ ప్రభుత్వానికి ఖర్చు పెంచే సంక్షేమ చర్యలు అనుకుంటాము కాబట్టి వీటికొక సీలింగ్ పెట్టి అంతకంటే ఎక్కువ అడగొద్దనీ ఇవ్వొద్దనీ అంటాం. అదే వెడల్పయిన రోడ్లు, టెలికాం లైన్లు, పర్యాటక కేంద్రాలు – ఇటువంటివయితే 'అభివృద్ధి'కి సంబంధించిన విషయాలనీ, వాటిపైన ఎంత ఖర్చు పెట్టగలిగితే అంత మంచిదనీ అనుకుంటాం.

కానీ నిజానికి 'సంక్షేమం' అనేది ఎంత 'అభివృద్ధో' గ్రహించినట్టయితే ఈ విషయాల గురించి మనం చర్చించే పద్ధతే మారిపోతుంది. ప్రభుత్వ ఖజానాకూ ప్రైవేట్ బ్యాంక్ అకౌంట్లకూ పెట్టుబడులను వేగంగా జమ చేసేది మాత్రమే అభివృద్ధి కాదనీ, ప్రజల జీవితాలను బాగుపరిచేదీ అభివృద్ధే అనీ గ్రహించే రోజు ఎప్పుడొస్తుందో!

బలహీనవర్గాలకు స్కాలర్‌షిప్‌లు, చవక బియ్యము, కరెంటు సబ్సిడీలు, ఉచిత వైద్యం, విద్య – ఇవన్నీ యాభైఏళ్ళుగా లేకుండినట్టయితే ఈ రోజు పక్కా ఇళ్ళలో ఉంటూ పిల్లలను అంతో యింతో చదివించుకుంటూ ఒక మోస్తరు జీవన ప్రమాణం అనుభవిస్తున్న లక్షలాది కుటుంబాలు ఎక్కడుండేవి, ఏ విధంగా ఉండేవి? ఇది 'అభివృద్ధి' కాదనీ, ప్రభుత్వానికి ఆర్థిక భారం పెంచే సంక్షేమ వ్యయం మాత్రమేననీ అనుకోగలమా?

నిజమే, ఏ పేరు పెట్టుకున్నా ప్రభుత్వ బడ్జెట్ పరిమితులను మించి సబ్సిడీలు గానీ ఉచిత సేవలుగానీ అందియ్యడం సాధ్యం కాదు. హేతుబద్ధమైన ఆదాయవ్యయ

విధానాల పరిధిని ధిక్కరించి వ్యవహరించడం విజ్ఞత కాదు. ఇదెవ్వరూ కాదనగల విషయం కాదు. అయితే ఏది హేతుబద్ధం, ఎక్కడ ఆగితే సమతుల్యం అనేవి నిర్ణయించే ముందు ఏ ఖర్చును ఏ కళ్ళతో చూస్తున్నామో కొంచెం విమర్శనాత్మకంగా గమనించాలి. సింగిల్‌రోడ్డుగా ఉన్నదాన్ని డబుల్‌రోడ్డు చేస్తున్నారంటే ఇటువంటివి ఎంత చేస్తే అంత అభివృద్ధి అనుకుంటాం. ఒక టెక్నాలజీ పార్కు స్థానంలో రెండు నెలకొల్పితే ఆహా అభివృద్ధి ఎంత వచ్చేస్తున్నదనుకుంటాం. కొత్త ఓడరేవులు కట్టినా, ఎగుమతి దిగుమతి కేంద్రాలు నెలకొల్పినా, ఆటోనగర్‌లు వెలిసినా అదే అనుకుంటాం. కానీ ఒక సోషల్ వెల్ఫేర్ హాస్టల్ పక్కనే రెండవది కడితే ఇట్లాంటివి ఎన్ని కట్టుకుంటూపోతారు, అడిగే వాడికి బుద్ధి లేకపోయినా ఇచ్చేవాడికి ఉండొద్దా అనుకుంటాం. ఉచిత కరెంటు ఇవ్వడమే తప్పనుకుంటే దొంగ కరెంటు కనెక్షన్లను తొలగించవద్దనే ఆందోళనలేమిటని విసుక్కుంటాం.

ఈ దృష్టి భేదం గురించి ఆలోచించుకోవడం అవసరం. స్కాలర్‌షిప్పులు, ఉచిత విద్యావైద్యాలు, చవక బియ్యం మొదలయినవి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలోను ప్రజా జీవనం అభివృద్ధికి తోడ్పడగా, మెట్ట ప్రాంతాలలో జీవన ప్రమాణాలను పెంచిన ప్రధాన విషయం చవక కరెంటు. అది లక్షలాది కుటుంబాలకు రెండు పూటలా తిండి పెట్టింది. తిండి వెతుక్కునే ఆరాటం నుండి జీవితాలను ఒకింత ముందుకు తీసుకుపోయింది. దొంగ కరెంటు కనెక్షన్లు అనే వాటిని ఈ అభివృద్ధిని ఇంకొంత మందికి అందిచ్చేవిగా చూసినప్పుడే వాటిని ఏం చేయాలో హేతుబద్ధంగా అర్థం చేసుకోగలుగుతాం.

ఆర్థిక విధానాలను అర్థం చేసుకోవడంలో మామూలుగానే ఉండే ఈ దృష్టి లోపాన్ని చంద్రబాబు పాలన బాగా పెంచింది. పెట్టుబడులను పెంచేది మాత్రమే అభివృద్ధి అనీ, కేవలం బతుకుల్ని బాగు చేసే ఖర్చు అభివృద్ధికి నష్టకరమయిన వ్యయం అనీ అతను దాదాపు పదేళ్ళు మనకు నూరిపోశాడు. దీనిని కూడ అభివృద్ధిగా చూడడం అసాధ్యం చేశాడు. ఒకటిరెండు వాక్యాలనే పదేపదే ఊదరగొట్టినట్టు ప్రచారం చేసే అతని మాటలశైలి మెదళ్ళను మొద్దుబార్చింది. దీని నుండి బయటపడడానికి తెలుగుజాతికి ఎంతకాలం పడుతుందో.

**ప్రజాతంత్ర**

**5 సెప్టెంబర్ 2004**

# ఉచిత విద్యుత్తుకు ఉచిత సంస్కరణలు

ఉచిత విద్యుత్ విధానాన్ని సవరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అనివార్యం అని మంత్రులూ, కాంగ్రెస్ నాయకులూ వివరిస్తున్నారు. వ్యవసాయదారులందరికీ అన్ని వేళలా కరెంటు ఉచితంగా ఇవ్వడం తెలివయిన పాలసీ కాదన్న ఇంగితం మొదటే ఎందుకుండలేదో మాత్రం వారు చెప్పడం లేదు.

వ్యవసాయరంగానికిచ్చే రాయితీలను పరిశ్రమలకిచ్చే రాయితీలతో పోల్చినప్పుడు వ్యవసాయరంగంలో అందరికీ అన్ని వేళలా కరెంటు ఉచితంగా ఇస్తే మాత్రం తప్పేముందనిపిస్తుంది. 'ప్రైవేట్' పెట్టుబడి అని పిలవబడేది ఎన్ని రకాలుగా ప్రజల సొమ్ము తిని బతుకుతుందో లిస్టు రాసుకుంటే దానిని మించిన సబ్సిడీ రైతులు కాదు, గుడిసెవాసులు కాదు, ఆదివాసులు కాదు, ఎవరూ పొందటం లేదని అర్థం అవుతుంది. అన్నిటినీ మించిన రాయితీ – ప్రభుత్వ రుణ వ్యవస్థ నుండి రెండు చేతులా అప్పులు చేసేసి చివరికి సగమో ముప్పావో మాఫీ చేయించుకొని కంపెనీని మూసేసి ఇల్లు చేరుకునే సదుపాయం. ఇది బి.ఐ.ఎఫ్.ఆర్ చేసే సర్దుబాట్ల రూపంలో ఉంటుంది. రిజర్వ్ బ్యాంకు అడపాదడపా ప్రకటించే 'వన్ టైం సెటిల్‌మెంట్'ల రూపంలోనూ ఉంటుంది.

కంపెనీ మునిగినా డైరెక్టర్లు మునగరనేది 'కంపెనీ' అనే సృష్టిలోనే ఉన్న అద్భుత సదుపాయం కాబట్టి ఈ ప్రహసనం ఫలితంగా అసమర్థులు, అయోగ్యులు, అవినీతిపరులు అయిన వారు తాత్కాలికంగా పారిశ్రామికవేత్తలుగా అవతారమెత్తి మంది సొమ్ము తినింది తిని, దాచింది దాచి చేతులు దులుపుకొని హాయిగా బతకగలుగుతున్నారు. దీనితో పోలిస్తే వ్యవసాయ రంగానికి సంపూర్ణంగా ఉచిత విద్యుత్ ఇచ్చినా సమాజం భరించే బరువు చాలా తక్కువే.

ఇది నిజమే కానీ దీని భావం సంపూర్ణ ఉచిత విద్యుత్తు తెలివయిన పాలసీ అని కాదు. పరిశ్రమల చేతిలో ప్రజల సొమ్ము దుబారా అయ్యే వ్యవహారనీతిని చక్కదిద్దాలని మాత్రమే. ఏ వనరులు ఎవరికి ఏ రేటుకు ఇవ్వాలన్న దానికి సామాజిక న్యాయమూ హేతుబద్ధతా ప్రమాణంగా గల పాలసీ ఉండాలి. అన్నీ అందరికీ ఉచితంగా ఇవ్వాలన్న దానిలో సామాజిక న్యాయమూ లేదు, హేతుబద్ధతా లేదు.

అయితే ప్రభుత్వం చేసిన సవరణ ఈ ప్రమాణాలకు నిలుస్తుందా? పూర్తి వివరాలింకా బయటికి రాలేదు గానీ పత్రికలలో వచ్చిన వార్తలను బట్టి చూస్తే అనేక సందేహాలు రావడం సహజం. రైతుకు ఉండే భూమి పరిమాణాన్నీ, ఆయా ప్రాంతాలలో సగటున భూగర్భజలాల లోతునూ లెక్కలోకి తీసుకుని భిన్నమైన రేట్లు నిర్ణయించడం ఉచితంగా ఉండేది. దాని బదులు ప్రభుత్వం విచిత్రమైన వర్గీకరణ చేసింది.

రబీలో బోర్ల కింద వరి సాగు చేసేటట్టయితే యూనిట్‌కు 50 పైసలు కట్టవలసి ఉంటుందని అన్నారు. ఖరీఫ్‌లో బోరు కింద, కాలవ కింద వరి పండించిన రైతు ఆ తరువాత రబీలో కూడ బోరు కింద వరి పండించినట్లయితే కరెంటు చార్జీ కొంత కట్టవలసి ఉంటుందంటే అదో రకం. రబీలో బోరు కింద పండించే వారంతా ఖరీఫ్‌లోనూ సాగునీటి సదుపాయం వాడుకొని ఉంటారని ఊహించుకొని శిక్ష విధించడం అన్యాయం. తెలంగాణలోనూ రాయలసీమలోనూ కూడ ఖరీఫ్‌లో వర్షాధారంగా ఏదో ఒకటి పండించుకొని, రబీలో మాత్రమే బోరు కింద వరి పండించే వారు అనేకులు. వారు బోరు వాడేదే రబీ సీజన్‌లో మరి. వారికి ఉచిత కరెంటు ఎందుకు కోత పెట్టాలి? నెల్లూరు, చిత్తూరు జిల్లాల వ్యవసాయదారులు ఇంకొక ప్రశ్న అడుగుతున్నారు. ఆ జిల్లాలలో వర్షాలు వచ్చేదే ఈశాన్య రుతుపవనాల నుండి. వారికి రబీయే మొదటి పంట. వారికి కూడా ఈ నియమం వర్తిస్తుందా?

నదీ జలాల ప్రాజెక్టు ఆయకట్టులోని భూములన్నిటికీ నీళ్ళు వస్తున్నాయని ఊహించుకొని ఆ నీళ్ళు ఈ నీళ్ళూ కలిపి వాడుకునేటట్టయితే దీని ఖర్చు కొంత భరించవలసి ఉంటుందని ప్రభుత్వం భావిస్తున్నట్టుంది. కాని కేవలం కాగితం మీద ఆయకట్టులో ఉండి నది నీటిని ఎన్నో ఏళ్ళుగా చూసి ఎరుగని వ్యవసాయ భూములు లక్షల ఎకరాలలో వున్నాయి. నిజాంసాగర్, రాజోలిబండ, తుంగభద్ర ఎగువ కాలవ, తుంగభద్ర దిగువ కాలువలు తమ ఆయకట్టులో 50 లేక 60 శాతానికి మించి నీళ్ళివ్వక చాలాకాలం అయింది. సోమశిల, నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్‌లలో ఆ

స్థాయిలో కాకున్నా 'టెయిల్ ఎండ్' ఆయకట్టు తడవని పరిస్థితి తరచుగా ఉంటూనే వుంది. మన రాష్ట్రంలో ఆయకట్టును మొత్తం మీద కాపాడుకున్న డెల్టాయేతర ప్రాజెక్టు ఒక్క కె.సి. కెనాల్ మాత్రమే. ఈ పరిస్థితిలో, ఆయకట్టుదారులందరినీ ఒకే గాటన కట్టి మెట్ట ప్రాంతం రైతులకన్నా భిన్నంగా చూస్తామంటే రెంటికీ చెడ్డవాళ్ళు ఏం కావాలి?

కరెంటు ఉచితంగా పొందే రైతులు కరెంటు వాడకంలో పొదుపు పాటించాలనీ, పాటించకపోతే ఛార్జీ కట్టవలసి ఉంటుందనీ అంటున్నారు. పొదుపు పాటించడం అంటే ఏమిటో ప్రభుత్వమే నిర్వచిస్తున్నది కూడ. ఫలానా రకం పైపులే కొనాలన్నది దీనిలో ముఖ్యమైనది. అవి బజార్లో ఉంటాయని హామీ ఇస్తుందా? ఇవ్వగలదా? దొరకకపోతే వాటి కోసం రైతు ఎన్ని ఊర్లు తిరగాలి? ఎరువులు, మందులు, పైపులు మొదలయిన అవసరాల కోసం పట్టణాలకు వచ్చిపోక తప్పని రైతుల ఇక్కట్లు తెలిసినవే. తరచుగా, మంచి సరుకు దొరకకపోతే దొరికింది కొనుక్కుని ఇంటి ముఖం పట్టక తప్పదు రైతుకు. అటువంటిది ఫలానా రకం సరుకు వాడితేనే కరెంటు ఉచితం అనడం రైతుపైన భారాన్ని పెంచడమే అవుతుంది.

గ్రామీణ విద్యుత్ గురించి చర్చ ఎప్పుడొచ్చినా సబ్సిడీ ఇవ్వడం ఇవ్వకపోవడం గురించే తప్ప వేరే ఏ ప్రభుత్వ బాధ్యత గురించీ ప్రస్తావించరు. విద్యుత్ ఛార్జీలు వసూలు చేయడం నాణ్యమైన కరెంటు సరఫరా చేయడం కోసమేనని చంద్రబాబు నాయుడు కాలం నుండి వింటూనే ఉన్నాము కానీ కరెంటు సరఫరాలో నాణ్యత పెరిగింది శూన్యం. లో వోల్టేజీ సమస్య, త్రీ ఫేజ్ సమస్య, నిరంతరాయమైన సరఫరా సమస్య, ట్రాన్స్‌కో ఉద్యోగుల నిర్లక్ష్య వైఖరి సమస్య – వీటిలో ఏ ఒక్క దానిలోనూ గుణాత్మకమైన మార్పు లేదు. దాని కోసమేనని ప్రకటించిన విద్యుత్ రంగ పునర్వ్యవస్థీకరణ మాత్రం జరిగిపోతూ వుంది.

భూమిలో 150 అడుగుల లోపలే నీళ్ళు దొరికే ప్రాంతాలున్నాయి. 300 లేక 400 అడుగుల లోతుకు పోతే తప్ప నీళ్ళు దొరకని ప్రాంతాలున్నాయి. ఇంకా లోతుకు పోవలసినవీ ఉన్నాయి. ఒక్కొక్క కమతానికీ ఈ లెక్క తీయడం కష్టమనుకుంటే స్థూలంగా ఒక మండలాన్ని గానీ తాలూకాను గానీ తీసుకొని సగటున ఎంత లోతులో నీళ్ళు దొరుకుతాయన్న అంచనా వేయవచ్చు. దీనినొక ప్రమాణంగానూ తీసుకొని

ఒక ఇండెక్స్ తయారు చేయవచ్చు. దానిననుసరించి పూర్తి ఉచిత కరెంటు నుండి యూనిట్‌కు 50 పైసల ఛార్జీ దాకా రేట్లు నిర్ణయించడం ఉచితంగా ఉంటుంది. 50 పైసలకే ఇచ్చినా అది సబ్సిడీయే కాబట్టి దీని నుండి కార్పొరేట్ సేద్యాన్ని, 'ఫార్మ్ హౌస్' సేద్యాన్నీ పూర్తిగా మినహాయించాలి. లేకపోతే పట్టణాలలో 'అభివృద్ధి' పేరిట పెట్టుబడి రుణాలు, వనరులు చవగ్గా పొందుతున్నవారే 'అన్నదాత' ముఖం తగిలించుకొని గ్రామీణ సబ్సిడీ కూడ పొందే ప్రమాదం ఉంది.

రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన సవరణ ఇటువంటి రూపమేదో తీసుకుంటే హేతుబద్ధంగాను, న్యాయంగాను ఉంటుంది. పత్రికలలో ప్రచురించిన ప్రతిపాదన మాత్రం న్యాయమైనదిగా తోచడం లేదు.

**ప్రజాతంత్ర**

**13 ఫిబ్రవరి 2005**

# 421 జీవో
# జీవోలోనూ, అమలులోనూ లోపాలే

రైతుల ఆత్మహత్యలను నివారించడానికి ఏం చేయాలో సూచించేటందుకు ఒక కమిషన్‌ను నియమించబోతామనీ, మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించే ఏర్పాటు చేస్తామనీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రకటించింది.

ఆ ప్రకారమే నివారణ మార్గాల అధ్యయనం కోసం జయతి ఘోష్ కమిషన్‌ను నియమించి, పరిహారం నిమిత్తం జీవో నెం. 421, రెవెన్యూ శాఖ (తేదీ: జూన్ 2004) జారీ చేసింది.

జీవో నెం. 421 అమలు గురించి కరీంనగర్, గుంటూరు, కృష్ణా, అనంతపురం, రంగారెడ్డి, మెదక్, నల్లగొండ, వరంగల్, కడప జిల్లాలలో పర్యటించి సేకరించిన సమాచారం ఆధారంగా మా వేదిక ఈ నివేదికను రూపొందించింది

రైతుల ఆత్మహత్యలు, వాటిపైన అధికార విచారణలు, నష్టపరిహారం మంజూరు లేక నిరాకరణ నిత్యం జరుగుతూనే ఉన్నాయి కాబట్టి ప్రభుత్వం ఎంతమందికి నష్ట పరిహారం ఇచ్చింది అనే ప్రశ్నకు తుది సమాధానమేదీ లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత 2000కు పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారని పత్రికలలో వచ్చిన వార్తలు తెలుపుతున్నాయి. అందులో ఈ సంవత్సరం మార్చి 10వ తేదీ నాటికి 665 కేసులలో మృతుల కుటుంబాలకు నష్టపరిహారం అందజేసినట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఆమోదం పొంది ఇంకా నష్టపరిహారం అందజేయని కేసులు కూడ కలుపుకున్నా, మొత్తం మీద 50 శాతానికి మించి నష్టపరిహారం పొందలేదని భావించవచ్చు.

నష్టపరిహారం నిరాకరించినవన్నీ అబద్ధపు కేసులే అయివుంటే ఇందులో ఆందోళన చెందవలసిందేమీ లేదు. కానీ అన్నీ అబద్ధపు కేసులు కావు. కొన్ని అటు వంటివి కూడా ఉన్నాయి కానీ జీవో 421లోని లోపాలు, దాని అమలులోని లోపాలు నష్టపరిహారం నిరాకరణకు ముఖ్య కారణం.

## జీవో 421లో ఏముంది?

'వ్యవసాయ ఆదాయానికి సంబంధించిన సమస్యల' కారణంగా ఆత్మహత్యకు పాల్పడ్డవారి కుటుంబాలకు ఆర్థికంగా ఆధారం కల్పించడానికి లక్ష రూపాయలు, బాకీలు తీర్చడానికి గరిష్ఠంగా 50,000 రూపాయలు ఇచ్చే ఏర్పాటు చేస్తుంది ఈ జీవో. 'వ్యవసాయ కార్యకలాపాలు, ఆర్థిక సమస్యలు, సమాజం ఎదుట అవమానం, తత్ఫలితమైన ఆత్మహత్య' అనే అంశాల మధ్య సంబంధం రుజువయినట్టయితేనే ఈ నష్టపరిహారం ఇవ్వడం జరుగుతుందని అంటుంది.

ఒక ఆత్మహత్య ఘటన ఈ పరిధిలోకి వస్తుందా రాదా అని నిర్ణయించడానికి ఈ జీవో ఒక త్రిసభ్య కమిటీని నియమిస్తుంది. సంబంధిత డివిజన్‌కు చెందిన ఆర్డీవో, డిఎస్‌పి, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఈ కమిటీలో సభ్యులు. వీరు ఆ ఘటన నష్టపరిహారం పొందగల ఆత్మహత్యా కాదా అని నిర్ణయిస్తారు. తదుపరి అప్పుల వాళ్ళతోనూ, ఊరి పెద్దలతోనూ, కుటుంబ సభ్యులతోనూ కూర్చొని అన్ని బాకీలూ ఒకేసారి సెటిల్ చేయడం కోసం ప్రయత్నిస్తారు.

నష్టపరిహారం ఇవ్వడానికి ఈ జీవో ప్రకటించిన ప్రమాణంలోనే అస్పష్టత ఉంది. 'వ్యవసాయ ఆదాయానికి సంబంధించిన సమస్యలు' అంటే అర్థం ఏమిటి? రైతుకు ఆదాయం వ్యవసాయం నుండి వస్తుంది కాని ఖర్చు వ్యవసాయ సంబంధమైనదీ ఉంటుంది (ఎరువులు, మందులు, విత్తనాలు, కరెంటు వగైరాల కోసం), ఇతరమూ ఉంటుంది. దైనందిన ఖర్చులు, పిల్లల చదువులు, అందరి ఆరోగ్యం, కూతుర్ల పెళ్ళిళ్ళు, వగైరాలు తప్పనిసరి ఖర్చులు. ఈ ఖర్చుకు చాలినంత ఆదాయం వ్యవసాయం నుండి రానట్టయితే, ఈ రాకపోవడం అప్పుడప్పుడు కాక ప్రతీ సంవత్సరమూ జరిగినట్టయితే రాబడికీ ఖర్చుకూ మధ్య ఏర్పడే ఖాళీని పూరించడానికి అప్పు చేయక తప్పదు. సంవత్సరం సంవత్సరం చేసిన అప్పు పోగుపడి ఇంక తీర్చలేమనుకున్నప్పుడో, ఇంక అప్పు పుట్టదనుకున్నప్పుడో ఆత్మహత్య చేసుకోవడం

తప్ప గత్యంతరం లేదన్న మానసిక స్థితికి చేరుకోవడం, ప్రాణం తీసుకోవడం జరుగుతున్నది.

అవసరమయిన ఖర్చుకూ వ్యవసాయ ఆదాయానికీ మధ్యనున్న అంతరాన్ని పూడ్చలేని నిస్సహాయ స్థితిని చేరుకోవడం అనేదాన్ని 'వ్యవసాయ ఆదాయానికి సంబంధించిన సమస్య' అని క్లుప్తీకరించదలచుకుంటే అభ్యంతరం చెప్పనక్కరలేదు గానీ, దాని భావం ప్రజలకూ అధికారులకూ కూడా స్పష్టంగా ఉండాలి. దానిని విడమరచి చెప్తూ, 'వ్యవసాయ కార్యకలాపాలు, ఆర్థిక సమస్యలు, సమాజం ఎదుట అవమానం, తత్ఫలితమైన ఆత్మహత్య'ల మధ్య సంబంధం రుజువయితేనే మృతుని కుటుంబానికి నష్టపరిహారం దక్కుతుందన్నారు. ఇక్కడ 'ఆర్థిక సమస్యలు' అనే దానిని కేవలం వ్యవసాయ ఆదాయానికీ, వ్యవసాయ సంబంధమైన వ్యయానికీ చెందిన సమస్యగా అర్థం చేసుకోకుంటే తప్పు లేదు. ఆ విధంగానే అర్థం చేసుకోవాలని జీవోలో అనలేదు. కానీ ఏ విధంగా అర్థం చేసుకోవాలో స్పష్టంగా చెప్పనూ లేదు.

దీని వల్ల చాలా కుటుంబాలు నష్టపరిహారం పొందలేక పోయిన వైనాన్ని చూస్తే తప్ప ఈ అస్పష్టత కలిగించిన నష్టం అర్థం కాదు. అప్పు తీసుకున్నది కేవలం వ్యవసాయ అవసరాల కోసం అయినట్టయితేనే ఆ అప్పు తీర్చలేక ఆత్మహత్య చేసుకున్న ఘటనకు జీవో 421 వర్తిస్తుందని ఎమ్మార్వోలూ, ఆర్డీవోలూ అంటున్నారు. జీవో అస్పష్టంగా ఉందే తప్ప కచ్చితంగా వ్యవసాయేతర అవసరాల కోసం తీసుకున్న అప్పు లెక్కలోకి రాదని అనలేదు కదా అంటే, ప్రభుత్వం ఆ రకంగా 'ఇన్‌స్ట్రక్షన్స్' ఇచ్చిందని అంటున్నారు.

కొన్ని ఉదాహరణలు చూద్దాం.

కరీంనగర్ జిల్లా కొడిమ్యాల మండలం దమ్మయ్యపేట గ్రామస్తురాలు పులి సత్తవ్వ 2004 సెప్టెంబర్ 23న పురుగుల మందు తాగి చనిపోయింది. ఆమె భర్త గౌరయ్యకు గుండె జబ్బు తీవ్రంగా ఉన్న కారణంగా వ్యవసాయ పనులు ఆమే చూసుకునేది. వారికి రెండున్నర ఎకరాలుండె. బావి కూడ ఉండింది. బావి కింద వరి పండించేది. నాలుగేళ్ళ కింద 80 వేలు ఖర్చుపెట్టి బావి రిపేరు చేయించి మోటార్ పెట్టింది. అప్పటి నుండి బావిలో నీళ్ళు లేవు. ఆ తరువాత ఒక బిడ్డకు పెండ్లి చేసింది. దానికి లక్షా 80 వేలు ఖర్చయింది. భర్తకు అవసరమయ్యే వైద్యానికి నెలకు 800 రూపాయలు ఖర్చయ్యేవి. మూడేళ్ళుగా వర్షాలు లేక పంట దిగుబడి బాగా దెబ్బతినగా, అప్పు లక్షా

50 వేలకు చేరుకుంది. సెప్టెంబర్ 23 నాడు సత్తవ్వ బావికాడికి పోయి ఏడ్చింది. ఆ తరువాత పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. అయితే ఆమె అప్పు చేసింది బిడ్డ పెండ్లి కోసం అన్న మిష మీద ఆమె కుటుంబానికి అధికారులు నష్టపరిహారం నిరాకరించారు.

కృష్ణా జిల్లా గంపలగూడెం మండలం మల్లెంపాడు గ్రామానికి చెందిన మానుకొండ రాంబాబుకు పది ఎకరాల భూమి ఉండేది. ఇది సాగర్ ఎడమ కాలవ చివరి భూమి. నాలుగేళ్ళుగా కాలవ నీళ్ళు రావడం లేదు. బోరుగానీ వేరే ఇతర నీటి వనరు గానీ లేదు. పత్తి, మిర్చి వేయగా ప్రతీ సంవత్సరం నష్టం రాసాగింది. పంట బాగున్న రోజులలో రెండున్నర లక్షలు పెట్టి ఇల్లు కట్టాడు. ఆ బాకీ మిగిలిపోయింది. ఆ తరువాత జరుగుబాటు కోసం తీసుకున్న అప్పులు కూడ తోడయి బాకీ బాగా పెరిగింది. మూడు ఎకరాలు అమ్మి తీర్చింది తీర్చగా ఇంకా ఆరు లక్షల అప్పు మిగిలింది. 21 జూన్ 2004 నాడు రాంబాబు పొలం దగ్గరే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పు ఇల్లు కట్టడం కోసం తీసుకున్నాడని చెప్పి అతని కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వలేదు.

ఇటువంటి ఉదాహరణలు దాదాపు అన్ని జిల్లాలలోనూ ఉన్నాయి.

'వ్యవసాయ కార్యకలాపాల'తో ముడిపడి ఉన్న ఆర్థిక సమస్యలే అయి వుండాలి అనడం ఇంకొక రకంగా కూడ వారికి అన్యాయం చేసింది. వ్యవసాయం చేసి చేసి అప్పులపాలయి, ఇంక చేసే పరిస్థితి లేక మానేసి కూలి చేసుకొని బతుకుదామంటే కూలి కూడ సరిగ్గా దొరకక, అప్పు ఎన్నటికీ తీరే మార్గం కనిపించక ఆత్మహత్య చేసుకుంటే జీవో 421 ప్రకారం అది రైతు ఆత్మహత్య కాదు అని అధికారులు అంటున్నారు.

కరీంనగర్ జిల్లా కోనరావుపేట మండలం సుద్దాల గ్రామస్తుడు సోమశెట్టి కిష్టయ్యకు మూడు ఎకరాల భూమి ఉంది. ఊరందరిలాగే పత్తి పండించడం మొదలు పెట్టాడు. మూడేళ్ళుగా వర్షాలు లేక పంట విపరీతంగా నష్టమయింది. 2003లో రెండెకరాలు అమ్మేశాడు. మిగిలిన ఒక ఎకరం పెట్టుబడులు లేక ఆ ఏడు, మరుసటి ఏడు కూడ బీడు పెట్టాడు. లక్షా 30 వేల అప్పు తేలింది. ఊరిలో చిట్టీ పాడి ఏవయినా పని దొరుకుతుందేమోనని బొంబాయికి పోయాడు. ఇంత తిని ఇంత మిగిల్చి మెల్లగా అప్పు తీర్చుదామనుకున్నాడు. అక్కడ కూడ పని దొరకక వెనక్కి వచ్చి 2004 ఆగస్టు

19న ఆత్మహత్య చేసుకున్నాడు. రెండేళ్ళుగా వ్యవసాయమే చేయడం లేదు కాబట్టి ఇది వ్యవసాయ కార్యకలాపాలతో ముడిపడిన ఆర్థిక సమస్యల వల్ల సంభవించిన మరణం కాదని చెప్పి అధికారులు కిష్టయ్య కుటుంబానికి నష్టపరిహారం మంజూరు చేయలేదు.

అప్పుల బరువు వల్ల కుటుంబంపైన పడే ఒత్తిడి ఆ ఇంటి ఆస్తికి యజమాని అయిన మగవాడిపైన మాత్రమే పడదు. ఇతరులపైన కూడా పడుతుంది. వారు కూడ తరచుగా కుటుంబానికి సంపాదనాపరులు అయివుంటారు. అప్పుల భారానికి తట్టుకోలేక వారు సహితం ప్రాణం తీసుకోవచ్చు. కానీ వారు 'రైతులు' కారు – అంటే భూమి వారి పేరిట లేదు – అన్న మిషతో ఆ చావులు జీవో 421 పరిధిలోకి రావని అధికారులు అంటున్నారు.

వరంగల్ జిల్లా ధర్మసాగర్ మండలం దేవునూరుకు చెందిన చిట్యాల పద్మ 2004 జూన్ నెల 19న ఆత్మహత్య చేసుకుంది. ఆమె భర్త పాల్ ఎకరం 35 గుంటలకు యజమాని. వారి కుటుంబానికది చాలని కారణంగా పద్మ కూలికి పోయేది, పాల్ పాలేరుగా పనిచేసేవాడు. వారికి 12, 10, 4 సంవత్సరాల వయస్సున్న ముగ్గురు కుమార్తెలున్నారు. చేయగా చేయగా రూ. 80 వేలు చేరుకున్న అప్పుంది. 2004లో 25 గుంటలలో వరి పంట పెట్టగా రాళ్ళవాన కురిసి అది మొత్తం ధ్వంసం అయింది. ఆ బాధతో పద్మ ఆత్మహత్య చేసుకుంది. భూమి యజమానురాలు ఆమె కాదన్న కారణంగా అది రైతు హత్య కాదన్నారు.

వరంగల్ జిల్లాలోనే హసన్‌పర్తి మండలం బైరాన్‌పల్లిలో ముల్కలపల్లి లక్ష్మి 14-6-2000 తేదీ నాడు ఆత్మహత్య చేసుకుంది. ఆమె భర్త పేరిట ఎకరన్నర భూమి ఉండింది. లక్షా 30 వేల అప్పు కూడ ఉండింది. బిడ్డ పెండ్లికి 60,000 కట్నం ఇస్తామని ఒప్పుకొని 10,000 మాత్రమే ఇచ్చిన కారణంగా అల్లుడు బిడ్డను వెనక్కి పంపాడు. బావి కింద కూరగాయలు పండించుకునేవారు గానీ బావి ఎండిపోవడంతో ఆ ఇంత భూమి కూడ అమ్ముకున్నారు. పోగైన బాకీ తీర్చే మార్గం కానరాక లక్ష్మి ఆత్మహత్య చేసుకుంది. ఎఫ్ఐఆర్‌లో లక్ష్మి చావుకు కడుపునొప్పి, భర్త తాగుడు, మానసిక ఒత్తిడి కారణం అని రాశారు. భూమిగానీ, దానిని నమ్ముకొని చేసిన అప్పుగానీ ఆమె పేరు మీద లేనందున ఆమె మానసిక వేదనకు అప్పుల బాధ అని అధికారులు పేరు పెట్ట లేదు. జీవో 421 కింద ఆమె కుటుంబానికి నష్టపరిహారమూ ఇవ్వలేదు.

చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే పై రెండు ఉదంతాలలోనూ ఆ అప్పు ఎన్నడయినా తీర్చడం అంటూ జరిగి ఉంటే అందులో లక్ష్మి శ్రమ, పద్మ శ్రమ వారి భర్తల శ్రమతో సమానంగా ఉండేది. అయినప్పటికీ వారి చావుకు ఆ అప్పుతో సంబంధం లేదనే ప్రభుత్వం భావించింది.

నష్టపరిహారం చాలా కేసులలో ఇవ్వకపోవడానికి మరొక కారణం శవానికి పోస్టుమార్టం జరగలేదు అనేది. పోస్టుమార్టం జరగకపోతే ఏమి? మృతుని చావు ఆత్మహత్య వల్లనే జరిగిందన్న రుజువు అవసరం కాబట్టి పోస్టుమార్టం జరిగి తీరాలంటున్నారు. ఆత్మహత్య అన్న నిర్ధారణ జీవో 421 పరిధిలో అవసరమే గానీ దానికి పోస్టుమార్టం తప్పనిసరిగా ఎందుకు జరగాలి? శవ పంచనామా ఎట్లాగూ జరుగుతుంది. పోలీసులూ ఎమ్మార్వో హాజరవుతారు. గ్రామస్తులు సాక్షులుగా ఉంటారు. శవ పంచనామాలో మరణానికి కారణం ఆత్మహత్యేనని వీరంతా అభిప్రాయపడినట్టయితే అదెందుకు సరిపోకూడదు? జీవో 421 కింద జరిపే విచారణ క్రిమినల్ నేర విచారణ కాదు కదా!

నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం బాబుసాహెబ్ పేటకు చెందిన జవ్వాది లచ్చయ్య నాలుగు ఎకరాల రైతు. అదొక కుంట కింద భూమే గానీ ఆ కుంట నీటిని గ్రామస్తులు పొలాలకు పారించకుండా నిలువ ఉంచుకోవాలని నిర్ణయించుకోవడంతో ఆయకట్టులో ఉండీ లేనట్టయింది. సాగర్ ఎడమ కాలువ నీళ్ళు కూడ కొంత అందేవి గానీ నాలుగేళ్ళుగా అదీ లేదు. బావి తవ్వితే రేగడి మట్టి కావడం వల్ల రెండుసార్లూ కూలిపోయింది. బోర్లు కూడ రెండు వేయించాడు గానీ అవి కూడ ఫలించలేదు. ఇది కాక అతని అనారోగ్యం కారణంగా ఆస్పత్రి ఖర్చు బాగా అయింది. వెరసి, రెండు లక్షల అప్పయింది. 2004 మార్చి 23 నాడు అతను ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్య నేరం అని ఎవరో చెప్పడం వల్ల కేసవుతుందని భయపడి అతని కుటుంబ సభ్యులు పోలీస్ కంప్లయింట్ ఇవ్వలేదు, శవానికి పోస్టుమార్టం జరగలేదు. అతను ఆత్మహత్య చేసుకున్నాడన్న విషయంలో ఎవరికీ విభేదం లేదు గానీ పోస్టుమార్టం జరగలేదని చెప్పి నష్టపరిహారం ఇవ్వలేదు.

అధికారులకు తెలిసిన తరువాత కూడ పోస్టుమార్టం జరగని సందర్భాలలో పోస్టుమార్టం జరగలేదు అని చెప్పి నష్టపరిహారం ఇవ్వని ఉదంతాలున్నాయి. ఇది పూర్తిగా అన్యాయం. ఒక వ్యక్తి అనుమానాస్పద స్థితిలో చనిపోతే పోస్టుమార్టం

జరిపించడం ప్రభుత్వం బాధ్యత. చనిపోయిన వారి కుటుంబానిది కాదు. కుటుంబ సభ్యులు ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా ప్రభుత్వ అధికారులు జరిపించాలి. (పరిటాల రవి మృతదేహానికి రెండవ పోస్టుమార్టం జరిపించడం కోసం అతని కుటుంబం సమ్మతి పొందడానికి సిబిఐ వారు పడిన ఆరాటాన్ని గురించి పత్రికలలో చదివినవారు అదే చట్టం కాబోలుననుకొని ఉండవచ్చు. అది చట్టం కాదు. పరిటాల రవి బతుకులోనే కాదు, చావులో కూడ చట్టం కంటే ఎక్కువని రుజువు చేసిన ఘట్టం మాత్రమే.)

కడప జిల్లా పోరుమామిళ్ళ మండలంలోని అక్కలరెడ్డిపల్లి ఒక మారుమూల గ్రామం. ఆ ఊరిలో ఎనుముల వీరయ్య అనే రైతు ఉండేవాడు. కులం రీత్యా వాళ్ళు దేవాంగులు. అయితే కుల వృత్తి 15 ఏళ్ళ కిందే నాశనం కాగా, ఉన్న అర ఎకరం భూమికి తోడు రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేయసాగాడు. ఆ భూమికి ఆధారంగా బావి ఉండింది గానీ ఊరిలో మిగిలిన రైతులు బోర్లు వేయడంతో బావి ఎండిపోయింది. వర్షాధారంగా వేసిన పంటలో జరుగుబాటు కాకపోగా 30 వేలు అప్పు మిగిలింది. 2004 జూన్ 16 నాడు అతను ఆత్మహత్య చేసుకునే నాటికి ఇంట్లో పిడికెడు బియ్యం కూడ లేవు. అతని శవం ఇంటి బయట ఉండగానే ఎమ్మార్వో, ఆర్డీవో గ్రామానికి వచ్చారు. ఇద్దరూ శవాన్ని చూశారు. పత్రికల వారితో మాట్లాడుతూ అది ఆత్మహత్యేననీ, అప్పుల వల్లనే చనిపోయాడనీ అన్నారు. అయినప్పటికీ పోస్టుమార్టం జరిపించే ప్రయత్నమేదీ వారు చేయలేదు. కుటుంబ సభ్యుల మాటకొస్తే, పోస్టుమార్టం జరిపించడానికి మృతదేహాన్ని బద్వేల్ తీసుకుపోయి అక్కడ మోసేవాళ్ళకూ, కోసే వాళ్ళకూ డబ్బులిచ్చుకోవాలంటే ఎంత తక్కువనుకొన్నా ఎనిమిది వేల రూపాయలు ఖర్చవుతాయని భయపడ్డారు. వారి దగ్గర అంత డబ్బు ఉంటే వీరయ్య చనిపోయేవాడే కాదు! అందువల్ల వారు పోస్టుమార్టం జరిపించలేదు. కాబట్టి ఆత్మహత్య రుజువు కాలేదన్న నెపంతో అధికారులు వీరయ్య కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వలేదు.

అప్పుల భారం వల్ల ఆత్మహత్య చేసుకున్న రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తుందనీ, అందువల్ల చనిపోయిన విషయం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలనీ, ఎమ్మార్వో వచ్చినప్పుడు అప్పుల విషయం చెప్పాలనీ తెలియని 'ఎడ్డి' మనుషులూ చాలామంది ఉన్నారు. అటువంటి వారు వట్టి అమాయకత్వం వల్ల ప్రభుత్వ సహాయం పొందలేకపోయారు. తాను చేయదలచుకున్న సహాయాన్ని ప్రజలకు తెలియజెప్పాలని,

వాళ్ళొకవేళ తెలియక సకాలంలో సమాచారం అధికారులకు అందించని పక్షంలో తరువాతయినా వారి నుండి సమాచారం స్వీకరించి దానిని సరిచూసుకొని తగు చర్యలు చేపట్టే ఏర్పాటు రూపొందించుకోవాలని ప్రభుత్వం అనుకోలేదు.

గుంటూరు జిల్లా నగరం మండలం ఇంకొల్లువారి పాలెంకు చెందిన ఇంకొల్లు వెంకట నారాయణకు ఎనిమిది ఎకరాల భూమి ఉండేది. అది కృష్ణా డెల్టా ప్రాంతం. వెంకట నారాయణ భూమి ఆయకట్టులో లేదు గానీ కాలవ నుండి మోటార్ పెట్టి తన పొలాలకు పారించుకునేవాడు. అయితే రెండేళ్ళుగా కృష్ణా డెల్టా కాలవలలో నీళ్ళు సరిగ్గా రాకపోవడం వల్ల వెంకట నారాయణ వంటి అదనపు వాడకందార్లకు నీరు కరువయింది. అప్పటి నుండి అప్పులు మొదలయ్యాయి. దీనికి కొడుకు బి.ఇడి చదువు ఖర్చు తోడయింది. పొలం తగాదాల కేసుల ఖర్చూ ఉండింది. మొత్తానికి అప్పు లక్ష దాకా అయిన తరువాత 2004 మే 29న వెంకట నారాయణ ఆత్మహత్య చేసుకున్నాడు. అతని కుటుంబ సభ్యులు ఫిర్యాదు ఇవ్వడానికి నగరం పోలీస్ స్టేషన్‌కు పోగా, అక్కడి ఎస్.ఐగారు కేసు కట్టడానికీ, పోస్టుమార్టం జరిపించడానికీ బద్ధకించి కాబోలు 'మీకు నష్టపరిహారం రాదులే – ఈ కేసులెందుకు' అన్నాడంట. వాళ్ళు అంతే కాబోలుననుకొని ఇంటికొచ్చేశారు.

ఇవి – స్థూలంగా – జీవో 421లోని లోపాలు కాగా, దాని అమలు కూడ చాలా అస్తవ్యస్తంగా ఉంది. మొదటి విషయం, ఈ జీవో కాపీ ఎమ్మార్వో ఆఫీసులో సయితం లేకపోవడం. ఏ పరిస్థితులలో మృతుల కుటుంబాలు నష్టపరిహారానికి అర్హమవుతాయో ప్రజలకు చెప్పే ప్రయత్నం ప్రభుత్వం చేయకపోవడం. కనీసం జీవో తెలుగు ప్రతిని గ్రామపంచాయతీలలో ప్రజలకు అందుబాట్లో పెట్టి ఉంటే చదువొచ్చిన వారయినా తెలుసుకుందురు. తెలియకపోవడం వల్ల అధికారులకు ఏయే విషయాలు చెప్పాలో అర్థంకాక నష్టపరిహారం పొందలేకపోయిన వారున్నారు.

రంగారెడ్డి జిల్లా చేవెళ్ళ మండలం సీతారాంపురానికి చెందిన పోతురాజు నర్సింహులుకు ఎకరం సొంత భూమి ఉండేది. మూడు ఎకరాలు కౌలుకు తీసుకొని చేసేవాడు. మూడేళ్ళుగా పంట పండలేదు. అప్పులు పెరిగాయి. దానితోపాటు ఇల్లు కట్టుకునే ప్రయత్నంలో ఇంకొంచెం అప్పు చేశాడు. అప్పు 48 వేలకు చేరేసరికి బేజారయి 2004 జూన్ 28న ఆత్మహత్య చేసుకున్నాడు. ఎమ్మార్వో వచ్చినప్పుడు అతని భార్య సబిత మనసులో ఇంటి ఖర్చే ప్రధానంగా ఉండింది. ఆమె దాని గురించే

చెప్పింది. ఎమ్మార్వో వేరే ఏమీ అడగకుండా ఆమె చెప్పింది రాసుకుపోయి 'ఇల్లు కట్టుకోవడం కోసం అప్పు చేశాడు కాబట్టి ఇది వ్యవసాయ కార్యకలాపాలకు సంబంధించిన ఆర్థిక సమస్య కాదు' అని రిపోర్టు పంపాడు. జీవో 421లో ఏముందో సబితకు తెలిస్తే తన భర్త ఇంటి కోసమే కాక పంట కోసమూ అప్పు చేశాడని – అది వాస్తవం కాబట్టి – చెప్పి ఉండేది. తెలియకపోవడం వల్ల అప్పటికి తన మనసులో ఏముందో అది మాత్రం చెప్పింది. ప్రజలను ఇట్లా మోసం చేసి ఇక్కడొక లక్షా అక్కడొక లక్షా మిగిలించుకోవాలని చూసే ప్రభుత్వాన్ని ఏమనాలి?

కాగా, ఆత్మహత్య జరిగిన వెంటనే శవపంచాయతీ చేసే సమయంలో పోలీసులు లేక ఎమ్మార్వో ఆత్మహత్యకు గల కారణాలను తెలుసుకొని పై అధికారులకు పంపాలనీ, దానిపై ఆర్డీవో, డిఎస్‌పి, జెడి (వ్యవసాయ శాఖ)ల త్రిసభ్య కమిటీ పరిశీలన జరిపి ప్రభుత్వానికి సిఫారసు చేయాలని జీవో అంటోంది. ఈ క్రమం ఎక్కడా సరిగ్గా అమలు కాకపోవడం రెండవ విషయం.

ఎమ్మార్వోలు బాధిత కుటుంబాలతో మాట్లాడకుండా ఎవరో చెప్పింది రాసుకుపోయిన సందర్భాలు అనేకం.

కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం ఆకునూరుకు చెందిన ఆకుల సాంబయ్య 2004 సెప్టెంబర్ 28 నాడు ఆత్మహత్య చేసుకున్నాడు. వడ్రంగం కులవృత్తిగా గల సాంబయ్య ఆ వృత్తికి అవకాశాలు దెబ్బతిన్న కారణంగా మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని చేస్తున్నాడు. బావి ఉన్న భూమిని కౌలుకు తీసుకున్నప్పుడు వరిపంట వేశాడు, బావి లేనిది తీసుకున్నప్పుడు పత్తి పెట్టాడు. ఏం చేసినా నాలుగేళ్ళుగా నష్టమే వచ్చింది. అప్పు 79 వేలకు చేరింది. అప్పు తెచ్చి వేసిన పత్తి పంటను కాపాడడానికి ఇంకొంచెం అప్పు అవసరమై ప్రయత్నం చేయగా పుట్టలేదు. దానితో విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. అతను చేసిన అప్పు బిడ్డ పెండ్లి కోసం అని ఎమ్మార్వో రిపోర్టు పంపిన కారణంగా సాంబయ్య కుటుంబానికి నష్టపరిహారం దక్కలేదు. తీరా చూస్తే సాంబయ్యకు ఉన్నది ఒకే కూతురు రేణుక. ఆ అమ్మాయి వయసు కేవలం పది సంవత్సరాలే. ఆమె పెళ్ళి గురించి సాంబయ్య గానీ, అతని భార్య గానీ అప్పటికి ఏ ఆలోచనా చేయలేదు. జరిగిందేమిటంటే, సాంబయ్య తన ఊరిలో చనిపోలేదు. అప్పు కోసం దుద్దెనపల్లికి పోయి అక్కడే ఆత్మహత్య చేసుకున్నాడు. శవపంచనామా అక్కడే జరిగింది. ఎమ్మార్వో అసలు ఆకునూరుకు రానే లేదు. సాంబయ్య కుటుంబాన్ని చూడనే లేదు. దుద్దెనపల్లిలో ఎవరో చెప్పిన దాన్ని బట్టి రిపోర్టు పంపించాడు.

నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం బొల్లిగుట్ట తాండాకు చెందిన లాగ్రీ రాము 2004 ఆగస్టు 8న ఆత్మహత్య చేసుకున్నాడు. అతనికి ఉన్న రెండెకరాల భూమిలో మూడు బోర్లు వేశాడు. 60 వేల అప్పయింది. పత్తి పంట వేశాడు గానీ బొటాబొటీగా దిగుబడి వచ్చింది. పైగా అదనంగా ఖర్చయింది. 2003-04 సంవత్సరాలలో పత్తి దిగుబడి అసలే రాకపోయేసరికి తన ఇద్దరు కొడుకులకు భూమి తలా ఒక ఎకరం పంచి ఇచ్చి తాను పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అతనికి బిడ్డతో ఏదో తగాదా ఉండడం వల్ల ఆత్మహత్య చేసుకున్నాడే తప్ప పంట నష్టం వల్ల కాదని అతని కుటుంబంతో మాట్లాడకుండానే ఎమ్మార్వో రిపోర్టు పంపించాడు. ఆ సంగతి ఎట్లా కనుక్కున్నావని ఎమ్మార్వోను అడిగితే, ఎం.పి.పి చెప్పాడంటాడు.

ఎమ్మార్వో రిపోర్టును పరిశీలించి నష్టపరిహారం విషయంలో తుది నిర్ణయం చేయవలసిన త్రిసభ్య కమిటీ ఒక కమిటీగా ఎక్కడా పనిచేసిన దాఖలాలు లేవు. వారు పరిశీలన ఎక్కడ జరుపుతున్నారో గానీ గ్రామాలకు మాత్రం పోవడం లేదు, బాధిత కుటుంబంతో మాట్లాడడం లేదు. బాధిత కుటుంబంతోనూ, ఇరుగు పొరుగుతోనూ మాట్లాడడం, ఇంకా సందేహం అనిపిస్తే గ్రామసభ నిర్వహించి అందరి అభిప్రాయాలూ తీసుకోవడం ఉచితమైన మార్గం. అటువంటి ఆలోచనేదీ మన పాలకులు చేయడం లేదు.

కృష్ణా జిల్లాలో విజయవాడ సబ్-కలెక్టర్ గారు విజయవాడలోనే దర్బార్ నిర్వహించి మృతుల కుటుంబాలను రమ్మని పోలీసుల ద్వారా పిలిపించాడు. జీవో 421 అనేదొకటి ఉందని గానీ, దానిలో ఫలానా విషయాలు ఉన్నాయని గానీ తెలియని జనం కొందరు పోయారు. కొందరు పోలేదు. పోయిన వారిలో కొందరిని దర్బార్‌లో మాట్లాడనిచ్చారు, కొందరిని మాట్లాడనీయలేదు. ఆ రకంగా సాగింది త్రిసభ్య కమిటీ సమీక్ష.

కొన్నిచోట్ల ఆ మాత్రం కూడ జరగలేదు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిరాల గ్రామ నివాసి జగమోని సురేందర్‌రెడ్డికి 30 గుంటల భూమి ఉంది. దానిలో మూడు బోర్లేస్తే మూడూ విఫలం కాగా దానిని అమ్మేసి నాలుగు ఎకరాల బోర్లున్న భూమిని కౌలుకు తీసుకున్నాడు. సిటీలో పాలు అమ్ముకుందామని మూడు బర్రెలు కొంటే రెండు చనిపోయాయి. లక్షా 88 వేల రూపాయల అప్పయింది. అది తీరే మార్గం కానరాక 2004 ఆగస్టు 5వ తేదీన ఆత్మహత్య చేసుకున్నాడు. విచారణ నిమిత్తం అదే నెల 16వ తేదీన ఆర్డీవో వస్తున్నాడని తెలిసి సురేందర్‌రెడ్డి కుటుంబమంతా

ఎదురు చూశారు. ఆర్డీవో రాలేదు. కానీ కొన్ని రోజుల తరువాత పేపర్లో ఆర్డీవో ప్రకటన వచ్చింది. సురేందర్‌రెడ్డికి టిప్పర్లు ఉన్నాయనీ, అతను కేవలం రైతు కాదనీ, అందువల్ల అతని కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందదనీ ఆ ప్రకటన సారాంశం. మాకు టిప్పర్లు లేవు మొర్రో అని ఆ కుటుంబం ఎంత మొత్తుకున్నా ఆర్డీవో నుంచి మళ్ళీ స్పందన లేదు, వివరణ లేదు, పునఃపరిశీలన లేదు.

**మానవహక్కుల వేదిక బులెటిన్–7 లో రిపోర్టుగా వచ్చింది**
**మే 2005**

# సరళమైన రుణ వ్యవస్థ లేనిదే రైతుల ఆత్మహత్యలు ఆగవు

రైతుల ఆత్మహత్యలు ఎక్కువగా జరుగుతున్న తెలంగాణలో సహితం కృష్ణా బేసిన్‌లో కంటే సాపేక్షంగా సంపన్నమైన గోదావరి బేసిన్‌లోనే ఆత్మహత్యలు ఎక్కువ. మహబూబ్‌నగర్ కన్నా వరంగల్‌లోనే ఎక్కువ. ఆత్మహత్య చివరి ఘట్టంలో పేదతనం ప్రధాన విషయమే కానీ పేదరికమే ముదిరి ఆత్మహత్యతో ముగియడం లేదు. పేదగానే ఉండిపోక తప్పదని మొదటి నుండి ఎరిగిన వారెవ్వరూ ఆత్మహత్య చేసుకోవడం లేదు. పేదరికం నుండి బయటపడడానికి కావలసిన వనరులు కొంచెం ఖర్చుపెడితే అందుబాట్లోకి వస్తాయన్న సహేతుకమైన ఆశ ఉండి, దాని కోసం అప్పుచేసి, ఆశించిన ఫలితం అందక బాకీపడి, దానిని తీర్చడం కోసం అదే ప్రయత్నం మళ్ళీ చేసి, మళ్ళీ మళ్ళీ చేసి, ఇంక చేయడానికి అప్పు కూడ పుట్టని దశకు చేరి, ఆపైన ఆత్మహత్య చేసుకున్నవే సగటు ఉదంతాలు. తొలి ఆశకు చోటే లేని ప్రాంతాలలో, వర్గాలలో ఆత్మహత్యలు తక్కువే.

ప్రత్యేకించి, బోరు వేసుకుంటే నీళ్ళు పడతాయనీ, దానికితోడు ఎరువులు, మందులు వాడితే ఏ పత్తిపంటో పండించవచ్చనే ఆశపడి, ఎన్ని బోర్లు వేసినా అన్నీ ఎండిపోగా పత్తి పంటకు పురుగుపట్టి, పురుగులమందు పనిచేయక, ఒకవేళ పంట పండినా సరయిన ధర లేక, అప్పు మీద అప్పుచేసి, ఉన్న భూమి మీద అప్పును నిలబెడితే ఆ భూమి వామనుడి మూడో పాదం పడినట్టు కుంగిపోయిన నాడు మనసు వికలమై ప్రాణం తీసుకున్నవారే ఎక్కువ.

అందుకే ఎన్నడూ లేనిది ఈ మధ్య మెదక్ జిల్లా నారాయణఖేడ్ ప్రాంతంలో రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారన్న వార్త ఆశ్చర్యం కలిగించింది. ఇప్పటి దాకా

మెదక్ జిల్లాలో ఆత్మహత్యలు భూగర్భ జలాలు ఉన్నాయని ఊరించిన ప్రాంతాలలోనే జరిగాయి. నారాయణఖేడ్ ప్రాంతంలో నేల కింద పెద్ద బండ కొన్ని వందల చదరపు కిలోమీటర్ల పర్యంతం పరచుకొని ఉంది కాబట్టి అక్కడ బోర్లు పడవు. బావులలో ఊట ఎక్కువ కాదు. చిన్న చిన్న కుంటలే తప్ప పెద్ద చెరువులు లేవు. ఏది పండించినా వర్షాధారం గానే పండించాలి. ప్రాజెక్టులంటారా, ఎక్కడున్నాయో తెలియకుండా అందరికీ నీళ్ళిస్తామంటున్న రాజశేఖరరెడ్డిగారి జలయజ్ఞంలో సహితం నారాయణఖేడ్ ఊసు లేదు. ఆయనగారు ఏ పదేళ్ళకో పుష్కరానికో ఒకసారి వచ్చిపోయే వరదను సహితం జలవనరుగా భావించి ప్రాజెక్టుల రచన చేస్తున్నాడు. అయినప్పటికీ నారాయణఖేడ్‌కు ఏ ప్రాజెక్టునూ ప్రతిపాదించ లేదంటే ఆ ప్రాంతం దౌర్భాగ్యాన్ని ఊహించుకోవచ్చు. మంజీర నది నీటిని ఇటు హైదరాబాద్‌కు గానీ అటు గోదావరిలోనికి గానీ పోకుండ ఆపేసి నిజాంసాగర్ నుండి తగు మాత్రం ఎత్తిపోస్తే తప్ప నారాయణఖేడ్‌కు నీళ్ళు రావు. మరి అక్కడి రైతులు ఏమి ఆశించి, నిరాశచెంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు?

వర్షాధారంగా జొన్నలు, అంతర్ పంటగా కందులు పండించుకొని తినినంత కాలం వాళ్ళు పురుగుల మందు డబ్బాలను చూసి ఎరుగరు, పురుగుల మందు తాగి ఎరుగరు. కానీ ఈ మధ్య, నేల కింద పెద్ద బండ ఉన్నప్పటికీ ఎక్కడో ఒకచోట బోరు పడకపోతుందా, వరి, పత్తి పండించుకోలేక పోతామా అని నారాయణఖేడ్ రైతులు ఆశపడడం మొదలయింది. ఒకరిద్దరికి ఒకటి రెండు బోర్లు పడ్డాయి. మిగిలినవాళ్ళూ ఆశపడ్డారు. ఒకదాని తరువాత ఒకటి బోర్లు వేయడం, విఫలం కావడం జరిగిపోయింది. బోరు సక్సెస్ అయి రెండేళ్ళు పారినా ఆ రెండేళ్ళూ పంట ధర సరిగ్గా లేక నష్టపోవడమూ జరిగింది. మిగిలిన కథ మామూలే.

రైతుల ఆత్మహత్యలు నివారించడం తన ముఖ్య లక్ష్యాలలో ఒకటని 2004లో రాజశేఖర్‌రెడ్డి అనడం అందరికీ జ్ఞాపకం ఉండే ఉంటుంది. దానికి మార్గాలు సూచించమని ప్రొఫెసర్ జయతీ ఘోష్ సారథ్యంలో ఒక కమిటీ అయితే వేశాడు. మామూలుగా ప్రభుత్వ కమిటీలలో ఉండడానికి ఇష్టపడని వారు సహితం చంద్రబాబు నాయుడు పొగరణచిన ఎన్నికలకు సలాం చెపుతూ ఆ కమిటీలో పాల్గొన్నారు. దాని ప్రయత్నానికి సహకరించారు. ప్రొఫెసర్ జయతీ ఘోష్ కమిటీ సమగ్రమైన నివేదికే ఇచ్చింది. అయితే ఆ నివేదికను చూడకముందే జారీచేసిన నష్టపరిహారం జీవో (421)

తప్ప వేరే ఏ చర్యా రాష్ట్ర ప్రభుత్వం అప్పటి నుండి ఇప్పటి దాకా తీసుకోలేదు. 'మాకు తెలియనట్టు మీ సలహాలడుగుతూ మీతో ఒక కమిటీ వేయడమే ఎక్కువ. ఇంక మీ సలహాలు పాటించడం కూడానా' అని రాజశేఖరరెడ్డి తన ఎన్నిక సూచికగా గల మార్పును ఆహ్వానించిన వామపక్ష మేధావులకు చెప్పదలచుకున్నాడు.

రాజశేఖర్‌రెడ్డిది ఒకరి చావును చూసి చలించిపోయే మనసు కాదు. పైగా చావడం బతకడమంత సహజం అని నమ్మే మనసు. అయితే అందరమూ అటువంటి వాళ్ళం కాదు కాబట్టి ఖరీఫ్ పంట చేతికొచ్చే కాలానికి మరోసారి ఆత్మహత్యలు ఎక్కువ కావడం ఆందోళన కలిగిస్తుంది. చంద్రబాబు పాలనను అన్ని తిట్లు తిట్టి ఏం సాధించినట్టు? ప్రొఫెసర్ జయతీ ఘోష్ కమిటీ చెప్పినా, అంతకుముందు నుండీ రైతుల ఆత్మహత్యలకు గల కారణాలు అన్వేషించిన వారందరూ చెప్పినా ప్రభుత్వానికి పట్టని సలహా, ప్రభుత్వం ఏ కొంచెమూ అమలు చేయడానికి ప్రయత్నించని సలహా– రైతాంగానికి అందుబాట్లో ఉదారమైన ప్రభుత్వరంగ రుణ వ్యవస్థ ఉండాలనేది. ఆత్మహత్యలకు ఎన్నో కారణాలున్నాయి – దక్కని గిట్టుబాటు ధరల నుండి పెరుగుతున్న పెళ్ళి కట్నాల దాకా; నాణ్యతలేని విత్తనాలు, ఎరువులు, మందుల నుండి ప్రైవేటీకరణతో విపరీతంగా పెరిగిన విద్యా వైద్య వ్యయం దాకా. అయితే అన్నిటికంటే ముఖ్యమైన కారణాలు రెండు. ఒకటి, సాగునీటి కోసం రైతు బోర్ల రూపంలో స్వంత పెట్టుబడి మీద ఆధారపడడం; రెండు అప్పు కోసం నెలకు 2 నుండి 5 రూపాయల దాకా వడ్డీ వసూలు చేసుకునే ప్రైవేట్ రుణవ్యవస్థ పైన ఆధారపడడం.

జలయజ్ఞంతో మొదటిది పోతుందన్న అభిప్రాయం రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం కలిగిస్తున్నది. ఇది వట్టి దగా. జలయజ్ఞంలో పోలవరం, వంశధార స్టేజ్–2లు తప్ప తక్కినవన్నీ ఎత్తిపోతల ప్రాజెక్టులే. బోరుకయినట్టే వీటికీ నిత్యం కరెంటు ఖర్చవుతుంది. భారీగానూ అవుతుంది. ఈ ఖర్చంతా ప్రభుత్వమే పెట్టుకుంటుందన్న హామీ మనం ఇప్పటిదాకా వినలేదు. రైతులే ప్రధానంగా భరించేటట్టయితే పైన చెప్పిన రెండు ముఖ్యమైన కారణాలలో మొదటి దానిలో మార్పుండదు. రెండవ దాని కోసం రాష్ట్ర ప్రభుత్వం వైపు నుండి ఏ ప్రయత్నమూ జరగడం లేదు. అయినప్పటికీ అన్ని ఘటనలకు కాకున్నా కొన్నిటికయినా నష్టపరిహారం ఇస్తుండడం వల్ల కాబోలు, ఆత్మహత్యల గురించి ఆందోళన తగ్గింది. నిజానికి అటువంటి రుణవ్యవస్థ ఆచరణ సాధ్యమే. గ్రామీణ బ్యాంకు మేనేజర్లతో మాట్లాడితే పంట బాగా రావాలే గానీ రైతు తీర్చినంత

నమ్మకంగా వేరే ఎవ్వరూ అప్పు తీర్చరని అంటారు. రైతుల మనసులు కల్మషం ఎరుగనివని దీనికి జవాబు చెప్పుకోవచ్చు. లేదా మళ్ళీ అప్పు పుట్టాలంటే చేసిన అప్పు తీర్చక తప్పదన్న ప్రాక్టికాలిటీ దీనికి కారణం అనుకోవచ్చు. ఏదయినా రైతు మీద నమ్మకం పెట్టుకున్న రుణవ్యవస్థ ఆచరణ సాధ్యమేనని దీనిని బట్టి అర్థం అవుతుంది.

అయినప్పటికీ అటువంటి రుణవ్యవస్థ సాలీనా కొంత నష్టాన్ని ప్రభుత్వానికి తెచ్చి పెడుతుందనే అనుకుందాం. దానిని 'అభివృద్ధి'కి – పెట్టుబడులు పెట్టి మంచి ఉత్పత్తి సాధించే వ్యవసాయ విధానానికి అవసరమైన రాయితీగా ఎందుకు భావించ కూడదు? ఎగుమతుల కోసం ప్రత్యేక ఆర్థిక మండలుల ద్వారా సాలీనా లక్ష కోట్ల రూపాయలు కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు ఇవ్వగా లేనిది ఇదెందుకు తప్పవుతుంది?

**ప్రజాతంత్ర**

**26 నవంబర్ 2006**

# కరువు నియమావళి చట్టం అవసరం

కరువు కాలంలో తప్పనిసరిగా ప్రజలకు అందవలసిన ఆసరాను హక్కులుగా క్రోడీకరించి, వాటి అమలుకు అవసరమైన యంత్రాంగాన్ని నిర్దేశించి, ఒక సమగ్రమైన చట్టాన్ని చేయాల్సిన అవసరం చాలా ఉంది. అందులో పశువులకు తిండి, మనుషులకు పని, గ్రామాలకు తాగునీరు, తీవ్ర దుర్భిక్ష ప్రాంతాలలో గంజి కేంద్రాల నిర్వహణ, ప్రభుత్వ రుణాల రద్దుతో పాటు ప్రైవేట్ రుణాలను ప్రభుత్వపరం చేసే ఏర్పాటు, పిల్లలకు అంగన్‌వాడీలు, స్కూళ్ళలోనేకాక బడికి పోయినా పోకున్నా తప్పనిసరి పౌష్టికాహారం, చెరువులతో సహా అన్ని నీటి వనరుల పునరుద్ధరణ, రైతుల దగ్గర ఇంకా మిగిలిపోయిన రబీ పంట కొనుగోలు, కాలాతీతమయినాక కురిసే వర్షాలకు తగిన ప్రత్యామ్నాయ విత్తనాల సరఫరా, ఆహార ధాన్యాలను దాచుకొని నల్ల బజారులో అమ్ముకునే వ్యాపారులపైన క్రిమినల్ కేసులు పెట్టడంతోపాటు భారీగా జుర్మానా వసూలు చేసి వ్యవసాయదారుల కోసం దానిని వినియోగించడం – ఇత్యాది విషయాలన్నిటికీ చోటు ఉండాలని డిమాండు చేయడం, దాని కోసం ఉద్యమం నిర్మించడానికి కృషి చేయడం మా కర్తవ్యంగా మేము భావిస్తున్నాం.

***30 ఆగస్టు 2009***

*2009 అక్టోబరు 2–3 తేదీలలో అనంతపురంలో జరిగిన మానవహక్కుల వేదిక 3వ రాష్ట్ర మహాసభల కోసం బాలగోపాల్ రాసిన కరపత్రాలలోని చివరి వాక్యాలివి. తన కార్యదర్శి నివేదికలోను, అక్టోబర్ 2న జరిగిన బహిరంగ సభలోను కూడ కరువు నియమావళి చట్టం రావల్సిన అవసరాన్ని ఆయన వక్కాణించారు.*

# రైతాంగ పోరాటాలు



# తెలంగాణ పోరాటం -
# 'ధనిక రైతాంగ' వాదం

తెలంగాణ రైతాంగ పోరాటం ఎందుకు విరమించబడింది అన్న ప్రశ్నకు ఇంతవరకు సంతృప్తికరమయిన సమాధానం లేదు. నాయకత్వం విద్రోహం చేసింది సరే, కాని నాయకత్వం ఎందుకు విద్రోహం చేసింది? యూనియన్ సేనల ఆధునిక ఆయుధాలను చూసి భయపడిందా? స్టాలిన్ తప్పుదారి పట్టించాడా? లేక నెహ్రూ సమ్మోహనాస్త్రం ప్రయోగించాడా? బెంగుళూరు దళిత ఉద్యమ మేధావి రాజశేఖరశెట్టి అన్నట్టు హైందవ వర్ణధర్మం దానికి కారణమందామా – లేక అదే సరళిలో – భారత కమ్యూనిస్టు ఉద్యమానికి ఒక స్వతంత్రమయిన లక్ష్యం, వ్యూహం ఏర్పడకపోవడానికి కారణం భాష్యానికే తప్ప స్వంత ఆలోచనకు తావివ్వని వేదాంత తాత్విక సంప్రదాయమందామా?

ఇట్లాంటి ప్రశ్నలెన్నయినా వేసుకోవచ్చు గాని సమాధానం చెప్పే సమగ్రమయిన ప్రయత్నం మాత్రం ఇంతవరకు జరగలేదు. అయితే ఈ మధ్య కాలంలో ఒక పాశ్చాత్య రచయిత అటువంటి ప్రయత్నం చేశాడు. (Barry Pavier, The Telangana Movement, 1944-51). వివరమయిన పరిశీలన మీద, ఒక నిర్దిష్టమయిన సిద్ధాంతం మీద ఆధారపడి చేసిన అతని వ్యాఖ్యానం విశ్వవిద్యాలయ మేధావులలోను, ఇతర అకాడమిక్ సర్కిల్స్ లోను పరపతి గడించుకుంటోంది. ఆ వ్యాఖ్యానం ఇంతవరకు తెలుగు పాఠకుల దృష్టికి రాకుండవచ్చును గాని, అంతమాత్రం చేత దాన్ని పరిశీలించడం అనవసరం కాదు. దానికి మూడు కారణాలున్నాయి. మనలో ఇంగ్లీష్ పుస్తకాలు, పత్రికలు చదివే అలవాటు ఉన్నవాళ్ళు తెలిసో తెలియకో తమ ఆలోచనల్ని పాశ్చాత్య దేశాల నుండి అరువు తెచ్చుకుంటారు. సామ్రాజ్యవాద సాంస్కృతిక ఆధిపత్యానికి ఇదొక సాధనం. భారతీయ భాషలు మాత్రమే తెలిసిన వాళ్ళను కూడ ఈ దిగుమతి అయిన భావాలు

(మళ్ళీ తెలిసీ తెలియక) అనువాద రూపంలోను, భాష్య రూపంలోను ప్రభావితం చేస్తాయి. ఇది ఒక కారణం.

రెండవ కారణం, ఈ వ్యాఖ్యానం తెలంగాణ రైతాంగ పోరాటానికి పరిమితమయినది కాదు. చైనాతో మొదలుపెట్టి వియత్నాం, లావోస్, కంపూచియా, అంగోలా, జింబాబ్వే, ఇంకా ఎన్నో ప్రాంతాలలో దీర్ఘకాలిక రైతాంగ పోరాటాల రూపంలో వచ్చిన విప్లవాలకు కూడ వర్తిస్తుంది. ఆ విప్లవాలన్నీ కూడ తరువాతి కాలంలో రకరకాల ఇబ్బందుల్ని ఎదుర్కొన్నాయన్న విషయాన్ని ఆసరా చేసుకుని, వాటి వ్యూహమూ, అవగాహనా అనివార్యంగా వైఫల్యానికి దారితీస్తాయని వక్రీకరిస్తుంది. అందుకోసమే ఆ వ్యాఖ్యానాన్ని ఎదుర్కోవలసి వుంది. దానికి ఒక పేరు పెట్టాలి కాబట్టి 'ధనిక రైతాంగ' వాదం అంటాను. దాని బలమయిన సైద్ధాంతిక రూపం ట్రాట్స్కీయిజం. అయితే ట్రాట్స్కీయిస్టులు కానివాళ్ళు చాలామంది కూడ ఆ వాదాన్ని బలపరచడానికి సిద్ధంగా వున్నారు. ఇది మూడవ కారణం.

ఈ 'ధనిక రైతాంగ' వాదం స్వరూపాన్ని తెలుసుకునే ముందు అసలు తెలంగాణ పోరాటం ఎందుకు వచ్చిందో గుర్తుకు తెచ్చుకుందాం. మన దేశంలో చరిత్ర గమనం మొదటి నుండి కూడ అసమానంగానే వుంటూ వచ్చింది. ఇవ్వాళ కూడ మద్రాసు నగరంలో ఎన్నూర్ థర్మల్‌స్టేషన్‌కు ఒక కిలోమీటర్ దక్షిణాన ఉడతల్నీ, ఎలుకల్నీ పట్టుకు జీవించే యానాదుల నివాసాలు కనిపిస్తాయి. ఇంత విపరీతం గతంలో లేకున్నా అసమాన అభివృద్ధి, ప్రాంతీయ ప్రత్యేకతా ఫ్యూడల్ దశలోనూ, అంతకు పూర్వమూ కూడ వుండేవి. అందుకే మన దేశ చరిత్రను దేశవ్యాప్తంగా వర్తించే 'దశ'లుగా విభజించే ఏ ప్రయత్నమయినా ఔత్సాహికం కాకమానదు. అందుకే యూరప్ ఫ్యూడలిజాన్ని మాత్రం ఒక్క వాక్యంలో కాకున్నా పది వాక్యాలలో నిర్వచించవచ్చును గాని, మన దేశ ఫ్యూడలిజాన్ని మాత్రం ఒక్కొక్క ప్రాంతాన్నీ తీసుకొని వివరించగలమే గాని నిర్వచించలేం. ఒక్క వర్ణవ్యవస్థ మాత్రమే భారతదేశ ఫ్యూడలిజంలో సార్వత్రికమయిన అంశం.

అయితే ఫ్యూడలిజం బహుశా అన్ని ప్రాంతాల కంటే హైదరాబాద్‌లో అసఫ్ జాహీల పాలన కింద అత్యంత విపరీత రూపాన్ని తీసుకుందనవచ్చునేమో. ఈ ఫ్యూడలిజం తాలూకు ప్రముఖ లక్షణం వెట్టిచాకిరీ. తెలంగాణలో వెట్టి కేవలం భూస్వాములకు అదనపు ఉత్పత్తిని చేజిక్కించుకోవడానికి ఉపయోగపడ్డ ఆర్థిక దోపిడీ

రూపం మాత్రమే కాదు, ఒక సార్వత్రిక సామాజిక పీడనా రూపం; అంతకుమించి ఒక సాంస్కృతిక వాతావరణం. యూరప్ భూస్వాములు రైతులకు కౌలుకీయగా మిగిలిన భూమిలో ఆ రైతుల చేతనే వెట్టిచాకిరీ చేయించుకుని పంట పండించుకునే వారు. దీనిని Corvee అంటారు. తెలంగాణ భూస్వాములు ఈ రకమయిన ఉత్పత్తిదాయకమయిన శ్రమ (productive labour) మాత్రమే కాక, అన్ని రకాల శ్రమలోనూ వెట్టి డిమాండ్ చేసేవారు. ఆ వెట్టి ఆయా కులాల కులవృత్తులకు మాత్రమే పరిమితమయినదీ కాదు. ఉదాహరణకు చాకలివాళ్ళు చాకలి పని మాత్రమే కాదు, ఇంటి చాకిరీ చేయడం కూడ వాడుకలో వుండేది. దొర ఇంట్లో ఏవయినా వేడుకలయితే తమ ఇంట్లోనే అయినట్టు అందరూ చాకిరీ చెయ్యాలి. ఎవరి ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా అది దొర చలవయినట్టు అతనికి కానుకలివ్వాలి. ఎవరికి ఏ తగువులొచ్చినా దొరే 'పంచాయతీ' జరిపించాలి. అందుకు ఇరుపక్షాలూ దొరకు దండుగలు ఇచ్చుకోవాలి. ఈ వెట్టిచాకిరీకీ దండుగలకూ తోడు పోయింది భూమి సమస్య. ఇందులో కూడ మూడు అంశాలున్నాయి. ఒకటి – భూమి పంపిణీలో విపరీతమయిన అసమానత, రెండు – కౌలుదార్లకు భద్రత లేకపోవడం, మూడు – రైతుల భూములను భూస్వాములు రకరకాల పద్ధతులలో ఆక్రమించుకోవడం.

ఇటువంటి సామాజిక పీడనకు వ్యతిరేకంగా వచ్చింది తెలంగాణ రైతాంగ తిరుగుబాటు. ఈ పీడనకు భూస్వాములు తప్ప తక్కిన వారెవ్వరూ (ధనిక రైతులతో సహా) మినహాయింపు కాదు గనక తిరుగుబాటులో కూడ ధనిక రైతుల నుండి వ్యవసాయ కూలీల దాకా అందరూ తరతమ భేదాలతో పాల్గొన్నారు. వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా మొదలయిన తిరుగుబాటు ఉధృతమయ్యే క్రమంలో ఏ విధంగా తన పరిధిని విస్తృత పరచుకుందో తరువాత చూద్దాం గాని, ఇక్కడ ఆగి ఒకసారి పేవియర్ 'ధనిక రైతాంగ వాదం' ఈ ఉద్యమానికి గల కారణాలను ఏ విధంగా అర్థం చేసుకుందో చూద్దాం.

వెట్టిచాకిరీ వంటి ఫ్యూడల్ పీడనా రూపాలను పేవియర్ కాదనడు గాని, రైతాంగ ఉద్యమాలకు ఫ్యూడల్ పీడన కారణం కాగలదని అతని ట్రాట్స్కీయిజం ఒప్పుకోదు. ట్రాట్స్కీయిజం ప్రకారం రైతాంగ ఉద్యమాలు రావాలంటే ముందుగా వ్యవసాయం వాణిజ్య పంటల ఉత్పత్తిని చేపట్టాలి. వ్యవసాయంలోకి పెట్టుబడి ప్రవేశించాలి, రైతాంగంలో విభజన ఏర్పడాలి, ఒక ధనిక రైతాంగం పుట్టుకు రావాలి, ఆ ధనిక రైతాంగం తన పురోగమనానికి ఫ్యూడలిజం ఒక అవరోధమని గుర్తించి తిరగబడాలి.

అప్పుడే రైతాంగ ఉద్యమాలు వస్తాయి. ఈ 'ధనిక రైతాంగ' వాదాన్ని సమర్థించడం కోసం పేవియర్ సేకరించిన సమాచారం చాలా ఆసక్తికరమయినది కాబట్టి దాన్ని ఒకసారి పరిశీలిద్దాం.

ముందుగా వాణిజ్య పంటల ఉత్పత్తి రావాలని చెప్పుకున్నాం. తెలంగాణలో ఆ రకంగా వచ్చిన పంటలు వేరుశెనగ, ఆముదం. ఆముదం తెలంగాణలో గత శతాబ్దం నుండి వుంది. 1925 తరువాత ఆముదం పంట అపారంగా పెరగడం, వేరుశెనగ విస్తరించడం, ఈ రెండు పంటల ఉత్పత్తిలో చాలా భాగం ఎగుమతి కావడం (వేరుశెనగలో 98 శాతం, ఆముదంలో 71 శాతం), ఈ కారణాలన్నిటి వల్ల తెలంగాణలోకి పెట్టుబడి ప్రవేశించి తెలంగాణ ప్రపంచ పెట్టుబడిదారీ మార్కెట్‌లో భాగమయింది. ('ధనిక రైతాంగ' వాదం ప్రకారం). 1925లో వేరుశెనగ కింద వున్నది 3000 ఎకరాలు కాగా అది 1937 నాటికి 6 లక్షల ఎకరాలకు పెరిగింది. ఈ కారణంగా దేశ్‌ముఖ్‌లూ, ఇతర భూస్వాములూ లాభదాయకమయిన వాణిజ్య పంటలు పండించడం కోసం భూమిని ఆక్రమించుకోవడం మొదలుపెట్టారు. ప్రభుత్వం ఇచ్చే ద్రవ్య సహాయాన్ని, ఇతర సౌకర్యాలను కూడ తమ ఆధిపత్యంలోకి తెచ్చుకున్నారు. ఈ గుత్తాధిపత్యాన్ని ధనిక రైతాంగం నిరసించింది. వాణిజ్య పంటలు పండించడానికి భూమి, పెట్టుబడి తనకూ కావాలని కాంక్షించడం మొదలుపెట్టింది. ఈ రకంగా ధనిక రైతాంగానికీ, దేశ్‌ముఖ్‌లకూ వైరుధ్యం ఏర్పడి తెలంగాణ రైతాంగ పోరాటానికి పూర్వరంగం సిద్ధమయింది.

తరువాతి పరిణామాలు ఈ పూర్వరంగాన్ని మరింత బలపరిచాయి. 1929 తరువాత వచ్చిన అంతర్జాతీయ సంక్షోభంలో ప్రపంచమంతటా జరిగినట్టే హైదరాబాద్ సంస్థానంలో కూడ సరుకుల ధరలు పడిపోయాయి. 1929 నుండి 1934 వరకు బియ్యం ధర సూచిక (index) 45 శాతం, గోధుమ 40 శాతం, జొన్నలు 40 శాతం, ఆముదం 50 శాతం, వేరుశెనగ 68 శాతం పడిపోయాయి. ధనిక రైతులు కానివారు కూడ ఆహారేతర అవసరాల కోసం, పన్ను కట్టడం కోసం కొంత పంటను మార్కెట్‌లో అమ్ముకోవాలి కాబట్టి దానివల్ల రైతాంగం బాగా దెబ్బతినింది. మళ్ళీ ఆ భూస్వాముల దగ్గరే అప్పులపాలయింది. మొత్తం గ్రామీణ ప్రాంతాలలో రైతుల అప్పు 1930 నుండి 1939 వరకు హైదరాబాద్ రాష్ట్రంలో 63 శాతం పెరిగింది. తెలంగాణలోనయితే 89 శాతం పెరిగింది. దీని ఫలితంగా రైతులు భూమిని కోల్పోవడం, ఆ భూమి

భూస్వాముల ఆక్రమణలోకి పోవడం జరిగి వుంటుందని పేవియర్ భావిస్తాడు. కాని ఎంత భూమి పరాయీకృతమయిందో అంచనా వేయలేకపోయానంటాడు.

ఆర్థిక సంక్షోభం తగ్గి 1940లు సమీపించేసరికి యుద్ధ వాతావరణం వల్ల, ఆ తర్వాత యుద్ధం వల్ల ధరలు పెరిగాయి. యుద్ధ కాల ద్రవ్యోల్బణం వల్ల బియ్యం ధర సూచిక (1939 నుండి 1944కు) 100 శాతం, గోధుమ ధర సూచిక 170 శాతం పెరిగాయి. పేద రైతులు, వ్యవసాయ కూలీలు తమ వాడకం కోసం కొంత ధాన్యం కొనక తప్పదు కాబట్టి ఈ ద్రవ్యోల్బణం వాళ్ళను గట్టిగా దెబ్బతీసింది. మళ్ళీ వాళ్ళు అప్పులపాలయ్యారు. 1939 నుండి 1950 వరకు తెలంగాణ రైతాంగం అప్పుల భారం 122 శాతం పెరిగిందని పేవియర్ అంచనా. అయితే దీని వల్ల ఎంతమేరకు వాళ్ళ భూమి పరాయీకృతమయిందన్న దానికి మళ్ళీ స్పష్టమయిన అంచనా లేదు.

పైపెచ్చు ధరలతోపాటు ఆహార ధాన్యాలను దొంగనిల్వ (hoard) చేయడం ఎక్కువ కావడంతో హైదరాబాద్ ప్రభుత్వం పట్టణ ప్రాంతాల ఆహార అవసరాలను దృష్టిలో వుంచుకొని గ్రామాల నుండి నిర్బంధంగా లెవీ (levy) సేకరించడం మొదలుపెట్టింది. ఈ లెవీని భూస్వాములు తమ పరపతిని వినియోగించుకొని తప్పించుకోగలిగారు గాని, ధనిక రైతులకు అది సాధ్యం కాలేదు.

దీనంతటి ఫలితాన్నీ పేవియర్ ధనిక రైతాంగానికీ, దేశ్‌ముఖ్‌లకూ మధ్య పెరుగుతున్న వైరుధ్యంగా చిత్రిస్తాడు. ఒకవైపు ధనిక రైతాంగపు మిగులు ఉత్పత్తిని లెవీ రూపంలో నిజాం ప్రభుత్వం తీసుకుపోతోంది, వేరొకవైపు ప్రభుత్వం ఇచ్చే ద్రవ్య సహాయం, ఇతర గ్రామీణ అభివృద్ధి పథకాలు దేశ్‌ముఖ్‌లకు గుత్త అయ్యాయి. దీనితో ధనిక రైతాంగం కన్నెర్ర జేసి పోరాటానికి సిద్ధమయిందని చెపుతాడు.

దేశ్‌ముఖ్‌లు ధనిక రైతాంగాన్ని ఇబ్బంది పెట్టేంతగా వ్యవసాయ అభివృద్ధి మీద గుత్తాధిపత్యాన్ని సంపాదించుకున్నారా, వాళ్ళకసలు వ్యవసాయిక అభివృద్ధి పట్ల అంత పట్టింపు ఉండిందా అని ఎవరికయినా అనుమానం రావచ్చు. దానికి పేవియర్ ఇచ్చే సమాధానం చాలా స్పష్టమయినది : దేశ్‌ముఖ్‌లు ఫ్యూడల్ ప్రభువులు కాదు, పెట్టుబడిదారీ వ్యవసాయదారులు, పైగా వాళ్ళు వ్యవసాయంలో 'ప్రత్యక్షంగా నిమగ్నం' (directly involved) అయ్యారు. విసునూరు రామచంద్రారెడ్డి ఉత్పత్తిలో ఎంత ప్రత్యక్షంగా నిమగ్నం అయ్యాడో జనగామ ప్రజలే చెప్పాలి!

నిజానికి ఆనాటి దేశ్‌ముఖ్‌లు పూర్తిగా ఫ్యూడల్ ప్రభువులు. వాళ్ళకు పెట్టుబడిదారీ కవచం తొడగటం వికృతమయిన చర్య. అలాగే ఆనాటి ధనిక రైతాంగానికి వున్న 'పెట్టుబడిదారీ' స్వభావం కూడ అంతంత మాత్రమే. ఇంతా చేసి, ఈ పెట్టుబడిదారీ అలంకరణకు మూలమయిన ఆముదం, వేరుశెనగల ఉత్పత్తి ఏపాటి పరిమాణంలో వుండేది? 1941 నాటికి హైదరాబాద్ సంస్థానంలోని మొత్తం వ్యవసాయ యోగ్యమయిన భూమిలో వేరుశెనగ కింద వున్న భూమి 9 శాతం, ఆముదం కింద వున్నది 4 శాతం. ఈ మహాభాగ్యానికే వాణిజ్య పంటల పెట్టుబడిదారీ ఉత్పత్తినీ, అందులో నుండి పుట్టిన వైరుధ్యాలనూ ఊహించడం, ఆ వైరుధ్యాలను ఉద్యమానికి మూలంగా చిత్రించడం హాస్యాస్పదం.

శాస్త్రీయంగా వ్యాఖ్యానించుకుంటే పేవియర్ ఇచ్చిన సమాచారం నిరుపయోగ మయినదేమీ కాదు. ధరల పెరుగుదల, తగ్గుదల రైతాంగం మీద ప్రభావాన్ని వేసిందని ఒప్పుకోవడానికి నాటి తెలంగాణలో దేశ్‌ముఖ్‌లూ, ధనిక రైతులూ పెట్టుబడిదారీ ఉత్పత్తి కొనసాగించేవారని నమ్మాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం భూమి శిస్తును ధాన్య రూపంలో కాక రొక్కపు రూపంలో సేకరించడం మొదలుపెట్టిన నాటి నుండీ రైతాంగానికి ఎంతో కొంత మార్కెట్‌తో సంబంధం ఏర్పడింది. ఎందుకంటే పన్ను చెల్లించడానికి అందరూ కూడ పంటలో కొంత భాగం అమ్ముకోవాలి కాబట్టి. పైగా, గ్రామీణ స్వయం సంపూర్ణత విచ్ఛిన్నమయ్యే కొద్దీ తమ అవసరాలను కూడ మార్కెట్ లోనే కొనాలి. 1929 తరువాత వచ్చిన ఆర్థిక సంక్షోభం ప్రపంచవ్యాప్తంగానే వచ్చింది కాబట్టి దాని వల్ల రైతులు దెబ్బతినడం, తాము మార్కెట్‌లో అమ్మే సరుకుల ధరలు పడిపోవడం వల్ల అప్పులపాలు కావడం, భూమిని భూస్వాములకు కోల్పోవడం జరిగి వుండవచ్చును. 1939 తరువాత (రెండవ ప్రపంచ యుద్ధకాలంలో) ప్రపంచవ్యాప్తంగా వచ్చిన ద్రవ్యోల్బణం వల్ల మళ్ళీ అటువంటి పరిణామమే సంభవించి ఉండవచ్చును. సాంప్రదాయికంగా వస్తున్న భూమి పరాయీకరణకు ఇది కొంత దోహదం చేసి వుండవచ్చును.

అంతేకాదు, తెలంగాణ పోరాటం మౌలికంగా వెట్టి వంటి ఫ్యూడల్ దోపిడీ రూపాలకు వ్యతిరేకంగా వచ్చిందని చెప్పుకున్నాం. రైతులకు మార్కెట్‌తో కొంత సంబంధం ఏర్పడినందువల్ల వెట్టిచాకిరీ పట్ల వారిలో వ్యతిరేకత పెరగడం కూడ సహజం. దీనికి ఆ రైతు లాభం కోసం ఉత్పత్తిచేసే పెట్టుబడిదారీ వ్యవసాయదారుడు

కానక్కరలేదు. శ్రమకు రొక్కపు విలువ లేనంతకాలం వెట్టిచాకిరీ చేయడం ఒకెత్తు, రొక్కపు విలువ ఏర్పడ్డ తరువాత, అంటే ఒక గంట శ్రమ ఉత్పత్తి చేసే సరుకుకు ఇన్ని రూపాయల విలువ ఉందనీ, ఒక ఎకరంలో పండే పంటకు ఇన్ని రూపాయల విలువ ఉందనీ తెలిసిన తరువాత వెట్టి చేయడం వేరొక ఎత్తు. సారాంశంలో, పేవియర్ వివరించిన మార్పులు ఫ్యూడల్ పీడనకూ, దానిపట్ల వ్యతిరేకతకూ బహుశా పరిమాణాత్మకంగా దోహదం చేసి వుండవచ్చును.

తిరిగి ఉద్యమం దగ్గరికి పోదాం. అది ప్రారంభమయింది ఆంధ్ర మహాసభ ఆధ్వర్యంలో. ఆంధ్ర మహాసభ మొదట్లో నిజాం ప్రభుత్వం నుండి రాయితీలు సంపాదించడం, సాంస్కృతిక రంగంలో సంస్కరణలు సాధించడం, మొదలయిన కార్యక్రమాలు గల సంస్థగా వుండేది. క్రమంగా కమ్యూనిస్టు ప్రభావం సోకి దాని స్వరూపం మారింది. శ్రామిక జనం చెదురుమదురుగా జరిపిన ఫ్యూడల్ వ్యతిరేక చర్యలను అది వ్యవస్థీకరించగలిగింది. 1944 తరువాత కమ్యూనిస్టుల నాయకత్వంలో ఫ్యూడల్ వ్యతిరేక ప్రణాళికను చేపట్టింది. సాయుధమయినదే పోరాటమన్న తప్పుడు నమ్మకం వలన తెలంగాణ రైతాంగ ఉద్యమం దొడ్డి కొమురయ్య మరణంతో 1945లో మొదలయిందని చెప్పుకుంటున్నాం గాని నిజానికి (పేవియర్ గుర్తించినట్టు) అది 1944 లోనే మొదలయింది. సూర్యాపేట, ఖమ్మం లాంటి కొన్ని ప్రాంతాలలోనయితే వెట్టిచాకిరీ వ్యతిరేక ఉద్యమం 1943 లోనే మొదలయింది. ఫ్యూడల్ వ్యతిరేకతతో బాటు, బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి ఏజెంటయిన నిజాం ప్రభుత్వాన్ని తొలగించి హైదరాబాదును స్వతంత్ర భారతదేశంలో భాగం చేయాలనే 'జాతీయ విమోచన' అంశం కూడ ఆ పోరాటంలో వుంది. అయితే ఈ అంశాన్ని ఆ రూపంలో కాక 'విశాలాంధ్ర' ఏర్పాటు రూపంలో పార్టీ గుర్తించినట్టుంది.

అటువంటి పోరాటంలో ఎటువంటి వ్యూహాన్ని అవలంబించాలన్న ప్రశ్నకు సమాధానం 1955 తరువాత ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమంలో జరిగిన రెండు ముఖ్యమయిన పోరాటాలు చూపాయి. ఒకటి – సోవియట్ రష్యా మార్గదర్శకత్వాన నడిచిన ఫాసిస్టు వ్యతిరేక పోరాటం. రెండు – చైనా విప్లవ పోరాటం. ఈ రెండూ కూడ 'ఐక్య సంఘటన' మీద ఆధారపడ్డాయి. ప్రధాన శత్రువుకు వ్యతిరేకంగా కలిసి రాగల వర్గాలనూ సెక్షన్లనూ కార్మికవర్గ ఆధిపత్యం కింద సంఘటిత పరిచేది 'ఐక్య సంఘటన'. ఫ్యూడల్ వ్యతిరేక జాతీయ విమోచనా పోరాటంలో అట్లా కలిసిరాగల

సెక్షన్లలో ధనిక రైతాంగం, చిన్న వ్యాపారస్తులు, పట్టణ ప్రాంత పెటీ బూర్జువా వర్గం, జాతీయ బూర్జువా వర్గం ముఖ్యమయినవి. ఆనాటి పార్టీ ఈ వర్గాలను కలుపుకొని కార్మికవర్గ నాయకత్వాన స్పష్టమయిన రాజకీయ ఐక్య సంఘటనను నిర్మించిందనడం అతిశయోక్తి అవుతుంది గాని ఐక్య సంఘటన రాజకీయాలు మాత్రం – సంకల్పితంగానో అసంకల్పితంగానో – ఉద్యమ ఆచరణలో కనిపిస్తాయి.

ఈ 'ఐక్య సంఘటన' రాజకీయాలే ట్రాట్స్కీయిజానికీ, ఇతర 'ధనిక రైతాంగ' వాదాలకూ గిట్టవు. స్టాలిన్ పట్ల వ్యతిరేకత, తరువాతి కాలంలో మావో పట్ల వ్యతిరేకత ట్రాట్స్కీయిజానికున్న ముఖ్య లక్షణాలు. అందుకే స్టాలిన్, మావోల నాయకత్వంలో రూపొందిన వర్గ ఐక్య సంఘటనను వ్యతిరేకించడం ట్రాట్స్కీయిస్టుల ప్రధాన వ్యాపకమైంది. ఈ దృక్పథం నుండి పుట్టిందే 'ధనిక రైతాంగ'వాదం. ఆ వాదాన్ని ఉపయోగించి తెలంగాణ ఉద్యమ చరిత్రను పేవియర్ రాయడంలో గల ఉద్దేశం స్టాలిన్, మావోల వారసత్వాన్నీ, చైనా విప్లవ అనుభవం వెలుగులో నడుస్తున్న వివిధ మూడవ ప్రపంచ దేశాల ప్రజాస్వామిక విప్లవాల్నీ వ్యతిరేకించడం.

ఆ వాదం ఈ రకంగా నడుస్తుంది : శ్రామికవర్గం శ్రామికేతర వర్గాలతో, ముఖ్యంగా ధనిక రైతాంగం, జాతీయ బూర్జువా వర్గాలతో ఐక్య సంఘటన కట్టడం అనివార్యంగా ఆ శ్రామికేతర వర్గాల అవసరాలకు శ్రామికవర్గాన్ని లోబరచడానికి దారితీస్తుంది. అందుకే అట్లాంటి ఐక్య సంఘటన మీద ఆధారపడ్డ విప్లవోద్యమాలన్నీ కూడ ఒకనాడు కాకుంటే ఒకనాడు వైఫల్యాన్ని పొందుతాయి. మావో మరణానంతరం చైనా విప్లవం ఎదుర్కొంటున్న సమస్యలను ట్రాట్స్కీయిజం ఇదివరకు ఈ రకంగానే వ్యాఖ్యానించింది. (ఉదాహరణకు నిగెల్ హారిస్ చైనా మీద రాసిన పుస్తకం.) పేవియర్ తెలంగాణ పోరాటాన్ని గురించి రాసిందీ ఈ దృక్పథంతోనే. దానికి కావలసిన భూమికగా దేశ్‌ముఖ్‌లకూ, ధనిక రైతాంగానికీ భూమి కోసం, పెట్టుబడి కోసం బలమయిన పెట్టుబడిదారీ వైరుధ్యం ఏర్పడ్డట్టు ఏ రకంగా చిత్రించాడో ముందు చూశాం. ఆ వైరుధ్యం వల్ల పోరాటానికి సిద్ధమయిన ధనిక రైతాంగానికి పోరాడడానికి అవసరమయిన పేద రైతాంగం మద్దతును కమ్యూనిస్టుపార్టీ సంపాదించి పెట్టింది. స్టాలిన్, మావోలు రూపొందించిన ఐక్య సంఘటన రాజకీయాలను ఆశ్రయించి ధనిక రైతాంగాన్ని పేద రైతాంగంతో కలుపుకొచ్చి, పేద రైతాంగాన్ని ధనిక రైతాంగం అవసరాలకు లోబరిచి, చివరికి యూనియన్ సేనల ప్రవేశం తరువాత ధనిక రైతాంగం

అవసరాలను కాంగ్రెస్ పార్టీ తీర్చగలదు కాబట్టి ఆ వర్గానికి పోరాటం పట్ల విముఖత ఏర్పడగా, కమ్యూనిస్టు పార్టీ పోరాటానికి స్వస్తి చెప్పింది. ఇది భారత కమ్యూనిస్టు పార్టీకో లేదా తెలంగాణకో పరిమితమయిన వైపరీత్యమనుకోవద్దు. ఇది 'ఐక్య సంఘటన' రాజకీయాల అనివార్య పర్యవసానం. ఈ వైపరీత్యం ఎందుకు అనివార్యమో ట్రాట్స్కీయిజం ఎక్కడా వివరించలేదు గాని, పేవియర్ చూపించే ఒక కారణం, పార్టీ నాయకులు ధనిక రైతాంగం నుండి రావడం. మరి చైనా, వియత్నాం, లావోస్, కంపూచియా, జింబాబ్వే తదితర విప్లవాలు 'ఐక్యసంఘటన' రాజకీయాలనే అనుసరించాయి గదా, వాటి నాయకులు కూడ చాలామంది ధనిక రైతాంగం నుండో, పెటీ బూర్జువా వర్గం నుండో వచ్చారు గదా అంటే ట్రాట్స్కీయిజం ఆ విప్లవాలను గుర్తించదు. ఆ నాయకులను అసలు మార్క్సిస్టులుగా అంగీకరించదు.

అసలు విషయం చాలా సంక్లిష్టమయినది. 'ఐక్య సంఘటన' అనగానే అందులో అంతర్గతంగా వైరుధ్యాలుంటాయి. ఆ వైరుధ్యాలు పార్టీలో ప్రతిఫలించడం కూడ సహజం. పార్టీలోనే పేద రైతాంగం పక్షం తీసుకునేవారు, ధనిక రైతాంగం పక్షం తీసుకునేవారు, హైదరాబాద్ యూనియన్‌లో విలీనం కాగానే ఉద్యమ లక్ష్యం నెరవేరిందనుకునే వారు, వ్యావసాయిక విప్లవంతోనే ఆ లక్ష్యం నెరవేరగలదనుకునే వారు ఉండడం సహజం. దీనికి ఆయా వ్యక్తుల సామాజిక పూర్వరంగం ఎంతవరకు కారణమన్నది యాంత్రికంగా నిర్ధారణ చేయాల్సిన విషయం కాదు. సామాజిక పూర్వ రంగానికీ, రాజకీయాలకూ సంబంధం వుంటుంది గానీ ఆ సంబంధంలో ఏ రకమయిన అనివార్యతా లేదు. ఉందనుకోవడం భౌతికవాదం కాదు.

ఈ సంక్లిష్టత ఉద్యమ క్రమంలో బాగా కనబడుతుంది. వెట్టి, దండుగలు మొదలయిన సామాజిక పీడనా రూపాలకు వ్యతిరేకంగా మొదలయిన ఉద్యమం 1946 తరువాత భూమి ఆక్రమణలకు దారితీసింది. కౌలుదార్లు కౌలు భూములను స్వంతం చేసుకోవడం ద్వారా 8 లక్షల ఎకరాలను భూస్వాముల నుండి గుంజుకున్నారు. భూస్వాములు రైతుల నుండి అక్రమంగా చేజిక్కించుకున్న భూమిని రైతులు తిరిగి ఆక్రమించుకోవడం మొదలుపెట్టారు. తరువాతి కాలంలో కమతాల పరిమాణంపై పరిమితులు (land - ceilings) విధించి మిగులు భూమిని రైతులకు పంచడం మొదలుపెట్టారు. ఈ విధంగా స్వాధీనపరుచుకున్న భూమి మరొక రెండు లక్షల ఎకరాలు.

ఆ పరిమితి కూడ స్థిరంగా లేదు. మొదట్లో, నిజాం వ్యతిరేక పోరాటంలో కలిసి రాగల సెక్షన్లను దూరం చేసుకోగూడదనే ఉద్దేశంతో పరిమితిని 20 ఎకరాల తరి, 200 ఎకరాల కుష్కి (మెట్ట)గా నిర్ణయించారు. 10 ఎకరాల కుష్కి 1 ఎకరం తరి పొలానికి సమానమన్న అంచనా వల్ల. దీని అర్థం 40 ఎకరాల తరి పొలాన్ని గరిష్ట పరిమితిగా నిర్ణయించారని. ఉద్యమ క్రమంలో ఇది తగ్గి కొన్ని ప్రాంతాలలో 10 ఎకరాలు తరి, 100 ఎకరాలు కుష్కికి దిగింది. ముఖ్యంగా అప్పటి నల్లగొండ జిల్లాలో (అంటే ఇప్పటి నల్లగొండే కాకుండ, ఇప్పటి వరంగల్‌లోని జనగామ, చేర్యాల, కొడకండ్ల ప్రాంతాలు) దీన్ని విస్తృతంగా అమలు చేయడమే కాక, పేద రైతాంగం బలంగా ముందుకొచ్చిన చోట దాన్ని 5 ఎకరాలు తరి, 50 ఎకరాలు కుష్కికి తగ్గించడం జరిగింది. (ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడ్డ తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం నియమించిన గరిష్ట పరిమితి 14 ఎకరాలు తరి కంటే ఇది 30 శాతం తక్కువ.) ఇవన్నీ పేవియర్ కాదనడు గానీ, కమ్యూనిస్టు పార్టీ అనుసరించిన 'ఐక్య సంఘటన' రాజకీయాలు ఉద్యమానికి ధనిక రైతాంగ స్వభావాన్ని అనివార్యంగా ఒక పక్క ఇస్తూండగా, నల్లగొండలో మాత్రం దానికి తట్టుకొని పేద రైతాంగం పక్షం వహించిన నాయకత్వం వచ్చిందంటాడు. కాని వాస్తవానికి అప్పటి పార్టీ డాక్యుమెంట్లను బట్టి చూస్తే పార్టీలోనూ, ఆంధ్ర మహాసభలోనూ భూమి పంపిణీ గురించి విభేదాలున్నట్టు, అన్ని ప్రాంతాలలోను కొందరు పేద రైతుపక్షం, కొందరు ధనిక రైతుపక్షం వహించినట్టు, కొందరు 'విలీన'వాదులు, కొందరు విముక్తివాదులు ఉన్నట్టు తెలుస్తుంది. ఇందులో ధనిక రైతుపక్షం వహించిన ఆరుట్ల రామచంద్రారెడ్డి వంటి విలీనవాద నల్లగొండ నాయకులూ ఉన్నారు. భూమి పంపిణీ పట్ల చాలా అలసత్వం ప్రదర్శించిన ఖమ్మం వంటి ప్రాంతాలలో యూనియన్ సేనలను తీవ్రంగా ప్రతిఘటించిన వాళ్ళూ ఉన్నారు.

అంతేకాకుండా ఐక్య సంఘటన నిలవడం కోసం సహజంగానే వారు ధనిక రైతాంగానికి కొన్ని రాయితీలు ఇవ్వవలసి ఉంటుంది. ఐక్య సంఘటన వ్యూహరీత్యా, సిద్ధాంతరీత్యా తప్పంటే వేరు గానీ, ఒప్పంటే సమస్య స్వరూపమే మారుతుంది. చైనా విప్లవ పోరాటంలో కూడ మనకు అన్ని దశలలోనూ ఈ సమస్య కనబడుతుంది. ప్రతీ దశలోనూ పార్టీ ఐక్య సంఘటనను దృష్టిలో వుంచుకొని ధనిక, మధ్యతరగతి రైతాంగానికి రాయితీలు ఇవ్వడం, మళ్ళీ కింద నుండి పేద రైతాంగం ఒత్తిడి వల్ల పథకాన్ని విప్లవీకరించడం కనబడుతుంది. విప్లవం తరువాత నూతన ప్రజాస్వామిక

దశ నుండి సోషలిస్టు దశకు పరిణామం చెందే క్రమంలో కూడ ధనిక, మధ్యతరగతి రైతుల నిరసనను దృష్టిలో వుంచుకొని పార్టీ వ్యావసాయిక సమిష్టీకరణను ఒక్కొక్క అడుగే అతి జాగ్రత్తగా ముందుకు నడిపిస్తుండగా పేద రైతాంగం ఒక వెల్లువగా ముందుకు వచ్చి వ్యవసాయిక సమిష్టి కేంద్రాలను తామే ఏర్పరచిన తీరు, ఆ తరువాత పార్టీ ఆ ఏర్పాటుకు తానే నాయకత్వం వహించి ముందుకు తీసుకుపోయిన తీరు చైనా విప్లవ చరిత్ర ఎరిగినవాళ్ళకు పరిచితమే. From the masses to the masses అనండి, ఐక్య సంఘటనలో అంతర్గతంగా ఉన్న unity and struggle అనండి - మావో ఆలోచనతో పరిచయమున్న వాళ్ళకు ఈ క్రమంలో వింతేమీ లేదు.

చైనా విప్లవంతో పోల్చడంలో గల ఉద్దేశ్యం తెలంగాణ పోరాటానికి చైనా విప్లవ పోరాటానికున్న స్పష్టత వుండిందని బుకాయించడం కాదు. విషయంలోని సంక్లిష్టతను వివరించడం మాత్రమే. నిజానికి చైనా విప్లవ పోరాటానికున్న స్పష్టమయిన లక్ష్యం లేకపోవడమే కాదు, తెలంగాణలో ఐక్య సంఘటన ఆచరణలో కూడ ఎన్నో లోపాలు కనబడతాయి. చాలా సందర్భాలలో పార్టీ తీసుకోగలిగినంతగా పేద రైతాంగం పక్షం తీసుకోలేకపోయిందని అప్పటి పార్టీ డాక్యుమెంట్లు తెలుపుతాయి. పైన చూపినట్టు వరంగల్-నల్లగొండ ప్రాంతాలలో 10 ఎకరాలు తరి, 100 ఎకరాలు కుష్కి అన్న పరిమితిని అమలు చేయగా జనగామ లాంటి చోట్ల దాన్ని 5.50 ఎకరాలకు కూడ తగ్గించారు. 1950 నాటికి సారవంతమయిన ప్రాంతాలలో పరిమితిని 2 ఎకరాలు తరి, 20 ఎకరాలు కుష్కికి తగ్గించాలని (అంటే మొట్టమొదటి పరిమితిలో 10వ వంతు) ప్రతిపాదించడం జరిగింది. అయితే దాన్ని అమలు జరిపే లోపల పోరాటం విరమించబడింది.

కాని ఇతర ప్రాంతాలలో పార్టీ నిర్ణయాలను ఉల్లంఘించి పరిమితి కంటే ఎక్కువ భూమిని ఉండనిచ్చారు. ఖమ్మం తాలూకాలోను, మధిర తాలూకాలోను, మధిర ఫిర్కాలోను అసలు భూమి పంపకమే జరగలేదని 1949 నాటి ఒక పార్టీ డాక్యుమెంటు తెలుపుతుంది. భూమి పంపకం జరిగిన చోట్ల కూడ కొన్ని సందర్భాలలో పేద రైతులకు కాక, ఉద్యమంలో ఆస్తులు కోల్పోయారన్న మిష మీద ధనిక రైతులకు, మధ్యతరగతి రైతులకు ఇవ్వడం జరిగింది. అంతేకాకుండ వ్యవసాయ కూలీల కూలి పెంపుదల ధనిక, మధ్యతరగతి రైతులను దెబ్బతీసే అవకాశం వుంది కాబట్టి కొన్నిచోట్ల కూలి సమస్యలు తీసుకోకనే పోవడం జరిగింది. పార్టీ నిర్ణయం ప్రకారం జీతగాళ్ళ జీతం

నెలకు 60 శేర్ల ధాన్యం నుండి 90కి పెంచాల్సి వుండింది గానీ అది కొన్నిచోట్ల మాత్రమే అమలయింది. ఈ అలసత్వంలోనూ మళ్ళీ అసమానత కనిపిస్తుంది. భూమి పంపకం అసలే జరగని ఖమ్మం తాలూకాలో జీతగాళ్ళ జీతం మాత్రం 120 శేర్ల జొన్నలకు పెంచబడిందని పైన పేర్కొన్న డాక్యుమెంట్ అంటుంది.

అదే సమయంలో కొన్ని విషయాలలో పార్టీ ప్రజల కంటే కూడ 'అతివాదాన్ని' ప్రదర్శించింది. అప్పులను పూర్తిగా రద్దుచేస్తే మళ్ళీ అప్పు దొరకదని రైతాంగం భయపడింది గాని, పార్టీ మాత్రం అనాలోచితంగా అప్పులను పూర్తిగా రద్దుచేయాలని డిమాండ్ చేసింది. ఇటువంటి మరొక ఉదాహరణ భూముల ఆక్రమణకు సంబంధించినది. ధనిక రైతులూ భూస్వాములూ మాత్రమే కాదు, మధ్యతరగతి రైతులయినా సరే పేద రైతులకు అప్పులిచ్చి అప్పుకు మారుగా వాళ్ళ భూమిని చేజిక్కించుకొని వుంటే ఆ భూమిలో కొంతభాగాన్నయినా సరే తిరిగి ఆ పేద రైతుకు ఇచ్చేయాలనేది రాష్ట్ర కమిటీ నిర్ణయం. ఆచరణలో దీని వల్ల పేద, మధ్యతరగతి రైతుల మధ్య స్పర్థలు వస్తున్నాయని గుర్తించిన తరువాతే, ఆ రకంగా నష్టపోయిన పేద రైతులకు భూస్వాముల భూములు పంచి ఇవ్వాలేగాని మధ్యతరగతి రైతు నుండి తీసుకోగూడదనీ, అటువంటి ప్రతీ కేసునూ నిర్దిష్టంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలే గాని ఎట్టి పరిస్థితిలోనూ సార్వత్రికమయిన సూత్రాలను ఏర్పరచుకోగూడదనీ అనుకోవడం జరిగింది.

నిజానికి ఆనాటి పార్టీ ఆచరణలోనూ సైద్ధాంతిక అవగాహనలోను ధనిక రైతాంగ పక్షపాతం ఎంత కనబడుతుందో, అగమ్యగోచరత, ఔత్సాహికత అంత కనబడతాయి. 1950లో రాసిన ఒక ఆత్మవిమర్శ సర్క్యులర్ ఈ రకంగా అంటుంది : "గ్రామ వర్గ నిర్మాణాన్ని గురించి ఎక్కడా కూడ సమాచారం సేకరించలేదు. అంటే ఎవడు భూస్వామి, ఎంతమాత్రం భూమి వుంటే రైతును భూస్వామి అనవచ్చు అనే విషయాల గురించి సమాచారం సేకరించలేదు. ఈ విశ్లేషణ లేకపోవడం వలన సరయిన వర్గ దృక్పథం అలవర్చుకోలేకపోయాము. 10 ఎకరాలు తరి, 100 ఎకరాలు కుష్కి కంటె ఎక్కువ భూమి ఉన్నవాళ్ళే భూస్వామ్య వర్గానికి చెందుతారని అంచనా వేసుకున్నాము. దీని వల్ల భూస్వామ్యాన్ని మట్టుబెట్టలేకపోయాము". అంతకంటే తక్కువ భూమి వున్నా ఫ్యూడల్ దోపిడీ రూపాలను అనుసరించేవాళ్ళు భూస్వాములే అవుతారన్న అవగాహన ఇక్కడ లోపించింది. దాని వల్ల "వ్యవసాయ కూలీలకూ, పేద రైతులకూ కావలసినంత

భూమి చిక్కలేదు. విప్లవ ప్రజానీకంలో చాలా అసంతృప్తి చెలరేగింది. ఈ భూస్వాముల దగ్గర అంత భూమి ఎందుకు మిగల్చాలి? వాళ్ళకంటే మా కుటుంబాలు పెద్దవి కదా, మరి మేమెట్లా బ్రతకాలి అని వాళ్ళు ప్రశ్నించడం మొదలుపెట్టారు" అని సర్క్యులర్ అంటుంది. (స్వేచ్ఛానువాదం నాది.)

విముక్తమయిన గ్రామాలలో పరిపాలనా నిర్వహణ కోసం గ్రామ కమిటీలను వేయడం జరిగింది. ఈ కమిటీలలో ఐక్య సంఘటనలో భాగమయిన ధనిక రైతాంగ ప్రతినిధులు ఇద్దరు, పేద రైతుల, వ్యవసాయ కూలీల, ఇతర శ్రామికుల ప్రతినిధులు ముగ్గురు ఉండేవారు. ధనిక రైతులను ఎంచుకోవడానికి ఉపయోగించిన ప్రమాణం ఆ వ్యక్తులకు 3 ఎకరాల నుండి 10 ఎకరాల వరకు తరి, 30 నుండి 100 ఎకరాల వరకు కుష్కి ఉండడం. (10 ఎకరాల కుష్కిని 1 ఎకరం తరికి సమానంగా పరిగణించారని గుర్తుంచుకుంటే, 6 ఎకరాల తరి పొలం కంటే వెక్కువ వున్న వాళ్ళను ధనిక రైతులుగా నిర్ణయించడం జరిగిందని తెలుస్తుంది. దీన్నిబట్టి చూస్తే పార్టీకి 'ధనిక రైతాంగ' స్వభావం వుండేదన్న ఆరోపణ చాలా అసంతృప్తికరమనిపించక తప్పదు.)

అయితే ఇట్లా కేవలం భూమి పరిమాణాన్ని బట్టి వీళ్ళను ధనిక రైతులని నిర్ణయించుకుని గ్రామ కమిటీలో వేసుకోవడం వలన వాస్తవానికి చాలాచోట్ల గ్రామ కమిటీలలో ఇద్దరు భూస్వాములను వేసుకోవడం జరిగిందని పైన ఉటంకించిన సర్క్యులర్ అంటుంది. ఇట్లా జరిగిన చోట్ల భూమి పంపకం తమ నిర్ణయాలను అనుసరించి జరగలేదని గుర్తిస్తుంది. "ప్రజలు ముందుకు రావడం లేదు" అన్న మిషమీద పంపకాన్ని ఆపడం జరిగేదట. జరిపినచోట్ల కూడ మంచి భూమిని భూస్వాములకే వుండనిచ్చి పనికిరాని భూమినే పంచేవారట. భూస్వాముల మిగులు భూమిని లాక్కొని పంచకుండ ఈ గ్రామ కమిటీలు పేద రైతుల మధ్య వచ్చిన తగువులను పరిష్కరించడం, ఒక పేద రైతు నుండి అర ఎకరం భూమి తీసి ఇంకొక పేద రైతుకు ఇప్పించడం, మొదలయిన కార్యక్రమాలతో పొద్దుపుచ్చేవట.

ఇక్కడ సమస్య గ్రామ కమిటీలలో చేరిన భూస్వాములూ, ధనిక రైతులూ ఇట్లా ఎందుకు ప్రవర్తించారన్నది కాదు. అటువంటి ప్రవర్తన వాళ్ళకు సహజం. పార్టీ ఆ గ్రామ కమిటీల ఆచరణపై నిఘా ఎందుకు ఉంచలేకపోయింది, అసలు గ్రామ కమిటీల

నిర్మాణం ఏ వర్గాలకు దోహదం చేసేటట్లుందో ఎందుకు గుర్తించలేక పోయింది అన్నది.

ట్రాట్స్కీయిస్టు 'ధనిక రైతాంగ' వాదాన్ని పక్కకు పెట్టినా అప్పటి పార్టీ నాయకులు అత్యధికంగా ధనిక రైతాంగం నుండి రావడం దీనికి కారణమని బాధ్యతాయుతులయిన చాలా మంది పరిశీలకులు వాదించడం జరుగుతోంది. ఐక్య సంఘటన రాజకీయాలు అనివార్యంగా ఉద్యమానికి ధనిక రైతాంగ స్వభావాన్ని ఇస్తాయనే 'ధనిక రైతాంగ' వాదానికీ, ఈ వాదానికీ చాలా తేడా వుందని వివరించనక్కరలేదు. అయినా ఈ వాదన కూడ విశ్వసనీయంగా లేదు. వ్యావసాయిక విప్లవ పోరాటం తాత్కాలిక తిరుగుబాటుగా కాక దీర్ఘకాలిక లక్ష్యంతోను, చరిత్రాత్మక గమ్యంతోను నడవాలంటే దానికి నాయకత్వం వహించేవారికి కొంత ప్రపంచజ్ఞానం, చరిత్రతో పరిచయం అవసరం. భూస్వామ్య సమాజంలో భూస్వాములకూ, ధనిక రైతులకూ మాత్రమే అవి ఉంటాయి. అందుకే అటువంటి పోరాటాలకు నాయకత్వం వహించేవారు ఎక్కువగా ఈ వర్గాల నుండే వస్తారు. దీనికి తెలంగాణయే కాదు, చైనా, వియత్నాంలు కూడ మినహాయింపు కాదు.

అంతే కాకుండ పార్టీ ప్రదర్శించిన అగమ్యగోచరత తెలంగాణకు పరిమిత మయిందీ కాదు. భారత కమ్యూనిస్టు పార్టీ ఆది నుండి కూడ ఈ గుణం ప్రదర్శించింది. నిజానికి భారత, చైనా కమ్యూనిస్టు పార్టీలను పోల్చిచూస్తే చాలా ఆసక్తికరమయిన పోలికలూ, తేడాలూ కనబడతాయి. రెండూ కూడ 1920ల తొలి సంవత్సరాలలో పుట్టాయి. రెండూ కూడ 1925లో చరిత్రకెక్కాయి. (మీరట్ కుట్ర కేసు, షాంఘై తిరుగుబాటు.) 1935 తరువాత జరిగిన దీర్ఘకాలికమయిన ఫాసిస్టు వ్యతిరేక పోరాటంలో రెండూ కూడ ఐక్య సంఘటన రాజకీయాలను చేపట్టాయి. (ఇక్కడ కాంగ్రెస్‌తో, అక్కడ చియాంగ్ కైషేక్‌తో). అయినా 1948 చివరి నాటికి చైనా కమ్యూనిస్టు పార్టీ విప్లవానికి ఒక్కడుగు దూరంలో మాత్రమే వుంది. కాని భారత కమ్యూనిస్టు పార్టీ తాను నాయకత్వం వహించిన పోరాటాలలో అత్యంత మహత్తరమైనదయిన తెలంగాణ రైతాంగ పోరాటాన్ని విరమించుకోవడానికి సిద్ధమవుతోంది. అంతేకాదు, ఐక్య సంఘటనకు సంబంధించి అంతర్జాతీయ కమ్యూనిస్టు నాయకత్వం ఇచ్చిన స్థూలమయిన సూచనలను చైనా కమ్యూనిస్టు పార్టీ సృజనాత్మకంగా స్థానిక పరిస్థితులకు అన్వయించగా సి.పి.ఐ మాత్రం వాటిని వర్గ

సంకర రాజకీయాలకు దిగజార్చిందని తరువాతి కాలంలో అప్పటి కార్యకర్తలే చాలామంది అంగీకరిస్తున్నారు. 1926లోనే మావో హూనాన్ రిపోర్టుతో చైనా విప్లవ లక్ష్యానికీ, వ్యూహానికీ బీజం పడింది. కాని 1948 వరకు భారత విప్లవానికి రాజ్యాధికార లక్ష్యం గానీ వ్యూహం గానీ లేవు. ఆ సంవత్సరంలోనే రెండు పరస్పర వ్యతిరేకమయిన ప్రతిపాదనలు (రణదివె పంథా, 'ఆంధ్ర' పంథా) ముందుకొచ్చాయి. అయితే మూడు సంవత్సరాలలోపే రెండింటికీ గోరీ కట్టారు. మళ్ళీ నక్సల్బరీ వచ్చేదాకా భారత కమ్యూనిస్టు పార్టీ ఉద్యమానికి ఒక స్పష్టమయిన లక్ష్యం, దానికి అనుగుణ్యమయిన వ్యూహం లేవు. ఇప్పటికి కూడ రెండు రివిజనిస్టు పార్టీలకూ ఉన్న సకల అవలక్షణాలలో ఒకటి – తమ గమ్యం ఏమిటో తెలియకపోవడం. రాజ్యాధికార లక్ష్యం, దాన్ని సాధించడానికి అవసరమయిన వ్యూహం లేకుండ దాదాపు 50 సంవత్సరాలు పనిచేసిన ఘనత ఒక్క భారత కమ్యూనిస్టు ఉద్యమానికే దక్కుతుందనుకుంటాను.

ఇవ్వాళ మనం కారణాలు వెతకాల్సింది ఈ ఘనతకే గాని, దాని నుండి తెలంగాణ పోరాట విరమణను వేరుచేసి దానికి గల కారణాలను విడిగా అన్వేషించడం అర్థరహితమయిన పని. అప్పుడే 'ధనిక రైతాంగ' వాదాలు ఎంత అసంతృప్తికర మయినవో అర్థమవుతుంది. ఆరుట్ల రామచంద్రారెడ్డిని భూస్వామో ధనిక రైతో అనవచ్చు కాని రణదివేనీ, డాంగేనీ, పి.సి. జోషీని ఏమనాలి? పెటీ బూర్జువాలు అనేటట్లయితే అదో ఇదో కాని వారు ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమ నాయకులలో ఎంతమంది?

**సృజన**
**అక్టోబర్ 1982**

# సిరిసిల్లా - వేములవాడ రైతాంగ పోరాటం

'సిరిసిల్లా, జగిత్యాల తాలూకాలలో కల్లోలిత ప్రాంతాల ప్రకటనను ఎత్తివేయాలి' ఈ నినాదం తెలంగాణ పట్టణాలలో గోడలపై విస్తృతంగా కనిపిస్తుంది. 1978 అక్టోబర్‌లో కల్లోలిత ప్రాంతాల ప్రకటన చేసినప్పుడు సిరిసిల్లా తాలూకాగా వుండిన ప్రాంతాన్ని, ఆ తరువాత సిరిసిల్లా, వేములవాడ తాలూకాలుగా విభజించారు. అందువల్ల, వేములవాడ కల్లోలిత ప్రాంతంగానే పుట్టిందని చెప్పవచ్చు. కరీంనగర్ – కామారెడ్డి రోడ్డు ఈ రెండు తాలూకాలను విభజించే రేఖ. దీనికి ఉత్తరంగా వేములవాడ, దక్షిణంగా సిరిసిల్లా తాలూకాలుంటాయి. ఈ రెండూ కలిసి కరీంనగర్ జిల్లా ఈశాన్య మూలను ఆక్రమిస్తాయి.

అకడెమిక్స్ కళ్ళు ఇంకా కరీంనగర్ రైతాంగ పోరాటంపై పడలేదు. పడినప్పుడు, ఒక వాస్తవం వాళ్ళకు కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఈ పోరాటం ప్రారంభమైంది 1970లో. గోదావరి నది మీద కట్టిన పోచంపాడు ప్రాజెక్టు కరీంనగర్ జిల్లాలో కొన్ని ప్రాంతాలకు నీళ్ళందించడం ప్రారంభమైంది కూడా 1970లోనే. ఇది రైతాంగ పోరాటాలపై ప్రసిద్ధ అకడెమిక్ సిద్ధాంతాలకు చక్కగా నప్పుతుంది. బ్యారీ పేవియర్ ధనిక రైతు సిద్ధాంతాలకు కుదురుతుంది. 1940 తరువాత వచ్చిన తెలంగాణ రైతాంగ పోరాటాలను ఐరోపా సైన్యం అవసరాలకు, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నడిచిన ఆముదాలు, వేరుశెనగల విప్లవంగా వివరించడానికి పేవియర్ ప్రయత్నించాడు. నీటి పారుదల, పెట్టుబడి చొరబాటులో వ్యత్యాసాల ప్రాతిపదికపై పేవియర్ సిద్ధాంతం ఆధారపడుతుంది. (Built around the irrigation-capital penetration differentiation syndrome.)

కాని, ఈ పెట్టుబడి చొరబాటు సిద్ధాంతాన్ని నమ్ముకున్న అకడెమిక్స్ ఎదుర్కనే సమస్య ఒకటుంది. పోచంపాడు కాలువ కరీంనగర్ జిల్లాలోని దక్షిణ ప్రాంత తాలూకాలలో ప్రవహిస్తుంటే, పోరాటం సిరిసిల్లాలోని వేములవాడ ప్రాంతంలో ప్రారంభమైంది. అది కూడ సిరిసిల్లాలో ఏదో మేరకు వరి పండించే ప్రాంతంలో కాకుండా, ప్రధానంగా జొన్న, మొక్కజొన్న పండించే వేములవాడ చిట్టడవి ప్రాంతంలో ప్రారంభమైంది. (40 సంవత్సరాల నాటి ఎగువ మానేరు ప్రాజెక్టు కింద కొంత ప్రాంతానికి నీళ్ళందుతాయి). ఈ సెప్టెంబర్ నెలలో ఖరీఫ్ పంట కాలం మొదలైన 8 వారాల తరువాత చూస్తే వేములవాడ పొదలతో, రాతి భూములతో, అక్కడక్కడ మనిషెత్తు మొక్కజొన్న, జొన్న కర్రలతో పాడుబడినట్టుగా కనిపిస్తున్నది.

వాస్తవ పరిస్థితిని వస్తుగతంగా పరిశీలించినట్లయితే, ఇక్కడ పోరాటం బద్దలు కావడానికి కారణం పెట్టుబడి చొరబడడం కాదనీ, కమ్యూనిస్టు కేడరు చొరబడడమేనని తెలిసిపోతుంది. నిజానికి 1940 ప్రాంతాల్లో రైతాంగ పోరాటంలో పాల్గొన్న కొన్ని ప్రాంతాలలో ఈ సిరిసిల్లా తాలూకా కూడ ఒకటి. పుచ్చలపల్లి సుందరయ్య (తన తెలంగాణ ప్రజా పోరాటం – గుణపాఠాలు పుస్తకంలో) 1950 జూన్ 10న సిరిసిల్లా పోలీసు స్టేషన్‌పై గెరిల్లా దళం జరిపిన దాడిని టర్నింగ్ పాయింట్‌గా పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లాలోని పెక్కు గ్రామాలలో భూస్వామ్య పీడనకు వ్యతిరేకంగా, ప్రభుత్వ ధాన్యం లెవీకి వ్యతిరేకంగా సమరశీల ప్రజాపోరాటాలకు ఈ దాడే దారి తీసిందని పేర్కొన్నారు. (నాటి వీరోచిత పోరాటానికి ఒక అవశేషంగానే, సి.పి.ఐ. ఎం.ఎల్.ఏ. సి. హెచ్. రాజేశ్వరావు సిరిసిల్లా నుండి గెలిచారు. ఈయన సి.పి.ఐ. ప్రధాన కార్యదర్శి కాదు. వేరే రాజేశ్వరరావు.) కాని, ప్రస్తుత పోరాటం గత సమరశీల పోరాటపు పునరుద్ధరణగా భావించడం కేవలం ప్రతీకాత్మమే అవుతుంది. ఎందుకంటే, 1964 పార్టీ విభజన సమయంలో, ఇక్కడ మొత్తం నాయకులు (అందువల్ల, మొత్తం కేడరు) సి.పి.ఐ.తోనే వుండిపోయారు. ఒక్క బద్దం ఎల్లారెడ్డి మాత్రం కేవలం 3 నెలలపాటు సి.పి.ఎం.లో వుండి, తిరిగి సి.పి.ఐ. లోకి వెళ్ళిపోయాడు. పర్యవసానంగా, 1967లో సి.పి.ఎం నుండి విప్లవ కమ్యూనిస్టులు బయటకు వచ్చినప్పుడు, కరీంనగర్‌లో సి.పి.ఎం నుండి బయటకు రావడానికి ఎవరూ మిగల్లేదు. ప్రస్తుత ఉద్యమాన్ని నడిపిన వాళ్ళంతా 1970లో రాజకీయంగా ప్రారంభకులే, వాళ్ళు ఉద్యమంతోపాటే పెరిగారు. అందువల్ల, కరీంగనర్ విప్లవ కమ్యూనిస్టు నాయకులలో మూడు పదులు దాటిన వాళ్ళు చాలా తక్కువ.

## ప్రారంభం

1970–71లో వీళ్ళు నిజామాబాద్ జిల్లా నుండి కొండల్లాగ కనిపించే ప్రాంతాన్ని దాటి, పాత సిరిసిల్లాలోని ఈశాన్య ప్రాంతం (ప్రస్తుత వేములవాడ పశ్చిమ ప్రాంతం)లోనికి ప్రవేశించారు. 1967 వసంత మేఘగర్జన ఉత్తేజంతో అంతవరకు తాము పనిచేస్తున్న నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ తాలూకాలో నిర్బంధం రావడం వల్ల వాళ్ళు ఈ దిశగా ప్రయాణించారు. ఇక్కడ వాళ్ళకు ఎదురైంది నీరులేని చిట్టడవి ప్రాంతం, అసఫ్‌జాహి కాలపు ఫ్యూడల్ విధానాల కిందనున్న గ్రామాలు. దొరలు దేశముఖ్‌లుగా, జాగీర్దార్లుగా లేరన్నది నిజమే కాని సారాంశంలో పెద్ద తేడా లేదు.

అత్యవసర పరిస్థితి ప్రకటన వరకు పోరాటం నిమ్మపల్లి, కోనారావుపేట, వీర్నపల్లి కేంద్రంగా కొద్ది గ్రామాలలో మాత్రమే సాగుతుండింది. నిమ్మపల్లి దొర పేరు బొంతల భాస్కరరావు, ఇతనికి 1600 ఎకరాల భూమి వుందంటారు. ఇతని విషయంలోనూ డజన్ల మంది ఇతరుల విషయంలోనూ వాళ్ళ భూముల విస్తీర్ణం ఆశ్చర్యకరమైన సంఖ్యల్లో వుంటాయి. వీటి మీద యాజమాన్యం చట్టబద్ధంగా గానీ, చివరకు బినామీగా గానీ వుండదని తెలిసే దాకా ఈ ఆరోపణలు నమ్మదగ్గవిగా కనిపించవు. వీళ్ళు గ్రామాల ఉమ్మడి భూముల మీద, అడవి భూమి మీద, ఎవరి పేరిటా రికార్డు కాని భూమి మీద, చెరువు శిఖం, నదీ తీరాల భూముల మీద, చివరకు సాగుకు లాయకు కాని బంజరు భూముల మీద సైతం యాజమాన్యం చెలాయిస్తుంటారు. వీటి వల్ల వారికేదో లాభం వుంటుందని కాదు. గ్రామీణ పేదలకు (మరీ అంత పేదలు కాదు) ఇవి దక్కకుండా చూడడానికే వాటిపై పెత్తనం చెలాయించడం. కచ్చితమైన (బూర్జువా) అర్థంలో యాజమాన్యం చెలాయించడం కాదిది. ఫ్యూడల్ అధికారం చెలాయించడంలో భాగం.

1950 ప్రాంతాల్లో ఎప్పుడో భాస్కరరావు 'తండ్రో, తాతో' తన భూమిలోంచి 22 ఎకరాలు కొన్ని హరిజన కుటుంబాలకు ఇచ్చాడు. రైతాంగ సాయుధ పోరాటం తరువాత శ్రామిక ప్రజలతో మంచి సంబంధాలు పెట్టుకోవాలన్న కోరిక దీనికి కారణమని చెబుతారు. ఆ రోజుల్లో ఈ నిమ్మపల్లి గ్రామం (అలాగే వీర్నపల్లి) 'కమ్యూనిస్టుల బలమైన కేంద్రం'గా వుండిందని సుందరయ్య పేర్కొన్నారు. కాని 1970 వచ్చేసరికి, ఈ 22 ఎకరాల్లో మంచి ఆదాయం వచ్చే అవకాశం ఏర్పడింది. మూలవాగు అనే చిన్న ఏటి మీద కట్టిన వంతెన (ఇది 1978లో పూర్తయ్యింది) వలన సుమారు

2500 ఎకరాలకు సాగునీరు లభించే అవకాశం వచ్చింది. అందువల్ల భాస్కరరావు భూమి తనకు తిరిగి కావాలని హరిజన కుటుంబాల్ని వెళ్ళగొట్టాడు. వాళ్ళు పార్టీని సంప్రదించారు. ఇదే ఆ తరువాత చంద్ర పుల్లారెడ్డి నాయకత్వంలోని సి.పి.ఐ. (ఎం.ఎల్) అయ్యింది. పార్టీ అప్పుడే కొన్ని పొరుగు గ్రామాలలో ప్రచార కార్యక్రమాలు ప్రారంభించింది. దాని ఫలితంగా 1973లో నిమ్మపల్లి, కోనరావుపేట, వీర్నపల్లి గ్రామాల్లో రైతుకూలీ సంఘాలు ఏర్పడ్డాయి. ఈ 22 ఎకరాలు ఆక్రమించుకుని నువ్వులు వేయండని సంఘం హరిజనులకు పిలుపునిచ్చింది. దొర కిరాయి గూండాలతో దాడి చేయించడంతో హరిజనులు వెనుకడుగు వేశారు. ఆ తరువాత సంవత్సరం సంఘం ఈ భూమి ఆక్రమణకు మూడు గ్రామాల ప్రజల్ని కదిలించింది. పర్యవసానంగా మొదలైన ఘర్షణలో పోలీసులు ప్రవేశించారు. మూడు గ్రామాల్లో పోలీసు క్యాంపులు పెట్టి, పెక్కుమంది ప్రజల్ని సిరిసిల్లా కుట్ర కేసులో ఇరికించారు. (కుట్ర కేసులనేవి పోలీసులకు ఒక ఫ్యాషన్‌గా వున్న రోజులవి. వాటిలో చాలా కేసులను కోర్టులో కొట్టి వేయడం వల్ల ఆ తర్వాత వాటిపై పోలీసులకు ఉత్సాహం తగ్గిపోయినట్టుంది.) సాక్షులు దొరక్కపోవడంతో ఈ కేసును కూడ కొట్టేశారు. కాని ఈ లోపల దొర మాత్రం ఆ 22 ఎకరాలను ఆక్రమించుకున్నాడు.

## నిర్బంధం, ప్రతిఘటన

అయితే ఇక్కడ రికార్డు చేయాల్సిన విషయం భూస్వామ్య పీడన, ప్రజా ప్రతిఘటన వివరాలు కాదు. (ఇవి గ్రామ గ్రామాన ఒకే విధంగా వుంటాయి.) ప్రత్యేకించి నిర్బంధ పరిస్థితులలో ప్రజలు అభివృద్ధి చేసుకున్న వ్యూహమూ, ఎత్తుగడలను గమనించాల్సి వుంటుంది. నిర్బంధ కాలంలో 'కొత్త ప్రాంతాలకు విస్తరించడం, విస్తరించిన ప్రాంతాలను పటిష్టం చేసుకోవడమే ప్రధాన ప్రతిఘటనా రూపం' అన్న ఎత్తుగడను నిమ్మపల్లి పోరాట కాలం నుండీ వాళ్ళు అనుసరిస్తూ వచ్చారు. నిమ్మపల్లిపై నిర్బంధం పొరుగు గ్రామాలలో విస్తరణకు దారితీసింది. అక్కడ ఇతర సమస్యలపై – తునికాకు కూలి రేట్లు, వ్యవసాయ కూలీ రేట్లు, పాలేర్ల కూలి రేట్లు, పాలనలో అవినీతి మొదలైన సమస్యలపై ఆందోళన చేస్తూ తమ పోరాటాలను పటిష్టం చేసుకున్నారు. 22 ఎకరాలు ఆక్రమించడానికి వాళ్ళు చేసిన రెండు విఫల ప్రయత్నాల మధ్య కాలంలో ఉద్యమం సిరిసిల్లా, వేములవాడ పట్టణాల్లోని విద్యార్థి యువజనులలోనికి వ్యాపించింది. నిమ్మపల్లి పోరాటం 'నాంది' అనే నాటకం ద్వారా ప్రచారంలోకి వచ్చింది. 'విస్తరణ, సంఘటితం'

ఎత్తుగడలలో భాగంగా వారు తునికాకు పోరాటాన్ని తీసుకున్నారు. కమ్యూనిస్టు విప్లవకారులు గోదావరి లోయ ప్రాంతంలో గిరిజన, తదితర ప్రజానీకాన్ని సమీకరించడం ప్రారంభించినప్పటి నుండీ (అంటే 1970 ముందు దినాల నుండీ) తునికాకు కూలీ పోరాటం నిజానికి నిరంతర పోరాటం అయింది. వేములవాడ చిట్టడవి (Shrub Forest) గోదావరి లోయ అడవిలో భాగం కానప్పటికీ, ఇక్కడ తునికాకు కూలీ పోరాటం సాధారణ పోరాటంలో భాగం అయింది.

ప్రతి ఏడు వేసవి ప్రారంభానికల్లా తునికాకులు తెంపే సీజన్ మొదలవుతుంది. వ్యవసాయ పనులు లేని కాలం కనుక భూమి లేని నిరుపేద రైతాంగ ప్రజలకు తునికాకు చాలా అవసరమైన ఆదాయ వనరు అవుతుంది. పూర్వం వాళ్ళు ఆకులు తెంపి కాంట్రాక్టర్లకు (గుత్తెదార్లకు) అమ్మేవాళ్ళు. వంద ఆకుల కట్టకు 2 లేక 3 పైసల రేటు దొరికేది. గ్రామంలోని కల్లాల్లో కాంట్రాక్టర్ ఏజెంటు (కల్లేదారు) ఆకు కొనుగోలు చేస్తాడు. 'వ్యాపారం లాగ' కనిపించే ఈ వ్యవహారంలో కూడ కాంట్రాక్టర్ 'వేతనం లేకుండా' శ్రమ దోపిడీ చేయడం ఈ ప్రాంతంలోని భూస్వామ్య వాతావరణం ప్రత్యేకత. ప్రతి పది కట్టల్లో ఒకటి రెండు కట్టల్ని ఏదో ఒక దేవత పేరిట 'ఉచితం'గా తీసేసుకుంటారు. అది కాక శ్రామికుడు ఆ రోజు కల్లానికి తెచ్చిన వాటిలో మొదటి కట్టను శుభశకునంగా 'ఉచితం'గా తీసేసుకుంటారు.

## భూస్వాముల రక్షణకు వచ్చిన ప్రభుత్వం

ఈ భూస్వామ్య ఆచారాల్ని నిర్మూలించి, తునికాకు కూలీరేట్లను పెంచడం కోసం సంఘం పోరాటం చేపడితే ప్రభుత్వం నుండి దానికి తక్షణ ప్రతి చర్య వచ్చింది. ప్రభుత్వం కాంట్రాక్టర్లను రక్షించడం కోసం ఆ వ్యాపారాన్నే జాతీయం చేసింది. ప్రైవేటు రంగాన్ని రక్షించడానికి జాతీయీకరణను ఉపయోగించడం వుపయోగకరమా, కాదా అన్నదానికి ఈ చర్య ఒక ప్రయోగం వంటిది. ప్రభుత్వం తునికాకు సేకరణకు సహకార సంఘాల్ని గానీ, పబ్లిక్‌రంగ కార్పొరేషన్లను గానీ ఏర్పరచకుండా; తునికాకును కూలీల నుండి కొనుగోలు చేసి (ఆ విధంగా వారి ఆందోళన భారం తాను వహించి) ఆ తరువాత ఆకును కాంట్రాక్టర్లకు అమ్ముతుంది. దీనికిగాను కాంట్రాక్టర్లు అదనంగా, కొనుగోలు చేసిన దానికి అనుగుణంగా రాయల్టీ చెల్లిస్తారు. ఇక్కడ కూడ కొనుగోలు కోసం ప్రభుత్వం ఫారెస్టు డిపార్టుమెంటును ఉపయోగించడం లేదు. కల్లెదార్లు స్వయంగా కొనుగోలు చేయడానికి అవకాశమిచ్చింది. దానికై డబ్బు అడ్వాన్సుగా

యివ్వడం కూడ మొదలయింది. ఒక పక్క తునికాకు కూలీల ఆందోళన భారాన్ని ఫారెస్టు డిపార్టుమెంటు మీదకు తోసి కాంట్రాక్టర్లు విశ్రాంతిగా కూర్చునే అవకాశం కల్పించింది. మరోపక్క, అలవిగాని అవినీతికి అవకాశమూ కల్పించింది. జాతీయకరణ వల్ల జరిగిందిదే. ఇప్పుడు కాంట్రాక్టర్లు ఫారెస్టు డిపార్ట్‌మెంటుతో చేతులు కలిపి కొనుగోలు చేసిన ఆకును తక్కువగా చూపించి, రాయల్టీలో పెద్ద మొత్తాలు మిగిలించుకుంటున్నారు. తునికాకు గుత్తెదార్లు ఫారెస్టు డిపార్టుమెంటు అధికారులకు చెల్లించే లంచాలు సీజన్‌కీ కొన్ని పదుల వేల రూపాయలదాకా వుంటాయి.

తునికాకు కూలీ పోరాటం దాని కదే ఒక కథ కాని, సిరిసిల్లా కథనానికి సంబంధించినంత వరకు చూస్తే, భూస్వామ్య వ్యతిరేక పోరాటాలపై తీవ్ర నిర్బంధం కొనసాగుతున్నప్పుడు 'విస్తరణ, సంఘటితం ద్వారా ప్రతిఘటన' అన్న ఎత్తుగడకు ఇది ఒక మార్గంగా పనిచేసింది.

1975లో నిమ్మపల్లిలో సంఘం తిరిగి విజృంభించింది. ఈసారి వివాదాస్పదంగా వున్న 22 ఎకరాలలో చింతచెట్లు దులుపుకునే కార్యక్రమం తీసుకుంది. భాస్కరరావు ఆ భూమి చుట్టూ కంచె వేసి వాటిపై తన యాజమాన్యానికి గుర్తుగా తెల్లరంగు వేయించాడు. హరిజనులు కంచె తొలగించి తెల్లరంగు మీద ఎర్రరంగు వేసి ఆ భూమి, దానిలో పంట తమదని ప్రకటించారు.

నిర్బంధం తిరిగి ప్రారంభమైంది. కాని, అప్పటికల్లా విస్తరణ, సంఘటితం అనే ఎత్తుగడ ఫలించింది. ప్రజలు నిర్భయంగా నిలబడ్డారు. ఎమర్జెన్సీ ప్రకటించాక మొత్తం ఉద్యమం వెనుకడుగు వేసినా ఈలోగా విస్తరణను సంఘటితం చేసుకునే క్రమంలో కార్యకర్తలు ఆ ప్రాంతంలోని పెక్కు గ్రామాలలో భూస్వామ్య పీడనకు వ్యతిరేకంగా నిర్దిష్ట పోరాటాలు చేపట్టారు. ఆ విధంగా ఎమర్జెన్సీ ఎత్తివేత కోసం నిరీక్షిస్తూ అజ్ఞాతంగా జీవించగలిగారు.

నిమ్మపల్లి ప్రాంతంలో ఉద్యమం అజ్ఞాతంలోకి వెళ్ళిన తరువాత విస్తరణ ద్వారా ప్రతిఘటన అనే ఎత్తుగడను మరోచోట అమలు జరిపారు వాళ్ళు. కరీంనగర్ – కామారెడ్డి రోడ్డు దక్షిణ దిక్కుకు అంటే ప్రస్తుత సిరిసిల్లా తాలూకా పశ్చిమ భాగానికి ప్రయాణించారు. రైతు కూలి సంఘం పేరు మీద (పార్టీ సంగతి సరేసరి) ఇంకేమాత్రం పనిచేయడానికి వాళ్ళకు వీల్లేకపోయింది. కాని ఈ ప్రాంతంలో వాళ్ళకు ఒక కొత్త

పరిస్థితి కనపడింది. సుమారు 17,000 ఎకరాలకు అంటే సుమారు 30, 40 గ్రామాల ప్రాంతానికి అప్పటికే ఎగువ మానేరు ప్రాజెక్టు నీళ్ళు అందుతున్నాయి. ఎమర్జెన్సీ కంటె ముందు నుండీనే అంటరానితనానికి వ్యతిరేకంగానూ, పాలేర్ల అధిక వేతనాల కోసమూ ఇక్కడ 'హరిజన ఉద్యమం' జరుగుతోంది. ప్రజలు తమ తగాదాలను దొర దగ్గర పరిష్కరించుకొనే పద్ధతికి వ్యతిరేకంగా వచ్చిన ఆందోళన కూడ ముఖ్యమైనదే. (దీనివల్ల దొర అధికారం కొనసాగడమే కాకుండా తగాదాలోని రెండు పార్టీలు దొరకు మామూళ్ళు ఇవ్వాల్సి ఉంటుంది. ఇది ఫ్యూడల్ తెలంగాణలో చిరకాలంగా వుంటూ వచ్చింది.) గూడెంకు చెందిన రాములు, చీకోడుకు చెందిన మల్లయ్య అనే ఇద్దరు హరిజన పాలేర్లు ఈ సమస్యలపై పోరాడడం కోసం ఒక హరిజన సంఘాన్ని స్థాపించారు. ఇందిరాగాంధీ ప్రసిద్ధ 20 సూత్రాల పథకాన్ని అమలు చేయాలనే డిమాండు మీద వీళ్ళు పోరాటం నిర్మించారు. (ఇట్లా డిమాండు చేయడం ఎత్తుగడ రీత్యానా, నిజంగా ఆశించేనా అన్నది స్పష్టంగా తెలియదు.) నిమ్మపల్లి నుండి తలదాచుకోను పోయిన విప్లవకారులు ఈ హరిజన సంఘంలో కలిశారు. చాలా కాలం వరకు వాళ్ళు తమ సిద్ధాంతాన్ని బయటకి చెప్పలేదు. పైపెచ్చు ఎమర్జెన్సీ ఎత్తివేయబడే దాకా వాళ్ళు 20 సూత్రాల కార్యక్రమం పరిభాషలోనే తమ డిమాండ్లను వెలువరిస్తూ వచ్చారు. కాని, క్రమ క్రమంగా వారు హరిజన సంఘం స్వభావాన్నే మార్చివేయడం ప్రారంభించారు. ఎమర్జెన్సీ అంతమయ్యేసరికి వారు హరిజన సంఘాన్ని తొలగించి, ఆ స్థానంలో రైతు కూలీ సంఘాన్ని ముందుకు తెచ్చారు. రాములు, మల్లయ్య ఇద్దరు కూడా – వారి భాష (ఆ మాటకొస్తే, ఈ ప్రాంత కార్యకర్తలందరి భాష కూడ) వారి కులపోరాటం ప్రారంభ దినాలను జ్ఞాపకం తెస్తున్నప్పటికీ ఈనాడు సి.పి.ఐ.(ఎం.ఎల్.)తో వుంటున్నారు. ఇతర ప్రాంతాలలో కార్యకర్తలు పీడకులను దొర, భూస్వామి అని వ్యవహరిస్తే ఈ ప్రాంతంలో వాళ్ళు ఇంకా "ఆ రెడ్లు, ఆ రావులు" అని తమ పాత అలవాటునే అలవాటులో పొరపాటుగా కొనసాగిస్తున్నారు. (ప్రతి రావూ వెలమ కులం కాదు గానీ ఇక్కడ రావులంటే వెలమల గురించే.) పీడన, పోరాటాల గురించి గ్రామం, గ్రామం పేర్కొంటూ పోతే – సంక్షిప్తంగానైతే ఒకే మూసగా వుంటుంది, లేక గ్రామం గ్రామం మధ్య వ్యత్యాసాల గురించి వివరంగా చెప్పుకుంటూ పోతే, వ్యాస విస్తరణ అవుతుంది. మొత్తంగా చూస్తే వారి పోరాటం ప్రధానంగా భూస్వామ్య, సామాజిక, పీడనకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడింది. ఇది చాలా భిన్నమైన

రూపాలు తీసుకుంటూ వచ్చింది. తెలంగాణ భూస్వామ్య విధానంలో వెట్టి లేక వెట్టిచాకిరీ (బేగార్) అసంఖ్యాక రూపాలతో – చాలా కొట్టొచ్చినట్లు కనిపించే ఫ్యూడల్ లక్షణం. రైతులు దొరల చేలల్లో వేతనం లేకుండా ఉత్పాదక శ్రమ చేయడమే గాకుండా, అన్ని కులాల్లోని శ్రామికులూ వెట్టి చేయాల్సిందే. కల్లు గీత కార్మికులు కల్లు ఉచితంగా అందించాలి. కుమ్మరివాళ్ళు ఉచితంగా కుండలివ్వాలి. ఇలా ఒకవైపు కుల ప్రాతిపదిక పైనా సాగుతుంటుంది. మరోవైపు కుల ప్రాతిపదిక లేకుండా కూడ సాగుతుంటుంది. ఉదాహరణకు కొన్ని కులాలవాళ్ళు (చాకలి, మంగలి మొ॥) తమ కులవృత్తితో సంబంధంలేని ఇంటి పనులు వెట్టికి చేయాలి. సాధారణ భాషలో చెప్పాలంటే, ఏ వస్తువయినా (అది మానవుడు కావచ్చు, మరొకటి కావచ్చు) దొర కళ్ళల్లో పడిందంటే చాలు దాన్ని అతడు తీసేసుకోవచ్చు.

పూర్వ హరిజన సంఘం మొదటి పోరాటం గూడెంలో ప్రారంభమైంది. ఆ తర్వాత మరో పెద్ద పోరాటం ద్వారా వారు వెట్టి గొర్రెల పద్ధతిని – గొల్లవారు దొరకు ఉచితంగా గొర్రెలు, మేకలు యిచ్చే పద్ధతిని – అంతం చేసుకున్నారు. ఆచారంగా (దసరా వంటి పండుగ దినాలలో) ఇచ్చే గొర్రెల నజరానాలు (బహుమతులు) కాకుండా ఏడాదికి  కొన్ని – ఒక నిర్దిష్ట సంఖ్యలో గ్రామానికి 30 నుండి 40 దాకా – గొర్రెలు, మేకలను యివ్వాల్సి వుండింది. ఇక్కడ మరో విచిత్ర రూపంలో కూడ వెట్టి ఉంది. ప్రత్యేకించి ఎగువ మానేరు ప్రాజెక్టు కిందనున్న గ్రామ సముదాయంలో ఈ వెట్టి రూపం వుంది. బలవంతంగా, మూల్యం లేకుండా ఎరువును వెట్టికి యివ్వాలి. ఖరీఫ్ పంటకు ముందు దొరల చేలల్లో గొల్లవారి గొర్రెలు వెట్టికి మంద పెట్టాలి. వీటినే వెట్టి మందలంటారు. సాధారణంగా దొరలు 2, 3 నెలలపాటు (వెట్టి) మంద పెట్టాలని డిమాండు చేస్తారు. "ఆ తరువాత ఆ భూమిలో ఏదైనా పండించొచ్చు"నంటారు రైతులు. అంత సారవంతంగా తయారవుతుంది అది.

'ఆధునికం'గా కనిపించే పొత్తూరు మాధవరావుది ఒక ఆసక్తికరమైన కేసు. ఇతగాడు, తన భూస్వామ్య అధికారాన్ని ఉపయోగించి, సంవత్సరంలో 6 నెలలపాటు వెట్టి మందలు పెట్టించుకుని, అధిక దిగుబడి వంగడాలు పండించి, 'వాణిజ్య రైతుల'కు ఇచ్చే జిల్లా బహుమతి సంపాదిస్తాడు. నిజానికి ఈ బలవంతపు (వెట్టి) గొర్రెల 'నజరానాలు', భూములకు బలవంతంగా ఇచ్చే (వెట్టి) ఎరువులే – సిరిసిల్లా పోరాటంలో ప్రధానాంశాలుగా కనిపిస్తాయి. ప్రధానంగా చిట్టడవులున్న (Shrub) ప్రాంతం గనుక,

గొర్రెల పెంపకం ఇక్కడ కాస్త లాభసాటి వ్యాసంగం కావడం సహజమే. గొర్రెల బలవంతపు నజరానాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం భూస్వాములకే కాకుండా ఫారెస్టు అధికారులకు – చౌకీదారు నుండి ఉన్నతాధికారి దాకా – కూడ వ్యతిరేకమైనదే. లాంఛనప్రాయ బూర్జువా పాలనా యంత్రాంగం (Formally bourgeois administration) లోని ఈ ఉద్యోగులు అన్ని ఫ్యూడల్ రూపాల్లోనూ దోపిడీ చేయడంలో సిద్ధహస్తులు. గొర్రెలు అడవిలో మేసినందు వల్ల వీళ్ళు జుర్మానా వేయరు కాని 'తమ' భూమిలో మేసినందుకు పరిహారంగా భూస్వామి గొర్రెల రూపంలో బహుమతి డిమాండ్ చేసినట్లే, వీళ్ళు కూడ సంవత్సరానికి కొన్ని గొర్రెలు 'బహుమతి'గా తీసుకుంటారు.

## వెట్టి రద్దు

ఎమర్జెన్సీ తర్వాత చాలాకాలానికి 1979–80లో జరిగినప్పటికీ వెట్టి గొర్రెల సమస్యకు వ్యతిరేకంగా జరిగిన ఒక పోరాటాన్ని ఈ పోరాటం తీవ్రతకు ఒక నమూనాగా చూడవచ్చు. ఆ ఊరి పేరు నామాపురం. అక్కడ భూస్వాములు రెడ్లు. వారిలో అతి పెద్ద భూస్వాములకు (ఇద్దరు పేర్లూ నారాయణ రెడ్డే) ఇప్పటికీ 100 ఎకరాల బంజరుతో కలిపి 500 ఎకరాల భూమి వుంది. భూస్వాములందరూ కలిసి ఏడాదికి 40 వెట్టి గొర్రెలు గుంజుకునే వాళ్ళు. దసరానాడు వెట్టి గొర్రెలివ్వకూడదని గొల్లవారు 1978లో నిర్ణయించుకునే దాకా ఈ దోపిడీ సాగుతూనే వచ్చింది. అయితే ఇవ్వడం ఆపేసినందుకు భూస్వామి కుటుంబాల్లోని కొందరు యువకులకు వారి పట్ల ఆగ్రహం కలిగింది. సాయంత్రం గొర్రెలను తోలుకొని ఇళ్ళకు వస్తున్న గొల్లవారిని దారికాచి అటకాయించి బలవంతంగా కొన్ని గొర్రెలు స్వాధీనం చేసుకున్నారు. గొల్లవారు వూరుకోకుండా ఒక గుంపుగా వెళ్ళి తమ గొర్రెలు తిరిగి తెచ్చుకున్నారు. మరోసారి 1979లో ఒక రెడ్డి కుటుంబంలో పెళ్ళి సందర్భంగా వెట్టి గొర్రెలు ఇవ్వడానికి నిరాకరించారు. దీనిపై ఆగ్రహించిన కొందరు భూస్వాములు గొర్రెలు తమ భూముల్లో మేశాయనే సాకుతో కొన్ని గొర్రెలను పట్టి బందెల దొడ్డిలో వేశారు. ప్రజలు ఊరేగింపుగా వెళ్ళి తమ గొర్రెలను విడిపించుకున్నారు. నెలరోజుల తరువాత ప్రజలు సిరిసిల్లాలో ఒక బహిరంగసభకు వెళితే, భూస్వాములు మరొకసారి గొర్రెలను బందెల దొడ్డిలో వేసి 250 రూ॥లు జుర్మానా విధించారు. గొల్లవారు జుర్మానా అయితే చెల్లించారు కాని, గొర్రెలను, మేకలను బహుమతిగా ఇచ్చే ఫ్యూడల్ ఆచారాన్ని మాత్రం తిరిగి తలెత్తనివ్వలేదు.

జనం మొండిగా వున్నారని గ్రహించిన భూస్వాములు వారి రైతు కూలీ సంఘం మీద పోరాడ్డానికి సొంతంగా తామే ఒక 'రైతు కూలీ సంఘాన్ని' ఏర్పరుచుకున్నారు. తమకు లొంగి వుండే గొల్ల కులం పెద్దలను పక్క గ్రామాల నుండి తీసుకువచ్చారు. చిన్న మోతాదులో బహుమతులిచ్చేట్లు ఆ గ్రామ గొల్లవారిని బలవంతంగా ఒప్పించారు. అయితే వెట్టి గొర్రెల సంఖ్య 40 నుండి 25 కు దిగింది. దానితోపాటు గొల్లవారు 500 రూపాయలు దండుగ కూడ చెల్లించాలి. ఆ తరువాత, అదే ఏడు, అడవిలో గొర్రెలు మేపినందుకు ఫారెస్టు అధికారులు వసూలు చేసే దండుగలకు (నిజానికి లంచాలు) వ్యతిరేకంగా తాలూకా వ్యాప్తంగా ఉద్యమం వచ్చింది. దీనిలో భాగంగా సిరిసిల్లా పట్నంలో ఒక ఊరేగింపు జరిగింది. నామాపురం గొల్లవారు కూడ దీన్లో కలిశారు. భూస్వాములు మరోసారి గొర్రెలను బందెలదొడ్లో వేశారు. గొల్లవారు సంఘం నాయకత్వంలో పక్కవూళ్ళ నుండి తమ కులంవాళ్ళను సమీకరించి వాటిని విడిపించు కోవాలని నిర్ణయించుకున్నారు. ఆ విధంగానే 100 మంది ఊరేగింపుగా వెళ్ళి గొర్రెలను విడిపించుకున్నారు. 1980 వచ్చింది. ఒక భూస్వామి తన అధీనంలోని భూమిలో గొర్రెలు మేపుకోవడాన్ని తిరస్కరించాడు. 100 రూ॥లు దండుగ వసూలు చేశాడు. ఇలాంటి ఘటనలింకా జరుగుతున్నాయి. కాని, వెట్టి రద్దు అన్నది ఖాయం గనుక, ఇలాంటివి కొడిగట్టిన దీపం లాంటివి.

ఈ పోరాటం ఇంత సుదీర్ఘంగా జరగడం చూస్తే, ఇక్కడ భూస్వామ్య ఆచారాలు ఎంత లోతుగా వేళ్ళూనుకొని వున్నాయో అర్థం అవుతుంది. అదే సమయంలో ఇక్కడి పోరాటం ప్రధాన ధోరణి సరుకులు ఉత్పత్తిచేసే రైతు 'పరిశ్రమ' కూ (enterprise), భూమి గుత్తాధిపత్యానికీ మధ్యనున్న ఘర్షణ కాదు. శ్రామిక ప్రజలకు, భూస్వామ్య సామాజిక సంబంధాలకు మధ్య ఘర్షణే దీని ప్రధాన ధోరణి. భూమిపై గుత్తాధిపత్యం ఈ ఘర్షణకు దోహదకారి మాత్రమే. భూమి ఒక సమస్యగా ముందుకొచ్చిన చోట్ల అది నీటిపారుదల భూమీ కాదు, వాణిజ్యపంటలకు అనువైన మెట్టభూమీ కాదు. కేవలం సారం లేని అర్ధ–బంజరు భూమి. అయినా, దీనిలో తక్కువ రకం ధాన్యం పండించుకోవచ్చుననే ఆశతో పేదలు దీని పట్ల ఆకర్షితులవుతున్నారు. కాని భూమిలేని వాళ్ళను భూమిలేని వాళ్ళుగానే వుంచాలనే కోరికతో భూస్వామి దానిపై కన్ను వేసి ఉంచుతున్నాడు. పెట్టుబడి గురించిన ఆలోచనల్లో మునిగిన పరిశీలకులు దీనిపై ఏ భాష్యాలు చెప్పినా, తెలంగాణలో రైతాంగ పోరాటాల ప్రధాన కేంద్రీకరణ భూస్వామ్య అధికారం, లేక 'పెత్తందారీ' తనమే.

ఎమర్జెన్సీ ఎత్తివేయబడిన తరువాత పార్టీ, సంఘం రెండూ బహిరంగంగా పనిచేయడం మొదలుపెట్టాయి. అంతేగాక, వాళ్ళు రెండు పశ్చిమ ప్రాంతాల నుండి పాత తాలూకా ఆగ్నేయ ప్రాంతానికి (ప్రస్తుత వేములవాడ తాలూకా తూర్పు ప్రాంతం) విస్తరించారు. ఇక్కడ నూకల మర్రి వంటి గ్రామాల్లో పార్టీకి కొన్ని సంబంధాలుండినాయి. ఎమర్జెన్సీలో రాత్రి పాఠశాలలు కూడ నడిపించారు. 1977 తరువాత ఈ ప్రాంతం లోని పెక్కు గ్రామాల్లో సంఘాలు త్వర త్వరగా ఏర్పడ్డాయి. అదే సమయంలో పడమట నిమ్మపల్లిలో 22 ఎకరాల హరిజనుల భూమిపై పాత పోరాటాన్ని తిరిగి చేపట్టారు.

అప్పటి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ శారదా ముఖర్జీ 1977లో వేములవాడకు వెళ్ళినప్పుడు జరిగిన ఘటన ఎమర్జెన్సీ తరువాతి ఉద్యమానికి ఒక కొండగుర్తు. పార్టీ పనిచేస్తున్న అన్ని గ్రామాల నుండి ప్రజల్ని పెద్దఎత్తున తరలించి, వేములవాడలో ఊరేగింపు జరిపి, మెమోరాండం యివ్వడానికి ప్రయత్నించారు. డి.ఎస్.పి. నాయకత్వం లోని పోలీసు బలగం వారిని అడ్డగించింది. ప్రజలు కోపోద్రిక్తులై డి.ఎస్.పి.ని దేవాలయం కోనేటిలో పడేస్తామని బెదిరించారు. (వేములవాడ ప్రాంతీయంగా 'దక్షిణ కాశీ'గా ప్రసిద్ధి చెందిన దేవాలయాల పట్నం.) డి.ఎస్.పి. మూర్ఖంగా ప్రవర్తించేసరికి, తమ బెదిరింపును అమలు చేయాలని కూడ చూశారు. అప్పుడు సంఘం జోక్యం చేసుకుని డి.ఎస్.పి.ని బతికించింది.

ఇట్లాంటి 'వీరోచిత' చర్యకు మూల్యం చెల్లించక తప్పలేదు. 70 మంది మీద కేసులు పెట్టారు. ఎమర్జెన్సీ తరువాత ఉద్యమం ప్రవేశించిన గ్రామాలంతటా ఈ సంఘటన ప్రభావం చూపించింది. ఇక్కడ ఉద్యమం నూకలమర్రి, చెక్కపల్లి, కొదురు పాక వంటి గట్టి గ్రామాలను కేంద్రంగా చేసుకుంది. నూకలమర్రి మీద ఎ.ఐ.సి.సి.(ఐ) ప్రధాన కార్యదర్శి సత్యనారాయణరావు బావమరిది భాస్కరరావు (150 ఎకరాల భూస్వామి) ఆధిపత్యం కొనసాగుతుంటే పక్కనే వున్న చెక్కపల్లిలో కర్కోటక భూస్వామి భగవంతరావు రాజ్యం చేస్తున్నాడు. కొదురుపాక మీద పెత్తనం భగవంతరావు బావమరిది వెంకట్రామారావుది. ఇప్పటికి ఐదేండ్ల వయస్సు వచ్చి, ఈ ప్రాంతంలో 70 గ్రామాలకు విస్తరించిన పోరాటానికి ఈ త్రయమే కేంద్ర బిందువు. భాస్కరరావు పూర్వ కౌల్దారుకు కౌల్దారీ చట్టం కింద పది ఎకరాల భూమి ఇవ్వడానికి తిరస్కరించాడు. భగవంతరావు తన మొత్తం భూమిని వెట్టికి దున్నించు కోవడమే గాక, 10-20 మందిని తన యింటిలో వెట్టికి సేవ చేయించుకునేవాడు. అతని సేవకులలో ముగ్గురు

సి.పి.ఐ.(ఎం.ఎల్.) వాళ్ళను కలుసుకుని 'అతని' గ్రామంలోనే సంఘం మొదలుపెట్టారు. దాంతో అతనికి కష్టాలు మొదలయ్యాయి. అతని మీద పోరాటం తీవ్రమయ్యేసరికి, తన ఫ్యూడల్ అధికారాన్ని ఉపయోగించి గ్రామంలోని కొందరు జనాన్ని కూడకట్టుకుని వేములవాడ నుండి చెక్కపల్లికి 'భగవంతరావు భగవంతుడు' అని నినాదాలు చేయిస్తూ ఊరేగింపు తీయించాడు. దీని వల్ల ప్రజల్లో కలిగిన భయాన్ని ఆ వెంటనే రెండు రోజుల తరువాత సంఘం జరిపిన ఊరేగింపు పోగొట్టగలిగింది. ఈ పోరాట కాలంలో ఒక ఘటన జరిగింది. (ఢిల్లీ పి.యు.సి.యల్. బృందం వచ్చి వెళ్ళడం వల్ల ఈ ఘటన వార్త కొంత ప్రాముఖ్యతను సంతరించుకుంది.) కొదురుపాక గ్రామంలో భూస్వామి వెంకట్రామారావు కిరాయి గూండాలు మధ్యవయస్కురాలైన రాజవ్వ అనే స్త్రీపై అత్యాచారం చేశారు. ఇది పూర్తిగా 'రాజకీయ' అత్యాచారం. మిలిటెంట్ మహిళా సంఘాన్ని నిర్మించినందుకు శిక్షగా జరిగిన చర్య. (సిరిసిల్లా ఉద్యమంలో 20, 25 గ్రామాల్లో – ప్రధానంగా తీవ్ర నిర్బంధం వలన మగవాళ్ళు గ్రామాలు వదలి వెళ్ళిన ఫలితంగా – ఇలాంటి మహిళా సంఘాలు పుట్టుకొచ్చాయి.) తాజా పరిస్థితి ఏమిటంటే వెంకట్రామారావు గూండాల మీద కేసు ఎగిరిపోయింది. అయినా రాజవ్వ మాత్రం చివరిదాకా పోరాడాలనే దృఢ నిశ్చయంతో వుంది.

కల్లోలిత ప్రాంతాల చట్టం ప్రకటన దొరల చేతలకు బలం యిచ్చిందనడంలో సందేహం లేదు. కాని వారి వెన్నెముక వంటి భూస్వామ్య పెత్తందారీ సంబంధాలు మాత్రం తిరిగి అతుక్కోకుండా విరిగిపోయాయి. 1978 పూర్వం వలె బహిరంగ పోరాటాలు బాగా కష్టం కావచ్చు గాని పరిస్థితి మౌలికమైన మార్పునకు లోనయ్యింది. నిర్దిష్ట విజయాలను పేర్కొనాలంటే, ఈ ఉద్యమ ప్రారంభ బిందువైన నిమ్మపల్లి 22 ఎకరాల భూమి అంతిమంగా హరిజనుల పరం అయింది. తునికాకు ఉద్యమం సంఘటితమయింది. ఈనాడు అన్ని వెట్టి కట్టలూ రద్దు కావడమే గాక, కట్టలకు 10 నుండి 12 పైసలు రేటు దొరుకుతున్నది. వ్యవసాయ కూలీ, పాలేర్ల వేతనాలు పెరిగాయి. (నిజానికివి ప్రతి ఏడాదీ ముందుకొచ్చే సమస్యలే. ప్రతి పంట కాలంలో కనీసం రెండుసార్లు – నూర్పిళ్లు, కోతల సమయంలో ముందుకు వచ్చి పెద్దఎత్తున తాలూకావాప్త ఉద్యమాలుగా నడుస్తుంటాయి. కార్యకర్తలు తమ శ్రద్ధనంతా ఫ్యూడల్ పెత్తందారీ వ్యతిరేక పోరాటాలపై కేంద్రీకరించడం వల్ల వాళ్ళతో మాట్లాడేటప్పుడు కూలీ సమస్య ప్రస్తావన అరుదుగా మాత్రమే వస్తుంటుంది.) అతి ముఖ్యంగా, వెట్టి

పూర్తిగా అదృశ్యమయ్యింది. గ్రామ తగాదాలలో దొరలు న్యాయ నిర్ణేతలుగా కూర్చోవడం ముగిసింది. ఈ రెండూ గ్రామీణ తెలంగాణలో పెద్ద మార్పును సూచిస్తాయి. కర్కోటక భూస్వామి చెక్కపల్లి భగవంతరావుతో సహా ఎక్కువమంది దొరలు గ్రామాలు వదిలి వెళ్ళారు. తమ భూముల్లో చాలా భాగం అమ్మేసుకొని కరీంనగర్‌లోను, హైదరాబాద్‌లోను జీవిస్తున్నారు.

## సాంఘిక బహిష్కరణ

వాళ్ళు (భూస్వాములు) సులభంగా పోరాటం వదులుకున్నారని కాదు. రాజవ్వ మాత్రమే కాదు, బోయినపల్లి లక్ష్మి వంటి మరి పెక్కుమంది స్త్రీలు భూస్వాముల గూండాల చేతిలో అత్యాచారాలకు గురయ్యారు. 1980 జనవరి నెలలో సిరిసిల్లా పట్టణంలో 8000 మంది జనం ఊరేగింపుపై పోలీసులు కాల్పులు జరిపినప్పుడు మరణించిన జక్కుల ఎల్లయ్య మాత్రమే గాక తిమ్మాపురం లక్ష్మీరాజం వంటి కార్యకర్తలు భూస్వాముల చేతిలో హత్యలకు గురయ్యారు. కల్లోలిత ప్రాంతాల ప్రకటనకు ముందూ తర్వాత కూడ తమకు చాలా ఉదారంగా లభించిన పోలీసు సహాయంతో భూస్వాములు తృప్తిపడి ఊరుకోలేదు. వాళ్ళు మొదట్నుండి చివరిదాక ఫ్యూడల్ దొరలే. రైతులకు వ్యతిరేకంగా పోరాడ్డానికి సొంత గూండా గ్యాంగులకు శిక్షణనిచ్చి, సాయుధుల్ని చేశారు. పోలీసులను తాత్కాలిక సాయంగానే భావించారు. ఉదాహరణకు జోగాపురం జగ్గారావు తన గ్యాంగును సాయుధం చేయడానికి 40 విచ్చు కత్తులు సంపాదించి పెట్టుకున్నాడు. వేములవాడ సమితి ప్రెసిడెంటు పాపారావు నాయకత్వంలో ఇతర భూస్వాములు దొంగల ముఠాలకు శిక్షణనిచ్చి 'నక్సలైట్ పార్టీ' పేరిట దొంగతనాలు చేయించి ఆ విధంగా ప్రజలను పార్టీ నుండి దూరం చేయాలని ప్రయత్నించారు. ముఖ్యంగా వెట్టిచాకిరీ రద్దు చేసి, పెక్కుమంది భూస్వాములను గ్రామాల నుండి వెళ్ళగొట్టిన తరువాత, ఉద్యమం సాధించిన ఒక ముఖ్య విజయం – ఈ దొంగల ముఠాలను పట్టుకొని, పోలీసులపై ఒత్తిడి తెచ్చి వారిని అరెస్టు చేయించడం. (ఈ పనికి పోలీసులపై చాలానే వత్తిడి తీసుకు రావలసి వుంటుందని సులభంగా వూహించుకోవచ్చు.)

శత్రుదాడిలాగానే ప్రజల ప్రతిఘటన కూడ విభిన్నమైన రూపాలు తీసుకుంది. 'నక్సలైట్ హింసా విధానాలు' (Naxalite cult of violence) అనేదాన్ని ప్రభుత్వం చాలా శ్రద్ధాసక్తులతో ప్రచారంలో పెట్టడం వల్ల పార్టీ తీసుకున్న కొన్ని (ప్రతిఘటనా) రూపాలపై

ప్రజలు విశ్వాసం వుంచడం కష్టం. ఉదాహరణకు, ఈ ప్రాంతాన్ని కల్లోలిత ప్రాంతంగా ప్రకటించిన తరువాత పోలీసులు రాత్రుళ్ళు గ్రామాలపై దాడులు చేయడం మొదలుపెట్టారు. దీన్ని నిరోధించడం కోసం గ్రామాలకు గ్రామాలు (భూస్వాములు, వారి కిరాయి గూండాలు మినహా) సాంప్రదాయక జానపద గీతాలను, భక్తిగీతాలను పాడుకుంటూనో లేక హరిదాసు చెప్పే పౌరాణిక గాథలు వింటూనో మేలుకోవాల్సి వచ్చింది. అట్లా కాకుంటే వాళ్ళు తమ ఇళ్ళ బయట కూర్చుని, అల్యూమినియం ప్లేట్ల మీద, లోటాలు చెంబుల మీద గరిటెలతో కొడుతూ రాత్రంతా ఒక పెద్ద రణగొణ ధ్వని సృష్టించే వాళ్ళు. తునికాకు కూలీరేట్ల పెంపుదల వంటి సీజనల్ పోరాటాల సమయంలో పోలీసులు ముందు జాగ్రత్తగా బలగంతో గ్రామాలకు వెళ్ళి సమ్మె పిలుపుల పోస్టర్లు అతికించకుండా చూడడానికి ప్రయత్నిస్తారు. దీనికి విరుగుడుగా కొన్ని గ్రామాల్లో సంఘం ఒక దేశీయ సృజనాత్మక పద్ధతిని ఉపయోగించింది. సాయంత్రం ఇళ్ళకు చేరుకునే పశుల కాపరులకు పోస్టర్లు అతికించే కార్యక్రమం అప్పజెప్పింది. వాళ్ళు పశువుల్ని ఉసిగొల్పి దారిపక్కన నించున్న పోలీసులను బెదరగొట్టి, వాళ్ళు తిరిగి నిలదొక్కుకునే లోపల పోస్టర్లు అతికించేవాళ్ళు. ఉద్దేశపూర్వక ప్రచారం కింద కళ్ళు మూసుకుపోయిన వాళ్ళు తప్ప, మరెవరయినా, ఒక ప్రజా ఉద్యమం (Mass Movement) ప్రజా (Mass) ఎత్తుగడల్ని స్వీకరించక తప్పదని గుర్తించగలుగుతారు.

అదే విధంగా భారతీయ కమ్యూనిస్టులు కులం వంటి ఇండియాకీ ప్రత్యేకమైన సాంస్కృతిక లక్షణాలను ఎన్నడూ గుర్తించలేదని పాచిపండ్ల దాసరి మాదిరి ఫిర్యాదుచేసే వాళ్ళు ఒక సంగతి తెలుసుకోవాలి. ఇక్కడ భూస్వామ్య వ్యతిరేక పోరాటాలలో 'సాంఘిక బహిష్కరణ' చాలా బలమైన ఆయుధంగా పనిచేసింది. హిందూ 'ధర్మ' నిర్వచనాలలో శారీరక శ్రమను అసహ్యించుకోవడం ఒకటి. అందువల్ల శ్రామిక ప్రజలు భూస్వాముల యిళ్ళల్లో పనిపాటలను బహిష్కరించడం చాలా బలమైన ఆయుధంగా పనిచేస్తుంది. ఇది భూస్వామ్య వ్యతిరేక పోరాటంలో పెట్టుబడికి వ్యతిరేకంగా కార్మికుల సమ్మెలంత బలంగా పనిచేస్తుంది. భూస్వామ్య కుటుంబాలలో స్త్రీ, పురుషులు ఏ విధమైన 'నీచ' శ్రమ చేయరు కనుక చాకలి, మంగలి, హరిజనులు ఆ పనులను బహిష్కరించడం చాలాసార్లు భూస్వాములను లొంగదీయడానికి సరిపోతుంటుంది. చాలా గ్రామాల్లో మొదట అనుసరించే ఎత్తుగడ సాధారణంగా ఇదే. ముఖ్యంగా వెలమ భూస్వాముల

విషయంలో ఇది బాగా పనిచేస్తుంది. రెడ్ల కంటే వెలమలు మరింత పొగరుగా వుంటారు.

## మారిన పరిస్థితులు

తీవ్ర నిర్బంధం, శత్రువు ఆధునిక తెలివి తేటలకు పూనుకోవడం ఈనాటి పరిస్థితి. అంటే పోరాట ఫలితంగా భూస్వామ్య విధానం పోయి పెట్టుబడిదారీ విధానం వచ్చిందని కాదు. కార్యకర్తలు స్పష్టంగా గుర్తిస్తున్నట్లుగా అసలు పరిస్థితి దాని కంటే చాలా సంక్లిష్టమయినది. దొరలు – అంటే గ్రామాలు వదలి వెళ్ళని దొరలు – తమ పెత్తందారీ ధోరణులలో అత్యంత అసహ్యకరమైన వాటిని మార్చుకొన్నారు. బహిరంగ ప్రవర్తనలో కొంత 'ప్రజాతంత్రం'గా మారారు. పూర్వం వాళ్ళ భూముల్ని వెట్టి చాకిరీ కింద లేక 'కట్టు బానిస' పాలేర్ల కింద, కౌలు చెల్లించే కౌల్దార్ల కింద సాగు అయ్యేవి. ఇవాళ ఎక్కువమంది 'కోరు'కు యిస్తున్నారు. (అంటే పంటలో భాగం పద్ధతిలో యిస్తున్నారు.) ఖర్చులలోను, దిగుబడిలోను (తరి పొలాల్లో) సగం సగం భాగం తీసుకుంటున్నారు. వాళ్ళకిప్పుడు వెట్టి దొరకదు. కాని వేరే పద్ధతులలో వసూళ్ళు చేసుకుంటున్నారు. ప్రభుత్వం అవలంబించిన పెక్కు 'అభివృద్ధి పథకాల'ను ఉపయోగించుకుని బ్రోకర్లుగా మారి ప్రజల మూల్గులు పీలుస్తున్నారు. కాని వీళ్ళు కమీషన్ మీద పనిచేసే మామూలు బ్రోకర్లు కారు. 'గ్రామ పెద్దల' రూపం ధరించి ప్రభుత్వ అభివృద్ధి సంస్థలలోని డబ్బుకు గ్రామ ప్రజల తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 'ఖర్చులు' అనబడే రూపంలో డబ్బు చాలా దయతో స్వీకరిస్తున్నారు. వారిలో చాలామంది భూమి తనఖా బ్యాంకుల, వ్యవసాయ బ్యాంకుల ఛైర్మన్లుగా, సహకార (రుణ) సంఘాల, పంచాయతీ సమితుల అధ్యక్షులుగా, రాజకీయ పార్టీల నాయకులుగా రూపాలు ఎత్తడం వల్లనే ఈ కొత్త దోపిడీ పాత్ర వారికి సాధ్యమవుతున్నది. దీనికి మంచి ఉదాహరణ సి.పి.ఐ. నాయకుడు సి.హెచ్. రాజేశ్వరరావు. ఒక దేశాయి కుటుంబంలో పుట్టాడు. అతని సోదరులలో ఒకరు జిల్లా వ్యవసాయ బ్యాంకు ఉపాధ్యక్షులు. మరొకరు భారతీయ జనతాపార్టీ నాయకులు.

మరో మాటలో చెప్పాలంటే, సారాంశంలో ఆధిపత్య సంబంధాలే కాని ఇప్పుడవి కొత్త వ్యక్తీకరణ రూపం తీసుకున్నాయి. ఈ కొత్త రూపం శ్రామిక ప్రజల్ని విభజించి, కార్యాచరణలో వారు ఐక్యం కావడాన్ని కష్టతరం చేస్తున్నది. ఈ మేరకు పాత దాని నుండి కొంత తేడా వున్న మాట నిజమే. 'పెట్టుబడి విభజిస్తుంద'నే మామూలు

భావానికి ఇదొక రూపం. కాని కార్యకర్తలను బాధిస్తున్న సమస్య ప్రజలను ఐక్యం చేయడంలో కలుగుతున్న కష్టం కాదు, పోలీసు నిర్బంధాన్ని ఎదుర్కొనడమే వారి సమస్య. ఈనాడు నిర్బంధం చాలా తీవ్రంగా వుంది. ఆ రెండు తాలూకాలలో కొన్ని గ్రామాలలో తప్ప మిగిలిన ఏ గ్రామంలోనయినా ప్రజలతో ఉద్యమం గురించి బహిరంగంగా చర్చించడం దాదాపు అసాధ్యంగా వుంది.

*యం. కోదండరామిరెడ్డితో కలిసి ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో Forever 'Disturbed': Peasant Struggle of Sircilla-Vemulawada అనే పేరుతో రాసిన ఆంగ్ల వ్యాసానికి రచయితలే చేసిన తెలుగు అనువాదం*

**ఆంగ్ల వ్యాసం : 27 నవంబరు 1982**

తెలుగు వ్యాసం : విమోచన, 15 ఫిబ్రవరి & 1 మార్చి 1983

# రైతాంగ పోరాటాలు

గడచిన రెండు దశాబ్దాల కాలంలో జరిగిన సైద్ధాంతిక పరిశోధనలూ, రాజకీయ ఆచరణా కలగలిసి భారతదేశంలో రైతాంగ చరిత్రా, రాజకీయాల కంటే ఆసక్తికరమైన విషయం మరొకటి లేదని గుర్తించేలా చేశాయి. రైతాంగ చరిత్ర సంక్షిప్తీకరణకు ఒదిగేదీ కాదు, రాజకీయ ఆచరణ సులభమైన ముగింపులకి లోబడేదీ కాదు. భారత రైతాంగ చరిత్రపై ఒక స్పష్టమైన అవగాహనకి వచ్చే ముందు టన్నులకొద్దీ కాగితాన్నీ, సిరానీ వెచ్చించాల్సి వుంటుందనేది నిర్వివాదం. అట్లాగే ఈ రక్తసిక్తమైన చరిత్ర పుటలు తమ గమ్యం చేరే లోపు ఎన్నెన్నో పోరాటాలను, త్యాగాలను చేయాల్సి ఉంటుంది; కడగండ్లను అనుభవించాల్సి వుంటుంది.

ఎ. ఆర్. దేశాయి సంకలనం చేసిన ఈ పుస్తకం ఆయనే ఇంతకుముందు రాసిన 'పీజంట్ స్ట్రగుల్స్ ఇన్ ఇండియా' (భారతదేశంలో రైతాంగ పోరాటాలు) పుస్తకానికి కొనసాగింపు. ఇది 1947 నుండి నేటి దాకా రైతాంగ రాజకీయాల చరిత్రని నమోదుచేసి క్లుప్తంగా విశ్లేషించే ప్రయత్నం. ఇందులో కొన్నిటిని వివిధ పత్రికల నుండి ఎంపిక చేశారు, మరి కొన్నిటిని పుస్తకాల నుంచి తీసుకొన్నారు, కొన్నిటిని అధికారిక, అనధికారిక నివేదికల నుంచి సంగ్రహించారు. ఇంకొన్నిటిని ఈ పుస్తకం కోసమే ప్రత్యేకంగా రాయించారు. ఈ వ్యాసాలను రెండు భాగాలుగా విభజించారు. మొదటి భాగంలో 'స్వాతంత్ర్యానంతర రైతాంగ భారతదేశం' పై రాసిన కొన్ని సిద్ధాంత వ్యాసాలతో పాటు రైతాంగ పోరాట 'అఖిల భారత' చిత్రాన్ని చూపే కొన్ని నివేదికలు ఉన్నాయి. రెండో భాగంలో రైతాంగ పోరాటాల 'ప్రాంతీయ' చిత్రాన్ని చూపే వ్యాసాలున్నాయి. ఈ పుస్తకాన్ని రెండు భాగాలుగా విభజించిన తీరు, దానితోపాటు రెండో భాగంలో వివిధ వ్యాసాలను పొందుపరచిన తీరు ఒక క్రమ పద్ధతిలో లేవు.

రైతాంగ పోరాటాల చారిత్రక పరిణామ క్రమానికి అనుగుణంగా వీటిని పొందుపరచినా, కనీసం ఆయా పోరాటాల కాలక్రమానుసారం ఈ వ్యాసాలను కూర్చినా ఈ సంకలన ప్రయత్నం అర్థవంతంగా వుండి వుండేది. కాని అందుకు భిన్నంగా జరిగింది. ఉదాహరణకు శ్రీకాకుళ పోరాటంపై నివేదిక ఈ సంకలనంలో తొమ్మిదవది. నక్సల్బరీ తిరుగుబాటుపై సుమంతా బెనర్జీ పుస్తకంలోంచి తీసుకున్న భాగం ఇరవై మూడవది. ఇంకా చెప్పాలంటే తెభాగా పోరాట కాలం నాటి కక్ ద్వీప రైతాంగ తిరుగుబాటుపై వ్యాసం అన్నిటికన్నా చివరిది కావడం వింతగా అనిపిస్తుంది. ఇందులో ఏ వ్యాసానికీ అది మొదట అచ్చయిన తేదీ వివరాలు లేకపోవడం కూర్పులోని గందరగోళాన్ని మరింత పెంచుతుంది. ఒక అభిప్రాయం లేదా 'ప్రకటన' అది ఎప్పుడు చేసిందో తెలియకపోతే దాన్ని అర్థం చేసుకోవడం చాలా కష్టం. అనుభవజ్ఞుడూ, లక్ష్య శుద్ధి కలిగినవాడూ అయిన ఎ. ఆర్. దేశాయి లాంటి వ్యక్తి నుంచి ఇంత నిర్లక్ష్యం వ్యక్తంగావడమే దురదృష్టమని చెప్పుకోవాలి.

## I

## సైద్ధాంతిక సమస్యలు

సంపాదకుని పరిచయ వ్యాసం, పుస్తకంలోని రెండు భాగాలకీ ఆయన విడి విడిగా రాసిన ప్రవేశికలు, 'మారుతున్న గ్రామీణ భారత సమాజ'మనే శీర్షికతో ఆయన రాసిన వ్యాసం, వీటితో పాటు, సుమంతా బెనర్జీ పుస్తకంలోంచి తీసుకున్న 'గ్రామీణ దృశ్య'మనే వ్యాసం, గెయిల్ ఆమ్‌వెట్ రాసిన 'కులం, వ్యవసాయిక సంబంధాలు, రైతాంగ సంఘర్షణలు' అనే వ్యాసం – పూర్తిగా సైద్ధాంతిక వ్యాసాలు. ఈ వ్యాసాలు గ్రామీణ భారత సామాజిక చట్రాన్ని సైద్ధాంతికంగా అవగాహన చేసుకునే ప్రయత్నం చేస్తాయి. నిజానికి వ్యవసాయక సంబంధాలను సిద్ధాంతీకరించే ప్రయత్నం ఎంతో కొంత మిగతా అన్ని వ్యాసాలలో కూడ వుంది. అయితే చెప్పుకోదగ్గ విషయమేమిటంటే 'భారత వ్యవసాయ రంగంలోని ఉత్పత్తి విధానం'పై 1970లలో ఎందరో ఆర్థికవేత్తలు చేసిన చర్చను ఇందులో పూర్తిగా విస్మరించడం. ఈ విస్మరణకు సంపాదకుని పూర్వ నిశ్చిత సిద్ధాంత దృక్పథమే కారణమని నా అనుమానం (ఆయనది స్థూలంగా ట్రాట్స్కీయిస్టు దృక్పథమని చెప్పుకోవచ్చు). ఈ విస్మరణ సరైనదే. అలాగే, లెనిన్ సంకలిత రచనల మూడవ సంపుటం నుంచి ఉటంకింపులు, వ్యాఖ్యానాల వరదతో పాఠకులని భయపెట్టే ధోరణిలోకి దేశాయి గారు వెళ్ళకపోవడం మరొక మంచి

విషయమని చెప్పుకోవచ్చు. (లెనిన్ సంకలిత రచనలలోని మూడవ సంపుటి 'రష్యాలో పెట్టుబడిదారీ విధానాభివృద్ధి'కి సంబంధించినది – అనువాదకుడు).

'ఉత్పత్తి విధానం'పై చర్చ, లెనిన్ రచనపై వ్యాఖ్యానాల పరంపర – ఈ రెండింటికి బదులుగా వ్యవసాయిక సంబంధాలపై దేశాయి విశ్లేషణ భారత రాజ్యానికి సంబంధించిన విశ్లేషణతో మొదలవుతుంది. ఆయన అవగాహన ప్రకారం, వ్యవసాయిక రంగాన్ని అర్థం చేసుకోవాలంటే రాజ్యం స్వభావమూ, దాని ఉద్దేశాలూ కీలకమైనవి. ఆయన మాటల్లోనే చెప్పుకోవాలంటే, 'వ్యవసాయిక సమాజాన్ని రాజకీయంగా, ఆర్థికంగా, సామాజిక వ్యవస్థాపరంగా, సాంస్కృతికంగా మార్చేందుకు భారత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బహుముఖమైన చర్యలు చేపట్టాయి. భారతదేశ గ్రామీణ సమాజంలో మార్పులను నేను ఈ బహుముఖ చర్యల పర్యవసానంగా చర్చిస్తాను'. ఈ అవగాహనా దృక్పథమే ఆయన విశ్లేషణను 'ఉత్పత్తి విధాన' చర్చ కంటే మెరుగైనదిగా చేస్తుంది. ఎందుకంటే, 'ఉత్పత్తి విధానం'పై చర్చ భూకమతాల యాజమాన్య నమూనాలు, కౌలు, ట్రాక్టర్లు, గొట్టపు బావుల సంఖ్య మొదలైన గణాంకాలపైన కేంద్రీకరిస్తుంది. జారిస్టు రష్యా రాజ్యానికీ ఆధునిక భారత రాజ్యానికీ మధ్య సంపూర్ణమైన తేడా వుంది. ఈ తేడా మూలాన భారతదేశంలో వ్యవసాయిక సంబంధాలను అర్థం చేసుకోవడానికి లెనిన్ పద్ధతిని అనుకరించే ప్రయత్నాలు పనికిరాకుండా పోతాయి.

దేశాయి గారి అవగాహన, 1947 తర్వాత భారత రాజ్యం వ్యవసాయాన్ని పెట్టుబడిదారీ మార్గంలో అభివృద్ధి చేయడానికి సంకల్ప పూర్వకంగా కృషి చేయనారంభించిందనే నిశ్చితాభిప్రాయంతో ప్రారంభమౌతుంది. శిస్తు (రెవెన్యూ) వసూలు చేసే మధ్యవర్తుల తొలగింపు, ఇతర భూసంస్కరణ చర్యలు ఒక విశాలమైన గ్రామీణ సంపన్న వర్గం సంఘటితం కావడానికి దారితీశాయనీ, వ్యవసాయంలో పెట్టుబడిదారీ విధానాభివృద్ధిని వేగిరపరచేందుకు రాజ్యమే ఈ వర్గాన్ని సృష్టించిందనీ ఆయన అంటారు. "భూ సంస్కరణలు విస్తారమైన భూ కమతాలను కలిగిన పాత భూస్వాముల సంఖ్యను కొంత తగ్గించి, పైస్థాయి కౌలుదారులలోని ఒక చిన్న బృందాన్ని భూస్వాముల్ని చేసి, తద్వారా ఒక విస్తృతమైన భూస్వామ్య శ్రేణిని సృష్టించాయనీ" ఆయన చెబుతున్న దానితో మనం అంగీకరించవచ్చు. స్వతంత్ర భారతదేశంలో గ్రామీణ సంపన్న వర్గపు పుట్టుకపై ఇది ఒక సూటి వ్యాఖ్యానం. అయితే వచ్చిన చిక్కల్లా 'వ్యవసాయాన్ని పెట్టుబడిదారీ మార్గంలో అభివృద్ధి చేయడంలో (ఈ వర్గం) క్రియాశీలమైన

పాత్ర పోషిస్తుందనే ఆయన నిర్ధారణతోనే. ఇందులో రెండు వేరు, వేరు విషయాలున్నాయి. ఒకటి భారత రాజ్యం దీనితో సాధించదలచుకున్నదేమిటి? రెండవది వాస్తవంగా సాధించినదేమిటి? ఈ రెండూ ఒకటేనా, లేక సాధించదలచిందీ, సాధించిందీ కూడ అత్యధిక లాభాన్ని రాబట్టే 'పెట్టుబడిదారీ రైతులను సృష్టించడమేనా' అన్నది అస్సలు స్పష్టంగా లేదు. భారత రాజ్యాంగం అన్ని విధాలా కల్తీలేని బూర్జువా రాజ్యాంగం. రాజ్యపు సంస్థలలో అత్యధికమైనవి బూర్జువా సంస్థలే. వీటి నుంచి దేశాయిగారు తేల్చేదేమిటంటే, భారత రాజ్యం వ్యవసాయ రంగంలోనూ, దాని వెలుపలా కూడ పెట్టుబడిదారీ విధానాన్ని పెంపొందించదలచుకుందని. దీనికి ప్రత్యామ్నాయమైన అవగాహన మరొకటుంది. దాని ప్రకారం, 1947-50 ల మధ్య ఉనికిలోకి వచ్చిన భారత రాజ్యం, వైవిధ్యభరితమైన ఆస్తిపర వర్గాలను కలిపి వుంచే బాధ్యతనూ, అశాంతితో రగిలిపోతున్న విశాల శ్రామిక, రైతాంగ ప్రజా బాహుళ్యపు విధేయతనూ చూరగొనే బాధ్యతలను తన వారసత్వంగా స్వీకరించింది. పాలక వర్గాలను సంపద్వంతం గావించడం, అందుకొరకు అవసరమైన సంస్థలను సృష్టించడం దాని బాధ్యత. అయితే ఈ బహుళ బాధ్యతల భారమే రాజ్యం విధిగా పెట్టుబడిదారీ విధానాన్ని పెంపొందించేలా చేస్తుందని భావించడానికి ఆస్కారం లేదు. మనం పద్దెనిమిదో శతాబ్దంలో జీవించడం లేదు. భారత రాజ్యం ఏర్పాటు చేసిన చాలా సంస్థలు పేరుకు - పేరుకు మాత్రమే - బూర్జువా సంస్థలు. భారత రాజకీయ వ్యవస్థ (పాలిటీ) భావజాల రీత్యా సోషలిస్టు రూపాన్ని, నిర్మాణ చట్రరీత్యా బూర్జువా రూపాన్ని ధరిస్తుంది కాని సారంలో అది విభిన్న సామాజిక సంబంధాల మేళవింపు.

తన కర్తవ్యాన్ని అత్యంత సులువుగా, తొందరగా నెరవేర్చడానికి భారత రాజ్యం ఎంచుకున్న మార్గం ఇదీ - సామ్రాజ్యవాదానికి దళారీ స్వభావంతో లోబడిపోవడం; ప్రభుత్వం (బ్యూరోక్రాట్ పెట్టుబడి) పైన, సామ్రాజ్యవాదం పైన ఆధారపడి పరాన్నభుక్కుగా తప్ప మనలేని వ్యాపార (ఎంట్రప్రెన్యూరియల్) పెట్టుబడిని ప్రోత్సహించడం; పెట్టుబడికి ఆధారభూతమైన ఒక పారిశ్రామిక, మౌలిక సదుపాయాల వ్యవస్థను రూపొందించడం; ఇంకా నూతనంగా సంఘటితమవుతున్న వర్గం - లేదా గ్రామీణ సంపన్న వర్గంగా పిలవబడే వర్గం - ఆస్తులనూ, దాని పెత్తనాన్నీ కాపాడటం; అదే సమయంలో ఈ వర్గాల దోపిడీకి అనువుగా సాంకేతిక సాధనాలను ఆధునీకరించడం. అయితే దీని పర్యవసానంగా ఏర్పడే వర్గ సంబంధాలలో వ్యవసాయం

నుండి అత్యధిక లాభాలను రాబట్టే పెట్టుబడిదారీ రైతులు ఒక చివరా, వ్యవసాయ శ్రామికవర్గం మరో చివరా ఉంటారనేం కాదు.

## ఎంత తేడాలున్నాయి?

పై అవగాహనతో చూసినప్పుడు, దేశాయి గారు ప్రతిపాదించే గ్రామీణ భారత వర్గ విశ్లేషణ సమాధానం లేని అనేక ప్రశ్నలను మిగులుస్తుంది. ముఖ్యమైన సందేహమేమిటంటే, గ్రామీణ సంపన్నులలో ఆయన చూస్తున్న విభజనలో వాస్తవమెంత? ఆయన పూర్వ నిశ్చిత నిర్ధారణల పాలు ఎంత? ఆయన ఒకే వాక్యంలో ధనిక రైతులు, కులక్కులు, భూస్వాముల గురించీ, గ్రామీణ బూర్జువా వర్గం గురించీ మాట్లాడగలగటం అబ్బురపరుస్తుంది. అలాగే ఇతరులు భూస్వాములను, పెట్టుబడిదారీ భూస్వాములను, అర్ధ-ఫ్యూడల్ భూస్వాములను, కులక్కులను కలిపేసి మాట్లాడడం కనబడుతుంది. దేశాయి గారిని గౌరవిస్తూనే, మనం అర్థం చేసుకొనేందుకు వీలుగా, చాలా స్పష్టంగా నిర్వచించబడ్డ ఈ వర్గాలకు వైయక్తికమైన నమూనాలను ఆయనే ఎంపిక చేసుకున్న ఒక్క గ్రామంలోనైనా చూపించమని అడగాలనిపిస్తుంది. నిజానికి అలాంటి విభజన గ్రామాలలో వున్నదా? లేదని నా ఉద్దేశం. గ్రామీణ సంపన్నులను సృష్టించే సామాజిక సంబంధాల వ్యవస్థలో అంతటి కచ్చితమైన విభజన లేదు. ఉన్నదల్లా, ఆయా ప్రాంతాలను బట్టి ఈ సామాజిక సంబంధాల పొందికలో తేడాలు మాత్రమే. నేల స్వభావం, నీటి వసతి, చరిత్ర, రాజకీయాలలో వైవిధ్యతను బట్టి ప్రాంతాల మధ్య ఈ తేడా నిర్ణయమవుతుంది. అన్ని ప్రాంతాలలోనూ ఒకే రకమైన విభజన రాకపోవడానికి భారతీయ పెట్టుబడికి గల దళారీ, బ్యూరోక్రాట్ స్వభావమే కారణం.

భారతీయ పెట్టుబడి స్వీయ విస్తరణకు తన సొంత బలం పైన, శక్తి పైననే గనక ఆధారపడాల్సి వచ్చి వుంటే అది పెట్టుబడిదారీ పూర్వ సంబంధాలతో తలపడి, వాటిని నాశనం చేయాల్సి వచ్చేది. కనీసం వాటిని తనలో సంపూర్ణంగా సంలీనం చేసుకోవాల్సి వచ్చేది. అలాంటి వత్తిడి దానిపై లేదు గనక, దాని విస్తరణకి సామ్రాజ్యవాదం, రాజ్యం తోడ్పడుతున్నాయి గనక పెట్టుబడిదారీ పూర్వ లక్షణాలను వదిలించుకోవల్సిన అవసరం దానికి రాలేదు. స్వాతంత్ర్యానంతర భారతదేశ చరిత్రలో 'అత్యధిక లాభార్జనా పరులైన పెట్టుబడిదారీ రైతులు' ఫ్యూడల్ భూస్వాములతో తలపడిన సందర్భం మచ్చుకి ఒక్కటంటే ఒక్కటి కూడ లేదు. గ్రామీణ సంపన్నులందరూ కలిసి సాగించిన

ఆందోళనలే వున్నాయి. అవి విదేశాల నుండి అరువు తెచ్చుకున్న వనరులలో మరింత వాటా కోసం కావచ్చు, రాజ్యమే సృష్టించుకున్న వనరులలో వాటా కోసం కావచ్చు. ఏదేమైనా ఒక వర్గమేమిటనే దాన్ని దాని చేతలే నిర్ణయిస్తాయి. పేదలు తమ కోసం తాము సంఘటితమయ్యే వర్గంగా కాకుండా (Class for themselves), వర్గ స్పృహ లేని వర్గంగా ఉండడం (Class for themselves) సాధ్యమే. అయితే ధనిక వర్గాలు వర్గ చైతన్యం కలిగిన వర్గాలు. ఆ స్వీయ చైతన్యమే గనక వాటికి లేకుంటే వాళ్ళు భౌతికంగా ఒక వర్గంగా వుండలేరు. కులక్కులు, పెట్టుబడిదారీ రైతులుగా పిలవబడే వర్గాలు ఫ్యూడల్ భూస్వాములని (పిలవబడే) వాళ్ళతో ఏనాడూ తలపడలేదంటే దానికి కారణం ఈ రెండు వర్గాలలో ఒకటి ఉనికిలో లేకపోవడమన్నా కావాలి లేదా గ్రామీణ సంపన్నులలో వుందని భావించే విభజన ఊహాజనితమైనా అయి వుండాలి. (ఇందులో మొదటి వాదనని అంగీకరించడం గెయిల్ ఆమ్‌వెట్ వైఖరిలోని సుగుణం.)

కాగా సి.పి.ఐ (ఎం.ఎల్) ఉద్యమం రెండవ వాదం మీద ఆధారపడిన వైఖరి తీసుకొంటుంది. గ్రామీణ సంపన్న వర్గమనేది వైవిధ్యతలతో కూడిన వర్గమనీ, అది పెట్టుబడిదారీ రైతులు, ఫ్యూడల్ భూస్వాములు అనే విభజనకు గురి కాలేదనీ, భారతీయ పెట్టుబడికి గల దళారీ, బ్యూరోక్రాటిక్ స్వభావమే గ్రామీణ సంపన్న వర్గంలోని ఈ వైవిధ్యాలకు మూల కారణమనీ సి.పి.ఐ (ఎం.ఎల్) ఉద్యమం భావిస్తుంది. వ్యవసాయిక సంబంధాలు అర్ధ భూస్వామ్య సంబంధాలని చెప్పడంలో ముఖ్యమైన అర్థమిది. 'అర్ధ – ఫ్యూడల్ భూస్వాముల'నే ఒక బృందాన్ని గుర్తించి గ్రామీణ సంపన్నులనే సెక్షననేదే లేనట్లుగా, ఆ భూస్వామ్య వర్గంతో మాత్రమే పోరాడతారనడం సి.పి.ఐ (ఎం.ఎల్) వైఖరిని వక్రీకరించడమే అవుతుంది. సి.పి.ఐ (ఎం.ఎల్) గ్రూపుల త్యాగశీలత, పోరాటశీలత వగైరాలను వెన్ను తడుతున్నట్టు మెచ్చుకుంటూనే, వారికి ఉందనుకుంటున్న సైద్ధాంతిక మూర్ఖత్వంపై జాలి పడుతూ ఉపదేశించడం 'ఉన్నత' స్థాయి మేధావులకి అలవాటైపోయింది గనక ఈ విషయాన్ని స్పష్టం చేయడం అవసరం. (దేశాయి గారు తన పుస్తకం రెండో భాగానికి రాసిన ప్రవేశికలో సి.పి.ఐ(ఎం.ఎల్) నాయకత్వంలో సాగిన భోజ్‌పూర్ పోరాటాన్ని సమర్థిస్తూనే, అది సి.పి.ఐ(ఎం.ఎల్) వ్యూహాన్ని తప్పుగా రుజువు చేసే ఉదాహరణగా పేర్కొన్నారు. సి.పి.ఐ(ఎం.ఎల్) వ్యూహం 'ఫ్యూడల్ భూస్వాములకు' వ్యతిరేకంగా మాత్రమే పోరాడే వ్యూహమనీ లేదా 'అర్ధ–భూస్వామిక అవరోధాల'ని మాత్రమే అధిగమించాలనే వ్యూహమనీ వారి ఆరోపణ).

ఈ విషయంలోకి మరింత లోతుగా వెళ్ళాల్సి వుంది. దేశాయి గారు వ్యవసాయిక సంబంధాల మార్పులో రాజ్యం నిర్వహించే ప్రధాన భూమికను ముందుకు తేవడం సరైనదే. సామాజిక ఆర్థిక పరిణామంలో రాజ్యం నిర్వహించే కీలక పాత్రను చూడడమూ సరైనదే. అయితే పైకి కనిపించే రూపాన్నే ఆయన వాస్తవ సారంగా అంగీకరించడంతోటే పేచీ. ఇది భావజాలాన్నే వాస్తవికతగా ఆమోదించే ఘనత వహించిన సి.పి.ఐ వారి అవగాహన కంటె మెరుగైనదేమీ కాదు. వ్యవసాయిక సంబంధాల మార్పులో రాజ్యం పాత్రకి సంబంధించిన వాస్తవ సారం పెట్టుబడిదారీ వ్యవసాయాన్ని ప్రోత్సహించడంలో లేదు. పెట్టుబడిని, ప్రత్యేకించి వ్యవసాయిక పెట్టుబడిని అధికార యంత్రాంగం గుప్పెట్లో ఉంచుకోవడంలో ఉంది. ఇది భారతదేశానికి ప్రత్యేకమైన పార్లమెంటరీ, పంచాయతీ రాజకీయాల వ్యాప్తికి సమాంతరంగా సాగింది. ఈ రెండిటి కలయిక వల్ల జరిగిన పరిణామమేమిటంటే పంచాయితీ రాజ్ సంస్థల్లోను, అవి రూపొందించే అభివృద్ధి వ్యూహాలలోను, సహకార సంస్థల్లోను, రాజకీయ నిధుల పంపకంలో అవి నిర్వహించే పాత్రలోను, దీనంతటికీ నేపథ్యంగా రాజ్యం మద్దతుతో, సామ్రాజ్యవాదుల తోడ్పాటుతో జరిగిన ఉత్పత్తి శక్తుల సాంకేతిక ఆధునీకరణ – నూతనంగా సంఘటితమైన గ్రామీణ సంపన్న వర్గానికి ఇబ్బంది లేని ఒక సామరస్యపూర్వక వాతావరణాన్ని తీవ్ర వైరుధ్యాల మధ్య కూడా సృష్టించాయి. ఈ గ్రామీణ భూస్వామ్య వర్గానికి వ్యతిరేకంగా ఎక్కుపెట్టినవే రైతాంగ పోరాటాలు.

గ్రామీణ సంపన్న వర్గాన్ని 'ఫ్యూడల్' భూస్వాములు, పెట్టుబడిదారీ భూస్వాములుగా విడదీయడం అసాధ్యం. అలాగే గ్రామీణ పేదలను, పెట్టుబడిదారీ దోపిడీకి గురయ్యే గ్రామీణ శ్రామికులు, భూస్వామ్య దోపిడీకి గురయ్యే రైతాంగం అని వేరుగా విడదీయడం కూడ అంతే అసాధ్యమైన విషయం. ఈ సంవత్సరం రోజు కూలీకి పనిచేసే కార్మికుడు, ఆపై సంవత్సరంలో ఏదో ఒక అవసరం కోసం డబ్బు తీసుకుని జీతానికి కుదురుకోవచ్చు. అయితే అతను తీసుకున్న మొత్తం అప్పు, దానికి కట్టాల్సిన వడ్డీ కంటే అతను చేసిన శ్రమ ఎప్పుడూ ఏ అర్థంలోనైనా ఎక్కువే ఉంటుంది. భూస్వామి సంతృప్తి చెందేంతవరకు అది మాఫీ కాదు. ఆ తర్వాత అతను మరోసారి జీతానికి కుదిరే దాకా 'గ్రామీణ కార్మికుడు'గా కొనసాగవచ్చు. ఉత్పత్తిని ఏదో ఒక రూపంలో మార్కెట్లో అమ్మడమే కనిపిస్తుంది గనక ఇందులో వున్నదంతా పెట్టుబడిదారీ విధానమే అని మనం అనవచ్చు. లేదా, ఇది 'లేని ఒక విభజన' కోసం వెదుకులాట అని గుర్తించి మన సైద్ధాంతిక సంయమనాన్ని నిలబెట్టుకోవచ్చు.

ఇటీవల 'ధనిక రైతు సమస్య'పైన ఉపదేశాలివ్వడం కొందరికి పరిపాటై పోయింది. మరీ ముఖ్యంగా సి.పి.ఐ(ఎం.ఎల్) గ్రూపులనుద్దేశించి వీళ్ళు ఈ బోధనలు చేస్తున్నారు. ఈ కారణం రీత్యా కూడ దీని గురించి విపులంగా చర్చించడం అవసరం. 'రైతు' అనే పదాన్ని ఉపయోగిస్తున్న తీరు వల్ల కొంత గందరగోళం తలెత్తుతోంది. మొఘల్, బ్రిటిష్ శిస్తు అధికారులు 'రైతు' అనే పదాన్ని ఇష్టానుసారం వాడినట్లే వీళ్లూ వాడుతున్నారు. భూమిని సాగుచేసే వారికి మాత్రమే, అంటే నాగలి పట్టిన వారికి మాత్రమే ఈ పదాన్ని పరిమితం చేస్తే, ధనిక రైతాంగం అనే పేరుమీద ఆ వర్గం రైతాంగ పోరాటాలకు ప్రధాన లక్ష్యం కాజాలదు. అటువంటి అవగాహన ఆత్మహత్యా సదృశమౌతుంది.

అదలా వుంచితే, కూలీలు, పేద రైతులు, మధ్యతరహా రైతులతోపాటు ధనిక రైతులలోని ఒక సెక్షన్‌తో ఐక్యత సైతం సమస్యాత్మకమౌతుంది. ఇక్కడ ఐక్యత సూత్రం పట్ల అభ్యంతరం లేదు. అయితే ఏ కోణం నుంచి ఐక్యతని కోరుకుంటున్నారనేది సమస్య. ఎందుకంటే ధనిక రైతు దృక్పథం నుంచి ఐక్యతను కోరుకోవచ్చు లేదా పేద ప్రజల దృక్పథం నుంచి ఐక్యతను కోరుకోవచ్చు. సి.పి.ఐ, సి.పి.ఎంలతో సి.పి.ఐ(ఎం.ఎల్) గ్రూపులకు వున్న తేడాకి మూలమిదే. నక్సలైట్లు కూలీలను రైతులకి వ్యతిరేకంగా నిలబెడుతున్నారని సి.పి.ఐ.(ఎం) ఆరోపిస్తున్నది. విదేశీ నిధుల సహాయంతో నడిచే స్వచ్ఛంద సంస్థలు కొన్ని వెట్టిచాకిరీ పద్ధతులలో సాలు జీతగాళ్ళను కుదుర్చుకున్న ధనిక, మధ్యతరహా రైతులపైన వెట్టి చాకిరీ (నిర్మూలన) చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తే, సిగ్గులేకుండా వాటికి వ్యతిరేకంగా సభలు పెట్టి వాటిని ఖండిస్తున్నది (ఇటీవల ఆంధ్రలోని ఖమ్మం జిల్లాలో జరిగిందిదే). వీటితో ఆ పార్టీ కోరుకుంటున్న రైతాంగ ఐక్యత స్వభావం ఏమిటో స్పష్టమే. సి.పి.ఎం వ్యూహాలపై చేసిన చర్చలో ఎన్. కృష్ణాజీ ఆ పార్టీ సందిగ్ధాన్ని చక్కగా పట్టి చూపించారు (16వ అధ్యాయం). సమస్యను ఈ రకంగా చర్చిస్తే అది తేలికయినదిగానే కనిపిస్తుంది. అయితే కుల సమస్య ఇమిడి ఉన్నపుడు పేద ప్రజల దృక్పథం నుంచి ఐక్యతను కోరుకోవడం చాలా కష్టసాధ్యమవుతుంది. భూమిలేని ప్రజల ప్రయోజనాలను వదిలేయకుండా, వాటిని బలహీన పరచకుండా ఆ ఐక్యతను సాధించాలి. భూమిలేని ప్రజల కోర్కెలను బలపరిచే రీతిలో, తమకి ఎంత ఇష్టం లేకున్నా వారితో వర్గ ఐక్య సంఘటన ద్వారా తప్ప తమకి భవిష్యత్తు లేదని మధ్య, ధనిక రైతులు గుర్తించేలా ఆ ఐక్యతను సాధించాల్సి వుంటుంది. ఇవాళ సి.పి.ఐ(ఎం.ఎల్) గ్రూపులను వేధిస్తున్న ప్రధాన సమస్య ఈ

బలాన్ని సాధించడంలోనే వుంది. పరిష్కారానికి లొంగని ఈ సమస్యే సి.పి.ఐ(ఎం.ఎల్) గ్రూపులపై అమలవుతున్న దారుణ దమనకాండకి ఒక కారణం. అయితే ఇది మనం ఎదుర్కొని, పరిష్కరించాల్సిన వాస్తవ సమస్య. నక్సలైటు గ్రూపులు తామేం చేస్తున్నారో అర్థం చేసుకోలేని మూర్ఖులని భ్రమపడి దాటవేస్తే సమసిపోయే సమస్య కాదు. దేశాయి, గెయిల్ ఆంవెట్ – ఇద్దరూ అలాంటి ఊహల్లోనే వున్నారు.

## చారిత్రక కోణం

రాజ్యాన్ని విశ్లేషణకి కేంద్రంగా చేయడం ద్వారా దేశాయి గారి సిద్ధాంత దృక్పథం వ్యవసాయిక సమస్యపై వెలుగుని ప్రసరిస్తే, గెయిల్ ఆమ్‌వెట్ మరొక ముఖ్యమైన కోణాన్ని ముందుకు తీసుకొచ్చారు. ఈ కోణం మామూలుగా 'ఉత్పత్తి విధానం' పైన జరిగే చర్చల్లో కనిపించదు. అదే చారిత్రక కోణం. రష్యాలో పెట్టుబడిదారీ విధానాభివృద్ధిపై లెనిన్ విశ్లేషణ పెట్టుబడిదారీ పూర్వ రష్యాతో ప్రారంభమైతే మన ఆర్థికవేత్తలు లెనిన్ నుంచి ప్రారంభమవుతారు. ఇలా చరిత్రను వదిలేయడంతో దానితో పాటు కులమూ అదృశ్యమైపోయింది. కులాన్ని సూటిగా చూడడం పట్ల (మన మేధావులందరిలో సార్వత్రికంగా కనిపించే) విముఖతే చరిత్రను కూడ పట్టించుకోకుండా చేసిందని నా అనుమానం.

కులాన్ని చూడలేని ఒక రకమైన గుడ్డితనం భారతీయ మేధావులను, ప్రత్యేకించి మార్క్సిస్టులని పీడిస్తున్నది. అవకాశమిస్తే తమకు అసలు కులమే లేనట్లు వీళ్ళు నటించగలరు. ఒక భారతీయ మార్క్సిస్టు (ఇతర భారతీయులందరి లాగే) మరొకరిని కలవగానే మొదట చేసే పని, ఆ ఎదుటి వ్యక్తి పేరు, ఇంటి పేరు, ప్రవర్తన, అలవాట్లు, భాషలను బట్టి అతని కులాన్ని ఊహించడం. అయితే బహిరంగంగా మాత్రం కులమన్నదే లేనట్లు నటిస్తారు. అవాస్తవికమైన ఈ వైఖరి అత్యంత అచారిత్రకమైన సామాజిక శాస్త్రాలకు దారి తీసింది. ఇదొక విషాదం. ఎందుకంటే చరిత్ర లేకపోతే భారతదేశానికి ఇంకేముంది? భారతదేశానికి ఉన్నంతటి చరిత్ర ప్రపంచంలో మరే దేశానికీ లేదు. ఈ మాట కేవలం, గతంలో ఎన్నో ఘటనలు జరిగాయనే అర్థంలో అంటున్నది కాదు, సజీవ చరిత్ర – అంటే అవిచ్ఛిన్నంగా కొనసాగుతున్న గతపు వారసత్వం అనే అర్థంలో చెబుతున్నది. ఈ అంశాన్ని అర్థం చేసుకున్న మార్క్సిస్టు కోశాంబి వొక్కరే. భారత చరిత్రపై ఆయన విశ్లేషణలో కులం కీలకమైన స్థానాన్ని

కలిగి ఉండడమూ, ఆ విశ్లేషణలో విలక్షణమైన భారతీయతా యాదృచ్ఛికమైనవి కావు. ఆయనతో విభేదిస్తున్నప్పుడు సైతం, ఆయన మాట్లాడుతున్నది భారతదేశం గురించేననీ, భారత సమాజం గురించేననీ మనకు స్పష్టంగా అర్థమవుతుంది. కానీ, మన మార్క్సిస్టు సామాజిక శాస్త్రవేత్తలతో చర్చించేటప్పుడు, మనం వాళ్ళతో పూర్తిగా అంగీకరించే సందర్భంలో సైతం, వాళ్ళు ఏ దేశం గురించి మాట్లాడుతున్నారన్నది మనకి అనుమానమే. ఎందుకంటే వాళ్ళు మాట్లాడేది ఆఫ్ఘనిస్తాన్ గురించైనా కావచ్చు, భారతదేశం గురించైనా కావచ్చు. దురదృష్టవశాత్తూ కోశాంబి వారసత్వాన్ని ఆయన అభిమానులమనే వాళ్ళే విస్మరించారు.

దీనితో, వ్యవసాయిక సంబంధాల విశ్లేషణకు చారిత్రకమైన, ప్రత్యేకించి భారతీయమైన అవగాహనా దృక్పథాన్ని అందించే బాధ్యత విచిత్రంగా డేనియల్ థార్నర్, గెయిల్ ఆమ్‌వెట్ వంటి విదేశీయులపై పడింది. (ఇప్పుడున్న వాతావరణంలో, నేను విదేశీయులనే మాటను నిందాపూర్వకంగా వాడలేదని చెప్పాల్సి వుంది). ఇది మన విశ్లేషణలో కేవలం కులం అనే ఇంకొక అంశాన్ని చేర్చడానికి సంబంధించినది కాదు. వ్యవసాయ సంబంధాల పరిణామాన్ని చారిత్రకంగా అధ్యయనం చేయడం, రైతాంగ పోరాటాలను చారిత్రక పరిణామంలో భాగంగా చూడడం ఇందులో కీలకమైనవి. అలాంటి అధ్యయనం ఎలా వుంటుందో చెప్పడానికి గెయిల్ ఆమ్‌వెట్ రాసిన 'కులం, వ్యవసాయిక సంబంధాలు, రైతాంగ సంఘర్షణలు' అనే వ్యాసం ఒక చక్కటి ఉదాహరణ.

అయితే, అగ్రకుల భూస్వాముల (మాలిక్‌లు) స్థానాన్ని నడిమి కులాల పెట్టుబడిదారీ రైతులు (కిసాన్‌లు) ఆక్రమించారనీ, అగ్రకుల భూస్వాములపై నడిమి కుల కౌలుదారుల భూస్వామ్య వ్యతిరేక పోరాటం స్థానంలో కిసాన్‌లకు వ్యతిరేకంగా పేద దళితుల (మజ్దూర్‌లు) పెట్టుబడిదారీ వ్యతిరేక పోరాటం వచ్చేసిందనీ ఆవిడ చేస్తున్న వాదనలో చాలా ఆకర్షణీయమైన సరళత వున్నా, అది రైతాంగ చరిత్రపైన, అందులో భాగమైన కులంపైన మన అవగాహనా లేమిని ఎత్తి చూపుతోంది. సామాజిక శాస్త్రవేత్తలందరిలో 'నడిమి కులం' అనే పదం పట్ల ఏకాభిప్రాయం వున్నప్పటికీ, నేను మాత్రం దాన్ని అర్థం చేసుకోలేకపోతున్నాను. నడిమి అంటే దేనికి  నడిమి అనుకోవాలి? అది బ్రాహ్మణుల చాతుర్వర్ణమనుకుంటే (నాలుగు అనే సంఖ్యలో నడిమి లేదనే ఇబ్బందినటుంచి) మొదటగా, అది వ్యవసాయిక విశ్లేషణకి పొసగనిదని (irrelevant)

చెప్పాలి. రెండవది, అది అర్థం లేనిది కూడ. 2000 సంవత్సరాల క్రితం 'స్వయం పోషక' గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఆవిర్భావం, ఆ గ్రామాల పునాదిపైన భూస్వామ్య సమాజపు ఆవిర్భావంతో యజుర్వేదపు చాతుర్వర్ణ వ్యవస్థ సహజంగానే అంతరించిపోయింది. తర్వాతి కాలంలో అభివృద్ధి చెందిన సంక్లిష్టమైన కులవ్యవస్థకీ (ఉత్తర భారతీయులు జాతి అని పిలుస్తారు) ఈ చాతుర్వర్ణ వ్యవస్థకీ పెద్ద సంబంధమేమీ లేదు. భూస్వామ్య కాలంలో నిజమైన అర్థంలో క్షత్రియులు లేనే లేరు (క్షత్రియులుగా తమను తాము పిలుచుకున్న వారు మాత్రమే వున్నారు). వైశ్యులు సాగుదారులుగా వుండడం మానేసి వ్యాపారస్తులయారు. శూద్రులనే పదం గతంలో లాగా ఇప్పుడు ఒక వర్గాన్ని సూచించదు. అది న్యాయశాస్త్ర – భావజాలపు వ్యక్తీకరణగా, బ్రాహ్మణీయ తిట్టుపదంగా మారిపోయింది. అటు భూస్వామ్య పూర్వ దశలోని చాతుర్వర్ణ వ్యవస్థలోనూ ఇటు భూస్వామ్య యుగపు కులవ్యవస్థలోనూ కొనసాగింది దానికి ఆధారభూతంగా వున్న బ్రాహ్మణులొక్కరే. ఏనాడో చచ్చిన వాటిని సైతం వదులుకోలేని వారి అశక్తతే చాతుర్వర్ణాన్ని నిలబెట్టింది. అది కొనసాగుతున్నట్లు చూపడానికి మనువు వర్ణ సాంకర్య సిద్ధాంతం అవసరమైంది. ఇప్పుడు మన గ్రామీణ సామాజిక వేత్తలు ఒక నడిమి కులాన్ని కనిపెట్టడం కోసం ఈ మృత కళేబరాన్ని పరిశోధించ చూస్తున్నారు.

అయితే, ఇది కేవలం పదజాలానికి సంబంధించిన సమస్య కాదు. 'జాట్లు, కుర్మీలు, అహిర్లు, మరాఠాలు, రెడ్లు, కమ్మలు వగైరా'ల మధ్య (ఈ వగైరా జాబితాలో ఇంకా ఎవరెవరిని కలుపుదామనే దానిపై ఎలాంటి దురభిప్రాయమూ లేకుండానే) ఉమ్మడిగా ఉన్న అంశమేమిటి? (పై జాబితాని నేను గెయిల్ ఆమ్‌వెట్ నుంచి తీసుకున్నాను.) అలాగే (ఇప్పుడు దేశాయి గారి నుంచి తీసుకున్న జాబితా ప్రకారం) 'మరాఠాలు, పాటిదార్లు, జాట్లు, అహిర్లు, భూమిహార్లు, రెడ్లు, నాయర్లు, వొక్కళిగ'ల మధ్యనున్న ఉమ్మడిదనమేమిటి? రెడ్లు, నాయర్లు, మరాఠాలలో సాగుదార్లు మాత్రమే కాదు, రాజులు, సామంతులు, దొరలు, పరిపాలకులు, శిస్తు వసూలుదార్లు కూడ వున్నారు. అయితే భూమిహార్లు 'నడిమి కులస్తులు' కాకపోగా, వాళ్ళు తమని తాము బ్రాహ్మణులుగా భావించుకుంటారు. పశుపాలక సమూహాల నుండి సాగుచేసే కులాలుగా అహిర్ల, యాదవుల పరిణామం ఇంకా పూర్తికాలేదు. కమ్మవారు ప్రధానంగా వ్యవసాయ దారులే గానీ గడచిన నూరేళ్ళ కాలంలో ఒక భూస్వాముల వర్గం వాళ్ళలో ఎల్లప్పుడూ భాగంగా వుంటూ వచ్చింది. ఈ కులాల మధ్య ఒక వాస్తవ

సామాన్యాంశమేదీ లేదు, ఉన్నదల్లా ఒక సిద్ధాంతం మాత్రమే. ఈ 'నడిమి కులాల, సాగుదార్లు అంతా ఒకప్పుడు 'ద్విజ' అగ్రకుల (బ్రాహ్మణ, క్షత్రియ) భూస్వాములకు కౌలుదార్లని, ఆ తర్వాత భూస్వామ్య వ్యతిరేక పోరాటాలకు నాయకత్వం వహించి, ఇప్పుడు గరిష్ట లాభార్జనాపరులైన పెట్టుబడిదారీ రైతులుగా మారి కింది కులాలనీ, దళితులనీ దోచుకుంటున్నారనీ ఆ సిద్ధాంతం చెబుతుంది. ఈ సరళ సిద్ధాంతం ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రలలోని కొన్ని ప్రాంతాలలోని వాస్తవికతకి విమర్శనా రహితమైన పొడిగింపుగా కనిపిస్తుంది. (ఈ మేరకు దీన్ని నేను అంగీకరించడమంటే గెయిల్ ఆమ్‌వెట్ నిర్ధారణలనూ, ఉత్తరప్రదేశ్ తూర్పు ప్రాంతాలలో కొన్నిచోట్ల జరిగిన భూమి ఆక్రమణ ఉద్యమం మీద రాజేంద్ర సింగ్ రాసిన విషయాలను లోపలిదాకా వెళ్ళి పరిశీలించకుండానే ఒప్పుకుంటున్నానని చెప్పాలి.) వాస్తవానికి సంప్రదాయ వర్ణ వ్యవస్థలోని దొంతరలకీ, కులవ్యవస్థలోని దొంతరలకీ మధ్యనున్న సంబంధం గానీ, కుల – వర్గాల మధ్య సంబంధం గానీ అంత సరళంగా ఏనాడూ లేదు. కులాలన్నీ ఎలాంటి అంతర్గత విభజనలు లేని ఏకరూపంలో ఎన్నడూ లేవు. రాజకీయ ఆర్థిక వ్యవస్థ పరంగా చూసినా వర్గ సంబంధాలను పూర్తిగా కుల సంబంధాల రూపంలో చర్చించగలిగే పరిస్థితీ లేదు.

వాస్తవానికి దేశంలోని అనేక ప్రాంతాలలో మధ్యయుగాల నాటి గ్రామీణ సముదాయాలను వర్ణ వ్యవస్థ దొంతరలతో సరిపోల్చడం గానీ, ఇవాళ్టి కులాలతో సరిపోల్చడం గానీ చాలా కష్టం. ఇవాళ్టి కులాలు సర్వ కాలాలలోనూ అలాగే వున్నాయని అనుకుంటే పొరపాటు. విభిన్న సమూహాలు రూపాంతరం చెంది పరిణామ క్రమంలో కులాలుగా, కుల సముదాయాలుగా రూపొందాయి. నిరంతరాయంగా రూపొందుతూ, పరిణామం చెందుతున్న కుల వ్యవస్థకు కుహనా చాతుర్వర్ణ వ్యవస్థకు ఉన్నదనుకుంటున్న శాశ్వతత్వాన్ని పొరపాటుగా ఆపాదిస్తున్నారు. ఆంధ్రా గురించి చెప్పుకోవాలంటే (ఉత్తర కోస్తాలో తమకి తాము క్షత్రియత్వాన్ని ఆపాదించుకునే రాజులు తప్ప) అక్కడ క్షత్రియులు లేరు. అక్కడ ఎన్నడూ వైశ్యుల చేతిలో పెద్దగా భూమి వున్నదీ లేదు. ఫ్యూడల్ భూస్వామ్య వర్గం పూర్తిగా గానీ, ప్రధానంగా గానీ 'ద్విజ కులాల'కు ఎప్పుడూ పరిమితమై లేదు. అందులో బ్రాహ్మణులూ వున్నారు, అనేక బ్రాహ్మణేతర సమూహాలూ వున్నాయి. ఇవాళ్టి కులాలను, ఈ సమూహాలతో సరిపోల్చి గుర్తించడం అన్నివేళలా సాధ్యం కాదు. ఈ సమూహాల నుండి వచ్చిన వారిలోనే

ఇవాళ తమని తాము రెడ్డి, కమ్మ, వెలమ కులస్తులుగా పరిగణించుకునే వాళ్ళున్నారు. 19వ శతాబ్దం, 20వ శతాబ్దారంభం నాటి బ్రిటిష్, అసఫ్ జాహి పరిపాలిత ప్రాంతాలలోని భూస్వామ్య కులీన వర్గంలో ముఖ్య భాగంగా వున్నది బ్రాహ్మణులు, వారితోపాటు ఈ కులాల భూస్వాములు. బ్రాహ్మణ శ్రోత్రియం దారులు, అగ్రహారం యజమానులతో పాటు ఈ భూస్వాములకీ వ్యతిరేకంగా ఎక్కుపెట్టినవే భూస్వామ్య వ్యతిరేక రైతాంగ తిరుగుబాట్లు. ఇందులో చాలాసార్లు ఒకే కులస్తులు పోరాటంలో రెండువైపులా నిలిచారు. కోస్తా ఆంధ్రలో కమ్మ జమీందారులకి వ్యతిరేకంగా కమ్మ సాగుదార్లు నిలబడితే, తెలంగాణలో రెడ్డి దేశ్‌ముఖ్‌లకు వ్యతిరేకంగా రెడ్డి సాగుదారులు నిలబడ్డారు. ఈ ద్వంద్వత్వం ఈనాటికీ కొనసాగుతోంది. ఉదాహరణకు రెడ్డి కులస్తులుగా ఉన్న వారిలో నాగలి పట్టడం చిన్నతనంగా భావించే వారితో పాటు కష్టపడి పనిచేసే చిన్న సాగుదారులూ వున్నారు. గ్రామీణ భారత దేశంలో మనం కనిపెట్టజూస్తున్న 'నడిమి కుల పెట్టుబడిదారీ' రైతు వీరిలో ఎవరు?

మన సమిష్టి అజ్ఞానాన్ని అలాగే వదిలేద్దాం

## II

## రైతాంగ పోరాటాలు

ఈ సంపుటంలో దేశంలోని వివిధ ప్రాంతాలలోని రైతాంగ పోరాటాలను చర్చించే వ్యాసాలు, నివేదికలు దాదాపు ఇరవై దాకా వున్నాయి. వారి వారి అభిప్రాయాలను బట్టి ఈ ఎంపికను కలగూరగంప అనో, వైవిధ్యభరితమనో వ్యాఖ్యానించుకోవచ్చు. ఒంటెత్తు వాదానికి ఇది సమయం కాదు గనక, వీటి ఎంపిక వైవిధ్య భరితమనే చెప్పుకుందాం. పక్షపాతం లేకుండా సి.పి.ఐ, సి.పి.ఐ(ఎం), సి.పి.ఐ(ఎం.ఎల్), సోషలిస్టులు, ఇంకా షేత్కారి సంఘటన లాంటి సంస్థల నాయకత్వంలో సాగిన పోరాటాలను దీనికోసం ఎంపిక చేశారు. అయితే కనీసం ఒక్క వ్యాసం ఈ సంపుటంలోని ప్రధానాంశానికి విరుద్ధంగా వుందని చెప్పుకోవచ్చు. అది ఇయాన్ బ్రెమన్ రాసిన 'భూమిలేని కూలీల సమీకరణ: దక్షిణ గుజరాత్‌లో హాలపతులు' అనే వ్యాసం. అది రైతాంగ పోరాటపు నివేదిక కాదు. పాలకవర్గాలు ఏర్పాటుచేసే సంఘాలు, రైతాంగ పోరాటాలు ఎలా నీరుగారిపోతాయో తెలిపే వ్యాసం. ఈ వ్యాసంలో భూమిలేని కూలీలు సంఘటితం కాకుండా గాంధీవాద రాజకీయాలు ఎలా అడ్డుకున్నాయో

చర్చించారు. ప్రస్తుత సంపుటంలో ఈ వ్యాసాన్ని చేర్చడం చరిత్ర పట్ల సంపాదకుని గతితార్కిక అవగాహనకి నిదర్శనం అనుకుంటే, ఆచరణాత్మక అర్థంలో వ్యవసాయిక సంబంధాల ఊసే లేని నాగా, మిజో పోరాట నివేదికల్ని చేర్చడం అనేది ఆయన తన ప్రధాన చర్చాంశాన్ని కేవలం సామాజిక పరంగా గాక రాజకీయ కోణంలో అర్థం చేసుకున్నారనడానికి దాఖలా అనుకోవచ్చు. భారత వ్యవసాయ విప్లవాన్ని ఎవరు ఏ రకంగా ఊహించి అర్థంచేసుకున్నా ఈశాన్య ప్రాంత ప్రజల జాతీయ ఆకాంక్షలను నెరవేర్చకుండా ఆ విప్లవం పరిపూర్తి కాలేదు. జాతీయ పోరాటాలన్నిటినీ ప్రధానంగా దేశ సమైక్యత, సమగ్రత కోణం నుండీ, 'విదేశీ కుట్రల' కోణం నుండీ చూసే రెండు ప్రధాన కమ్యూనిస్టు పార్టీల యాంత్రిక అవగాహన నుంచి తనని విడగొట్టుకొన్నందుకు దేశాయి గారిని ప్రత్యేకంగా అభినందించనవసరం లేదనుకుంటాను.

కానీ, సంపాదకులు తమ ప్రధాన చర్చాంశాన్ని గతితార్కికంగానూ, రాజకీయం గానూ అర్థం చేసుకున్నారనేది విస్పష్టంగా వుంది గనకనే అంతిమ ఫలితం కొంచెం నిరాశ పరుస్తుంది. ఇందులో వ్యాసాల కోసం ఆయన ఎంచుకున్న వారందరికీ అలాంటి స్ఫూర్తి లేదు. కొందరు ప్రజా పోరాటాలతో వుత్తేజం పొందినా, రాజకీయాల పట్ల అహంకార పూరితమైన అవిశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారు. స్వస్తి మిట్టర్ వ్యాసం దీనికొక ఉదాహరణ. సి.పి.ఐ(ఎం) నాయకత్వంలో సాగిన సోనార్‌పూర్ రైతాంగ పోరాటంపై ఆమె ఒక వ్యాసం రాశారు (24వ అధ్యాయం). 'సైద్ధాంతిక తర్ఫీదు'తో గాక 'సామాజిక అన్యాయాన్ని సరిదిద్దాలని', 'ఎంతో కొంత తక్షణ ప్రయోజనాన్ని' సాధించాలని కోరుకుని ఉద్యమంలో చేరిన సాధారణ రైతులను చూడాలనే ఉద్దేశంతో తాను క్షేత్ర పర్యటనకు పూనుకున్నానని ఆమె చెబుతారు. ఇది సామాజిక న్యాయం, భౌతిక ప్రయోజనాల సాధన అనే ఆకాంక్షలని రాజకీయాల నుండి విడదీయడమే (రాజకీయాలను పైనుంచీ, బయటి నుంచీ ప్రవేశపెట్టేవిగా, అందజేసేవిగా తిరస్కార పూర్వకంగా చూడడం). కొన్నిసార్లు ఈ ధోరణిని చరిత్ర రచనా సిద్ధాంత స్థాయికి కూడ తీసుకుపోతున్నారు. ఈ ధోరణి సంపాదకుని పరిచయ వ్యాసాల స్ఫూర్తిని దెబ్బతీస్తుంది. ప్రజలు తమ పోరాటాల గురించి తామేమనుకుంటున్నారో వెలుగులోకి తేవడం చాలా ఆసక్తికరమైందనేది నిస్సందేహం. కానీ, ప్రపంచాన్ని వ్యాఖ్యానించడం కంటే దాన్ని మార్చడంపైనే మనకి ఎక్కువ ఆసక్తి వుందనుకుంటే, మనం రాజకీయాలకే ప్రాధాన్యత ఇవ్వక తప్పదు. అప్పుడు రాజకీయాలను, బయటి నుంచి ప్రవేశపెట్టేవిగా కాక, ప్రజల ఆర్థిక, సామాజిక ఆకాంక్షల సాంద్ర వ్యక్తీకరణగా చూడక తప్పదు.

ఒకానొక నిర్దిష్ట రాజకీయాలు ఆ ఆకాంక్షలను వాస్తవంగా వ్యక్తీకరిస్తున్నాయా అనే ప్రశ్న ఎప్పుడూ వుంటుంది. అయితే అది నిర్దిష్టమైన విశ్లేషణలో తేలాల్సిన విషయం; దురభిప్రాయాలతో చేసే ప్రకటనలతో కాదు.

పై ధోరణికి మరొక ఉదాహరణ ఆంత్రోపాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా మాజీ సంచాలకులు కె.ఎస్. సింగ్ రాసిన వ్యాసం. దీనికి పెట్టిన 'ఆదివాసుల పోరాటాలలో వ్యవసాయిక కోణాలు' అనే శీర్షిక కొంచెం తప్పుదారి పట్టిస్తుంది. వామపక్షాల నాయకత్వంలోని ఉద్యమాలలో రైతులు వ్యవసాయిక సమస్యలపై పోరాడినా, ఆదివాసుల పోరాటాలలోనే వ్యవసాయిక అంశ ఎక్కువ వుందనీ, వామపక్షాల నాయకత్వంలోని ఆదివాసి ఉద్యమాలలో నిజమైన ఆదివాసుల భాగస్వామ్యం లేనే లేదనీ అందులో వాదిస్తారు. ఇంకా ఎప్పటిలాగే, ఆదివాసుల ఉద్యమాలను నడిపే నక్సలైట్లకి వాళ్ళేమి మాట్లాడుతున్నారో తెలియదనీ వాదిస్తారు. సి.పి.ఐ(ఎం.ఎల్) గ్రూపులు తెలివి మాలినవనే అభిప్రాయం అందరూ వ్యక్తం చేయడం గుర్తించాల్సిన విషయం. ఉన్నతాధికార మేధావుల నుండి మేధావి కార్యకర్తలు, మేధావి ఉన్నతాధికారుల దాకా అందరిలోనూ అదే అభిప్రాయం కనిపిస్తుంది. ఎం.ఎల్ గ్రూపులు ప్రధానంగా అతి పేద ప్రజలకు పరిమితమై పోవడం, పట్టణ మేధావులకు వారి వ్యక్తీకరణ అర్థం కాకపోవడమే దీనికి కారణం. శ్రీకాకుళ ఉద్యమంపై (9వ అధ్యాయం) తరుణ్ కుమార్ బెనర్జీ, నక్సల్బరీ తిరుగుబాటుపై (23వ అధ్యాయం) సుమంతా బెనర్జీలు రాసిన వివరమైన వ్యాసాలు కె.ఎస్. సింగ్ నిర్ధారణలకి పూర్తి విరుద్ధంగా వున్నాయి.

ఈ దృక్పథం పనికిమాలినదనీ, అందుకని ఈ దృక్పథంతో రాసిన వ్యాసాలను సంపుటంలో చేర్చకుండా వుండాల్సిందనీ నేననడం లేదు. దృక్పథం సంగతి అటుంచితే, ఈ వ్యాసాలు చాలా ఆసక్తికరంగా వున్నాయి. వీటిలో వివరమైన సమాచారమూ వుంది. ఉద్దేశించిన విషయం గురించి తెలపకపోయినా అవి రచయిత గురించి తెలుపుతాయి. ఇదీ విలువైనదే. రచయితలందరూ సామాజికంగా నిర్మితమైన వర్గాలలో సభ్యులుగా వుంటారు. జంతుశాస్త్రానికి జంతుజాలపు వర్గీకరణ ఎంత కీలకమో, సామాజిక, చారిత్రక అధ్యయనాలకు మేధావుల వర్గీకరణ కూడ అంతే ముఖ్యమైనది. ప్రపంచాన్ని వ్యాఖ్యానించడం కంటే దాన్ని మార్చడం ముఖ్యమనీ, ప్రపంచాన్ని మార్చే క్రమంలోనే దాన్ని సరిగ్గా వ్యాఖ్యానించగలమనీ దేశాయి గారు నమ్ముతారనే నేను అనుకుంటాను. అందులో నాకెలాంటి సందేహం లేదు. అలాంటప్పుడు ఈ సంపుటం

కోసం ఆయన మరింత సముచితమైన వ్యాసాలను ఎంపిక చేయగలిగే వారనీ, అలా చేసి వుండాల్సిందనీ నా అభిప్రాయం.

అటువంటి ఎంపిక అవసరమైతే రెండు భాగాలకీ రెండు రెండు వేర్వేరు విశ్లేషణాత్మకమైన పరిచయ వ్యాసాలతో తీసుకొచ్చి ఉంటే అది రైతాంగ పోరాటాల వైవిధ్యాన్ని చూపడానికి మాత్రమే పరిమితం కాకుండా ఒక చలనశీలమైన, చారిత్రక రైతాంగ పోరాట దృశ్యాన్ని ఆవిష్కరించగలిగేది. ఈ సంపుటంలో అలాంటి సమగ్ర చిత్రం కోసం ప్రయాసతో అన్వేషించాల్సి వస్తోంది.

## ఇందులో మనకి కనిపించే దృశ్యమేమిటి?

ఈ సంపుటంలో పరిగణనలోకి తీసుకున్న కాలాన్ని స్థూలంగా రెండు దశలుగా – నక్సల్బరీకి ముందూ, నక్సల్బరీ తర్వాతా అనే దశలుగా విభజించవచ్చు. కొంచెం తక్కువ రెచ్చగొట్టే విధంగా చెప్పాలంటే, 1960 దశకం మధ్య కాలం నాటి కరువుకి ముందు దశ, తర్వాత దశగా విభజించవచ్చు. స్వాతంత్ర్యానంతరం ఆంధ్రాలో వచ్చిన రైతాంగ ఉద్యమాల కాలాన్ని జాతీయ కార్మిక సంస్థ (National Labour Institute) తన నివేదికలో హరిత విప్లవానికి ముందు, తర్వాతి దశలుగా విభజించింది (10వ అధ్యాయం). సామాజిక శాస్త్రవేత్తలలో ఎక్కువమంది ఈ అవగాహనని ఆమోదిస్తారనుకుంటాను. అయితే, రైతాంగ ఉద్యమాల స్వభావంలో వచ్చిన మార్పుకి హరిత విప్లవం కంటే అరవైయవ దశకం మధ్యలో వచ్చిన తీవ్రమైన కరువూ, 1964 నాటి సి.పి.ఐ చీలికలో అసంపూర్తిగా మిగిలిన అంశాల ప్రకంపనలూ (ఇంకా చైనా సాంస్కృతిక విప్లవమూ) ఎక్కువ కారణాలనేది నా వాదన.

పోరాట స్థాయి తక్కువగా వుండడం, పోరాటాలకు రాజకీయ దిశ లోపించడం, ఆ పోరాటాలు భూమిలేని కూలీల కేంద్రంగా కాకుండా, భూమి కలిగిన రైతుల కేంద్రంగా సాగడం – ఇవీ వాటి తొలి దశ లక్షణాలు. ఈ మొత్తం సంకలనంలో ఆ తొలి దశ 'రైతాంగ పోరాటాల'పై గుర్తించదగ్గది ఒకే ఒక్క వ్యాసం. సంకలనంలో ఇది కొట్టొచ్చినట్టు కనిపించే విషయం. పైన చెప్పుకున్న జాతీయ కార్మిక సంస్థ ఆంధ్రాలో పోరాటాలపై ఇచ్చిన నివేదికే ఈ వ్యాసం. దీని కూర్పు కూడ ప్రయాస పూర్వకంగా కనిపిస్తుంది. ఇంకొక మూడు వ్యాసాలలో తొలి దశ గురించిన ప్రయత్నం కనిపిస్తుంది. కేరళపై కృష్ణాజీ (16వ అధ్యాయం), పంజాబ్‌పై బి.డి. తాలిబ్ (20వ అధ్యాయం),

తమిళనాడుపై గోపాల్ అయ్యర్, విద్యాసాగర్‌లు (21వ అధ్యాయం) ప్రయత్నించి కూడ తొలి దశ గురించి చెప్పడానికి తమ దగ్గర పెద్దగా ఏమీ లేదని గ్రహించి, తమ వ్యాసాలను భూసంస్కరణలపైన, భూమి నైసర్గిక స్వరూపం పైన చర్చలతో నింపేశారు.

అసలైన రైతాంగ పోరాటాలన్నీ రెండో దశలో వున్నాయి. గిట్టుబాటు ధరలు, వ్యవసాయ ఉత్పాదకాలపై సబ్సిడీల కోసం స్థితిమంతులైన భూయజమానులు చేసిన పోరాటాలను ఇందులో చేర్చాలని దేశాయి గారు అనుకున్నప్పటికీ (అలా అనుకోవడమే సరైనది) ఈ వాస్తవం మారదు. శరద్ జోషి కూడ రెండో దశకే చెందుతారు, మొదటి దశకి కాదు.

## రైతాంగ పోరాటాల వెల్లువ, దాని మూలాలు

తొలి దశ, రెండో దశల రైతాంగ పోరాటాలలో ఇంత తీవ్రమైన మార్పుకి కారణమేమిటి? హరిత విప్లవాన్ని ఈ మార్పుకి కారణంగానూ, దాన్ని ఒక విభజన రేఖగానూ పరిగణించడం అలవాటైపోయింది. ఈ వాదన, హరిత విప్లవపు సాంకేతిక జ్ఞానం – ప్రత్యేకించి – పెట్టుబడిదారీ వ్యవసాయాభివృద్ధిని ప్రోత్సహిస్తుందనీ, ఇది గ్రామాలలో ఘర్షణల పెరుగుదలకి దారితీసిందనీ భావించే సిద్ధాంతానికి అనుగుణంగా వుంది. అందుకే ఈ వాదనను విమర్శనారహితంగా అంగీకరిస్తున్నారు. ఈ వాదన, ట్రాక్టర్లను, గొట్టపు బావులను 'వస్తుగత పరిస్థితుల'లో భాగంగా పరిగణించి, చైతన్యయుతమైన మానవాచరణను మాత్రం అందులో భాగంగా చూడలేకపోయిన చారిత్రక భౌతికవాదపు అపభ్రంశ అవగాహనకు కూడ అనుగుణంగా వుందని నా అనుమానం. ఏదేమైనా, ఈ అవగాహన వాస్తవాలతో పొసగనిదే.

ఈ సంపుటంలో పేర్కొన్న నక్సల్బరీ, శ్రీకాకుళం, ధన్‌బాద్, ధూలియా, వర్లీ ఆదివాసి రైతాంగ పోరాటాలు ఆనాడు గానీ, ఈనాడు గానీ హరిత విప్లవ ప్రాంతాలు కావు. విలువైన చారిత్రక సమాచారంతో నిర్మల్ సేన్ గుప్తా, ఆయన సహచరులు విశదంగా చిత్రించిన బీహార్‌లోని పూర్ణియా, మధుబని బతాయిదార్ల పోరాటాలు కూడ హరిత విప్లవ ప్రాంతాలు కావు (12, 13వ అధ్యాయాలు). భోజ్‌పూర్‌లో సాంద్ర వ్యవసాయాభివృద్ధి పథకం (ఐ.ఎ.డి.పి) అమలు జరిగింది గానీ, అది 1960లోనే మొదలైంది. అదీ హరిత విప్లవానికి చెందిన అంశం కాదు (మంజుకళ, ఆర్.ఎన్. మహారాజ్, కల్యాణ్ ముఖర్జీల వ్యాసం, రెండవ అధ్యాయం). సోషలిస్టు పార్టీల భూ

ఆక్రమణ (మేన్ కైండ్ పత్రిక నివేదిక, 4వ అధ్యాయం) గానీ, సి.పి.ఐ భూ ఆక్రమణలు గానీ (6వ అధ్యాయం, గిరిప్రసాద్ వ్యాసం. ఈ పేరు గురుప్రసాద్‌గా అచ్చువ్వడం నిస్సందేహంగా అచ్చు తప్పే) హరిత విప్లవ ప్రాంతాలలో సాగినవి కావు. పంజాబ్‌ను మినహాయిస్తే ఈ సంపుటంలో పేర్కొన్న హరిత విప్లవ ప్రాంతం తమిళనాడులోని తంజావూరు మాత్రమే (గోపాల్ అయ్యర్, విద్యాసాగర్‌ల వ్యాసం – 21వ అధ్యాయం). అయితే తంజావూరు రైతాంగ పోరాటాలకు హరిత విప్లవ కాలానికి ముందునుండీ కొనసాగిన సుదీర్ఘ చరిత్ర వుంది.

అరవైల మధ్య కాలంలో వచ్చిన రైతాంగ పోరాటాల వెల్లువకి కారణాలు వీటికన్నా మరింత సంక్లిష్టమైనవి. అయితే, ఈ సంకలనంలో చేర్చిన నివేదికల్ని జాగ్రత్తగా పరిశీలిస్తే ఆ కారణాలను గ్రహించవచ్చు. నక్సల్బరీ, శ్రీకాకుళం, భోజ్‌పూర్ పోరాటాలు రాజకీయ నిర్ణయంతో వచ్చాయన్నది విస్పష్టం. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నుంచి తాము ఏ కారణాల రీత్యా బయటికి వచ్చామో ఆ దిశగా పని చేయకపోవడం పట్ల సి.పి.ఐ (ఎం)లో ఉన్న అసంతృప్తి కారణంగాను, వీరోచితమైన చైనా సాంస్కృతిక విప్లవపు పిలుపు అందించిన ఉత్తేజంతోనూ ఈ పోరాటాలు ముందుకొచ్చాయి. (సుమంతా బెనర్జీ వ్యాసం, 23వ అధ్యాయం). నిర్మల్‌సేన్ గుప్తా తదితరులు వివరించినట్లు, పూర్ణియా, మధుబని బతాయిదార్ల పోరాటాలు భూసంస్కరణల బూటకత్వాన్ని గ్రహించడంతో ముందుకొచ్చిన పోరాటాలు. అరవైల మధ్య కాలంలో తాండవించిన కరువు పరిస్థితులు దీనికి తోడయ్యాయి. బీహార్ ఆదివాసి పోరాటాల విషయానికొస్తే, వాటి వెనక భూపరాయీకరణా, వడ్డీ దోపిడీల సుదీర్ఘ చరిత్రని తారాస్థాయికి తీసుకొచ్చిన కరువు పరిస్థితులూ, దానికి సంఘటిత రాజకీయ రూపమిచ్చిన ఎ.కె. రాయ్ వంటి నాయకుల కృషీ వున్నాయి. ఇందులోనూ, గ్రామీణ పేదలను సుమరశీలంగా సంఘటితం చేయడానికి సిద్ధంగా లేని సి.పి.ఐ, సి.పి.ఐ(ఎం)ల వైఖరితో విసుగుచెందిన రాజకీయ నిర్ణయమే ఎ.కె. రాయ్ లాంటి వారిని పురికొల్పిందని కూడ గుర్తించాలి. 1967 తర్వాత ముందుకొచ్చిన రైతాంగ పోరాటాలన్నిటి వెనకా మూడు అంశాలున్నాయి. అవి – చైతన్యయుతమైన రాజకీయ నిర్ణయం, తీవ్రమైన కరువు పరిస్థితులు, భూసంస్కరణల చట్టం నిరుపయోగమైనదని ప్రజలలో పెరిగిన గుర్తింపు. వ్యవసాయాభివృద్ధి వ్యూహం పర్యవసానంగా గ్రామీణ సంపన్న వర్గం బలపడి, గ్రామీణ పేదలను మరింత దారిద్ర్యం లోకి నెట్టిన నేపథ్యానికి

కరువు, విప్లవ వామపక్ష రాజకీయాలు తోడై ఈ పోరాటాలను ముందుకు తెచ్చాయని వాదించడం మరొక పద్ధతి.

ఈ రైతాంగ పోరాటాలు అనేక ఫలితాలకు దారి తీశాయి. అందులో కొన్ని స్ఫూర్తిదాయకంగా వుంటే, కొన్ని వినోదాత్మకంగా కనిపిస్తాయి. పాత వామపక్షాలు – ప్రత్యేకించి సి.పి.ఐ, సోషలిస్టుల కుహనా విప్లవీకరణను మనం వీటిలో చూడవచ్చు. వీళ్ళు దేశంలోని అనేక ప్రాంతాలలో హడావుడిగా భూ ఆక్రమణ ఉద్యమాలను మొదలుపెట్టారు కాని అలవాటులేని కార్యక్రమం కావడం వల్ల మూర్ఛ వచ్చినప్పుడు మనిషి ఎలా అయిపోతాడో అలా 'సీజన్' చివరికి వచ్చేసరికి అలిసి పడిపోయారు. ఎంతో కొంత భూమిని ఆక్రమించేశాక, ఆ తర్వాత ఏమి చేయాలో వాళ్ళకి తోచలేదు. 'మహత్తర భూపోరాటం' అని గొప్పగా శీర్షిక పెట్టుకుని రాసిన వ్యాసంలో గిరిప్రసాద్ ముగింపు మాటలు చూడండి: 'కేంద్ర ప్రభుత్వం కేంద్ర భూ సంస్కరణల సంఘాన్ని ఏర్పాటు చేయడమే భూపోరాటపు అతి ముఖ్యమైన విజయం'. ఇది ఒక అతి ముఖ్యమైన విషయానికి ముగింపుగా చేసిన ప్రకటనగా కంటే సమాధి శిలా ఫలకంపై రాసే వాక్యంలా ఉంది.

భూసంస్కరణలు మరో దఫాగా మొదలవడం ఈ రైతాంగ పోరాటాల వెల్లువ ఫలితాలలో ఒకటి. అనేక రాష్ట్రాలలో భూ పరిమితి చాలావరకు తగ్గించారు (కనీసం కాగితాల మీద). స్వాధీనం చేసుకోగలిగిన భూమిలో చాలావరకు స్వాధీనం చేసుకున్నారు. ఈ దశలో రాజకీయ కేంద్రీకరణ రైతాంగ పోరాటాలలో సమరశీలంగా నిలిచిన భూమిలేని పేద రైతుల వైపు మళ్ళింది. పోరాట వెల్లువ పర్యవసానాలలో ఇది మరొకటి. 'గ్రామీణ శ్రామికుల'ను సమీకరించడానికి ఎవరు పూనుకుంటారా అని దేశాయిగారి సిద్ధాంతం ఇన్నాళ్ళుగా ఎదురుచూస్తూ వచ్చింది. సి.పి.ఐ వారు భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (వ్యవసాయ కార్మిక సంఘం) ను ఏర్పాటు చేసినందుకు దేశాయిగారు ఎంతో ముగ్ధులైపోయారు. భూమిలేని కార్మికుల ప్రత్యేక అస్తిత్వాన్ని గుర్తించి, సమీకరించేందుకు పూనుకున్న మొదటి పార్టీ అని వారిని అభినందించారు. దేశాయిగారికి వాస్తవాలు బాగానే తెలుసు. వ్యవసాయ కార్మిక సంఘం ఏర్పాటు ఆనాటి ఉద్రిక్త పరిస్థితుల ప్రాబల్యానికి తలొగ్గి చేసిన నిర్ణయం. ఎన్నికల సమయంలో చేసిన ఆందోళనలను మినహాయిస్తే, భూపంపిణీ కోసం గానీ, కనీస వేతనాల అమలు కోసం గానీ అది నిర్మాణాత్మకమైన పోరాటాలను ఏనాడూ

నడపలేదు. వ్యవసాయ కార్మిక సంఘమూ, రైతు సంఘమూ ఒకే పార్టీ నాయకత్వంలో వున్న చోట, వ్యవసాయ కార్మిక సంఘం రైతు సంఘానికి లోబడి వుంటుంది. రైతులు కాంగ్రెస్ వైపు వున్నప్పుడు, సి.పి.ఐ వారి వ్యవసాయ కార్మిక సంఘం కొంచెం సమరశీలతని ప్రదర్శిస్తుంది. (అదీ సి.పి.ఐ కాంగ్రెస్ అనుకూల వైఖరి తీసుకోకుండా వున్న సమయంలో మాత్రమే) రైతులు సి.పి.ఐ వారికి అనుకూలంగా వుండి, కూలీలను సి.పి.ఐ(ఎం.ఎల్) గ్రూపులు సమీకరించిన చోట్ల సంఘర్షణాత్మకమైన శత్రుపూరిత వాతావరణం వుంటుంది. సిపిఐ(ఎం) కు కూడా ఇదే వర్తిస్తుంది. విదేశీ నిధులపై ఆధారపడి పనిచేస్తూ, భూమిలేని కూలీలని సమీకరిస్తున్న స్వచ్ఛంద సంస్థల పట్ల కూడ సి.పి.ఐ(ఎం) ఇలాంటి శత్రు వైఖరినే ప్రదర్శిస్తున్నది. (విదేశీ నిధులపై ఆధారపడి పనిచేస్తున్న సంస్థలను నేనేమీ సమర్థించడం లేదు. వీటిలో పనిచేస్తున్నవారి ఉద్దేశ్యాలు ఎలా వున్నా, అంతిమంగా ఈ సంస్థలు మన దేశ ప్రజలకు మేలుకన్నా కీడే ఎక్కువ చేస్తాయని నా అభిప్రాయం. అయితే విదేశీ నిధులతో నడుస్తున్న స్వచ్ఛంద సంస్థలకు వ్యతిరేకంగా సి.పి.ఐ(ఎం) సాగిస్తున్న ప్రచారానికి వెనక వున్న కారణాలలో ఒకటి ఈ శత్రుత్వమేనని గుర్తించాలి.)

అయితే, రైతాంగ పోరాటాల వెల్లువలో ముందుకొచ్చిన ఈ ఉపఫలితాలను అటుంచితే, అసలు ఆ వెల్లువ ఏమయిందీ? మిలిటెన్సీ మిలిటెన్సీయే గాని దానికదిగా రాజకీయం కాలేదు. ఈ దేశపు అట్టడుగు ప్రజానీకం, రైతు కూలీలు, ఆదివాసులు ముందున్న పోరాటాలతో మనం స్ఫూర్తి పొందుతున్నామంటే మన హృదయం వుండవల్సిన చోటులోనే వుందని అర్థం. అయితే అర్థవంతమైన రాజకీయాలకు హృదయం సరైన స్థానంలో వుండటమొక్కటే సరిపోదు.

దేశాయి గారి శ్లాఘనీయమైన కృషిలో వున్న ముఖ్యమైన లోపం పై ప్రశ్నకి జవాబివ్వకపోవడమేనని నేననుకుంటాను. కొన్ని వ్యాసాలు, నివేదికలు 1980ల దాకా కొనసాగినప్పటికీ, వాస్తవంలో ఈ సంకలనాన్ని ఎమర్జెన్సీ కాలంతో ముగించడమే దీనికి కారణం. స్వాతంత్ర్యానంతర భారతదేశంలో జరిగిన రైతాంగ పోరాటాలను నిజానికి మూడు దశలుగా విభజించాలి, రెండు దశలుగా కాదు. మొదటి దశ అరవైల మధ్య కాలం దాకా సాగుతుంది. ఈ దశలో చెప్పుకోదగ్గ పోరాటాలేవీ లేవు. రెండవ దశ అరవైల మధ్య నుండి ఎమర్జెన్సీ దాకా సాగింది. ఈ కాలంలో పోరాటాలు విస్తృతంగా జరిగాయి. అయితే ఈ దశలో వచ్చిన పోరాటాలు అప్రయత్నంగా

ముందుకొచ్చినవీ, లేదా ప్రయత్నపూర్వక సమీకరణ జరిగినచోట తడబడుతూ అయినా నిలదొక్కుకోవాలని చూసినవీ. మూడవ దశ ఎమర్జెన్సీ అనంతర దశ. ఈ దశలో వచ్చిన పోరాటాలు చాలా వరకూ పరిణతినీ, అవగాహననీ సంపాదించాయి. త్వరత్వరగా మారిపోతున్న పరిస్థితులను ఎదుర్కొన్నాయి. సంఘర్షణలో అనుకూల, ప్రతికూల ఫలితాలు రెండింటినీ చవిచూసాయి. అటు పాత సమస్యలకు పరిష్కారాలను కనుగొనడంతో పాటు, కొత్త సమస్యలను ముందుకు తెచ్చిన ముఖ్య వేదికలుగా ఆంధ్రప్రదేశ్, బీహార్ పోరాటాల గురించి చెప్పుకోవచ్చు. ఎమర్జెన్సీ అనంతరం ముందుకొచ్చిన ఈ బీహార్, ఆంధ్ర రైతాంగ పోరాటాలకు ఈ సంకలనంలో చోటు దొరక్కపోవడం విచారించాల్సిన విషయం. సంపాదకులకి ఈ పోరాటాలపై వ్యతిరేకతని ఆపాదించలేము, అలాగని వారికి ఈ పోరాటాల గురించి తెలియదని అనుకోనూ లేము. దీంతో వాటి మినహాయింపు మరీ చిత్రంగా తోస్తుంది.

ఈ పోరాటాల గురించి సమగ్రంగా వివరించడానికి ఇంగ్లీషులో ఎక్కువ సమాచారం లేదనేది నిజమే. అయితే, వాటి గురించి రేఖా మాత్రంగానైనా చూపడానికి సరిపడేంత సమాచారం కచ్చితంగా వుంది. ఎన్నో నివేదికలు ఈ పత్రికలోనే అచ్చయ్యాయి. నాగా, మిజో పోరాటాలపై వ్యాసం కోసం దేశాయి గారు ఎంచుకున్న 'పీపుల్స్ ఫర్ ఎ న్యూ ఇండియా' పుస్తకంలో కరీంనగర్ గురించిన సమాచారం వుంది. ఎమర్జెన్సీ అనంతర కాలంలో అత్యంత విస్తృతమైన రైతాంగ పోరాటానికి కరీంనగర్ వేదికగా ఉండింది. అంతేకాదు. దేశాయి గారు ఎంతో కాలంగా పౌరహక్కుల ఉద్యమం పట్ల చురుకైన ఆసక్తి చూపుతూ వస్తున్నారు. వారి వద్ద ఆంధ్ర, బీహార్ పౌరహక్కుల సంఘాల నివేదికలు కోకొల్లలుగా వున్నాయి. 'సి.పి.ఐ(ఎం.ఎల్) గ్రూపులు శుద్ధ ఆర్థిక వాదంలోనూ, సంస్కరణ వాదంలోనూ మగ్గుతున్న గ్రామీణ పేదల ఉద్యమాలను నూతనమైన ఉన్నత రాజకీయ స్థాయికి తీసుకువెళ్ళాయ'ని గుర్తించిన వ్యక్తి ఆయన. అయినా వీటిని విస్మరించారంటే ఆ గ్రూపుల సిద్ధాంత, రాజకీయ అవగాహన పట్ల ఉన్న అపోహలే ఆయన్ని బహుశా ఈ పోరాటాలను చూడకుండా చేశాయని అనుకోవాలి. సి.పి.ఐ (ఎం.ఎల్) తమ పోరాటాల నుండి వ్యూహాత్మకంగా, ఎత్తుగడల రీత్యా అనేక ముఖ్యమైన గుణపాఠాలు నేర్చుకుని ఆ 'ఉన్నత రాజకీయ స్థాయి'ని మరో మెట్టు పైకి తీసుకెళ్ళినప్పటికీ ఈ అపోహల కారణంగానే ఆయన వాటిని చూడలేకపోతున్నారు. నెత్తురు, కన్నీళ్ళు కలగలసిన రైతాంగ భారతపు సుదీర్ఘ

చరిత్రని అంతం చేసే మార్గాన్ని అన్వేషిస్తున్నది నక్సలైటు గ్రూపులు మాత్రమేనని నేను అనడంలేదు. సందేహాశీలులైన మార్క్సిస్టుల నుండి అసమ్మతి వాదులైన మత ప్రచారకుల దాకా ఎందరో ఈ అన్వేషణలో ఉన్నారు. అయితే, రాజకీయ ప్రాధాన్యత దృష్ట్యా చూస్తే ఇరువురి మధ్యా పోలికే లేదు. దేశాయి గారి వైవిధ్యతా సూత్రం ఉపయోగపడకుండా పోయేది ఇక్కడే.

ఈ సమీక్షని ముగించే ముందు, నిరాశాజనకమైన రాజకీయాలు, సృజన లేని ఆలోచనలు రాజ్యమేలుతున్న వేళలో నిస్పృహకి లోనవకుండా నిలిచిన సంపాదకుని అచంచల స్ఫూర్తిని మనసారా అభినందించకుండా వుండలేము. ఎమర్జెన్సీ అనంతర కాలంలోని రైతాంగ పోరాటాలపైన మరొక సంపుటానికి కూడ ఆయనే సంపాదకత్వం వహించగలగాలని కోరుకుందాం. అదే మనం ఆయన పట్ల చూపే గౌరవానికి నిదర్శనం.

*ఎ.ఆర్. దేశాయి సంపాదకత్వంలో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్, బొంబాయి సంస్థ 1986లో ప్రచురించిన 'అగ్రేరియన్ స్ట్రగుల్స్ ఇన్ ఇండియా ఆఫ్టర్ ఇండిపెండెన్స్' పుస్తకంపై బాలగోపాల్ 'Agrarian Struggles' అనే పేరుతో రాసిన సమీక్షా వ్యాసం.*

**ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ, 9 ఆగస్టు 1986**
**అనువాదం : సుధాకిరణ్**

# నూతన రైతాంగ ఉద్యమాలు ఒక అభిప్రాయం

**1981** మార్చి – ఏప్రిల్ నెలలలో కర్ణాటకలోని నిపాణి వద్ద పొగాకు పంటకు గిట్టుబాటు ధర చెల్లించాలన్న డిమాండుతో రైతులు రాస్తారోకో చేశారు. 23 దినాలపాటు బొంబాయి – బెంగుళూరు జాతీయ రహదారి మీద వాహనాల రాకపోకలను ఆటంకపరిచారు. పోలీసులు కాల్పులు జరిపి 11 మందిని చంపారు. ఈ పోరాటానికి నాయకత్వం వహించింది శరద్‌జోషి నెలకొల్పిన షేత్‌కారి సంఘటన. ఇదే సంఘం నాయకత్వంలో అంతకుముందు సంవత్సరం నవంబర్ నెలలో మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలో రైతులు ఉల్లిపాయల ధర పెంచాలని రాస్తారోకో చేసి పోలీసు కాల్పులలో ఇద్దరిని పోగొట్టుకున్నారు. రోడ్డు మీద వాహనాల రాకపోకలను ఆటంకపరిచే పోరాట రూపానికి 'రాస్తారోకో' అన్న పేరు ఈ నాసిక్ ఉద్యమంతోనే వచ్చిందని అంటారు.

1980లో కర్ణాటకలోని మలప్రభ నీటిపారుదల ప్రాజెక్టు ఆయకట్టు ప్రాంతంలో నివసించే రైతులు నీటి తీరువాకు, బెటర్‌మెంట్ లెవీకి వ్యతిరేకంగా అలజడి చేశారు. అదే సంవత్సరం హెచ్.ఎస్. రుద్రప్ప నాయకత్వంలో కర్ణాటక రైతు సంఘం ఏర్పడింది.

1966లోనే తమిళనాడులో నారాయణస్వామి నాయుడు నేతృత్వంలో తమిళనాడు వ్యవసాయగళ సంఘం ఏర్పడింది. ఈ సంఘం నాయకత్వంలో 1970–80 దశకంలో కోయంబత్తూరు జిల్లాకు చెందిన రైతులు పత్తిపంట గిట్టుబాటు ధర కోసం పెద్దఎత్తున ఆందోళన చేశారు. పోలీసు కాల్పులలో 35 మంది ప్రాణాలు పోయాయి.

1972లో గుజరాత్‌లో ఖేదుత్ సమాజ్ ఏర్పడింది. రైతులు ధాన్యం లెవీకి వ్యతిరేకంగా పోరాటం చేసి, తమ డిమాండు ఒప్పుకునేదాకా పట్టణాలకు పాలు,

కూరగాయలు సరఫరా చేయడాన్ని బంద్ చేసే పోరాట రూపాన్ని చేపట్టారు. తరువాత కాలంలో ఇదే సంఘం నాయకత్వంలో రైతులు నీటి తీరువాకు వ్యతిరేకంగా కూడ పోరాటం చేశారు. అదే రాష్ట్రంలో భారతీయ కిసాన్ సంఘ్ నాయకత్వంలో 1986 నుండి రైతులు కరెంటు సరఫరాలోని అనిశ్చిత పరిస్థితికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తూ వున్నారు.

1984లో పంజాబుకు చెందిన భారతీయ కిసాన్ యూనియన్ నాయకత్వంలో 50 వేల మంది రైతులు చండీగఢ్‌లోని గవర్నర్ బంగళాను చుట్టుముట్టి పికెటింగ్ చేశారు. ఈ సంఘం నాయకులు భూపీందర్ సింగ్ మాన్, బల్బీర్‌సింగ్ రాజివాల్ కరెంటు బిల్లులను మాఫీ చేయాలన్న డిమాండు మీద ఈ పికెటింగ్ వారం రోజుల పాటు చేశారు.

1988 జనవరి 27 నుండి ఫిబ్రవరి 20 దాకా (అంటే 25 దినాల పాటు) ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ పట్టణంలో మహేంద్రసింగ్ తికాయత్ నేతృత్వంలో కొన్ని లక్షలమంది రైతులు ధర్నా చేశారు. చెరుకు కొనుగోలు ధర పెంచాలనీ, కరెంటు బిల్లు చెల్లించకపోతే జుర్మానా వసూలు చేయకూడదనీ, రోజూ 12 గంటల కరెంటు సరఫరా చేయాలనీ, భూమిశిస్తు, నీటి తీరువా బెటర్మెంట్ లెవీలు తగ్గించాలనీ వాళ్ళ డిమాండ్లు.

## నూతన రైతాంగ పోరాటాలు

ఈ ఉద్యమాలన్నిటికీ ఈ దశాబ్దపు ప్రధాన ప్రజాపోరాటాల జాబితాలో గుర్తింపు వచ్చింది. వీటిని 'నూతన రైతాంగ పోరాటాలు' అంటున్నారు. (అంటే గతంలో తెలంగాణలోనూ, ఇతర ప్రాంతాలలోనూ జరిగిన భూస్వామ్య వ్యతిరేక రైతాంగ పోరాటాల కంటే భిన్నమైనవి అని అర్థం.) వీటిని నిర్వహిస్తున్న సంఘాలకూ, వ్యక్తులకూ ఇవ్వాళ వార్తలలో ప్రముఖ స్థానం వుంది. దినపత్రికలు చదివే అలవాటున్న వాళ్ళందరూ శరద్ జోషీ గురించీ, మహేంద్రసింగ్ తికాయత్ గురించీ విని వున్నారు. లక్షలమంది వ్యవసాయదారులు ధర్నాలూ పికెటింగ్‌లూ నిర్వహిస్తున్న ఫోటోను ఇలస్ట్రేటెడ్ వీక్లీ అట్టమీద రంగులలో చూసి అందరం ముచ్చటపడ్డాం.

ఈ ఉద్యమాల స్వభావం ఏమిటి? వీటి నాయకుల లక్ష్యం ఏమిటి? ఈ రైతులలో నిజమైన రైతులు ఎంతమంది? గ్రామీణ పేదల పట్ల వీళ్ళ వైఖరి ఏమిటి? భూస్వాముల

పట్ల వీళ్ళ వైఖరి ఏమిటి? దేశ భవితవ్యంలో ఈ ఉద్యమాల పాత్ర ఏమిటి? ఇత్యాది ప్రశ్నలకు సమాధానం చెప్పుకోవలసిన అవసరం ఉంది.

మొదట ఈ సంఘాల గురించి, ఉద్యమాల గురించి మరికొన్ని వాస్తవాలు తెలుసుకుందాం. ఈ సంఘాలన్నీ – మినహాయింపు లేకుండా – భూసంస్కరణలనూ, కనీస వేతన చట్టాలనూ, గ్రామీణ పేదలకు ఇళ్ళస్థలాలు ఇచ్చే పథకాలనూ వ్యతిరేకించాయి. గుజరాత్ ఖేదుత్ సమాజ్ అయితే భూగరిష్ట పరిమితిని (లాండ్ సీలింగ్) తొలగించాలనే డిమాండుతో పుట్టింది. తమ సంఘంలో ఎవరయినా చేరవచ్చును గానీ కమ్యూనిస్టులు మట్టుకు చేరరాదని నియమం పెట్టింది. తమిళనాడు రైతు నాయకుడు నారాయణస్వామి నాయుడు గ్రామాలలో షెడ్యూల్డు కులాలకు ఇళ్ళస్థలాలు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన చేశాడు. ఈ మధ్య కాలంలో ఈ రైతులలో కొంచెం తెలివయిన వాళ్ళు – ముఖ్యంగా శరద్‌జోషి – వ్యవసాయ కూలీలను, పేద రైతులను కూడ కలుపుకొచ్చే ప్రయత్నంలో భూసంస్కరణలనూ, కనీసవేతన చట్టాలనూ వ్యతిరేకించడం మానేశారు గానీ ఇప్పటికి కూడ రైతులకు పట్టణ ప్రాంత బడా వ్యాపారస్తులతోనూ ప్రభుత్వంతోనూ వున్న వైరుధ్యాన్ని గురించి ఎంత అలజడి చేస్తారో, గ్రామం లోపల పేద–ధనిక వర్గాల మధ్యనున్న వైరుధ్యాలను గురించి అంత మౌనంగా వుంటారు. వాదనకు దిగితే, గ్రామం లోపల పేద–ధనిక అనే విభజనను తీసుకొచ్చేవారు పెట్టుబడిదార్ల ఏజంట్లని అంటారు.

## ఉద్యమాల స్వభావం

రెండవది – దేశంలోని రైతులకు అనేక సమస్యలున్నా ఈ ఉద్యమాలు కొన్ని సమస్యల గురించి మట్టుకే అలజడి చేస్తాయి. దానిని తప్పుగా భావించనవసరం లేదు గానీ ఆ సమస్యలు ఎటువంటివో విశ్లేషించడం అవసరం. వాటిలో మౌలికంగా రెండు రకాలున్నాయి. ఒకటి – రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర దొరక్క పోవడం, రెండు రైతులు ఉపయోగించే పారిశ్రామిక ఉత్పత్తుల ధరలు అధికంగా వుండడం వాటి సరఫరా అస్తవ్యస్తంగా వుండడం. నాసిక్ ఉల్లిపాయల ఉద్యమాన్ని మినహాయిస్తే తక్కిన గిట్టుబాటు ధరల పోరాటాలన్నీ కూడ పారిశ్రామిక ముడి సరుకులుగా ఉపయోగపడే వ్యవసాయ ఉత్పత్తుల ధరలకే ప్రధానంగా పరిమితం అయ్యాయి. అందులోనూ పత్తి, పొగాకు, చెరుకు వంటి పంటలకే ప్రధానంగా

పరిమితం  అయినాయే తప్ప చిన్న పరిశ్రమలకు ముడి సరుకులుగా ఉపయోగపడే ఉత్పత్తుల గురించి – ఆముదాలు, వేరుశెనగ, నువ్వులు మొదలయిన నూనెగింజల గురించి – ఎక్కడా చెప్పుకోదగ్గ ఆందోళనలు జరగలేదు. కాని దేశంలోని మొత్తం వ్యవసాయ యోగ్యమయిన భూభాగంలో 8 శాతం మట్టుకే పత్తి, పొగాకు, చెరుకు పంటల కింద వుంది. అది కూడ ఎక్కువగా అభివృద్ధి చెందిన ప్రాంతాలకే పరిమితం అయివుంది. ఆముదాలు, నువ్వులు, వేరుశెనగ తదితర నూనె గింజలు 11 శాతం భూభాగంలో పండిస్తారు. చిన్న రైతులు, కరువు ప్రాంతాల రైతులు కూడ ఈ పంటలు పండిస్తారు. ఈ వ్యాపార పంటలు కాక, ఎంతో కొంత మార్కెట్‌లో అమ్ముడుపోయే వరి, గోధుమ, పప్పుదినుసులు మరొక 55 శాతం భూభాగంలో పండిస్తారు. వీటి ధరల గురించి ఉపన్యాసాలు ఇవ్వడమే తప్ప ఆందోళనలు నిర్వహించింది లేదు. ఇక తక్కిన 26 శాతం భూభాగంలో పండించే జొన్నలు, సజ్జలు, రాగులు, మొక్కజొన్నలు మొదలయిన పంటల గురించి ఈ రైతాంగ ఉద్యమాల నోట ఒక్కమాట సహితం వినము. వీటిని పండించేది ఎక్కువగా వెనుకబడ్డ ప్రాంతాల సామాన్య రైతాంగం. నిజానికి, దేశంలోని వ్యవసాయదార్లలో మరీ పేదవాళ్ళను మినహాయిస్తే మిగిలిన వాళ్ళంతా ఎంతో కొంత పంటను మార్కెట్‌లో అమ్ముతారు. అయినా ఈ ఉద్యమాలు కొన్ని పంటలకే ప్రధానంగా పరిమితం అయ్యాయి. బడా పరిశ్రమలు ఏ వ్యవసాయ ముడి సరుకులను వినియోగించుకొని అధిక లాభాలు సంపాదించుకుంటున్నాయో ఆ అధిక లాభాలలో కొంత భాగం వ్యవసాయదారులకు ఇప్పించడం ఈ ఉద్యమాల లక్ష్యంగా అర్థం అవుతుంది.

ఇక, రెండవ కోవకు చెందిన సమస్యల గురించి చూద్దాం. కాలవల కింద వ్యవసాయం చేసే ప్రాంతాలలో ప్రభుత్వం వసూలు చేసే నీటి తీరువా, బెటర్‌మెంట్ లెవీకి వ్యతిరేకంగా ఈ ఉద్యమాలు అలజడి చేస్తున్నాయి. గొట్టపు బావులు లేక పంప్‌సెట్ల సహాయంతో వ్యవసాయం చేసే ప్రాంతాలలో కరెంటు సరఫరాలోని అస్తవ్యస్త పరిస్థితిని గురించి, కరెంటు కనెక్షన్ల మంజూరులోని అవినీతిని గురించి, కరెంటు బిల్లు వసూళ్ళను గురించి ఆందోళనలు చేపడుతున్నారు. అయితే దేశంలోని మొత్తం సేద్యపు భూభాగంలో ఇప్పటికీ 30 శాతం మట్టుకే నీటి పారుదల సౌకర్యాన్ని పొందుతోంది. అందులో మూడవ వంతు సాంప్రదాయిక నీటి వనరులయిన చెరువులు,

మోటారు బావుల నుండి నీటిని పొందుతోంది. ఈ చెరువుల మరమ్మత్తు గురించీ, బావుల నిర్వహణ గురించీ నూతన రైతాంగ ఉద్యమాలు ఇప్పటికీ పట్టించుకున్న దాఖలాలు లేవు.

## ఎవరి కోసం ఆందోళన?

కొందరికే పరిమితమయిన సమస్యలను చేపట్టడాన్ని ఒక తప్పుగా భావించ నక్కరలేదు గానీ ఆ కొందరు ఎవరో, తక్కిన సమస్యలేమిటో చూడవలసిన అవసరం ఉంది. గ్రామీణ ప్రాంతాలలో ఇవ్వాళ జనం ఎదుర్కొంటున్న సమస్యలను ఒకసారి చూద్దాం. దేశం మొత్తం మీద తీసుకుంటే అత్యధిక భూభాగంలో నీటి పారుదల సౌకర్యాలు లేవు. భూవనరుల సంరక్షణ సక్రమంగా జరగకపోవడం వల్ల దేశంలో కరువు మళ్ళీ ఒక సమస్యగా తయారయింది. కొన్ని లక్షల గ్రామాలకు ఇప్పటికీ కరెంటు లేదు. స్కూళ్ళు లేవు, ఆస్పత్రులు లేవు, రోడ్లు లేవు. భూమిలేని వ్యవసాయ కూలీలకు గౌరవప్రదమైన మనుగడకు కావలసిన జీవనం దొరకకపోడడం మన దేశంలో నూటికి తొంభై గ్రామాలలో వున్న సమస్య. భూ సంస్కరణల ద్వారా వాళ్ళకు రావలసిన భూమి దక్కలేదు. కనీస వేతన చట్టాలు హామీ యిచ్చే కూలీరేట్లు కొన్ని సంపన్న ప్రాంతాలను మినహాయిస్తే వేరే ఎక్కడా ఇవ్వడం లేదు. వాళ్ళకు ఉండడానికి ఇళ్ళ స్థలాలుండవు. తాగడానికి నీళ్ళు దొరకవు. పొయ్యిలోకి కట్టెల నుండి పశువుల మేత దాకా ఏదీ సక్రమంగా లభ్యం కాదు. ఈ సమస్యలు చాలక వాళ్ళ మీద కులపరమైన దాడులు దేశంలోని అన్ని ప్రాంతాలలోనూ జరుగుతున్నాయి. ఇక చాలీచాలని కమతాలున్న రైతుల మాటకొస్తే తమ కమతాలను అభివృద్ధి చేసుకోవడానికీ నీటి పారుదల వసతి కల్పించుకోడానికీ అవసరమైన ఆర్థిక వనరులు వాళ్ళకు దుర్లభం. వడ్డీకి అప్పులు తెచ్చుకొని బ్రతకలేరు, బ్యాంకుల నియమాలేమో వాళ్ళ అవసరాలకు పూర్తిగా విరుద్ధంగా వుంటాయి. ఇంకొంచెం మెరుగైన స్థోమత గల రైతుల విషయానికి కొస్తే వాళ్ళు ఏ పంటలు పండించినా వాళ్ళకు అయ్యే ఖర్చులకూ, వచ్చే ఆదాయానికీ పొంతన ఉండదు. 1980కి పూర్వం ఎలాగున్నా ఈ దశాబ్ద కాలంలో మట్టుకు వ్యవసాయ ఉత్పత్తుల ధరలు చాలా వేగంగా పెరుగుతూండడం వాస్తవం. పైగా వ్యవసాయేతర ఉత్పత్తుల నాణ్యతలోనూ సరఫరాలోనూ వున్న అవకతవకలు రైతులకు పెద్ద తలభారంగా తయారయ్యాయి.

ఈ వర్గాలకు పైనున్నది గ్రామీణ భూస్వామ్య పెత్తందారీ వర్గం. దీని పెత్తనం కింద ఇతర వర్గాలు బ్రతుకుతూ వుంటాయి. భూములపైన గుత్తాధిపత్యమే కాక గ్రామ పంచాయితీలు, గ్రామీణ బ్యాంకులు, సహకార సంస్థలు, కాంట్రాక్టులు, పైరవీలు, స్థానిక రాజకీయాలు తదితర అనేక రంగాలలో పెత్తనం వీరిదే. వీళ్ళు పట్టణాలలో లభ్యమయ్యే విద్యా వైద్య తదితర సౌకర్యాలు అన్నింటినీ అనుభవిస్తూ వుంటారు. గ్రామీణ ప్రాంతాలకే పరిమితం అయి బ్రతికే రైతాంగానికి మట్టుకు ఏ సౌకర్యాలూ ఉండవు.

క్లుప్తంగా చెప్పుకుంటేనే ఇన్ని సమస్యలు ఉండే గ్రామీణ వ్యవస్థలో కొన్ని సమస్యలను మాత్రమే ఎంచుకొని అలజడి చేస్తున్నాయి ఈ నూతన రైతాంగ ఉద్యమాలు. ఇవి గ్రామీణ పేదల సమస్యల పరిష్కారం పట్ల వ్యతిరేకత ప్రదర్శించడమే కాక, గ్రామాలపైన భూస్వాముల పెత్తనానికి వ్యతిరేకంగా ఎన్నడూ మాట్లాడవు. గ్రామీణ పేదలపైన జరిగే అత్యాచారాలను పట్టించుకోవు. నిరుడు ఒంగోలు దాకా వచ్చిన శరద్‌జోషి ఇంకొల్లు మండలంలో ఆత్మహత్య చేసుకున్న పత్తి రైతుల గురించి కన్నీళ్ళు కార్చాడు గానీ కారంచేడు బాధితులను కనీసం పరామర్శించ లేదు.

## వికృత వ్యవసాయ విధానం

నిజానికి ఈ ఉద్యమాలు భారత ప్రభుత్వం అనుసరిస్తున్న వికృత వ్యవసాయ విధానం నుండి పుట్టాయి. ఈ విధానానికి నాంది జాతీయోద్యమంలోనే వున్నప్పటికీ అది 1965–66 సంవత్సరాల కరువు తరువాత స్పష్టమైన రూపం తీసుకుంది. దేశ వ్యాపితంగా ప్రభావం వేసిన ఆ రెండేళ్ళ కరువు మూడవ పంచవర్ష ప్రణాళికను విఫలం చేసింది. నాలుగవ పంచవర్ష ప్రణాళికను మూడేళ్ళు వాయిదా వేయించింది. ప్రభుత్వానికి ఆ దెబ్బతో బెదురు పట్టుకుంది. భూసంస్కరణలను సమగ్రంగా అమలుచేసి, భూమిలేని పేదలకు భూమిని పంచిపెట్టి, నీటి వనరుల అభివృద్ధినీ భూవనరుల నిర్వహణనూ శాస్త్రీయంగా చేపట్టి, మొత్తం రైతాంగానికి తమ కమతాలను అభివృద్ధి చేసుకునే అవకాశాలు విస్తారంగా కల్పించే దీర్ఘకాలిక ప్రణాళిక ఆ కరువు సమస్యకు శాశ్వత పరిష్కారం కాగలిగి వుండేది. కాని ప్రభుత్వం అట్లా చేయలేదు. అసలు మొదటి నుండీ కూడ, గ్రామీణ ప్రాంతాలలో స్థోమత వున్న వర్గాల చేతిలో మరింత అధికారాన్నీ, వనరులనూ పెట్టడం ద్వారా వ్యవసాయ అభివృద్ధిని సాధించడం

అనే పంథాను భారత ప్రభుత్వం అనుసరిస్తూ వుంది. పంచాయతీ వ్యవస్థ, నీటి పారుదల సౌకర్యాలు, సహకార వ్యవస్థ, గ్రామీణ బ్యాంకులు, మార్కెటింగ్ వ్యవస్థ, గ్రామ విద్యుద్దీకరణ మొదలైనవన్నీ ఈ చట్రంలోనే జరిగాయి. 1966 తరువాత 'హరిత విప్లవం' పేరిట వచ్చిన మార్పులు దీనిని కొనసాగించాయి. భూమీ, నీటి వనరులూ, ఆర్థిక స్థోమతా వున్న వ్యవసాయదారులకు మరిన్ని సౌకర్యాలు కల్పించి, విదేశాల నుండి ఎరువులూ మందులూ అధిక దిగుబడినిచ్చే విత్తనాలూ దిగుమతి చేసి వీళ్ళకు సరఫరా చేసి, గుత్త పెట్టుబడిదార్లకు లైసెన్సులిచ్చి, ఇక్కడే వాటిని ఉత్పత్తి చేసే సౌకర్యం కూడ కల్పించి, తద్వారా వ్యవసాయ ఉత్పత్తిని ఇనుమడింపచేసి కరువు సమస్యను పరిష్కరించాలని భారత ప్రభుత్వం ప్రయత్నించింది. ఈ ప్రయత్నమే 'హరిత విప్లవం'. దీని ఫలితంగా ఆహారధాన్యాల ఉత్పత్తి నిజంగానే కొంత పెరిగింది గానీ ఆ పెరుగుదల నిలవలేదు. నిలవలేకపోవడానికి గల కారణాలను ఇక్కడ చర్చించడం వీలు కాదు. కాని ఆ వైఫల్యం ఫలితాలను గుర్తించాలి. ఎరువుల ధరలు బాగా పెరిగిపోయాయి. పంట దిగుబడి తగ్గకుండా ఉండడానికి సంవత్సరం సంవత్సరం మరింత ఎక్కువగా ఎరువులు వేయవలసి వస్తోంది. కొత్త కొత్త రకం పురుగులు పంటలను తినేస్తున్నాయి. మందులలో కల్తీ వల్ల ఎన్ని మందులు వేసినా అవి చావడం లేదు. కరెంటు ఉత్పత్తిలో సంక్షోభం ఫలితంగా గొట్టపు బావులకూ పంప్‌సెట్లకూ కరెంటు సరఫరా సరిగ్గా జరగడం లేదు. ఎలక్ట్రిసిటీ బోర్డు ఉద్యోగుల అవినీతి ఫలితంగా కరెంటు ఖర్చు తడిసి మోపెడు అవుతోంది. నీటిపారుదల వసతుల నిర్వహణ లోపించడం వల్ల అవి రోజురోజుకూ నిరుపయోగం అవుతున్నాయి.

ఈ సమస్యలన్నీ 1980 నాటికి ఒక స్పష్టమయిన రూపం తీసుకున్నాయి. 'హరిత విప్లవం' ఫలితంగా కొంత డబ్బు సంపాదించుకొని మరింత ఆశ పెంచుకున్న వ్యవసాయదారులకు నిరాశ ఎదురయింది. ఆ నిరాశ నిరసనగా మారి ఈ 'నూతన రైతాంగ ఉద్యమాల'కు దారితీసింది. ఈ ప్రాంతాలు ముందు నుండీ కూడ సంపన్నమైనవే కావడం వల్ల, అక్కడి వ్యవసాయదారులలో చాలామంది అప్పటికే పట్టణాలలో ఆస్తులూ, వ్యాపారాలూ, రాజకీయాలలో ప్రాబల్యమూ సంపాదించుకొని ఉన్నందు వల్ల ఉద్యమాలను సామర్థ్యంతో నడపగలుగుతున్నారు. మామూలు రైతులూ పేద రైతులూ కూడ 'పెద్దరెడ్డికి ఒక మూట చిక్కితే నాకు తవ్వెడు గింజలు చిక్కక పోతాయా' అన్నట్టు వెంటపోతున్నారు. కాలువలున్న ప్రాంతాలలో చిన్న రైతులకు

కూడ నీటి సౌకర్యం లభిస్తుంది కాబట్టి వాళ్ళు కూడ వ్యాపార పంటలు పండిస్తారు. అంతేకాక, పత్తికో చెరుకుకో గిట్టుబాటు ధర కావాలని 'హరిత విప్లవ' రైతాంగం గొడవచేస్తే అదే గ్రామంలో నువ్వులో, వేరుశేనగలో పండించుకునే రైతులు తమకు కూడ 'గిట్టుబాటు ధర' అనేది కావాలి కాబట్టి తామూ వారి వెంటపోతారు. కాకుంటే, ఈ ఉద్యమకారులు గ్రామీణ ప్రాంతాలలో పట్టణాల పట్ల ఉండే వ్యతిరేకతను చాలా చాకచక్యంగా వాడుకొని జనాన్ని తమ వెంట సమీకరించుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల ధనిక వర్గమే పట్టణాలకు తరలి వెళ్ళి వర్తక వ్యాపారాలలోనూ రాజకీయాలలోనూ పెత్తనం చలాయిస్తోందన్న వాస్తవాన్ని కప్పిపెట్టి 'పట్టణాలు' అనేవి మొత్తం గ్రామానికి శత్రువులన్న సిద్ధాంతాన్ని చాలా జనాకర్షణీయంగా ప్రచారం చేస్తున్నారు. ఈ అన్ని కారణాల వల్ల, చాలా పరిమితమయిన ప్రయోజనం గల ఈ ఉద్యమాలు బలమైన ప్రజా ఉద్యమాల రూపం తీసుకుంటున్నాయి. గ్రామీణ ప్రాంతాలలో భూస్వాముల పెత్తనాన్ని వ్యతిరేకించని ఉద్యమమేదీ ప్రజా ఉద్యమం కాజాలదన్న వాస్తవాన్ని కొంత విజయవంతంగానే కప్పిపెట్టగలుతున్నాయి.

**నలుపు**

**1-15 జూన్ 1989**

# మానవహక్కుల వేదిక ప్రచురణలు

| | | |
|---|---|---|
| 1 | శివమెత్తిన సేన | జనవరి 1999 |
| 2 | ఎండమావి 2020 | మే 1999 |
| 3 | మానవహక్కుల బులెటిన్ 1 | నవంబర్ 1999 |
| 4 | మానవహక్కుల బులెటిన్ 2 | జూన్ 2000 |
| 5 | మానవహక్కుల బులెటిన్ 3 | మార్చి 2001 |
| 6 | యుద్ధ సత్యాలు : మానవహక్కుల బులెటిన్ 4 | నవంబర్ 2001 |
| 7 | మానవహక్కుల బులెటిన్ 5 | ఏప్రిల్ 2002 |
| 8 | గాంధీ గుజరాత్‌లో గాడ్సే రాజ్యం | జూన్ 2002 |
| 9 | ఎవరిదీ అడవి? | ఫిబ్రవరి 2003 |
| 10 | మానవహక్కుల బులెటిన్ 6 | ఫిబ్రవరి 2004 |
| 11 | మణిపూర్ : ఎందుకింత ఆగ్రహం ? | డిసెంబర్ 2004 |
| 12 | ఆరుగాలం కరువు | మే 2005 |
| 13 | మానవహక్కుల బులెటిన్ 7 | మే 2005 |
| 14 | Death, Displacement & Deprivation<br>The War in Dantewada: A Report | డిసెంబర్ 2006 |
| 15 | మానవహక్కుల బులెటిన్ 8 | మే 2007 |
| 16 | ఆదివాసీ సమాజంలో అంతర్యుద్ధం | మే 2007 |
| 17 | మానవహక్కుల బులెటిన్ 9 | డిసెంబర్ 2008 |
| 18 | Kashmir: Will The Pain Never End? | డిసెంబర్ 2008 |
| 19 | మానవహక్కుల బులెటిన్ 10 | జూన్ 2009 |
| 20 | సచార్ చెప్పిన సత్యాలు | జూలై 2009 |
| 21 | కంధమాల్ నుండి కరావళి దాకా :<br>ప్రజాస్వామ్యంపైన సంఘ్ పరివార్ దాడి | అక్టోబర్ 2009 |

| | | |
|---|---|---|
| 22 | హక్కుల ఉద్యమం-తాత్విక దృక్పథం | అక్టోబర్ 2010 |
| 23 | మా బాలగోపాల్ : మానవహక్కుల బులెటిన్ 11 | అక్టోబర్ 2010 |
| 24 | మానవహక్కుల బులెటిన్ 12 | అక్టోబర్ 2011 |
| 25 | హక్కుల బాటసారి బుర్ర రాములు | అక్టోబర్ 2011 |
| 26 | ఆ శిక్షే ఒక నేరం | ఏప్రిల్ 2012 |
| 27 | Of capital and other punishments | అక్టోబర్ 2012 |
| 28 | The Terrible Cost of an Inhuman Counter-Insurgency | అక్టోబర్ 2013 |
| 29 | మానవహక్కుల బులెటిన్ 13 | అక్టోబర్ 2013 |
| 30 | ముస్లిం ఐడెంటిటీ-హిందుత్వ రాజకీయాలు | డిసెంబర్ 2013 |
| 31 | చుండూరు: ఒక మారణకాండ తరువాత | అక్టోబర్ 2014 |
| 32 | Tsunduru: An Atrocity and its Aftermath | అక్టోబర్ 2014 |
| 33 | నక్సలిజంపై రాజ్యం అణచివేత : మూల్యం చెల్లిస్తున్న ఆదివాసులు | అక్టోబర్ 2014 |
| 34 | పాలస్తీనా ప్రజాపోరాటం | అక్టోబర్ 2014 |
| 35 | ఆదివాసులు ఛత్తీస్‌గఢ్, కంధమాల్‌పై వ్యాసాలు, నివేదికలు | అక్టోబర్ 2015 |
| 36 | అభివృద్ధి-విధ్వంసం | అక్టోబర్ 2015 |
| 37 | విస్థాపన-విధ్వంసం | అక్టోబర్ 2016 |
| 38 | మానవహక్కుల బులెటిన్ 14 | అక్టోబర్ 2015 |
| 39 | విశాఖకు 7వ నెంబరు కాలుష్య హెచ్చరిక | అక్టోబర్ 2016 |
| 41 | సరళీకరణ-విధ్వంసం | అక్టోబర్ 2017 |
| 40 | ఎన్నికలు-ప్రజాస్వామ్యం | అక్టోబర్ 2017 |
| 42 | మానవహక్కుల బులెటిన్ 15 | అక్టోబర్ 2017 |
| 43 | అణుశక్తి-విధ్వంసం | అక్టోబర్ 2018 |
| 44 | హిందూ మత జాతీయవాద రాజకీయాలు | అక్టోబర్ 2018 |
| 45 | కరువు-వ్యవసాయ సంబంధాలు | అక్టోబర్ 2018 |

karuvu - vyavasaya sambandhalu : k balagopal



## ...ఓడితే రైతు ఒక్కడే చస్తాడు

రైతులు భారీగా పెట్టుబడులు పెట్టి వ్యాపార పంటలు పండించి వ్యవసాయ ఉత్పత్తులు పెంచాలని కోరుకునే వాళ్ళు సమాజంలో చాలామంది ఉన్నారు. ప్రభుత్వ మొక్కటే కాదు.

పురుగుల మందు కంపెనీల వాళ్ళు, ఎరువుల కంపెనీల వాళ్ళు కూడ అదే కోరుకుంటారు. హైబ్రిడ్ విత్తనాల తయారీదార్లూ కోరుకుంటారు. వీటి హోల్‌సేల్ డీలర్లు, రిటైల్ అమ్మకందార్లు, మార్కెట్‌లో సేఠ్‌లు, కమిషన్ ఏజెంట్లు కూడ కోరుకుంటారు. బోర్‌వెల్ కంపెనీల వాళ్ళు, రిగ్గులు తయారు చేసేవాళ్ళు, కరెంటు మోటార్లు, పైపులు తయారు చేసేవాళ్ళు కూడ కోరుకుంటారు. ఉత్పత్తి పెరుగుదల రేటు నాగరికత పురోగమనాన్ని సూచిస్తుందని నమ్మే సామాజిక శాస్త్రవేత్తలు సైతం కోరుకుంటారు. మార్కెట్ వర్ధిల్లితే అందరూ వర్ధిల్లుతారని నమ్మే ఆర్థిక శాస్త్రవేత్తలూ, ప్రపంచ బ్యాంకు పెద్దలూ కోరుకుంటారు. మండలానికొక ఇంజనీరింగ్ కాలేజి పెట్టి విద్యార్థుల కోసం ఎదురుచూస్తున్న విద్యావేత్తలూ కోరుకుంటారు. కడుపునొప్పి అంటే చాలు అపెండిసెక్టమీ నుంచి హిస్టరెక్టమీ దాకా ఏదైనా చేసేయడానికి రెడీగా తాలూకా కేంద్రాలలో సహితం కత్తులు నూరుకొని రెడీగా ఉన్న వైద్య నిపుణులూ కోరుకుంటారు. అర్బన్ మార్కెట్‌తో సంతృప్తి చెందక గ్రామాలవైపు ఆశగా చూస్తున్న టి.వి. కంపెనీల వాళ్ళు, ద్విచక్ర వాహన తయారీదార్లు మొదలయిన వారంతా కోరుకుంటారు.

పెట్టుబడులు పెరుగుతున్న వ్యవసాయ ఆర్థిక వ్యవస్థలో చిక్కుకున్న రైతులు విజయవంతంగా బయటపడితే వీళ్ళంతా వర్ధిల్లుతారు. అపజయం పాలయితే రైతు మాత్రమే చస్తాడు.

రూ. 150/-

A Human Rights Forum Publication